
ఈనాడు

విజయవాడ 27-1-2026 మంగళవారం సిటీ సంపుటి 52 . సంచిక 167
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 12
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



గణతంత్ర వేడుకల్లో ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లెయెన్, ప్రధాని మోదీ, ఐరోపా కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా

ఆపరేషన్ సిందూర్ నుంచి దేశీయ క్షిపణుల దాకా..

స్వీయ శక్తిని చాటిన భారత్

- బైరవ్ బెటాలియన్ సత్తా
- సూర్యాస్త్ర ప్రతాపం
- రాష్ట్రపతి గౌరవ వందనం
- ఘనంగా రిపబ్లిక్ డే పరేడ్
- ముఖ్య అతిథులుగా ఈయూ నేతలు
- భారత్‌తో సుస్థిర ప్రపంచం సాధ్యమని ఉర్సులా వ్యాఖ్య
- పాల్గొన్న ప్రధాని, ఖర్గే, రాహుల్



గణతంత్ర వేడుకల్లో సూర్యాస్త్ర రాకెట్ లాంచర్ వ్యవస్థ, బ్రహ్మోస్ మొబైల్ అటానమస్ లాంచర్

దిల్లీ: భారత 77వ రిపబ్లిక్ డే వేడుకలు సోమవారం దేశవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. భారత స్వీయ శక్తి ప్రదర్శనకు దిల్లీలోని కర్తవ్య పథ్ వేదికైంది. ముఖ్య అతిథులైన ఈయూ నేతలు ఉర్సులా వాన్ డెర్ లెయెన్, కోస్టా సాక్షిగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గౌరవ వందనం స్వీకరిస్తుండగా మన బలగాలు తమ సైనిక శక్తిని చాటాయి. (మిగతా 2లో)



శుభాంశు శుక్లాకు అశోక చక్ర పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న రాష్ట్రపతి ముర్ము. చిత్రంలో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

రాజధానిలో వేడుకలు ఆనందదాయకం

రాజధాని రైతుల ఉద్యమ పోరాట ఫలితమిది

ప్రభుత్వ కార్యక్రమాలన్నీ అమరావతిలోనే నిర్వహించాలి

రైతులు, యువత అభిప్రాయం 3లో

అమరావతిలో తొలిసారి గణతంత్ర వేడుకల నిర్వహణ అద్భుతం

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ 3లో

ప్రాజెక్టులు కొనసాగుతున్నాయి..

సంస్థలు బలోపేతమవుతున్నాయి

ప్రజల్లో విశ్వాసం కనిపిస్తోంది..

రాష్ట్రం మళ్లీ కోలుకుంటోంది

మార్పు మొదలైంది



అమరావతిలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో గౌరవ వందనం స్వీకరిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్. చిత్రంలో వెనుక కనిపిస్తున్నది రాజధాని భవనాలు

- దృఢ సంకల్పంతో పనిచేస్తున్నాం
- సమాన అవకాశాలు గల సమాజాన్ని నిర్మిస్తున్నాం
- పౌరులకు వేగంగా సేవలు
- పది సూత్రాల అమలులో పురోగతి సాధించాం..
- రాజధాని అమరావతిలో తొలిసారి రాష్ట్ర స్థాయి గణతంత్ర వేడుకలు
- జాతీయ జెండా ఆవిష్కరించిన గవర్నర్ అబ్దుల్ నజీర్

ఈనాడు - అమరావతి

'కొన్ని సంవత్సరాలుగా రాష్ట్రానికి స్పష్టమైన దిశ లేకుండా పోయింది. రాజధాని నిర్మాణం ఆగిపోయింది. ఆర్థిక విశ్వాసం సడలిపోయింది. అభివృద్ధి, ప్రాజెక్టుల కొనసాగింపు లేమి పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని క్షీణింపజేసింది. ఆర్థిక స్థిరత్వాన్ని బలహీనపరచింది. ఇలాంటి సవాళ్లన్నింటినీ ఎదుర్కొంటూ.. ఆర్థిక స్థిరత్వాన్ని పునరుద్ధరించేందుకు, నమ్మకాన్ని పునర్నిర్మించేందుకు మా ప్రభుత్వం దృఢ సంకల్పంతో పనిచేస్తోంది' అని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చటం, అభివృద్ధి పునరుద్ధరణే లక్ష్యంగా ప్రభుత్వం ఆవిష్కరణ, సంస్కరణ, సమీక్షలను చేపడుతోందని పేర్కొన్నారు. 'ఈ ప్రయత్నాలన్నింటి వల్ల ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రాజెక్టులు కొనసాగుతున్నాయి. సంస్థలు తిరిగి బలోపేతమవుతున్నాయి. ప్రజల్లో విశ్వాసం ఏర్పడుతోంది. రాష్ట్రం కోలుకుంటోంది. మార్పు ప్రయాణం మొదలైంది' అని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి గణతంత్ర వేడుకలు తొలిసారిగా రాజధాని అమరావతిలో జరిగాయి. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ అబ్దుల్ నజీర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ దేశానికి స్వతంత్రం వచ్చి వందేళ్లు పూర్తయ్యేనాటికి బలమైన, సమగ్రత కలిగిన, ప్రపంచంతో పోటీ పడగలిగే రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దటమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం స్వర్ణాంధ్ర విజన్-2047కు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. ఆ లక్ష్య సాధన కోసం నిర్దేశించుకున్న పది మౌలిక సూత్రాల అమల్లో ఎంతో పురోగతి సాధించామన్నారు.

అమరావతి గడ్డపై నిల్చొని మాట్లాడటం గర్వకారణం..

ప్రజా రాజధాని అమరావతిలో తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ గణతంత్ర వేడుకలు చరిత్రాత్మకమైనవి. అత్యంత స్ఫూర్తిదాయకమైన కాలంలో మనం జీవిస్తున్నాం. ఒకప్పుడు మహా నాగరికతలు విలసిల్లిన, ఇప్పుడు కొత్త కలలు సాకారమవుతున్న చారిత్రక అమరావతి గడ్డపై నిలుచొని మాట్లాడటం గర్వకారణంగా ఉంది. (మిగతా 2లో)



గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్, సీఎం సతీమణి భువనేశ్వరి, గవర్నర్ సతీమణి సమీరా నజీర్



వేడుకలకు హాజరైన ప్రజలు

3 నెలలు..

54 ప్రాజెక్టులకు శంకుస్థాపనలు

- రూ.3.71 లక్షల కోట్ల పెట్టుబడులు
- 1.24 లక్షల మందికి ఉపాధి
- కార్యాచరణ సిద్ధం చేసిన అధికారులు

ఈనాడు, అమరావతి: ఒప్పందాలు కుదుర్చుకున్న కొన్ని ప్రాజెక్టుల గ్రౌండింగ్‌పై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఈ ఏడాది మొదటి మూడు నెలల్లో 54 ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేసేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. వాటిలో ఇప్పటికే 8 కంపెనీలకు శంకుస్థాపనలు నిర్వహించారు. ఇంకా 41 కొత్త ఎంవోయూలు.. ఇప్పటికే ఉత్పత్తిలో ఉన్న 5 కంపెనీల విస్తరణ ప్రాజెక్టులు గ్రౌండింగ్ చేసేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. వాటి ద్వారా జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో రూ.3.71 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయి. సుమారు 1.24 లక్షల మందికి ఉపాధి (మిగతా 11లో)

పట్టణాల్లో మౌలిక వసతులు

మరింత మెరుగ్గా

- రూ.52 వేల కోట్లతో అభివృద్ధి పనులకు ప్రణాళికలు
- 20 ఏళ్ల అవసరాలు తీర్చేలా ప్రతిపాదనలు
- తాగునీరు, డ్రైన్లు, రోడ్లు, ప్రజారోగ్యం, వీధిదీపాలకు ప్రాధాన్యం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి రోడ్ మ్యాప్



ఈనాడు - అమరావతి

పట్టణీకరణతో పెరుగుతున్న జనాభా అవసరాల మేరకు మౌలిక సదుపాయాలను మెరుగు పరిచేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రహదారులు, వరద నీటి కాలువలు, తాగునీరు, వీధి దీపాలు, ప్రజారోగ్యం తదితర అంశాల్లో పట్టణవాసులకు ప్రస్తుతం అందిస్తున్న సేవల్లో లోటు భర్తీ చేయడంతో పాటు వచ్చే 20 ఏళ్ల అవసరాలు తీర్చేలా కార్యాచరణ రూపొందిస్తోంది. కేంద్ర పథకాల సమర్థ వినియోగంతో పాటు పుర, నగరపాలక సంస్థల నిధులతో పట్టణాల్లో మెరుగైన సేవలు అందించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. 2028 నాటికి రూ.52 వేల కోట్లతో ప్రతిపాదిత పనులు పూర్తి చేయాలని యోచిస్తోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో పట్టణ జనాభా 29.47% నుంచి 37 శాతానికి పెరిగిందని అంచనా. విశాఖపట్నం, విజయవాడ నగరాల విస్తరణతో పాటు కొత్తగా అనేక ప్రాంతాలు వెలిశాయి. (మిగతా 2లో)

సహకార బ్యాంకుల్లో

'యూపీఐ' సేవలు

- తొలుత ఉమ్మడి పశ్చిమలో ప్రయోగాత్మకంగా అమలు

ఈనాడు, ఏలూరు: రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల్లో(డీసీసీబీ) యూపీఐ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రయోగాత్మకంగా ఉమ్మడి పశ్చిమగోదావరిలోని సహకార బ్యాంకుల్లో సోమవారం ఈ సేవలు ప్రారంభమయ్యాయి. ఇప్పటి దాకా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి చెల్లింపులు చేసే విధానం, ఫోన్ పే, గూగుల్ పే వంటి యూపీఐ సేవలు వాణిజ్య బ్యాంకుల్లో ఖాతాలు కలిగిన వినియోగదారులకు మాత్రమే ఉన్నాయి. సహకార బ్యాంకుల్లో ఖాతాలు కలిగిన రైతులకు ఈ రకమైన సేవలు లేకపోయేసరికి ప్రధానంగా పొగాకు, ఆయిల్ పామ్, కోకో రైతులు వాణిజ్య బ్యాంకుల వైపు ఆసక్తి చూపిస్తున్నారు. ఆ రైతుల సరకు విక్రయ లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌తోనే ముడిపడి ఉంటున్నాయి. దీంతో ఈ రకమైన యూపీఐ సేవలు (మిగతా 2లో)

పౌష్టికాహార లోపమే

అతిపెద్ద సమస్య

- చౌకధరల దుకాణాల ద్వారా ఇస్తున్న బియ్యం, గోధుమలు సరిపోవు
- విటమిన్లు, ప్రొటీన్లు ఆహారంలో భాగం కావాలి
- ఉపాధి హామీకి నిధుల తగ్గింపుతో పేదరిక నిర్మూలన లక్ష్యం నెరవేరదు
- 'ఈనాడు' ముఖాముఖిలో నోబెల్ పురస్కార గ్రహీత అభిజీత్ బెనర్జీ



ఆకారపు మల్లేశం

ఈనాడు - హైదరాబాద్

భారతదేశానికి పౌష్టికాహార లోపమే అతిపెద్ద సమస్య అని, ప్రజల ఆహారంలో ప్రొటీన్ల (మాంసకృత్తుల) లోపం ఎక్కువగా ఉందని, దాని వల్ల ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఎదువుతున్నాయని నోబెల్ పురస్కార గ్రహీత అభిజీత్ బెనర్జీ పేర్కొన్నారు. దేశ ప్రజలకు లభిస్తున్న, చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యం, గోధుమలు సరిపోవన్నారు. ప్రొటీన్లు, విటమిన్ల మిళితమైన పౌష్టికాహారాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలన్నారు. దేశవ్యాప్తంగా బడిపిల్లలకు గుడ్లు ఇవ్వడం వల్ల తక్కువ ఖర్చుతో పోషకాహారం అందించవచ్చని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్ ప్రభావవంతంగా ఉండాలన్నారు. భారతీయ సంతతికి చెందిన అమెరికన్ ఆర్థికవేత్త అభిజీత్ వినాయక్ బెనర్జీ... 2019లో (మిగతా 2లో)

నేడు బ్యాంకు ఉద్యోగుల సమ్మె

వారానికి ఐదు రోజుల పని విధానానికి డిమాండ్ 8లో

ఇదీ సంగతి!



కడలి కోతకు అడ్డుకట్ట!

జియోట్యూబ్ టెక్నాలజీతో రక్షణ గోడ

ఈనాడు డిజిటల్, భీమవరం, నరసాపురం, న్యూస్‌టుడే: ఒకప్పుడు అక్కడొక ఇల్లు, ఇక్కడో గుడి ఉండేవి.. తీరం పొడవునా కొబ్బరి, సర్వీ తోటలు విస్తారంగా ఉండేవి.. అవన్నీ కళ్లెదుటే కడలి గర్భంలో కలిసిపోయాయి' పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండల పరిధిలో చినమైనవానిలంక, బియ్యపుతిప్ప, పెదమైనవానిలంక గ్రామాల్లో తరచూ వినిపించే మాటలివి. కడలి అలల కోత, సముద్రం క్రమేపీ ముందుకొస్తుండటంతో ఊళ్లకు ఊళ్లే సముద్ర గర్భంలో కలిసిపోతున్నాయి. తీరప్రాంతవాసుల గుండె కోతకు కారణమవుతున్న అలల ఉద్ధృతికి అడ్డుకట్ట వేసేందుకు ఈ ప్రాంతంలో ప్రయోగాత్మకంగా కిలోమీటరు మేర జియోట్యూబ్ టెక్నాలజీతో రక్షణ గోడ నిర్మాణం చేపట్టారు.

కేంద్ర మంత్రి నిర్మల చొరవతో..

తీర ప్రాంతంలో కోత నివారణకు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాల్లో గతంలోనే జియోట్యూబ్ టెక్నాలజీని వినియోగించారు. ప్రస్తుతం



పీఎం లంక వద్ద రక్షణ గోడ నిర్మాణ పనులు

పశ్చిమ గోదావరి జిల్లాలోనూ అదే సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. పెదమైనవానిలంక (పీఎం లంక)లో సముద్రపు కోతను నివారించేందుకు 2022లో కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదేశాలతో ఈ ప్రాజెక్టుకు అంకురార్పణ జరిగింది. డెలైట్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు రూ.13.50 కోట్లు మంజూరు చేయగా వైకాపా సర్కారు నిర్లక్ష్యంతో పనులు ప్రారంభం కాలేదు. మద్రాస్ ఐఐటీ నిపుణుల నమూనా, సూచనల ఆధారంగా గతేడాది మేలో పెదమైనవానిలంకలో పైలట్ ప్రాజెక్టుగా ఒక కిలోమీటరు మేర (మిగతా 2లో)

దోపిడీకి ఆక్సిజన్ అందిస్తున్నారు!

- వచ్చే మూడేళ్లలో రూ.వంద కోట్లకుపైగా భారం
- వైకాపా నాయకులకు భారీగా ముడుపులు
- విజిలెన్స్ నిగ్గు తేల్చినా చర్యలు శూన్యం



కర్నూలు సర్వజన ఆసుపత్రిలోని ఆక్సిజన్ సరఫరా కేంద్రం

ఈనాడు - కర్నూలు

రాష్ట్రంలోని ప్రభుత్వ బోధనాసుపత్రులు, కొన్ని సర్కారు ఆసుపత్రుల్లో ఆక్సిజన్ కొనుగోలు పేరుతో భారీ దోపిడీ జరుగుతోంది. దీన్ని అడ్డుకోకపోతే వచ్చే మూడేళ్లలో ప్రభుత్వ ఖజానాపై రూ.వంద కోట్లకు పైగా భారం పడుతుందని విజిలెన్స్ నిగ్గు తేల్చింది. కర్నూలుకు చెందిన శ్రీభరత్ ఫార్మా మెడికల్ ఆక్సిజన్ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ రాష్ట్రంలోని బోధనాసుపత్రులు, కొన్ని ఇతర సర్కారు ఆసుపత్రులకు లిక్విడ్ మెడికల్ ఆక్సిజన్ (ఎల్ఎంవో) సరఫరా చేస్తోంది. ప్రైవేటు ఆసుపత్రులు కొనుగోలు చేస్తున్న ఎల్ఎంవో ధరలతో పోలిస్తే బోధనాసుపత్రులు.. సదరు సంస్థకు రెట్టింపునకు మించి చెల్లిస్తున్నాయి. దీంతో ఖజానాకు ప్రతి నెలా రూ.కోట్లలో నష్టం వాటిల్లుతోందంటూ కొందరు విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విజిలెన్స్ అధికారులు దర్యాప్తు చేయగా.. దోపిడీ వెలుగు చూసింది.

ఇదేం మతలబు?: కర్నూలు సర్వజన ఆసుపత్రికి 2018 నుంచి 2025 ఆగస్టు వరకు 1.01 కోట్ల క్యూబిక్ మీటర్ల ఎల్ఎంవో సరఫరా చేసినందుకు (మిగతా 11లో)

స్వీయ శక్తిని చాటిన భారత్

(మొదటి పేజీ తరువాయి)

ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పలువురు కేంద్ర మంత్రులు, మాజీ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, కాంగ్రెస్ అగ్ర నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, దౌత్యవేత్తలు తదితరులు హాజరయ్యారు. దాదాపు 10,000 మంది రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొన్నారు.

● కర్తవ్య పథ్‌లో జరిగిన వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జాతీయ జెండాను ఆవిష్కరించారు. తొలుత రాష్ట్రపతి భవన్ నుంచి విదేశీ అతిథులతో కలిసి ఆమె.. సంప్రదాయ గుర్రపు బగ్గీలో అశ్విక దళంతో కలిసి కర్తవ్య పథ్‌కు వచ్చారు.





గణతంత్ర వేడుకల్లో తొలిసారి పాల్గొన్న రెండు మూపురాల ఒంటెలు, ఝన్‌స్కార్ పోనీలతో సైనికులు ● హిమయోధ కంటింజెంట్‌కు చెందిన నల్ల గద్ద

తొలిసారిగా..

రిపబ్లిక్ డే వేడుకల పరేడ్‌కు కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ భవనీశ్ కుమార్ నేతృత్వం వహించారు. ఈ వేడుకల్లో తొలిసారిగా కొత్తగా ఏర్పాటు చేసిన భైరవ్ లైట్ కమాండో బెటాలియన్ కవాతు నిర్వహించింది. దీంతోపాటు శక్తిబన్ రెజిమెంట్ పాల్గొంది. రాకెట్ లాంచర్ వ్యవస్థ సూర్యాస్త్రను సైన్యం ప్రదర్శించింది. ఇది సుదూర ప్రాంతాల్లోకి చొచ్చుకెళ్లి దాడులు చేయడంతోపాటు కీలక మిలిటరీ స్థావరాలను లక్ష్యంగా చేసుకోగలదు.

● ప్రధాన యుద్ధ ట్యాంకు అర్జున్, దివ్యాస్త్ర బ్యాటరీ, ధ్రువ్ అత్యాధునిక హెలికాప్టర్, టీ-90 భీష్మ ట్యాంకు, నాగ్ క్షిపణి వ్యవస్థ, రోబోటిక్ శునకాలు, డ్రైవరు రహిత వాహనాలు పరేడ్‌లో పాల్గొన్నాయి.

● రెండు మూపురాలున్న ఒంటెలు, ఝన్‌స్కార్ పోనీలు తొలిసారిగా పరేడ్‌లో పాల్గొన్నాయి.

● పరేడ్‌లో తొలిసారిగా పాల్గొన్న భిన్న స్కౌట్ యూనిట్ల కవాతుకు లెఫ్టినెంట్ అమిత్ చౌధరి నాయకత్వం వహించారు. పర్వత ప్రాంతాల్లో పనిచేసే ఈ దళాలు.. తీవ్ర హిమపాతాన్ని తట్టుకునే శ్వేత వర్ణ దుస్తులు ధరించి ఆకట్టుకున్నారు.

● శక్తిబన్ రెజిమెంట్ తొలిసారిగా పరేడ్‌లో పాల్గొంది. ఈ దళాన్ని ఫిరంగుల కోసం ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. దీనిని డ్రోన్లు, కౌంటర్ డ్రోన్లు, మందుగుండు సామగ్రితో బలోపేతం చేశారు.

● గత ఏడాది అక్టోబరులో ఏర్పాటైన భైరవ్ దళం జనవరి 15వ తేదీన జైపుర్‌లో జరిగిన సైనిక దినోత్సవంలో పాల్గొంది. సోమవారం రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొంది. శీఘ్రంగా స్పందించే, అత్యంత తీవ్ర స్థాయిలో దాడులకు దిగేలా ఈ దళాన్ని రూపొందించారు.

● ఆపరేషన్ సిందూర్ చేపట్టిన విధానాన్ని పరేడ్‌లో ప్రదర్శించారు. గత ఏడాది పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై చేపట్టిన దాడుల దృశ్యాల వీడియోను విడుదల చేశారు.

● పరేడ్‌లో రఫేల్, మిగ్-29, సుఖోయ్-30లను ప్రదర్శించారు. సీఆర్‌పీఎఫ్ దళ కవాతుకు 26ఏళ్ల మహిళా అధికారి సిమ్రన్ బాల నేతృత్వం వహించారు. దాదాపు 100మంది కళాకారులు తమ భిన్నత్వంలో ఏకత్వ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.

బ్రహ్మోస్ సహా పలు క్షిపణుల ప్రదర్శన

పరేడ్‌లో బ్రహ్మోస్, ఆకాశ్ క్షిపణులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మధ్యశ్రేణి భూతలం నుంచి గగనతలంలోని లక్ష్యాలను ఛేదించే ఎంఆర్ శామ్ క్షిపణి వ్యవస్థ, అటాగ్స్ శతఘ్ని వ్యవస్థ, ధనుష్ శతఘ్ని, డ్రోన్లను ప్రదర్శించారు.

● దీర్ఘ శ్రేణి నౌకా విధ్వంసక హైపర్‌సోనిక్ క్షిపణి, హైపర్ సోనిక్ గ్లైడ్ క్షిపణిని (స్థిర, చలన లక్ష్యాలను ఛేదించే) పరేడ్‌లో ప్రదర్శించారు.

● కెప్టెన్ హర్షిత రాఘవ్ నేతృత్వంలోని రెమౌంట్ వెటర్నరీ కోర్ దళం పరేడ్‌లో పాల్గొంది. ఇందులో డేగలు, శునకాలున్నాయి.

● 18 కవాతు దళాలు, 13 బ్యాండ్ దళాల పరేడ్ 90 నిమిషాలపాటు సాగింది.

● సీఆర్‌పీఎఫ్ జవాన్ల మోటారు సైకిళ్ల విన్యాసం, సశస్త్ర సీమాబల్ ప్రదర్శన ఆకట్టుకున్నాయి.

● ఈ ఏడాది రిపబ్లిక్ డే పరేడ్ థీమ్‌గా 150 ఏళ్ల వందేమాతరాన్ని ఎంచుకున్నారు.

గ్యాలరీలకు నదుల పేర్లు

పరేడ్ గ్యాలరీలకు బ్రహ్మపుత్ర, బియాస్, చంబల్, చినాబ్, గండక్, గంగా, ఘాగ్రా, గోదావరి, సింధు, జీలం, కావేరి, కోసి, మహానది, యమునా, కృష్ణా, నర్మదా, పెన్నార్, రావి, సోన్, సట్లెజ్, తీస్తా, పెరియార్ తదితర నదుల పేర్లు పెట్టారు.

● 17 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన 30 శకటాలు పరేడ్‌లో పాల్గొన్నాయి.

భారత్‌తోనే సుస్థిరత

విజయవంత భారత్‌తోనే సుస్థిర ప్రపంచం సాధ్యమని ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లెయెన్ స్పష్టం చేశారు. రిపబ్లిక్ డే ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న అనంతరం ఆమె సామాజిక మాధ్యమ వేదికగా స్పందించారు. 'రిపబ్లిక్ డే ఉత్సవాల్లో పాల్గొనడం నాకు జీవితకాల గౌరవం. విజయవంత భారత్‌తోనే సుసంపన్న, సురక్షిత ప్రపంచం సాధ్యమవుతుంది. అది మనందరికీ మేలు చేస్తుంది' అని ఆమె పేర్కొన్నారు. భారత గణతంత్ర వేడుకల్లో తొలిసారిగా ఐరోపా కూటమి (ఈయూ) అగ్రనేతలిద్దరూ ఒకేసారి పాల్గొనడం విశేషం. వాన్ డెర్‌తోపాటు ఐరోపా కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా పాల్గొన్నారు. కర్నల్ ఫ్రెడిక్ సైమన్ స్ప్రూజ్ నేతృత్వంలోని ఈయూ సైనిక దళం వేడుకలకు హాజరైంది.

అశోక చక్ర అందుకున్న శుభాంశు

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్లొచ్చిన తొలి భారతీయుడిగా గుర్తింపు పొందిన వ్యోమగామి గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా.. శాంతికాలంలో ఇచ్చే దేశ అత్యున్నత శౌర్య పురస్కారం 'అశోక చక్ర'ను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా అందుకున్నారు.



వేడుకల్లో భైరవ్ బెటాలియన్ సైనికుల కవాతు







గణతంత్ర వేడుకల సందర్భంగా సోమవారం అమరావతిలో నిర్వహించిన శకటాల ప్రదర్శనలో ప్రథమ బహుమతి పొందిన రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ శకటం ● ద్వితీయ బహుమతి పొందిన గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ శకటం ● తృతీయ బహుమతి పొందిన పరిశ్రమలు, వాణిజ్యశాఖ శకటం

మార్పు మొదలైంది

(మొదటి పేజీ తరువాయి)

గతాన్ని చూసి గర్వపడదాం. వర్తమానాన్ని నమ్ముదాం. భవిష్యత్తుపై విశ్వాసం పెట్టుకుందాం. గౌరవం, అవకాశాలు, న్యాయం ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలనేది ప్రభుత్వ లక్ష్యం.

రైతు కుమార్తె ఇంజినీర్ అయ్యేలా..

● స్వర్ణాంధ్ర విజన్-2047లో భాగంగా మౌలిక వసతుల నిర్మాణానికే పరిమితమవ్వట్లేదు. సమాన అవకాశాలు కలిగిన సమాజాన్ని నిర్మిస్తున్నాం. ఓ సాధారణ రైతు కుమార్తె ఇంజినీర్ అయ్యేలా, ఓ మత్స్యకారుడి కుమారుడు పారిశ్రామికవేత్తగా మారేలా సమాన అవకాశాలు కల్పించే సమాజాన్ని సృష్టిస్తున్నాం.

● పరిపాలన కాలానుగుణంగా మారాలనేది మా ప్రభుత్వ నమ్మకం. సేవల పంపిణీలో వేగం, పారదర్శకత ఇప్పుడు కొత్త ప్రామాణికాలుగా మారాయి. సాంకేతికత ద్వారా సహాయం, సమాచారం, న్యాయం ఇవన్నీ పౌరులకు వెంటనే చేరేలా చూస్తున్నాం. రోజుల్లో కాదు.. క్షణాల్లో సేవలందిస్తున్నాం. ఇదే స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్.

● స్వర్ణాంధ్ర దిశగా ప్రతి గ్రామాన్ని, పట్టణాన్ని నగరాన్ని తీర్చిదిద్దాలనేది లక్ష్యం.

పరిపాలనకు పది మౌలిక సూత్రాలు

1.పేదరికం లేని సమాజం: ప్రతి వ్యక్తికి గౌరవం, భద్రత, సంతోషం అందించటానికి, ప్రతి కుటుంబం సాధికారత సాధించేలా చేయటం కోసం సూపర్ సిక్స్ అమలు చేస్తున్నాం. సంపన్నులు-పేదల మధ్య అంతరాలు తగ్గించటానికి సంక్షేమ పథకాలను సంపద సృష్టితో మేళవించి.. అందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నాం.

2. ఉపాధి, నైపుణ్యం (యువగళం): యువగళం హామీల్లో భాగంగా ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశాం. 5,757 పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలిచ్చాం. స్కిల్ పాస్‌పోర్టు, నైపుణ్యం పోర్టల్, ఏఐ రెజ్యూమె బిల్డర్, వాయిస్ అసిస్టెంటైన ఆస్క్ విద్య వంటి వాటి ద్వారా యువత ప్రపంచ స్థాయి ఉద్యోగాలు పొందేలా అనుసంధానిస్తున్నాం.

3. జనాభా నిర్వహణ: జనాభా నియంత్రణ నుంచి జనాభా నిర్వహణ వైపు అడుగులేస్తున్నాం. పునరుత్పత్తి సామర్థ్య ఆరోగ్యం కోసం ఫెర్టిలిటీ కళాశాలలు ఏర్పాటు చేస్తున్నాం. మండల స్థాయిలో ఎల్డర్లీ క్లబ్‌లు నెలకొల్పుతున్నాం. సీనియర్ సిటిజన్స్ కోసం సిల్వర్ ఎకానమీని ప్రోత్సహిస్తున్నాం.

4. నీటి భద్రత: నదుల అనుసంధానం ద్వారా ప్రతి ఎకరాకు నీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. పోలవరం ప్రాజెక్టు వేగంగా ముందుకు సాగుతోంది. 2027 డిసెంబరు నాటికి ఈ ప్రాజెక్టు ప్రారంభించాలనేది లక్ష్యం.

5. రైతులు-అగ్రిటెక్: డిజిటల్ ఫార్మర్ ఐడీలు, ఈ-పంట సర్వేలు, కిసాన్ డ్రోన్ బ్యాంకులు, 100 శాతం భూ ఆరోగ్య కార్డుల ద్వారా వ్యవసాయాన్ని డిజిటల్ వైపు మళ్లిస్తున్నాం.


6. ప్రపంచ స్థాయి లాజిస్టిక్స్: అమరావతిని నిర్మిస్తున్నాం. విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్‌ను అభివృద్ధి చేస్తున్నాం. 2019-2024 మధ్య రాష్ట్రంలో రోడ్లు నిర్లక్ష్యానికి గురయ్యాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక.. రహదారులపై గుంతలు లేకుండా చేయటాన్ని ఓ ఉద్యమంలా చేపట్టాం.

7. వ్యయ నియంత్రణ: క్లీన్, అఫర్డబుల్ ఎనర్జీకి ఆంధ్రప్రదేశ్‌ను పవర్‌హౌస్‌గా మారుస్తున్నాం. విద్యుత్తు ఛార్జీలకు ట్రూ అప్ స్థానంలో ట్రూ డౌన్ చేసి వినియోగదారులపై భారం తగ్గిస్తాం.

8. ప్రొడక్ట్ పర్ఫెక్షన్ (బ్రాండ్ ఏపీ): ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వైపు వచ్చేశాం.

9. స్వచ్ఛ ఆంధ్ర, సేఫ్ ఆంధ్ర: స్వచ్ఛమైన గాలి, నీరు, కాలుష్యరహిత భూమిని అందించాలనే మా లక్ష్యం. శాంతిభద్రతల సమస్యలను ఉపేక్షించేది లేదు. వాటి పట్ల కఠినంగా ఉంటాం.

10. డీప్ టెక్ అండ్ స్మార్ట్ గవర్నెన్స్: అమరావతి క్వాంటమ్ వ్యాలీని నెలకొల్పుతున్నాం. అతి త్వరలోనే భారత్‌లోనే తొలి క్వాంటమ్ కంప్యూటర్‌ను ఇన్‌స్టాల్ చేస్తున్నాం.



జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్. చిత్రంలో సీఎస్ విజయానంద్, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా



వేడుకలకు హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లతో గవర్నర్ అబ్దుల్‌నజీర్



పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌ల ఆత్మీయ ఆలింగనం

కడలి కోతకు అడ్డుకట్ట!

(మొదటి పేజీ తరువాయి)

రక్షణ గోడ నిర్మాణ పనులు చేపట్టారు. పుణెకు చెందిన గార్వారె సంస్థ ఈ పనులు ప్రారంభించగా ఫిబ్రవరి నాటికి 73 శాతం పూర్తవుతాయని ఆ సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు.

సునామీ తరువాత నుంచి..: 2004లో సునామీ తర్వాత సముద్రంలో అలల ఉద్ధృతి పెరగడంతో నరసాపురం ప్రాంతంలో తీరం కోతకు గురవుతోంది. చినలంక, పాత బియ్యపుతిప్ప గ్రామాలు దాదాపుగా సముద్రంలో కలిసిపోయాయి. పీఎం లంక, కేపీపాలెం సౌత్‌లోనూ తీరం తరగిపోతోంది. బంగాళాఖాతంలో తుపానులు, ఇతర ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు తీరం వెంబడి రూ. కోట్ల విలువైన సర్వి, కొబ్బరి తోటలు కడలిలో కలిసిపోతున్నాయి. మూడేళ్ల కిందట సముద్రం పీఎం లంకకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉండేది. ఇప్పుడు కేవలం కిలోమీటరు దూరంలోకి వచ్చేసింది. జిల్లాలో 19 కి.మీ. మేర తీర ప్రాంతం ఉండగా ఇక్కడ కోత సమస్య తీవ్రంగా ఉంది. దీంతో పైలట్ ప్రాజెక్టుగా కిలోమీటరు మేర నిర్మాణం చేపట్టారు. దీని ఫలితాల ఆధారంగా మిగిలిన చోట్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

జియో ట్యూబ్ సాంకేతికత..

నీటి ప్రవాహ వేగం, అలల తీవ్రత, నేల స్వభావాన్ని అంచనా వేసి రక్షణ గోడ నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. ఆరు దశలుగా చేపడుతున్న



ఈ ప్రక్రియలో జియో టెక్స్‌టైల్ ఫ్యాబ్రిక్‌తో తయారు చేసిన ట్యూబ్ (జియో ట్యూబ్)లను ఇసుకతో నింపి నిర్దేశిత పొడవు, వ్యాసంతో తీర ప్రాంతంలో గోడలా అమర్చుతున్నారు. దీనికి ఇరువైపులా పాలిప్రొపైలిన్ జియో సింథటిక్ తాడుతో చేసిన గాబియన్ బాక్స్ (150×150 ఎంఎం)లో గ్రానైట్ రాళ్లను నింపి ఉంచుతున్నారు. వాటి మధ్య ఖాళీని ఇసుక సంచులతో నింపుతున్నారు. తరువాత గాబియన్ బాక్సులపై, జియో టెక్స్‌టైల్ లేయర్, రాతిపొర, దానిపై మొర్రమ్ (మట్టిలాంటిది) లేయర్ వేస్తున్నారు.

పట్టణాల్లో మౌలిక వసతులు మరింత మెరుగ్గా

(మొదటి పేజీ తరువాయి)

గుంటూరు పది లక్షల జనాభాకు చేరువలో ఉంది. నెల్లూరు, ఒంగోలు, కాకినాడ, కర్నూలు, అనంతపురం, కడప నగరాలు ఏటేటా విస్తరిస్తున్నాయి.

అదనపు మౌలిక వసతులు..

● 123 పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో కొత్తగా 1,450 కిలోమీటర్ల మేర సిమెంట్, తారు రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదించారు. ప్రస్తుతం 20,513 కి.మీ. మేర రహదారులున్నాయి. కొత్తగా వెలుస్తున్న చాలా కాలనీల్లో అంతర్గత రహదారుల్లేవు. పుర, నగరపాలక సంస్థల సాధారణ నిధులతో అక్కడ రోడ్లు వేయనున్నారు.

● నగరాలు, పట్టణాల్లో 23,611 కి.మీ. మేర వరద నీటి కాలువలు నిర్మించాలని ప్రతిపాదించారు. ఇందుకు రూ. 4,849 కోట్లు అవసరమని అంచనా. ప్రధాన నగరాల్లో ప్రస్తుతం 23,349 కి.మీ. మేర వరద నీటి కాలువలు ఉన్నాయి. మిగిలిన చోట్లా నిర్మించనున్నారు. పట్టణాభివృద్ధి సంస్థల నిధులతో ఈ పనులు చేపట్టనున్నారు.

● రోజూ 302.01 మిలియన్ లీటర్ల మురుగు నీటిని శుద్ధి చేసేలా ప్లాంట్ల ఏర్పాటుకు ప్రతిపాదించారు. ప్రస్తుతం రోజూ వస్తున్న 1,957 మిలియన్ లీటర్ల మురుగు నీటిలో 533.65 మిలియన్ లీటర్లు శుద్ధి చేస్తున్నారు. మరో 711.76 మిలియన్ లీటర్లు శుద్ధి చేసేందుకు చేపట్టిన ఎస్‌టీపీలు నిర్మాణ దశల్లో ఉన్నాయి.

● 289 మిలియన్ లీటర్ల తాగునీరు అదనంగా అందుబాటులోకి వచ్చేలా కొత్త ప్రాజెక్టులు ప్రతిపాదించారు. ప్రస్తుతం నిత్యం 1,817 మిలియన్ లీటర్లు సరఫరా చేస్తున్నారు. పలు పథకాల కింద నిర్మాణంలోని ప్రాజెక్టులు పూర్తి చేయడం ద్వారా అదనంగా 1,285 మిలియన్ లీటర్ల నీరు అందుబాటులోకి రానుంది.

నగరాలు, పట్టణాల్లో ప్రజలకు ఇప్పుడు అందుతున్న వివిధ సేవలు, ఇంకా చేయాల్సినవి. (శాతంలో)

విభాగం	ప్రస్తుత సేవలు	లోటు
తాగునీటి సరఫరా	63.50	36.50
ఘన వ్యర్థాల నిర్వహణ	95.10	4.90
ద్రవ వ్యర్థాల నిర్వహణ	36.10	63.90
రహదారులు	82.10	17.90
వీధి దీపాలు	96.84	3.16

● కొత్త కాలనీల్లో, పాడైన వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటుకు 87,672 ఎల్ఈడీ వీధి దీపాలు అమర్చాల్సి ఉంది. ప్రస్తుతం 9.07 లక్షలకు పైగా వీధి దీపాలు ఉన్నాయి. వీటిలో 28,705 ఎల్ఈడీల్లో సరైన వెలుతురు (గ్లోయింగ్) ఉండటం లేదు.

నిధుల సమీకరణ ఇలా..

● 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్' కింద కేంద్రం నుంచి ఏటా రూ.10 వేల కోట్ల చొప్పున పదేళ్లలో రూ. లక్ష కోట్లు సాధించి వాటితో నగరాలు, పట్టణాల రూపురేఖలు మార్చాలన్నది ప్రణాళిక. రూ.30 వేల కోట్లతో తొలిదశలో చేపట్టనున్న ప్రాజెక్టులకు సంబంధించి కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు.

● సాస్కీ పథకంలో కేంద్రం నుంచి రూ.2 వేల కోట్లు రాబట్టాలన్నది ప్రణాళిక. పట్టణ పాలనలో సంస్కరణల ద్వారా నిధులు సమకూర్చుకునేలా కేంద్రానికి ప్రతిపాదించారు.

● పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి (యూఐడీఎఫ్), ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐఐబీ) రుణాలతోపాటు అమృత్ పథకంలో రూ.15,500 కోట్లతో వివిధ దశల్లోని అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నది ప్రణాళిక.

పౌష్టికాహార లోపమే అతిపెద్ద సమస్య

(మొదటి పేజీ తరువాయి)

ఆర్థికశాస్త్రంలో ఎస్తేర్ డూఫ్లో, మైఖేల్ క్రేమర్‌లతో కలిసి 'ప్రపంచ పేదరిక నిర్మూలనకు ప్రయోగాత్మక విధానం' అనే పరిశోధనకు నోబెల్ అందుకున్నారు. హైదరాబాద్‌లో జరుగుతున్న సాహితీ ఉత్సవానికి హాజరైన అభిజీత్ సోమవారం 'ఈనాడు' ముఖాముఖిలో మాట్లాడారు.

దేశంలో పేదరికం తగ్గుతోందా?

ప్రజలకు సరైన ఆహారం అందడమే ప్రగతి సూచిక. ప్రస్తుతం దేశంలో పేదవారు తమ ఆదాయంలో 40% ఆహారంపై ఖర్చు చేస్తుండగా... ధనవంతులు 60% వెచ్చిస్తున్నారు. పేదలకు ఆదాయం పెరిగినప్పుడు పోషకాహారం కంటే ఆహారేతర వస్తువుల కొనుగోలు, ఇతర సౌకర్యాలకు ఎక్కువ మొత్తం ఖర్చు చేస్తున్నారు. ఆహారం ఎంపిక విషయంలో చాలా సంక్లిష్టంగా వ్యవహరిస్తున్నారు. ఒక్కోసారి టీ, కాఫీ, స్నాక్స్ వంటి వాటిని ఎక్కువగా వినియోగిస్తున్నారు. పోషక విలువల కోసం సంప్రదాయ ఆహారాలను కొనసాగించాలి. అవి కేవలం సంప్రదాయమనే కాదు... ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి కాబట్టి.

పోషకాహార సమస్యకు పరిష్కారమేంటి?

ఆకలిని తీర్చడానికి ఆహార ధాన్యాలను అందించడం కాకుండా పోషకాహార లోపం తగ్గించడం అవసరం. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే సేవలను మెరుగుపరచడం ద్వారా పిల్లల్లో పోషకాహార లోపాన్ని అరికట్టవచ్చు. మహిళలకు సాధికారత కల్పించడం, వారిలో అవగాహన పెంపొందించడం ద్వారా కుటుంబంలో ఆరోగ్యకరమైన అలవాట్లను తీసుకురావచ్చు.

ఉపాధి హామీ స్థానంలో కేంద్రం తెస్తున్న జీరామ్‌జీపై మీ అభిప్రాయం...

ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను తగ్గించడం వల్ల రాష్ట్రాల మధ్య అసమానతలు పెరుగుతాయి. ముఖ్యంగా పేద రాష్ట్రాల వద్ద నిధులు లేక తక్కువ ఖర్చు చేస్తాయి. దీని వల్ల పేదరిక నిర్మూలన లక్ష్యం నెరవేరదు.

రానున్న కేంద్ర బడ్జెట్‌కు మీ సూచనలు...

బడ్జెట్ మూస పద్ధతిలో కాకుండా మరింత ప్రభావవంతంగా ఉండేలా దృష్టి సారించాలి. ప్రజల ఆరోగ్యకరమైన జీవన ప్రమాణాల మెరుగుదలతో పేదరిక నిర్మూలన, పట్టణ వికేంద్రీకరణ వంటి అంశాలపై దృష్టి సారించాలి.

అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా మారేందుకు 2047 వికసిత భారత్ లక్ష్యాలు ఎలా ఉన్నాయి?

2047 నాటికి భారత్ 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకుంటుందా అన్న ప్రశ్నకు ఆర్థిక వ్యవస్థలు ఎప్పుడు పెరుగుతాయో, ఎప్పుడు ఆగిపోతాయో అంచనా వేయలేం. భవిష్యత్తు గురించి ఇప్పుడే చెప్పలేం.

ఆర్థిక ర్యాంకింగ్‌లో పురోగతి దేనికి సూచిక?

ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల జాబితాలో భారత్ 4 లేదా 5వ స్థానంలో ఉండటం అనేది సంక్షేమపరంగా పెద్ద ఆసక్తికరమైన విషయం కాదు. జర్మనీతో పోలిస్తే మన దేశ జనాభా చాలా ఎక్కువ కాబట్టి తలసరి ఆదాయం ప్రాతిపదికన చూడాలి.

సహకార బ్యాంకుల్లో 'యూపీఐ' సేవలు

(మొదటి పేజీ తరువాయి)

సహకార బ్యాంకుల్లో ప్రారంభించే విషయంపై ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు ఉన్నతాధికారులతో మాట్లాడి తొలుత తన సొంత జిల్లా ఉమ్మడి పశ్చిమ నుంచే దీనికి శ్రీకారం చుట్టారు. సహకార సంఘాలు, బ్యాంకులు పారదర్శకంగా పనిచేయాలని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాటిల్లో లావాదేవీలను కంప్యూటరీకరణ చేసింది. దీంతో ఆన్‌లైన్ సేవలు అమలు చేయటానికి మార్గం సుగమమైంది. ఇకపై ఖాతాదారులు మొబైల్ ఫోన్లను వినియోగించి తక్షణమే ఇతరులకు డబ్బులు పంపొచ్చు. స్వీకరించొచ్చు. నగదు రహిత సేవలను ఎప్పుడైనా, ఎక్కడి నుంచైనా బ్రాంచిని సందర్శించకుండా వినియోగించుకోవచ్చు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సహకార బ్యాంకుల్లో త్వరలోనే యూపీఐ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు.

నేటి నుంచి కార్మిక చట్టాలపై ప్రాంతీయ సదస్సు

ఈనాడు, అమరావతి: కార్మిక చట్టాలు, ఇతర కీలక అంశాలపై మంగళవారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్న ప్రాంతీయ సదస్సులో పాల్గొనేందుకు కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి శోభా కరంద్లాజే సోమవారం విజయవాడకు చేరుకున్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కార్మిక సంస్కరణలు, కొత్త కార్మిక చట్టాల అమలు విధానం, కార్మికుల సంక్షేమం, పరిశ్రమల అభివృద్ధి, కేంద్రం-రాష్ట్రాల సమన్వయంపై ఈ సదస్సులో చర్చించనున్నారు. ఏపీ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ, దిల్లీ, పుదుచ్చేరిలకు చెందిన కార్మిక శాఖ అధికారులు పాల్గొననున్నారు.

గ్రహం అనుగ్రహం

27-1-2026 మంగళవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర ఋతువు, మాఘ మాసం, శుక్ల పక్షం

నవమి: సా. 4-53 తదుపరి దశమి; **భరణి:** ఉ. 9-28 తదుపరి కృత్తిక
వర్జ్యం: రా.8-38 నుంచి 10-08 వరకు; **అమృత ఘడియలు:** తె.5-35 నుంచి
దుర్ముహూర్తం: ఉ. 8-52 నుంచి 9-36 వరకు తిరిగి రా. 10-56 నుంచి 11-47 వరకు; **రాహుకాలం:** మ. 3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ.6.38; **సూర్యాస్తమయం:** సా.5.49

చలి-పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	16.0	28.0
విశాఖపట్నం	17.6	31.0
శ్రీకాకుళం	18.0	30.0
తాడేపల్లిగూడెం	19.0	32.0
హైదరాబాద్	19.6	29.7
గుంటూరు	20.0	31.0
కర్నూలు	20.0	31.5
విజయవాడ	20.3	30.2
రాజమహేంద్రవరం	20.5	35.0
కడప	21.0	28.0
తిరుపతి	21.0	28.1
అనంతపురం	21.0	33.4
నరసాపురం	21.8	33.0
ఒంగోలు	23.0	30.7
నెల్లూరు	23.4	31.2

అమరావతి వేదికగా.. తొలి మువ్వన్నెల పండగ


గణతంత్ర వేడుకలకు హాజరైన అమరావతి రైతులు

ఈనాడు, అమరావతి: ప్రజా రాజధాని అమరావతిలో తొలి మువ్వన్నెల పండగ ఘనంగా జరిగింది. రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతుల ఆనందోత్సాహాల మధ్య ఈ వేడుక అద్భుతంగా అంగరంగ వైభవంగా కొనసాగింది. ఎటు చూసినా మువ్వన్నెల జెండాల రెపరెపలు... మూడు రంగులతో అలంకరించిన ప్రాంగణాలతో అమరావతి ప్రాంతమంతా శోభాయమానంగా కనిపించింది. ఏటా విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిపే గణతంత్ర రాష్ట్ర స్థాయి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం ఈసారి అమరావతిలో నిర్వహించింది. రాయపూడి సమీపంలో సీడ్ యాక్సెస్ రహదారి పక్కనున్న ఎమ్మెల్యేల భవన సముదాయాల నుంచి హైకోర్టుకు వెళ్లే మార్గంలోని 22 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన విశాలమైన పరేడ్ మైదానంలో జరిగింది. అమరావతి రైతులు, మహిళలు అత్యంత ఉత్సాహంగా హాజరయ్యారు. వారి కోసం ప్రత్యేకంగా గ్యాలరీలు ఏర్పాటు చేశారు. తమ ప్రాంతంలో మొదటిసారి రిపబ్లిక్ డే రాష్ట్ర స్థాయి వేడుకలు జరుగుతుండటంతో రైతులు, మహిళలు కుటుంబాలతో ఉత్సాహంగా తరలివచ్చారు. ఆకుపచ్చ కండువాలు ధరించి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఓ చరిత్రాత్మక కార్యక్రమంలో పాల్గొన్నామనే ఆనందం వారి ముఖాల్లో వెల్లివిరిసింది. గవర్నర్, ముఖ్యమంత్రి సహా ప్రముఖులు ఆసీనులైన వేదికగా ఎదురుగా ఉండే ప్రాంతాన్ని అమరావతి స్ఫూర్తిని ప్రతిబింబించేలా తీర్చిదిద్దడం ఆకట్టుకుంది. ప్రజా రాజధాని అమరావతిలో తొలిసారిగా గణతంత్ర దినోత్సవ రాష్ట్ర స్థాయి కార్యక్రమ నిర్వహణ చరిత్రాత్మకమని, మహోన్నత నాగరికత విలసిల్లిన అమరావతి నుంచి ప్రసంగించడం తనకు గర్వకారణమని గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగించిన సమయంలో హర్షధ్వానాలు వినిపించాయి.


అమరావతిలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో కవాతు చేస్తున్న పోలీసులు

● సాయుధ, సాయుధ రహిత బలగాల కవాతు ప్రదర్శన ఆకట్టుకుంది. సాయుధ విభాగంలో ఇండియన్ ఆర్మీ కంటింజెంట్‌కు మొదటి బహుమతి, ఏపీఎస్పీ 16వ బెటాలియన్ విశాఖపట్నానికి రెండో బహుమతి లభించింది. కేరళ పోలీసు కంటింజెంట్‌కు ప్రోత్సాహక బహుమతి దక్కింది. సాయుధ రహిత విభాగంలో ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థ (ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్) ప్రథమ బహుమతి, ఎన్‌సీసీ బాలికల కంటింజెంట్ ద్వితీయ బహుమతి దక్కించుకున్నాయి.

చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఆసక్తికర చర్చలు

■ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన సతీమణి నారా భువనేశ్వరి, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఆయన సతీమణి అన్నా లెజినోవాతో కలిసి వేడుకలకు హాజరయ్యారు. మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు పలు సందర్భాల్లో ఆసక్తికరంగా చర్చించుకుంటూ, నవ్వుతూ కనిపించారు.

■ గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యా శాఖ మంత్రి లోకేశ్ ప్రాంగణానికి చేరుకున్నప్పుడు విద్యార్థులు, యువత కేరింతలు కొట్టారు.

అమరావతిలో తొలిసారి గణతంత్ర వేడుకల నిర్వహణ అద్భుతం

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ఈనాడు, అమరావతి: 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కలల రాజధాని అమరావతిలో తొలిసారి నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో పాల్గొనడం ఆనందాన్నిచ్చింది. అద్భుతంగా నిర్వహించిన ఈ కార్యక్రమం భవిష్యత్తు లక్ష్యాలకు అద్దం పట్టింది. 22 శకటాలు రాష్ట్ర ప్రగతిని ప్రతిబింబించాయి. సీఎం చంద్రబాబు నాయకత్వంలో అమరావతి సకల సౌకర్యాలతో విశ్వనగరంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నా' అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 'గణతంత్ర దినోత్సవ వేదిక నుంచి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం రాష్ట్ర భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేసింది. రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిస్తూ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తాం. కూటమి ప్రభుత్వం వేసే ప్రతి అడుగు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ఉంటుంది' అని వివరించారు.

వందేమాతర గీతం శకటానికి ప్రథమ స్థానం

గణతంత్ర దినోత్సవం సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల ప్రగతిని చూపించేలా రూపొందించిన శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. వందేమాతరం గీతానికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని సాంస్కృతిక శాఖ ఏర్పాటు చేసిన 'వందేమాతరం-150 సంవత్సరాలు' శకటానికి ప్రథమ బహుమతి లభించింది. 'మహిళా సంక్షేమమే చంద్రన్న ధ్యేయం- లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే మన ప్రభుత్వ ఆశయం' పేరిట సెర్ప్ రూపొందించిన శకటానికి ద్వితీయ బహుమతి దక్కింది. 'పెట్టుబడుల ద్వారా ఉపాధి' థీమ్‌తో పరిశ్రమల శాఖ శకటానికి తృతీయ బహుమతి వరించింది. గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఆయా శాఖల ఉన్నతాధికారులు బహుమతులు అందుకున్నారు.

పాలనలో సాంకేతికతకు ప్రాధాన్యత

- ఉద్యోగులపై పని భారాన్ని తగ్గించండి
- ఆర్టీజీఎస్‌పై సమీక్షలో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి : పాలనలో సాంకేతికతను విస్తృతంగా వినియోగించి ఉద్యోగులపై పనిభారాన్ని తగ్గించాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. సాంకేతికతపై అవగాహనకు శిక్షణ ఇచ్చి.. నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు. ఆర్టీజీఎస్‌పై వివిధ శాఖల అధికారులతో క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమీక్షలో చంద్రబాబు మాట్లాడారు. 'సాంకేతికతతో పాలనలో చాలా సమస్యలు పరిష్కరించవచ్చు. సాంకేతికతను ఉద్యోగులు, అధికారులు విస్తృత స్థాయిలో వినియోగించుకునేలా ప్రోత్సహించాలి. ఈ ఏడాది టెక్నాలజీ డ్రివెన్ డెసిషన్ మేకింగ్ సంవత్సరంగా ఉండాలి. ప్రభుత్వ సేవల్లోనూ ఏఐ పాత్ర పెరగాలి. ఏఐని వినియోగించుకుని ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి. ఇక డేటా డ్రివెన్ గవర్నెన్స్‌పై మరింత దృష్టి సారిస్తాం' అని సీఎం పేర్కొన్నారు. మనమిత్ర- వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ప్రస్తుతం వివిధ ప్రభుత్వ విభాగాలకు చెందిన 878 సేవలు అందిస్తున్నామని. . వీటిని ఇప్పటి వరకు 1.43 కోట్ల మంది వినియోగించుకున్నారని అధికారులు సీఎంకు వివరించారు. వైద్యం, వ్యవసాయం, రెవెన్యూ, రహదారులు, ఆర్టీఏ, అగ్నిమాపకశాఖల పనితీరుపై సీఎం అధికారులతో సమీక్షించారు.

ఉండవల్లిలోని సీఎం నివాసంలో...

ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సోమవారం గణతంత్ర వేడుకలు నిర్వహించారు. సీఎం చంద్రబాబు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మహాత్మా గాంధీ, బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పోలీసులు, భద్రతాధికారులు, కార్యాలయ సిబ్బందికి చంద్రబాబు స్వయంగా మిఠాయి బాక్సులు అందజేశారు.

రాష్ట్రాభివృద్ధికి పార్టీలన్నీ సహకరించాలి

గణతంత్ర వేడుకల్లో స్పీకర్ అయ్యన్నపాత్రుడు


అసెంబ్లీ భవనం వద్ద జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

ఈనాడు, అమరావతి: 'అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలకు జీతాలు ఎందుకు ఇవ్వాలి? ఉద్యోగుల్లాగే శాసనసభ్యులకూ నో వర్క్ నో పే విధానాన్ని కచ్చితంగా అమలుచేయాలి. అప్పటికీ తీరు మార్చుకోకపోతే వారిని ప్రజలు రీకాల్ చేసే చట్టాన్ని తేవాలి' అని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. 'స్పీకర్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారంటూ నన్ను కొంతమంది విమర్శిస్తున్నారు. అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై మాట్లాడటం, శాసనాల రూపకల్పన చర్చల్లో పాల్గొనడం ఎమ్మెల్యేల డ్యూటీ కాదా? ఆ పని చేయని వారికి జీతాలు ఎందుకివ్వాలి?' అని ఆయన ప్రశ్నించారు. అసెంబ్లీ ఆవరణలో సోమవారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో అయ్యన్నపాత్రుడు పాల్గొని జాతీయ పతాకాన్ని ఎగరేశారు. అనంతరం ఆయన మాట్లాడారు.

కనీసం 60 రోజులు...: ఏడాదికి కనీసం 60 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని స్పీకర్ పునరుద్ఘాటించారు. ఇదే విషయంపై ఇటీవల లఖ్‌నవూలో జరిగిన 'చట్టసభల సభాపతుల 86వ అఖిల భారత మహాసభ'లో తీర్మానం చేశామని గుర్తుచేశారు. ఏడాదికి 20, 30 రోజులే సమావేశాలు పెడితే ఏ చర్చలు జరుగుతాయి? ఏ సమస్యలు పరిష్కారమవుతాయని ప్రశ్నించారు.

రాష్ట్రం.. ప్రజలు ముఖ్యం: 'బలమైన, స్వయంసమృద్ధి కలిగిన, సుభిక్షమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి మనమంతా తోడ్పాటునందించాలి. ఈ విషయంలో రాజకీయాలు ఉండకూడదు. పార్టీలు ఉంటాయి.. పోతాయి. గెలుస్తుంటాం. . ఓడిపోతుంటాం. వీటన్నింటికంటే రాష్ట్రం, రాష్ట్రంలోని ప్రజలు ముఖ్యం. భవిష్యత్తు తరాలకోసం ప్రభుత్వం చేపట్టే ప్రతి కార్యక్రమానికీ అన్ని పార్టీల నాయకులు సహకరించాలి' అని అయ్యన్నపాత్రుడు కోరారు. వేడుకల్లో ఉప సభాపతి రఘురామకృష్ణరాజు, శాసనసభ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగం మహోన్నత గ్రంథం

శాసనమండలి ఛైర్మన్ మోషేన్‌రాజు


అసెంబ్లీ ప్రాంగణంలో జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం సమర్పిస్తున్న శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేను రాజు

ఈనాడు, అమరావతి: దేశంలో ప్రతి పౌరుడు స్వతంత్రంగా, స్వేచ్ఛగా, శాంతియుతంగా జీవించే హక్కును భారత రాజ్యాంగం కల్పించిందని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు అన్నారు. రాజ్యాంగం మహోన్నత గ్రంథమని, దాని రూపకల్పనలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కృషి అమోఘమన్నారు. సోమవారం అసెంబ్లీ ఆవరణలోని శాసనమండలి వద్ద నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో ఆయన పాల్గొని, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. 'ఏ మత గ్రంథమైనా మనం చేసే పుణ్యకర్మలు, పరలోకాల గురించి బోధిస్తాయి. భూమ్మీద మానవత్వంతో ఎలా నడుచుకోవాలనే విషయాలను రాజ్యాంగం బోధిస్తుంది. మనందరికీ రాజ్యాంగం సమాన అవకాశాలు కల్పించింది.. వాటిపై ప్రజలంతా అవగాహన పెంచుకొని సద్వినియోగం చేసుకోవాలి' అని వివరించారు.

ఐక్యతను ప్రేరేపించే త్రివర్ణ పతాకం

మాజీ ముఖ్యమంత్రి జగన్

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ మాజీ ముఖ్యమంత్రి జగన్ సోమవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'గణతంత్ర దినోత్సవం సందర్భంగా.. మన సార్వభౌమత్వాన్ని ఘనంగా సెలబ్రేట్ చేసుకుంటూ, మన గొప్ప దేశం స్ఫూర్తికి వందనం చేద్దాం. ఐక్యత, పురోగతిని ప్రేరేపిస్తూ త్రివర్ణ పతాకం ఎల్లప్పుడూ రెపరెపలాడుతుంది. జై హింద్' అని పేర్కొన్నారు.


తాడేపల్లిలోని వైకాపా కేంద్ర కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ


తెదేపా కేంద్ర కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, వర్ల రామయ్య, పీతల సుజాత, అశోక్‌బాబు ఇతర నాయకులు

తెదేపా కేంద్ర కార్యాలయంలో...

ఈనాడు, అమరావతి: రాజ్యాంగం గొప్పతనాన్ని, విలువల్ని భావితరాలకు అందించడమే గణతంత్ర వేడుకల లక్ష్యమని, రాజకీయాల్లోకి రావాలనుకునే వారు ముందు రాజ్యాంగం గురించి తెలుసుకోవాలని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సూచించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం గణతంత్ర వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. 105 అడుగుల ఎత్తయిన జాతీయ జెండాను ఆటోమేటిక్ మూవింగ్ టెక్నాలజీ ఉపయోగించి రిమోట్ సాయంతో పల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. అనంతరం 102 అడుగుల ఎత్తయిన తెదేపా జెండాను ఎగురవేశారు.

భాజపా ఆధ్వర్యంలో...


విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రసంగిస్తున్న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్. చిత్రంలో నాయకులు, కార్యకర్తలు

ఈనాడు, అమరావతి: అన్నింటికంటే దేశమే ముఖ్యమనే భావన ప్రతి ఒక్కరిలో ఉండాలని.. దేశ సేవకు అందరూ పునరంకితం కావాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో ఆయన పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

జనసేన కార్యాలయంలో..


జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

ఈనాడు, అమరావతి: గుంటూరు జిల్లా మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, పార్టీ నాయకులు చిల్లపల్లి శ్రీనివాసరావు, కల్యాణం శివ శ్రీనివాసరావు, గాదె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేడీ శీలం

రాజధానిలో వేడుకలు

ఆనందదాయకం

రైతులు, యువత అభిప్రాయం

ఈనాడు, అమరావతి: ఇకపై స్వాతంత్ర్య దినోత్సవం సహా ప్రభుత్వ కార్యక్రమాలన్నీ రాజధాని అమరావతి వేదికగానే నిర్వహించాలని రైతులు, ప్రజలు, యువత అభిప్రాయపడ్డారు. తొలిసారిగా అమరావతిలో గణతంత్ర దినోత్సవం నిర్వహించడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ వేడుకల్ని చూస్తే వైకాపా ప్రభుత్వ వేధింపులు, అణచివేత, లాఠీదెబ్బలకు ఎదురొడ్డి చేసిన ఉద్యమ పోరాట ఫలితం కళ్లముందు కనిపిస్తోందని ఉద్వేగానికి గురయ్యారు. 'గణతంత్ర వేడుకలు చూసేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చినవారు అమరావతిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్ని చూసి ఆశ్చర్యపోతున్నారు. వైకాపా నేతలు చెబుతున్నట్లు ఇక్కడి భవనాలు గ్రాఫిక్స్ కాదని.. రాజధాని ఘనంగా నిర్మాణమవుతోందని గుర్తిస్తున్నారు' అని వారు పేర్కొన్నారు.

చాలా సంతృప్తిగా ఉంది

– గాంధీ, రాయపూడి



చాలా సంతృప్తిగా ఉంది. రాజధాని కోసం నాలుగెకరాలు ఇచ్చాను. వైకాపా ప్రభుత్వం మా త్యాగాల్ని గడ్డిపోచలా తీసిపారేసింది. అమరావతి పరిరక్షణకు పెద్ద ఉద్యమం చేశాం. మా ఉద్యమ ఫలాలు ఇప్పుడు కళ్ల ముందు కనిపిస్తున్నాయి. రేయింబవళ్లు రాజధాని నిర్మాణ పనులు జరుగుతున్నాయి. భూములిచ్చిన రైతుల సమస్యలు పరిష్కరిస్తున్నారు.

రాజధాని రైతులకు ప్రత్యేక గౌరవం

– చిలకా బసవయ్య, రైతు



గణతంత్ర వేడుకల్ని వీక్షించేందుకు అమరావతి రైతుల పేరుతో ప్రత్యేకంగా పాసులు జారీ చేశారు. ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేసి కూర్చోబెట్టి గౌరవించారు. రాజధాని పరిధిలోని అన్ని గ్రామాల రైతుల్ని ఆహ్వానించారు.

అమరావతి వ్యతిరేకులకు ఇది చెంపపెట్టు

– సుభాని, రాయపూడి రైతు



వైకాపా ప్రభుత్వం అమరావతిని శ్మశానంగా చూపినప్పుడు భూములిచ్చిన మా జీవితాలు ఏమవుతాయోనని కంటి మీద కునుకు లేకుండా బతికాం. కూటమి ప్రభుత్వం అమరావతిలో గణతంత్ర వేడుకలు నిర్వహించి, రాష్ట్ర రాజధాని గౌరవాన్ని నిలబెట్టింది. రాజధాని వ్యతిరేకులకు ఇది చెంపపెట్టు.




వైకాపా విధ్వంసం నుంచి రాజధాని బయటపడింది

– ఆలూరి పావని, గద్దె విజయలక్ష్మి, రజని, తుళ్లూరు మహిళా రైతులు

అమరావతి నడిబొడ్డున వేడుకల నిర్వహణ మాకు చాలా సంతోషాన్నిస్తోంది. రాజధానికి భూములిచ్చినందుకు ప్రతి రైతు ఆనందంగా ఉన్నారు. పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వైకాపా విధ్వంసం నుంచి రాజధాని బయటపడింది.

అంతకు మించిన అభివృద్ధి

–కారంపూడి శ్రీనివాసరావు, అబ్బరాజుపాలెం



జగన్ ప్రభుత్వంలో విధ్వంసం చూసి అసలు అమరావతి కోలుకుంటుందా అని భయపడ్డాం. కూటమి ప్రభుత్వం అమరావతికి తిరిగి ఊపిరులూదింది. ఈ స్థాయిలో అభివృద్ధి పనులు జరుగుతాయని, ఇంత త్వరగా రాజధాని ప్రాంతం కోలుకుంటుందని అస్సలు ఊహించలేదు. రైతు సమస్యల పరిష్కారం కోసం త్రిసభ్య కమిటీ నిరంతరం మాతో సంప్రదింపులు జరుపుతోంది.

ప్రత్యక్షంగా చూడటం మధురానుభూతి

– త్రివేణి, విద్యార్థిని, గిద్దలూరు



ఇంత మంది ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, పరేడ్‌ను ప్రత్యక్షంగా చూడటాన్ని జీవితంలో మర్చిపోలేను. అమరావతి యువత రాజధాని. భవిష్యత్తులో ఇక్కడే ఉద్యోగం చేయాలని ఆకాంక్షిస్తున్నాను. ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిని చూస్తే అది ఎంతో దూరం లేదనిపిస్తోంది.

మూడేళ్ల తర్వాత అమరావతిలోనే ఉద్యోగాలు చేస్తామనిపిస్తోంది

– నిత్య, రాజేశ్వరి, సౌమ్య, చందన, బీటెక్ విద్యార్థినులు



మొదటిసారి రిపబ్లిక్‌డే వేడుకలకు హాజరయ్యాం. పరేడ్ అద్భుతంగా అనిపించింది. రాజధాని అమరావతి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మేం బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాం. మూడేళ్ల తర్వాత మేం అమరావతిలోనే ఉద్యోగాలు చేస్తామనిపిస్తోంది.

లోక్‌భవన్‌లో సందడిగా ఎట్ హోం


లోక్‌భవన్‌లో నిర్వహించిన తేనీటి విందులో మంత్రి లోకేశ్, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, సీఎం చంద్రబాబు, గవర్నర్ అబ్దుల్ నజీర్, హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకుర్, ఆయన సతీమణి గుడియా ఠాకుర్, గవర్నర్ సతీమణి సమీరా నజీర్, సీఎం సతీమణి భువనేశ్వరి, ఉపముఖ్యమంత్రి సతీమణి అన్నా లెజినోవా

ఈనాడు, అమరావతి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా లోక్‌భవన్‌లో సోమవారం ఎట్ హోం కార్యక్రమం కోలాహలంగా జరిగింది. అతిథులకు గవర్నర్ అబ్దుల్‌నజీర్ తేనీటి విందునిచ్చారు. లోక్‌భవన్ ఆవరణలోని లాన్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టేబుల్ దగ్గర గవర్నర్‌కు కుడివైపు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ కూర్చున్నారు. గవర్నర్‌కు ఎడమవైపు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకుర్, ఆయన సతీమణి గుడియా ఠాకుర్, గవర్నర్ సతీమణి సమీరా నజీర్, సీఎం సతీమణి భువనేశ్వరి, ఉపముఖ్యమంత్రి సతీమణి అన్నా లెజినోవా కూర్చున్నారు. శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ కార్యక్రమానికి వచ్చి కాసేపు ఉండి, వెళ్లిపోయారు. ఆయనతోపాటు వైకాపా ఎమ్మెల్సీ రుహుల్లా ఉన్నారు.

■ కార్యక్రమం ప్రారంభానికి ముందు గవర్నర్ దంపతులను సీఎం, ఉపముఖ్యమంత్రి, సీజే దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. గవర్నర్‌కు పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. గవర్నర్ సతీమణి సమీరాకు భువనేశ్వరి, గుడియా, అన్నా లెజినోవాలు పుష్పగుచ్ఛాలు అందించారు. వారు నలుగురూ సరదాగా మాట్లాడుకుంటూ ప్రధాన వేదిక వద్దకు చేరుకున్నారు. అబ్దుల్‌నజీర్, పవన్‌కల్యాణ్, లోకేశ్‌లతో ఫొటోలు దిగేందుకు అతిథుల్లో చాలామంది ఆసక్తిచూపారు.

■ శాసనమండలి డిప్యూటీ ఛైర్‌పర్సన్ జకియా ఖానం, హైకోర్టు న్యాయమూర్తులు, మంత్రులు కె.అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, పి.నారాయణ, సవిత, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కొండపల్లి శ్రీనివాస్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వసంత కృష్ణప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, ఉన్నతాధికారులు, స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయస్థాయి అవార్డులు పొందిన ప్రముఖులు, క్రీడాకారులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

లోకేశ్.. బొత్స మాటామంతి

ఎట్ హోం కార్యక్రమంలో మంత్రి లోకేశ్ లోక్‌భవన్ ప్రాంగణంలో ప్రధాన వేదిక వద్దకు వెళుతూ మధ్యలో ఉన్న వారినందరినీ పలకరిస్తూ ముందుకు సాగారు. బొత్స సత్యనారాయణ కనిపించడంతో ఆగి, ఆయనతో కరచాలనం చేస్తూ బాగున్నారా.. అని అన్నారు. బొత్స సరదాగా నవ్వుతూ లోకేశ్ భుజం తడుతూ పలకరించారు. తర్వాత పక్కనే ఉన్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో లోకేశ్ కాసేపు మాట్లాడారు. అతిథుల్లో చాలామందిని లోకేశ్ పలకరించారు. లోకేశ్ తన పక్కనున్న పవన్‌కల్యాణ్‌తో ముచ్చటిస్తూ కనిపించారు.


వైకాపా నేత బొత్స సత్యనారాయణతో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్. చిత్రంలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

ఈనాడు

మత్తుమందుల ఊబిలో యువభారతం

వెదపురుగులు పట్టిన పచ్చని చెట్టు లోపల్లోపలే డొల్లగా మారిపోతాయి. మాదకద్రవ్యాలు ఇప్పుడు భారతావనికి అలాంటి ముప్పుగానే తయారయ్యాయి. ప్రతిచోటా విచ్చలవిడిగా దొరుకుతున్న గంజాయి, ఇతర మత్తుమందులు యువతను వ్యసనపరులుగా, నేరగాళ్లుగా మార్చుతూ... కుటుంబాల్లో కల్లోలం రేపుతున్నాయి. దేశ రాజధానిలోని ఎయిమ్స్ పరిశోధకులు ఇటీవల పది నగరాల్లో ఓ అధ్యయనం నిర్వహించాయి. దిల్లీ, బెంగళూరు, హైదరాబాద్ వంటి చోట్ల ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో వారు ఒక సర్వే చేశారు. 12-13 ఏళ్ల వయసు నుంచే పిల్లలు మాదకద్రవ్యాలకు అలవాటుపడుతున్నారనే దిగ్భ్రాంతికర వాస్తవం అందులో తేలింది. బడుల నుంచి విశ్వవిద్యాలయాల వరకు నవతరాన్ని డ్రగ్స్ మత్తులో ముంచుతూ జేబులు నింపుకొంటున్న దుర్మార్గులు తమను అడ్డుకోబోయిన అధికారులపైకి వాహనాలను దౌడుతీయిస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలో ఓ గంజాయి ముఠా అలా మహిళా ఎక్సైజ్ కానిస్టేబుల్‌ను కారుతో తొక్కించిన దారుణోదంతం- మాదకాసురుల బరితెగింపును కళ్లకుకడుతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు, నెల్లూరు జిల్లా వెంకటాచలం, అల్లూరి జాతీయ రహదారి, కాకినాడ జిల్లా కృష్ణవరం టోల్‌ప్లాజా దగ్గర కూడా పోలీసు, అబ్కారీ శాఖాధికారులు సిబ్బందిపై లోగడ ఇలాంటి దాడులే జరిగాయి. చట్టమంటే లెక్కలేనితనంతో పేట్రేగిపోతున్న గంజాయి ముఠాలు, డ్రగ్స్ మాఫియాలను సామాజిక శత్రువులుగా పరిగణించి ఉక్కుపాదం మోపాలి. అప్పుడే ప్రజారోగ్యానికి కనీస భద్రత లభిస్తుంది!

చాపకింద నీరులా తరగతి గదులు, ఇళ్లు, సమాజంలోకి వ్యాపిస్తున్న మాదకద్రవ్యాలు దేశ సౌభాగ్యాన్ని హరించివేస్తున్నాయి. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తాజాగా హెచ్చరించినట్లుగా దీన్ని నేర సమస్యగానే కాదు... సామాజికంగా, వైద్యపరంగా దేశాన్ని పట్టిపీడిస్తున్న పెనుముప్పుగా చూడాలి. సరదా కోసమో లేదంటే స్నేహితుల బలవంతంపైనో ఒక్కసారి డ్రగ్స్‌కు అలవాటుపడితే- మానసిక రుగ్మతల నుంచి గుండెజబ్బులు, క్యాన్సర్ల వంటివీ అనేకం చుట్టుముడతాయని యువత తెలుసుకోవాలి. మత్తుమందులకు బానిసలైనవారి వైద్యఖర్చులకే దేశీయంగా ఏడాదికి రూ.15వేల కోట్ల వరకు ఖర్చవుతోందని ఓ అంచనా. ఆ రొంపిలో చిక్కుకుని అర్ధాంతరంగా చనిపోతున్నవారు, జీవచ్ఛవాలుగా మిగులుతున్నవారు అందరినీ లెక్కలోకి తీసుకుంటే- ఉత్పాదకత పరంగా యువభారతానికి జరుగుతున్న నష్టం అనూహ్య స్థాయిలో ఉంటుందన్నది వాస్తవం. మాదక రక్కసి స్వైరవిహారంతో పసిపిల్లలపై లైంగిక అకృత్యాల నుంచి దొంగతనాల దాకా సాధారణ ప్రజలపై దాష్టీకాల వరకు అన్నీ పెరిగిపోతున్నాయి. నెత్తుటిదాహానికి అలవాటుపడి సమాజ శ్రేయస్సును కలుషిస్తున్నవాళ్లను కటకటాల్లోకి నెట్టకపోతే శాంతిభద్రతలు పూర్తిగా కొడిగట్టుకుపోతాయి!

దేశవ్యాప్తంగా 2003-2013 నడుమ రూ.40వేల కోట్ల విలువైన 26 లక్షల కేజీల మాదకద్రవ్యాలు పట్టుబడ్డాయి. 2014-2025 మధ్యలోనైతే రూ.1.65 లక్షల కోట్ల ఖరీదైన కోటి కేజీల మత్తుమందులు దొరికాయి. అంతకంటే ఇంకా ఎక్కువ మొత్తంలో డ్రగ్స్ నిత్యం దేశం నలుచెరగులా సరఫరా అవుతున్నాయి. మత్తు పదార్థాల రవాణా హాట్‌స్పాట్లనూ స్మగ్లర్లను గుర్తించడంలో పరస్పరం సమాచారాన్ని పంచుకుంటూ రాష్ట్రాలు కలిసికట్టుగా పనిచేయాలి. మాదకద్రవ్యాల కేసుల్లో 20శాతానికి మించని శిక్షల రేటు పెంపునకు అవి కృషిచేయాలి. తల్లిదండ్రులు, విద్యాలయాలు బాధ్యత తీసుకుని పిల్లల నడవడికను అనుక్షణం గమనిస్తుండాలి. మాదక రక్కసి కోరల్లోంచి భావితరాలను కాపాడుకోవాలంటే సమష్టి పోరాటమే శరణ్యం!



మనుషులు జీవితాన్ని తప్ప అన్నిటినీ పట్టించుకుంటారు. నిజానికి ఆస్తులూ అధికారాల కన్నా జీవితం చాలా గొప్పది. మృత్యువుకన్నా పెద్దది. కష్టసుఖాలను అనుభవిస్తూ బతికి చూపించడాన్ని మించిన గొప్పదనం మరొకటి లేదు.

– కమలేశ్వర్, రచయిత

వేదాలకు ప్రతీకలు

సాధారణంగా మనుషులందరికీ అవయవాలు సమానసంఖ్యలో ఉంటాయి. అయితే కొంతమంది దేవతలకు, ఆ మాటకొస్తే కొందరు రాక్షసులకు కూడా అవయవాలు ఎక్కువ ఉండటం విశేషం. బ్రహ్మ నుంచి రావణ బ్రహ్మ వరకు ఇందుకు ఉదాహరణలుగా కనిపిస్తారు.

త్రిమూర్తుల్లో బ్రహ్మకు నాలుగు తలలుంటాయి. అవి నాలుగు వేదాలకు ప్రతీకలు. సృష్టిలోని నాలుగు దిక్కులలోని ప్రాణుల పుట్టుకను చూడటానికి ఈ తలలు ఆవిర్భవించాయంటారు. బ్రహ్మ అభిజిత్ లగ్నమనీ, ఆ నక్షత్రానికి ఉన్న నాలుగు ముఖాలే బ్రహ్మ ముఖాలని మరో కథనం. అసలు బ్రహ్మకు అయిదు తలలుంటే ఆయన అహంకారాన్ని తొలగించడానికి శివుడు ఒక శిరస్సును ఖండించాడని కూడా చెబుతారు. అయితే ఆ అయిదో తలను శివుడు నరికేయడానికి బ్రహ్మ ప్రదర్శించిన అనుచిత స్త్రీ వ్యామోహం కారణమని మరో పౌరాణిక కథనమూ ఉంది.

విష్ణువుకు నాలుగు చేతులైతే వాటిలో శంఖం, చక్రం, గద, పద్మం ఆయుధాలుగా ధరిస్తాడని తరతరాలుగా భక్తుల విశ్వాసం. పరమ శివుడికి మూడు కళ్లు. రెండు కళ్లు సూర్యచంద్రులనీ, మూడో కన్ను అగ్ని అనీ అంటారు. పార్వతీదేవి తన చేతులతో శివుడి రెండు కళ్లనూ మూసివేస్తే ప్రపంచమంతా అంధకారం అలుముకోవడం వల్ల పరమేశ్వరుడికి అగ్నితో కూడిన కన్ను ఏర్పడిందని పురాణాలు చెబుతున్నాయి.



అంతర్యామి

అవయవాల సంఖ్య కారణంగానే దేవుళ్లకు కొన్ని పేర్లు కూడా స్థిరపడ్డాయి. నాలుగు ముఖాల బ్రహ్మను చతుర్ముఖుడు, చతురాననుడు, చతుర్వదనుడు, నలువ అనీ; నాలుగు చేతుల విష్ణువును చతుర్భుజుడనీ, మూడు కళ్ల శివుణ్ని ముక్కంటి, త్రినేత్రుడు, ఫాలాక్షుడు అనీ అంటారు.

అలాగే ఆరుగురు కృత్తికల దగ్గర పాలు తాగి సుబ్రహ్మణ్య స్వామి షణ్ముఖుడయ్యాడు. ఆర్ముగమనీ అనిపించుకున్నాడు. స్వర్గాధిపతి ఇంద్రుడు కామాంధుడై చేసిన తప్పిదం వల్ల గౌతమీ మహర్షి శాపంతో ఆపాదమస్తకం మర్మస్థానీయుడయ్యాడు. పశ్చాత్తాపంతో క్షమించమని వేడుకున్నాక గౌతమ మహర్షి కరుణతో ఇంద్రుడు సహస్రాక్షుడిగా మిగులుతాడు. శాపవశాత్తు చేతులు లేకుండా పుట్టిన కార్తవీర్యార్జునుడు దత్తాత్రేయ మహర్షి వరంతో వెయ్యి చేతులు సంపాదించుకుని అన్ని చేతులతోనూ బాణాలు వేయగలిగిన శక్తిసామర్థ్యాలు సంపాదించుకుంటాడు.

విరాట్ పురుషుడి గురించి 'సహస్ర శీర్షా పురుషః సహస్రాక్షః సహస్రపాత్' అనే శ్లోకం ఉంది. దీని ప్రకారం విరాట్ పురుషుడికి వెయ్యి తలలు, వెయ్యి కళ్లు, వెయ్యి కాళ్లు ఉంటాయి. అయితే సహస్ర అంటే వెయ్యి మాత్రమే కాదని, అనంత అనీ అర్థం చేసుకోవాలని పండితులు చెబుతారు.

ఇక రాక్షసుడైన రావణుడికి బ్రహ్మ వరంతో పది తలలు వచ్చాయన్నది పురాణగాథ. ఆ పది తలలు నాలుగు వేదాలు, ఆరు శాస్త్రాలని ఒక పురాణ కథనమయితే, పది దుర్గుణాలకు ప్రతీకలని మరో కథ. పురాణం అంటే 'పురా అపి నవం' అని వ్యుత్పత్తి. పాత విషయాలకు కొత్త కొత్త అన్వయాలు, భాష్యాలు వాటిలో కనిపిస్తుంటాయి. అవయవ సంఖ్యాధిక్య విశేషాలూ అందులో భాగమే.

– శంకర నారాయణ

రాష్ట్రంలో సాంకేతిక నవోదయం

నిపుణులే కీలకం

మన దేశంలోని పలు రాష్ట్రాలు కృత్రిమ మేధ(ఏఐ) సాంకేతికతకు అవసరమైన మౌలిక వసతులను నిర్మిస్తున్నాయి. తమిళనాడు సర్కారు చెన్నై దగ్గర సముద్రగర్భ కేబుల్ లైన్లతోపాటు భారీ డేటా సెంటర్లను ఏర్పాటు చేసింది. ముంబయి, నవీ ముంబయిలలో ఏఐ చోదిత ఫైనాన్షియల్ సాంకేతికతలను మహారాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. గుజరాత్‌లోని ధోలెరా ప్రత్యేక పెట్టుబడి ప్రాంతంలో సెమీకండక్టర్ల తయారీ, క్లౌడ్ కంప్యూటింగ్ మౌలిక వసతులను ఏర్పాటు చేస్తున్నారు. బెంగళూరు ఏఐ పరిశోధన, ఎంటర్‌ప్రైజ్ సాఫ్ట్‌వేర్ కేంద్రంగా రూపుదిద్దుకుంటోంది. ఏఐ క్లస్టర్లను, అప్లయిడ్ ఏఐ టెస్టింగ్ జోన్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలంగాణ ప్రకటించింది. తాజాగా ఆంధ్రప్రదేశ్ కూడా బరిలో దూకింది.

ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, క్లౌడ్ సర్వీసులు, డిజిటల్ మౌలిక వసతుల ఏర్పాటులో భారత్ వేగంగా దూసుకుపోతోంది. ఈ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఏపీ కూడా సన్నద్ధమవుతోంది. భారత ఏఐ భవితకు సారథిగా ఎదగాలని ఏపీ లక్షిస్తోంది. విశాఖపట్నం, అమరావతి నగరాలలో హైపర్ స్కేల్ ఏఐ వసతుల నిర్మాణం, అంతర్జాతీయ డిజిటల్ అనుసంధానత, క్వాంటమ్ పరిశోధనా కేంద్రం ఏర్పాటుతోపాటు హరిత ఇంధనాల వినియోగాన్ని పెద్దయెత్తున ప్రోత్సహిస్తోంది. విశాఖలో గూగుల్ 1.25 లక్షల కోట్ల పెట్టుబడితో 6 గిగావాట్ల డేటా సెంటర్‌ను నిర్మిస్తోంది. దీంతోపాటు రిలయన్స్, అదానీకోనెక్స్, టిల్మన్ గ్లోబల్, సిఫీ టెక్నాలజీస్, బ్రూక్ ఫీల్డ్ సంస్థలు కూడా డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తామంటున్నాయి. రిలయన్స్ డేటా సెంటర్‌ను 6 గిగావాట్ల సౌరవిద్యుత్ ప్లాంట్‌తో, బ్రూక్ ఫీల్డ్ సెంటర్‌ను 3 గిగావాట్ల హరిత ఇంధన ప్లాంట్‌తో నడపనున్నారు. ఏఐ, జీపీయూ, టీపీయూ క్లస్టర్లు, అంతర్జాతీయ క్లౌడ్ ఆపరేషన్లు, సైబర్ సెక్యూరిటీ కమాండ్ సెంటర్లకు విశాఖ కేంద్రంగా మారనుంది. మెటా, సిఫీలు కలిసి విశాఖకు సముద్రగర్భ కేబుల్ లైనును తీసుకొస్తున్నాయి. ఇది అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానతను పెంచుతుంది.



కొత్త కోర్సులు అవసరం

అమరావతిలో ఐబీఎం సహకారంతో భారత్‌లోనే అత్యంత భారీ క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీని ఏర్పాటు చేయనున్నారు. అక్కడ క్వాంటమ్ అల్గారిథమ్ ప్రయోగశాలలు, క్వాంటమ్ హార్డ్‌వేర్ డెవలప్‌మెంట్ యూనిట్లు, అడ్వాన్స్‌డ్ క్రిప్టోగ్రఫీ సెంటర్లు, అధునాతన శిక్షణ వసతులను నెలకొల్పుతారు. ఈ క్రమంలో విశాఖ-అమరావతి కొత్త సాంకేతిక లోకానికి ద్వారాలు తెరవనున్నాయి. ఈ మహదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి అవసరమైన సిబ్బందిని తీర్చిదిద్దుకోవాల్సి ఉంది. హైపర్ స్కేల్ సర్వర్ ఫార్మ్‌లు, పునరుత్పాదక ఇంధన వనరుల పార్కులు, ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ గేట్‌వేలను, క్వాంటమ్ ప్రయోగశాలలను నిర్వహించగల సిబ్బందిని తయారు చేసుకోవాలి. ఇందుకు ఐటీఐలు, పాలిటెక్నిక్‌లు, ఇంజినీరింగ్ కళాశాలలు, విశ్వవిద్యాలయాలు సమాయత్తం కావాలి. ఐటీఐ స్థాయి నుంచి ఉన్నత విద్య వరకూ కొత్తరకాల కోర్సులు ప్రవేశపెట్టి నిపుణ మానవ వనరులను తీర్చిదిద్దాలి. ఫైబర్ ఆప్టిక్ స్ప్లైసింగ్, హైడెన్సిటీ కేబ్లింగ్, సముద్రగర్భ కేబుల్ నిర్వహణ, సోలార్ ఏర్పాటు, ఇన్వర్టర్ల సర్వీసింగ్, పవన టర్బయిన్లు, యూపీఎస్, డీసీ కరెంటు ఉపకరణాల నిర్వహణ, బేసిక్ నెట్‌వర్క్ హార్డ్‌వేర్ సర్వీస్‌లకు సంబంధించిన కోర్సులు ప్రవేశపెట్టాలి. వీటిలో సర్టిఫికెట్లు పొందిన వారిని డేటా సెంటర్లు, పునరుత్పాదక ఇంధన కేంద్రాల నిర్వహణలో నియోగించాలి. పాలిటెక్నిక్‌లలో మధ్య శ్రేణి సిబ్బందిని తీర్చిదిద్దే డిప్లొమా కోర్సులను అందించాలి. డేటా సెంటర్ల కోసం సాంకేతిక సూపర్‌వైజర్ల కోర్సులు చేపట్టాలి. కంటైనర్ల నిర్వహణ, క్లౌడ్ మౌలిక సదుపాయాల పర్యవేక్షణ, ఏఐ హార్డ్‌వేర్ వంటి డిప్లొమా కోర్సులు రూపొందించాలి. విశ్వవిద్యాలయ స్థాయిలో ఏఐ ఇంజినీరింగ్, క్వాంటమ్ కంప్యూటింగ్, సస్టెయినబుల్ ఎనర్జీ సిస్టమ్స్, ఆప్టికల్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, అడ్వాన్స్‌డ్ సైబర్ సెక్యూరిటీ విభాగాలలో ఉన్నత నైపుణ్యాలు కలిగిన వారిని తయారుచేసుకోవాలి. మెషీన్ లెర్నింగ్ ఆపరేషన్స్, క్లౌడ్ ఆర్కిటెక్చర్, క్వాంటమ్ ఇన్ఫర్మేషన్ థియరీ, డిజిటల్ ట్విన్ సిమ్యులేషన్, జీనోమిక్స్ ఆధారిత కంప్యుటేషన్, అల్గారిథమిక్ ఫైనాన్స్, గ్రిడ్ స్టెబిలిటీ మాడలింగ్ వంటి కొత్త డిగ్రీ కోర్సులను అందించాలి. వాటిలో పట్టభద్రులైనవారిని ప్రస్తుతం గూగుల్, రిలయన్స్ తదితర కంపెనీలు ఏర్పాటుచేస్తున్న డేటా సెంటర్లలో దీర్ఘకాలిక అప్రెంటిస్‌లుగా నియమించాలి. నేడు అనేక రాష్ట్రాల్లో నిర్మితమవుతున్న ఏఐ క్లస్టర్ల నిర్వహణకు కావాల్సిన ప్రతిభావంతులను మన విద్యాసంస్థలు, కంపెనీలు తయారు చేయాలి. భారత్‌ను అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కంప్యూటింగ్, ఏఐలలో అంతర్జాతీయ అగ్రగామిగా నిలపాలి.

ఎన్నో ఉపాధి అవకాశాలు

డిజిటల్ ఇండియా, ఇండియా ఏఐ మిషన్ పథకాల కింద ఏర్పాటవుతున్న హైపర్ స్కేల్ డేటా, అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ వసతుల నిర్వహణ కోసం జాతీయ స్థాయిలో నిపుణుల సేనను తయారు చేసుకోవాలి. హైపర్‌స్కేల్ డేటా కేంద్రాలు, క్లౌడ్ కార్యకలాపాలు, అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ పరిశోధన కేంద్రాల్లో ఒక ఉద్యోగం ఏర్పడితే, పరోక్షంగా భవన నిర్మాణం, విద్యుత్ కేంద్రాలు, విద్యుత్ లైన్ల నిర్వహణ, శీతలీకరణ, నెట్‌వర్క్ సేవలు, డిజిటల్ భద్రత, ఆతిథ్య రంగాలలో 3 నుంచి 5 ఉద్యోగాలు వస్తాయి. ప్రతి ఏఐ, డేటా కేంద్ర క్లస్టర్ 10-15 టెక్నికల్ ఉద్యోగాలకు గిరాకీ సృష్టిస్తుంది. ఐటీఐలో శిక్షణ పొందిన టెక్నీషియన్లు, డిప్లొమా పొందిన సూపర్‌వైజర్లు, గ్రాడ్యుయేట్ ఇంజినీర్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్ పరిశోధకులు అవసరమవుతారు. ఈ లెక్కన జాతీయ స్థాయిలో డేటా సెంటర్ నిర్వహణ, ఏఐ హార్డ్‌వేర్, క్లౌడ్ ప్లాట్‌ఫామ్ నిర్వహణ, సైబర్ భద్రత, హరిత ఇంధన వినియోగం, ఏఐ నమూనా వినియోగానికి లక్షల్లో సిబ్బంది అవసరపడతారు. ఇండియా ఏఐ మిషన్, డిజిటల్ ఇండియా పథకాలు రెండో అంచె, మూడో అంచె పట్టణాల్లో కూడా అలాంటి నిపుణ సిబ్బంది తయారీకి తోడ్పడాలి. కింది అంచె నుంచే విద్యార్థులకు ఏఐలో శిక్షణ ప్రారంభించాలి. దీర్ఘకాలంలో దేశాభివృద్ధికి చోదక శక్తులయ్యే యువతరాన్ని ఇప్పటి నుంచే సిద్ధం చేసుకోవాలి.



నాగళ్ల శివప్రసాద్

విశ్రాంత ఆచార్యులు, ఐఐటీ-మద్రాసు

'మది శారదాదేవి మందిరమే...' అన్నారు మల్లాది రామకృష్ణ శాస్త్రి. అంకెగౌడ మదే కాదు మొత్తంగా ఇల్లే సరస్వతీదేవి మందిరమైంది. కర్ణాటకలోని చిన్న కురళి గ్రామంలో రైతు కుటుంబంలో పుట్టిన అంకెగౌడకు కాలేజీలో ఉండగా ప్రొఫెసర్ అనంతరామ్ ఏదైనా ఒక మంచి అలవాటు నేర్చుకోమని చెప్పారట. పుస్తకాలంటే ఎంతో ఇష్టం కాబట్టి అంకెగౌడ వాటి సేకరణనే హాబీగా చేసుకున్నారు. 'ఇంతింతై...' అన్నట్లుగా ఆయనతో పాటు పెరిగిన ఆ అలవాటు ఒక పెద్ద గ్రంథాలయానికి ఆయనను సొంతదారును చేసింది. మాండ్య జిల్లాలోని హరలహళ్లి గ్రామంలో ఉన్న ఆయన ఇంటినో సందర్శక కేంద్రంగా మలచింది. దేశవిదేశాల్లో పేరు తెచ్చింది. ప్రముఖుల ప్రశంసలతో పాటు తాజాగా 'పద్మశ్రీ' పురస్కారాన్నీ అందించింది.

ఆ ఇల్లే ఓ లైబ్రరీ!



అంకెగౌడ తల్లిదండ్రులు మరిగౌడ, నింగమ్మ. ప్రాథమిక విద్యాభ్యాసం చేస్తున్నప్పుడు పుస్తకాల కొరత సమస్యను అనుభవించారాయన. అందుకే గురువు చెప్పింది గుర్తుపెట్టుకుని బస్ కండక్టర్ ఉద్యోగం చేస్తూ పుస్తక సేకరణ మొదలెట్టారు. ఎంఏ పట్టా పుచ్చుకుని ముప్పయ్యేళ్లపాటు షుగర్ ఫ్యాక్టరీలో ఉద్యోగం చేశారు. వయసుతో పాటు ఆయన అభిరుచి కూడా పెరిగిందే కానీ తగ్గలేదు. గత 50 ఏళ్లలో ఆయన 20 లక్షల పుస్తకాలను, 25 వేల పోస్టల్ స్టాంపులను, వంద దేశాలకు సంబంధించిన నాణేలను సేకరించారు. భార్య, కుమారుడు సైతం అంకెగౌడకు సహకరించారు. సేకరించడమైతే సేకరించారు కానీ అవన్నీ పెట్టడానికి చోటేదీ? పైగా పుస్తకాలను భద్రం చేయడమంటే ఎంతో శ్రమతో కూడుకున్న వ్యవహారం. సర్ది పెట్టడానికి అల్మారాలు లేక చాలా పుస్తకాలు గుట్టలుగా పడి ఉండేవి. సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎం.ఎన్.వెంకటాచలయ్యతో సహా అంకెగౌడ పుస్తకాల సేకరణ అలవాటు గురించి ఆనోటా ఈనోటా విన్న ప్రముఖులెందరో ఆయన ఇంటికి వెళ్లి చూసి ప్రశంసలతో ముంచెత్తారు. అంకెగౌడ ఆసక్తికి ముగ్ధులైన పారిశ్రామికవేత్త శ్రీహరి ఖోడె ఆ పుస్తకాలు పెట్టుకోవడానికి ఇరవై ఏళ్ల క్రితం ఓ భవనాన్ని నిర్మించి ఇచ్చారు. కర్ణాటక ముఖ్యమంత్రులుగా పనిచేసిన సదానంద గౌడ, కుమారస్వామి ఆర్థిక సాయం అందజేశారు. భవనమంతా పుస్తకాలకు కేటాయించి ఓ మూలన కాస్త చోటులో సర్దుకుని నివసిస్తున్న అంకెగౌడ కుటుంబం ఎందరో విద్యార్థులకు, పరిశోధకులకు ఉచితంగా వాటిని చదువుకునే అవకాశం ఇస్తోంది.

అంకెగౌడ లైబ్రరీలో రామాయణ, భారతాల్లాంటివే వేలల్లో ఉన్నాయి. వేర్వేరు రచయితలు రాసినవాటిని వెతికి వెతికి సేకరించడం ఆయన ప్రత్యేకత. ఆదిశంకరులు, రామానుజులు, మధ్వాచార్యులు తదితరుల రచనలు, ఖురాన్‌తోపాటు ఉర్దూ, పార్సీ భాషలకు సంబంధించిన కావ్యాలు, తెలుగు, తమిళ, ఆంగ్ల పుస్తకాలూ తాళపత్ర గ్రంథాలు... కూడా అంకెగౌడ గ్రంథాలయంలో చోటు పొందాయి. పలు భాషలకు చెందిన అయిదు వేలకు పైగా నిఘంటువులున్నాయి. అంకెగౌడ ఒక్క చేతిమీదుగా ఒక్కచోటుకు చేర్చిన ఈ పుస్తక భాండాగారాన్ని భద్రంగా కాపాడుకోవడం అందరి వంతు. ముఖ్యంగా ప్రభుత్వాలు పూనుకుని వెలకట్టలేని ఆ గ్రంథ నిధిని తగిన విధంగా సంరక్షిస్తాయని ఆశిద్దాం.

– జానమద్ది విజయ భాస్కర్



స్థలాల ధరలకు రెక్కలు

పట్టణ ప్రాంతాలు, నగరాల్లో భూముల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. దాంతో అల్ప, మధ్యాదాయ వర్గాల వారు తమకంటూ ఒక గూడు సమకూర్చుకోవడం అసంభవంగా మారుతోంది. ముఖ్యంగా మెట్రో నగరాల్లో సొంతింటికి అవసరమైన మొత్తం వ్యయంలో స్థలం ధరే సగానికి మించి ఉంటోంది. గ్రామాల్లో అది తక్కువగానే కనిపిస్తుంది. మన దేశంలో నిర్మాణ వ్యయంలో ప్రాంతాల వారీగా భూమి ధర...

(శాతాల్లో)



■	గ్రామీణం	10
■	సెమీ అర్బన్	35
■	అర్బన్	46
■	మెట్రో నగరాలు	63

(ఆధారం: నీతి ఆయోగ్ నివేదిక-2025)

ఈయూతో ఎఫ్‌టీఏకు వేళాయె!

ఈసారి గణతంత్ర వేడుకలకు ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లెయెన్, ఐరోపా మండలి అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ అగ్రనేతల దిల్లీ పర్యటనకు మరో విశేషం ఉంది. మంగళవారం ప్రధాని మోదీతో జరిగే ఇండియా-ఈయూ శిఖరాగ్ర సదస్సులో వీరు పాల్గొంటారు. ద్వైపాక్షిక సంబంధాలను మేలిమలుపు తిప్పేలా ఎఫ్‌టీఏతోపాటు భద్రత, రక్షణ భాగస్వామ్యంపై ఇందులో కీలక ఒప్పందాలు కుదిరే అవకాశాలు ఉన్నాయి. నిపుణుల వలసలు, ఆర్థిక భద్రత వంటి అంశాల్లో పరస్పర సహకారాన్ని పెంచుకునే అంగీకార పత్రాలపైనా సంతకాలు చేసే సంకేతాలు కనిపిస్తున్నాయి.

ట్రంప్ తెంపరితనంతో వేగిరం

ఈయూ 27 ఐరోపా దేశాల కూటమి. ఇండియాకు 2004 నుంచి వ్యూహాత్మక భాగస్వామిగా ఉంది. వాణిజ్య బంధాన్ని సుదృఢం చేసుకునేలా ఎఫ్‌టీఏ కుదుర్చుకునేందుకు ఇరుపక్షాలు 2007లో సంప్రదింపులు ప్రారంభించాయి. ఆటోమొబైల్స్, వైన్‌పై దిగుమతి సుంకాలు, ఫార్మాస్యూటికల్స్‌పై మేధోసంపత్తి హక్కుల వంటి సున్నితమైన అంశాల్లో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో 2013లో నిలిచిపోయిన చర్చలు 2022లో తిరిగి మొదలయ్యాయి. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన తరవాత ట్రంప్ దుందుడుకుగా వ్యవహరిస్తుండటం, ఉర్సులా వాన్ డెర్ లెయెన్ నిరుడు ఫిబ్రవరిలో భారత్‌లో పర్యటించడం వంటి పరిణామాలతో ఎఫ్‌టీఏ చర్చలు జోరందుకున్నాయి. ట్రంప్ పెడధోరణితో ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లు కుదేలవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో రాజకీయ అనిశ్చితులు అలుముకుంటూ, సరఫరా గొలుసులకు ముప్పు ఏర్పడుతోంది. రష్యా నుంచి ముడిచమురు కొనుగోలు నేపథ్యంలో ఇండియాపై సుంకాల కొరడా ఝుళిపించిన ట్రంప్- ఉక్రెయిన్ యుద్ధం విషయంలో ఐరోపా దేశాల వాణికి విలువివ్వకుండా ముందుకు వెళ్తున్నారు. తాజాగా గ్రీన్‌లాండ్ విషయంలో ఐరోపా దేశాలకు అదనపు సుంకాల హెచ్చరికలు చేసి మళ్లీ వెనక్కి తగ్గారు. ఇలాంటి పరిస్థితుల్లో స్వేచ్ఛా వాణిజ్యాన్ని పరిరక్షించేలా, సరఫరా గొలుసులకు ముప్పు నివారించేలా పరస్పర విశ్వసనీయ భాగస్వామ్య బంధాన్ని దీర్ఘకాలం పదిలపరుచుకోవాలని ఇండియా, ఈయూ భావిస్తున్నాయి. తాజాగా దావోస్ సదస్సులో ట్రంప్ ఏకపక్ష ధోరణులను ఉర్సులా పరోక్షంగా విమర్శిస్తూ- స్వేచ్ఛా వాణిజ్యం, సుస్థిరత, భాగస్వామ్యాలను పరిరక్షించాలని ఈయూ స్వప్నిస్తున్నట్లు చెప్పారు. ప్రపంచంలోకెల్లా వేగంగా వృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న ఇండియాతో తాము కుదుర్చుకోబోయే ఒప్పందం అంతర్జాతీయ వాణిజ్యం, సరఫరా గొలుసుల రూపురేఖలను మార్చేస్తుందని అభిప్రాయపడ్డారు. ఎఫ్‌టీఏకు ఈయూ ఇస్తున్న ప్రాధాన్యాన్ని ఆమె వ్యాఖ్యలు చాటిచెబుతున్నాయి.



ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక, రాజకీయ, ఆర్థిక అనిశ్చితులు తీవ్రమవుతున్నాయి. వాటి ప్రతికూల ప్రభావాలను అధిగమిస్తూ, ప్రగతి పథంలో కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని ఇండియా, ఐరోపా యూనియన్(ఈయూ) కాంక్షిస్తున్నాయి. దీర్ఘకాలంగా చర్చలకే పరిమితమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని(ఎఫ్‌టీఏ) పట్టాలెక్కించేందుకు సిద్ధమయ్యాయి.

ప్రపంచ జీడీపీలో ఇండియా, ఈయూ ఉమ్మడి వాటా 25శాతం. ఈ రెండు పక్షాల మధ్య ఎఫ్‌టీఏ- దాదాపు 200 కోట్ల మందికి ఉమ్మడి మార్కెట్‌ను సృష్టిస్తుంది. అమెరికా, చైనాలను తోసిరాజని ఇప్పటికే ఇండియాకు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఈయూ అవతరించింది. వాణిజ్య ఒప్పందం అమల్లోకి వస్తే ఫార్మా, ఐటీ, జౌళి, ఇంజినీరింగ్ రంగాల్లో ఇండియా లాభపడుతుంది. ఐరోపా దేశాల్లో భారతీయ కంపెనీలకు సుంకాల భారం తగ్గుతుంది. ఈయూ దేశాల నుంచి దిగుమతయ్యే వైన్, స్పిరిట్‌పై ఇండియా 150-200శాతం వరకూ సుంకాలు విధిస్తోంది. ఎఫ్‌టీఏతో ఆ సుంకాల విషయంలో వారికి ఉపశమనం దక్కొచ్చు. శుద్ధ సాంకేతికతలు, డిజిటల్ మౌలిక వసతులు, ఔషధాలు తదితర రంగాల్లో తమకు వెసులుబాట్లు దక్కుతాయని ఈయూ ఆశిస్తోంది.

వాణిజ్యేతర అంశాలకూ ప్రాధాన్యం

ఇండియా 2021 నుంచి వరసగా ఎఫ్‌టీఏలు కుదుర్చుకుంటోంది. యూఏఈ, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, బ్రిటన్ వంటి దేశాలతో ఇప్పటికే వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు చేసింది. మరోవైపు- ఈయూ ఇటీవలే దక్షిణ అమెరికా వాణిజ్య కూటమి సహా పలు ఆసియా దేశాలతో ఎఫ్‌టీఏలను ఖరారు చేసుకుంది. వీటన్నింటితో పోలిస్తే ఇండియా-ఈయూ వాణిజ్య ఒప్పందం విశిష్టమైనదిగా నిలవడం ఖాయం! ఎందుకంటే- ఈ ఎఫ్‌టీఏ కేవలం సరకులపై సుంకాల విషయానికి పరిమితం కాబోదు. పెట్టుబడులు, సేవలు, డిజిటల్ వాణిజ్యం, సుస్థిరత ప్రమాణాల వంటివన్నీ మిళితమై ఉంటాయి. ఆర్థిక గణాంకాలపరంగా, వ్యూహాత్మక ప్రాధాన్యం కోణంలో చూసినా ప్రపంచంలోకెల్లా అతిపెద్ద, అత్యంత ప్రభావవంతమైన ఎఫ్‌టీఏల్లో ఒకటిగా ఇది నిలుస్తుంది. అందుకే ఇటు భారత వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, అటు ఉర్సులా ఉభయ ప్రయోజనకర ఒప్పందాన్ని 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా వ్యాఖ్యానించడంలో అతిశయోక్తి లేదు. ఇండియా-ఈయూ 16వ శిఖరాగ్ర సదస్సులో రక్షణ రంగంలో సహకారంపైనా కీలక ఒప్పందం కుదిరే అవకాశాలు ఉన్నాయి. 2030 వరకు వ్యూహాత్మక సహకారంపై రోడ్‌మ్యాప్‌ను ప్రకటించేందుకు ఇరుపక్షాలు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అందుకే నేటి సదస్సుపై ప్రపంచం దృష్టి పడింది.

– ఎం.నవీన్‌కుమార్ గౌడ్

హాయ్! బుజ్జీ!!

అమిత్... స్మార్ట్ థింకర్!

హాయ్ ఫ్రెండ్స్..! మీరు ఎప్పుడైనా బిజినెస్ కార్డులు, విజిటింగ్ కార్డులు చూశారా? 'ఓ.. చాలాసార్లు చూశాం. అందులో కొత్తేముంది అంటారా? అయితే మీరే చూడండి..

తమిళనాడుకు చెందిన అధ్విక్ అమిత్ కుమార్‌కు పదకొండు సంవత్సరాలు. కొన్నిరోజులుగా ఎక్కడ చూసినా తన పేరే వినిపిస్తోంది. ఈ నేస్తం 'జోజోకనెక్ట్' అనే ఒక స్టార్టప్ సంస్థను ప్రారంభించాడు. ఈ సంస్థ స్థాపించాలన్న ఆలోచన కూడా అమిత్ కుమార్‌దేనట. ఈ సంస్థ డిజిటల్ బిజినెస్ కార్డులకు సంబంధించింది. ఏవైనా సమావేశాలు జరిగినప్పుడు, స్టాల్స్ నిర్వహించినప్పుడు అందులో పాల్గొన్న సంస్థలు విజిటింగ్ కార్డులు ఇస్తుంటాయి. వాటికి బదులుగా జోజోకనెక్ట్ సంస్థ డిజిటల్ కార్డులు తీసుకొచ్చింది. వాళ్ల సైట్‌లో ఒకసారి రిజిస్టర్ అయితే దానికి సంబంధించిన డిజిటల్ లింక్, ఒక చిప్ ఇస్తారు.



ఎవరికైతే సంస్థ వివరాలు తెలియజేయాలి అనుకుంటున్నారో వాళ్ల ఫోన్‌తో ఆ చిప్‌ని స్కాన్ చేసినా, లేదంటే ట్యాప్ చేసినా వివరాలు వచ్చేస్తాయి. భలే ఉంది కదా! ప్రస్తుతం జోజోకనెక్ట్ సంస్థలో పదిమంది వరకు ఉద్యోగులు ఉన్నారు.

ఇటీవల అమిత్ కుమార్ స్టార్టప్ బిజినెస్‌లకు సంబంధించిన ఒక టీవీ కార్యక్రమంలో పాల్గొని న్యాయనిర్ణేతల ప్రశంసలు అందుకున్నాడు. 'మా అమ్మానాన్నలు కూడా వ్యాపారవేత్తలే. అందుకే వాళ్లే నాకు స్ఫూర్తి. వాళ్ల ప్రోత్సాహంతోనే ఇక్కడి వరకూ రాగలిగాను. అమ్మానాన్నలు ప్రతిచోటా నాకు అండగా ఉన్నారు. పేపర్ కార్డులను తగ్గించి పర్యావరణాన్ని రక్షించడం, నెట్‌వర్కింగ్‌ను సులభతరం చేయడమే మా ప్రధాన లక్ష్యం' అని చెబుతున్నాడు అమిత్ కుమార్. చిన్న వయసులో స్టార్టప్‌ని ప్రారంభించడమే కాకుండా 'ఇండియా సూపర్ ఫౌండర్' అనిపించుకున్నాడీ నేస్తం. ★



ముువ్వన్నెలు.. మురిసే కన్నులు!

విజన్ 2047 లక్ష్య సాధనకు సమష్టి కృషి..
గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ లక్ష్మీశ వెల్లడి

ఈనాడు, ఈనాడు డిజిటల్ - అమరావతి: 'రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకుంటూ.. అంకిత భావంతో విధులు నిర్వర్తించడం మన కర్తవ్యం. స్వర్ణాంధ్ర విజన్ - 2047 లక్ష్యాల సాధనకు సమష్టి ప్రణాళికలను అమలు చేస్తున్నాం. జిల్లాలో 98,408 బంగారు కుటుంబాలను, 5,401 మంది మార్గదర్శులకు అనుసంధానం చేశాం. యువతలో సామాజిక బాధ్యత, సేవాదృక్పథాన్ని పెంచేలా వాసవ్య మహిళా మండలితో కలిసి 'టైమ్ బ్యాంక్ కార్యక్రమాన్ని రూపొందించామని' కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. విజయవాడలో ఇందిరాగాంధీ మున్సిపల్ మైదానంలో నిర్వహించిన 77వ గణతంత్ర వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలిగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి.. గౌరవ వందనం స్వీకరించి, పోలీసు కవాతు తిలకించారు. అనంతర ప్రసంగం ఆయన మాటల్లోనే..



దేశం మనదే.. తేజం మనదే..
కళాకారిణుల నృత్య ప్రదర్శన







మొదటి బహుమతి పొందిన విద్యా శాఖ, వ్యవసాయ శాఖ శకటాలు



సాంకేతికతతో బాసట.. డ్రోన్‌తో మందుల పంపిణీ..



జాతీయ జెండా ఎగురవేసి వందనం చేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు, జేసీ ఇలక్కియా

ఆసుపత్రుల్లో క్యూఆర్ కోడ్ వ్యవస్థ...

★ ఆసుపత్రుల్లో వైద్యసేవలు, సమస్యలపై కలెక్టర్‌కు తెలిపేలా ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్యూఆర్ కోడ్ వ్యవస్థ ఏర్పాటు చేశాం. ★ పదోతరగతిలో 100 శాతం ఉత్తీర్ణతకు 100 రోజుల కార్యాచరణ పక్కాగా అమలు చేస్తున్నాం. ★ పర్యాటకులకు అందుబాటు ధరల్లో విహారయాత్ర సేవలకు ఆంధ్రా ట్యాక్సీ యాప్ ఉంది. ★ మీకోసం ద్వారా ఇప్పటి వరకు 54 వేలకు పైగా అర్జీలను స్వీకరించి 99 శాతం సమస్యలను పరిష్కరించాం. ★ నవోదయం 2.0 కింద 26 నాటుసారా ప్రభావిత గ్రామాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. నిరుడు ఆగస్టు 7న జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా ప్రకటించాం. నాటుసారా తయారీపై ఆధారపడిన 88 మందికి రూ.96 లక్షలతో ప్రత్యామ్నాయ జీవనోపాధి మార్గాలను చూపేందుకు కృషిచేస్తున్నాం. ★ ఎన్టీఆర్ జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా మార్చేందుకు అవగాహన కల్పించేందుకు విద్యాసంస్థల్లో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేశాం. ★ నగర కమిషనర్ రాజశేఖరబాబు, జేసీ ఇలక్కియా, డీసీపీ కృష్ణకాంత్ పటేల్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రగతి సూచికల్లో ప్రథమం...

"స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆధునిక సాంకేతికతపై శిక్షణ ఇచ్చేందుకు "ఏఐ ఫర్ ష్యూర్" కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభించాం. కీలక ప్రగతి సూచిక(కేపీఐ)లో ఎన్టీఆర్ జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. 2025-26 ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలుకు రూ.431 కోట్లు చెల్లించాం. కుటుంబానికో పారిశ్రామికవేత్త రావాలనే ప్రభుత్వ లక్ష్యం మేరకు. . నియోజకవర్గానికో ఎంఎస్ఎంఈ పార్కు, ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సుల అభివృద్ధికి విజయవాడ మధ్య, మైలవరం, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో రూ.42 కోట్లతో పనులు చేస్తున్నాం. నీతిఆయోగ్ ద్వారా గుంటుపల్లిలో రూరల్ ఇంక్యుబేషన్, స్కిల్లింగ్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ (రైజ్) కేంద్రం ద్వారా 5 వేల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం."



జయహో.. గ్యాలరీల్లో చిన్నారుల కేరింతలు



జాతీయ జెండా మూడు రంగులను నీటితో వెదజల్లుతున్న అగ్నిమాపక సిబ్బంది



గణతంత్ర దినోత్సవ కవాతు

త్రివర్ణ తేజం... రాజధాని మురిపెం

న్యూస్‌టుడే - తుళ్లూరు

రాజధాని రైతుల కలలు పండగా.... త్రివర్ణ పతాకాలతో అమరావతి కళకళలాడింది..

గణతంత్ర వేడుకకు... నవ్య రాజధానిలో ఘనమైన ఆరంభం అదిరింది..

ముువ్వన్నెల రెపరెపల నడుమ... వివిధ బెటాలియన్లు, స్కౌట్స్ అండ్ గైడ్స్, యూత్ రెడ్‌క్రాస్, ఎన్‌సీసీ బృందాల విన్యాసాలు జాతీయ ఐక్యతా స్ఫూర్తిని చాటగా... విద్యార్థులు, రాజధాని గ్రామాల రైతుల హర్షధ్వానాలు నూతనోత్తేజాన్ని రగిలించాయి. రాజధాని అమరావతిలో తొలిసారిగా నిర్వహించిన గణతంత్ర వేడుకలు పండగను తలపించాయి. సీడ్ యాక్సెస్ రహదారి పక్కన హైకోర్టుకు వెళ్లే మార్గంలో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. ఎటు చూసినా జాతీయ జెండాలు, అలంకరణలతో ప్రాంగణం త్రివర్ణమయమైంది. వివిధ ప్రాంతాల ప్రజలతోపాటు రాజధాని గ్రామాలకు చెందిన రైతులు, రైతు కూలీలు, విద్యార్థులతో గ్యాలరీలు ఉదయం ఏడున్నర గంటలకే నిండిపోయాయి. ఓ పక్క అమరావతి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతుండగా.. మరోవైపు తొలిసారిగా గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించడంతో రాజధాని ప్రాంతవాసులు మురిసిపోయారు. తొలుత గవర్నర్ అబ్దుల్ నజీర్ జాతీయ జెండాను ఆవిష్కరించి పరేడ్ పరిశీలించారు. అనంతరం సందేశం వినిపించారు. వివిధ ప్రభుత్వ శాఖల శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాష్ట్ర అభివృద్ధి సంక్షేమ పథకాలు, సాంస్కృతిక వారసత్వం, సామాజిక అవగాహన అంశాలను అవి ప్రతిబింబించాయి. ఆహ్వానితులకు స్వీట్లు, తాగునీరు అందించారు.

★ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దంపతులు, రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, హైకోర్టు న్యాయమూర్తులు, ప్రిన్సిపల్ సెక్రటరీ (పొలిటికల్) జె.శ్యామలరావు, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు పెద్దపీట.. రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన అన్నదాతల త్యాగాలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం వారిని గణతంత్ర వేడుకలకు ప్రత్యేకంగా ఆహ్వానించింది. వారి కోసం ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేసింది. ప్రజా రాజధాని నిర్మాణంలో భాగస్వాములైన రైతులకు సముచిత గౌరవం దక్కిందంటూ వారంతా సంతోషం వ్యక్తం చేశారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా





వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దంపతులు, మంత్రి నారా లోకేశ్



గ్యాలరీల్లో విద్యార్థులు, యువత సందడి

ముత్యాల్లా అక్షరాలు.. మెచ్చేలా మార్కులు

కానూరు, యనమలకుదురు, న్యూస్‌టుడే



ప్రస్తుతం చేతి రాత పట్ల విద్యార్థులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రతిభ ఉన్నా.. దస్తూరి సక్రమంగా లేక మార్కులు సాధించలేకపోతున్నారు. మూల్యాంకనం చేసే ఉపాధ్యాయులకు రాత అర్థం కాక మార్కులు తగ్గిస్తున్నారు. ముత్యాల్లాంటి అక్షరాలు రాయడంపై దృష్టి సారిస్తే మంచి మార్కులు సాధించవచ్చని విద్యావేత్త కొడాలి రామశేషాద్రిరావు సూచిస్తున్నారు. ఫిబ్రవరి, మార్చిలో ఇంటర్, పదో తరగతి, డిగ్రీ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అధిక మార్కులు సాధించడానికి చేతిరాత నిపుణుడు **కె.మురళీకిషోర్** కొన్ని మెలకువలు సూచించారు.

మెలకువలు కొన్ని..

- జవాబులు రాసే పేజీ పైభాగంలో ఎడమ వైపు అంగుళం చొప్పున, కుడి వైపు అర అంగుళం చొప్పున మార్జిన్ వదిలిపెట్టాలి.
- బాల్ పెన్ను ఉపయోగించి పరీక్ష రాస్తే మంచిది.
- కొట్టివేతలు లేకుండా పదాల నడుమ దూరం పాటించి క్రమపద్ధతిలో రాస్తే మేలు.
- పెన్ను పట్టుకునే విధానం బాగుండాలి.
- పదాలు, వాక్యాలు, పేరాల మధ్య తగిన స్థలం వదలాలి.
- అక్షరాల సైజు ఒకే తీరుగా ఉండాలి.
- భాషా దోషాలు లేకుండా చూసుకోవాలి.
- గొలుసుకట్టు రాత ఉండకూడదు.
- వేగంగా రాసేలా సాధన అవసరం.
- తెలుగులో తలకట్టు, దీర్ఘాలు, ఒత్తులు స్పష్టంగా కనిపించాలి.
- చేతి రాతకు అనుకూలమైన పెన్నులు వాడాలి.
- ముఖ్యాంశాలు, శీర్షికలు ఉప శీర్షికలకు అండర్‌లైన్ చేయాలి.
- అక్షరంపై మరో అక్షరం ఉండకూడదు.
- విద్యార్థి కూర్చునే విధానం, పెన్ను పట్టుకునే విధానం చేతిరాతపై ప్రభావం చూపుతుంది.
- చూచి రాతను సాధన చేస్తే క్రమంగా అందమైన చేతిరాత సాధ్యమవుతుంది.
- పరీక్షల సంసిద్ధతలో భాగంగా కనీసం అరగంట రాయడానికి కేటాయించాలి.

బైపాస్ వచ్చింది.. బాధలు తీర్చింది!

ఈనాడు - అమరావతి

"పశ్చిమ బైపాస్‌లో ఒక వైపు వాహనాలను అనుమతించడంతో విజయవాడ నగరంపై ట్రాఫిక్ ఒత్తిడి కాస్త తగ్గింది. ఈ ప్రభావం స్క్యూ వంతెన, మహానాడు కూడలి వద్ద కనిపిస్తోంది. రెండోవైపు కూడా పనులు పూర్తయితే వాహన రద్దీ మరింత తగ్గే వీలుంది. ప్రస్తుతం ఆటోనగర్‌కు వచ్చే భారీ వాహనాలు నగరంలోకి వస్తున్నాయి. వీటికీ సమయాలను నిర్దేశించి.. ఆమేరకే అనుమతిస్తే ట్రాఫిక్ ప్రభావం తగ్గుతుంది."

➚ నగరంలోకి భారీ వాహనాలు రాకుండా నియంత్రణ
➚ రోజుకు సగటు ట్రాఫిక్ నిడివి 50 కి.మీ.లోపే..

ఆదివారాలు 19 కి.మీ. మాత్రమే..

ట్రాఫిక్ అవసరాల దృష్ట్యా పశ్చిమ బైపాస్‌పై సంక్రాంతి నుంచి గుంటూరు జిల్లా కాజ వద్ద రాకపోకలు అనుమతించారు. గుంటూరు వైపు నుంచి వచ్చి హైదరాబాద్, ఏలూరు పైపు వెళ్లాల్సినవి నగరంలోకి రావడం లేదు. కాజ వద్ద గుంటూరు, విజయవాడ నగర పోలీసులు వాహనాలను మళ్లిస్తున్నారు. దీంతో నిత్యం వాహనాలతో కిటకిటలాడే నగరంలో తాకిడి తగ్గింది. సాధారణ రోజుల్లో వారధి నుంచి ఎనికేపాడు వరకు వాహనాలు నిలిచిపోతున్న దూరం రోజుకు సగటున 100-150 కిమీ ఉండేది. ఇది గణనీయంగా తగ్గి... రోజుకు సగటున 40-50 కి.మీ లోపే ఉంటోంది. సెలవులు, ఆదివారాలైతే వాహన రద్దీ మరింత పడిపోయింది. కేవలం 19 కి.మీ. మాత్రమే నమోదైంది.



(1) వెస్ట్ బైపాస్ మార్గం (2) విజయవాడ వైపు

రెండోవైపు అనుమతిస్తే ఊరట...

ఏలూరు నుంచి వచ్చి.. గుంటూరు మార్గంలో వెళ్లేందుకు వాహనాలు ప్రస్తుతం అనుమతించడం లేదు. కాజ వద్ద ఆ మార్గంలో ఇంకా పనులు పూర్తి కాలేదు. దీంతో చినఆవుటపల్లి వద్ద బైపాస్‌లోకి వాహనాలను పంపడం లేదు. విజయవాడ నగరంలోకి వస్తున్నాయి. వీటితో ఇంకా ట్రాఫిక్ రద్దీ నెలకొంటోంది. ఆ మార్గంలో కూడా పనులు పూర్తయితే చాలా రద్దీ తగ్గే వీలుంది.

ప్రస్తుతానికి మళ్లింపు ఇలా..

నగరంలోకి భారీ వాహనాలను ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల్లోపు అనుమతించడం లేదు. గుంటూరు వైపు బైపాస్ ఎక్కిన మచిలీపట్నం మార్గంలో వెళ్లే వాహనాలను. . గొల్లపూడి నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు, మహానాడు కూడలి నుంచి లేదా శక్తి కల్యాణ మండపం మీదుగా తాడిగడప వంద అడుగుల రోడ్డులోకి మళ్లిస్తున్నారు. ఏలూరు వైపు నుంచే వాటిని కేసరపల్లి నుంచి ఉప్పులూరు మీదుగా కంకిపాడు వద్ద ఉన్న మచిలీపట్నం రహదారిపైకి పంపిస్తున్నారు.

ఆటోనగర్‌కు భారీ వాహనాలు...

ఆటోనగర్‌కు వివిధ ప్రాంతాల నుంచి భారీ వాహనాలు నిత్యం వస్తుంటాయి. వీటికి సమయాలను నిర్దేశించక పోవడంతో భారీగా వాహనాలు నగరంలోకి వస్తున్నాయి. ఇది సమస్యగా మారింది. బైపాస్ రెండో వైపు కూడా పనులు పూర్తయ్యాక.. భారీ వాహనాలు ఆటోనగర్‌లోకి అనుమతించే వేళలు నిర్ణయించే వీలుంది. ప్రస్తుతం ఆటోనగర్ నుంచి బయటకు వెళ్లే వాహనాలపై నియంత్రణ ఉంది. ఉదయం 8-10 గంటలు, సాయంత్రం 4-8 గంటల మధ్య బయటకు వచ్చేందుకు అనుమతిలేదు.

'డిస్టిలరీల నుంచి బాలాజీకి స్పిరిట్ సరఫరా'

ఈనాడు - అమరావతి: తాము గోవాలో బాలాజీకి స్పిరిట్‌ను సరఫరా చేశామని.. దీనిని ఇబ్రహీంపట్నం, ములకలచెరువులో నకిలీ మద్యం తయారీకి వినియోగించారని నిందితుడు జినేష్, శిబులు వెల్లడించారు. విజయవాడలోని ఎక్సైజ్ కోర్టు ఆదేశం మేరకు ఆదివారం నుంచి వీరిని ఎక్సైజ్ పోలీసులు మూడు రోజుల కస్టడీకి తీసుకున్నారు. తూర్పు ఎక్సైజ్ స్టేషన్‌లో నిందితులను వేర్వేరుగా విచారించారు. బాలాజీతో ఎలా పరిచయమైందని పోలీసులు కస్టడీలో ప్రశ్నించారు. తనది కేరళలోని త్రిసూర్ జిల్లా కైపమంగళం అనీ, ఎనిమిదేళ్లుగా గోవాలో లారీ క్లీనర్‌గా పని చేస్తున్నానని వివరించాడు. మద్యం దుకాణాలకు వెళ్లే సమయంలో బాలాజీ పరిచయమయ్యాడని చెప్పాడు. నకిలీ మద్యం తయారీ కోసం స్పిరిట్‌ను సరఫరా చేయమని అడగడంతో అందజేసినట్లు చెప్పినట్లు తెలిసింది. వివిధ డిస్టిలరీల నుంచి తీసుకుని కేరళకే చెందిన శిబు ద్వారా బాలాజీకి అందించినట్లు చెప్పాడు. నిందితుల కస్టడీ మంగళవారంతో ముగియనుంది. విచారణ అనంతరం వీరిని ఎక్సైజ్ కోర్టులో హాజరపర్చనున్నారు.

'బంధువుల నుంచే పిల్లలను తీసుకుని అమ్మకానికి పెట్టాం'

ఈనాడు - అమరావతి: పోషించలేని స్థితిలో ఉన్న తన బంధువుల నుంచి పిల్లలను తీసుకుని విక్రయం కోసం విజయవాడకు పంపినట్లు పోలీసుల విచారణలో నిందితురాలు కవిత చెప్పింది. రెండు రోజుల కస్టడీలో భాగంగా ఈమెను భవానీపురం పోలీసులు మంగళవారం రాజమహేంద్రవరం కారాగారంలో అదుపులోకి తీసుకుని విజయవాడ తరలించారు. ఇక్కడ ఆమెను భవానీపురం, కొత్తపేట పోలీసులు విచారించారు. ముంబయికి చెందిన నిందితురాలిని ఇటీవల ప్రత్యేక బృందం అక్కడ అరెస్టు చేసింది. ఆమెను ముంబయిలోని కోర్టులో ట్రాన్సిట్ వారెంట్‌పై హాజరుపర్చి నగరానికి తెచ్చారు. ముగ్గురు పిల్లలను నూరి, సతీష్‌లతో కవిత.. విజయవాడ పంపించి సరోజినికి అందజేసినట్లు చెప్పింది. తనకు ఏ ముఠాతో సంబంధాలు లేవనీ, ఎవరి నుంచి కిడ్నాప్ చేసి పిల్లల్ని తీసుకోలేదని ఇంటరాగేషన్‌లో చెప్పినట్లు సమాచారం. పిల్లలను పోషించలేక ఇబ్బంది పడుతున్న తల్లిదండ్రుల నుంచి మాత్రమే తీసుకున్నట్లు విచారణలో వెల్లడించింది. రెండు రోజుల కస్టడీ బుధవారంతో ముగియనుంది.

పట్టు లేకున్నా.. పట్టకున్నారేం?!

ఈనాడు - అమరావతి

➡ ఫిట్‌నెస్ లేమితో భయపెడుతున్న నిర్వహణ లోపాలు
➡ ప్రమాదాల బారిన ఆర్టీసీ, ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు..

ఆర్టీసీ, ప్రైవేటు ట్రావెల్స్ బస్సు... ఏదైనా సరే ఫిట్‌నెస్ సమస్యలు వేధిస్తున్నాయి. అధికారుల అలసత్వం, ట్రావెల్స్ నిర్వాహకుల నిర్లక్ష్యంతో బస్సులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నాయి. ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన దుస్థితి.

ప్రాణాల మీదకు తెస్తున్నారు...

★ రెండు నెలల కిందట ఓ ఆర్టీసీ బస్సు విజయవాడ నుంచి కోదాడ బయలుదేరింది. నందిగామ మండలం అంబారుపేట దగ్గరకు వెళ్లే సమయానికి బస్సు నుంచి పొగలు చెలరేగాయి. డ్రైవర్, కండక్టర్ వెంటనే బస్సు ఆపి ప్రయాణికులను దించి వేరే బస్సుల్లో ఎక్కించారు. ఇంజిన్ ఆయిల్ లీకవడమే కారణం. సిబ్బంది వెంటనే మేల్కొనకపోతే పెద్ద ప్రమాదం జరిగేది.

★ కొన్నాళ్ల కిందట సింగ్‌నగర్ నుంచి సిటీ బస్టాండ్‌కు వస్తున్న సిటీ బస్సు సింగ్‌నగర్ పైవంతెన పైకి వచ్చే సరికి బ్రేకులు ఫెయిలయ్యాయి. వేగంగా కిందకు వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బస్సును సవ్యంగా పరీక్షించకనే బ్రేక్ ఫెయిల్ అయినట్లు తెలుస్తోంది.

★ బందరు రోడ్డులో సిటీబస్సుకు వెనుక చక్రాలు ఊడిపోగా.. కొందరు ప్రయాణికులు గాయాలపాలయ్యారు.



నందిగామ వద్ద అనాసాగరం పై వంతెనపై ప్రమాదంలో నుజ్జయిన బస్సు (పాత చిత్రం)

కలెక్టర్లు ఏమన్నారంటే... కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్లు బాలాజీ, లక్ష్మీశ మాట్లాడుతూ.. రహదారి భద్రత సమావేశాల్లో అధికారులను అప్రమత్తం చేసి సమస్యలు పరిష్కరిస్తాం.

పర్యవేక్షణ ఉండాలి సారూ..

■ ఆర్టీసీ బస్సుల్లో నాన్ హైడ్రాలిక్ స్టీరింగులు ఉండడంతో కొన్నిసార్లు అవి పట్టేస్తుంటాయి. ■ ప్రతి 10,000-20,000 కిలోమీటర్ల మధ్యలో ఇంజిన్ ఆయిల్, ఫిల్టర్లు మార్చాలి. ■ టైర్ల అరుగుదల చూసి వెనుక టైర్లు ముందుకు.. ముందు టైర్లు వెనక్కి మారుస్తూ వీల్ అలైన్‌మెంట్ చేయాలి. ■ ఓ క్లచ్ ప్లేట్ 60 వేల కిలోమీటర్లు దాటితే మార్చాల్సి ఉన్నా లక్ష కిలోమీటర్లు దాటేసినా మార్చడం లేదు. ■ విజయవాడలో దాదాపు 400 వరకు సిటీ బస్సులు ఉంటే 80 శాతం పైగా డొక్కువే. ముందు బస్సు వెళుతుంటే వెనుక పొగలు కమ్మేస్తుంటాయి. ■ డిపో నుంచి బయటకు వచ్చే ప్రతి బస్సు ఫిట్‌నెస్ సవ్యంగా ఉండేలా పర్యవేక్షించడంలో లోపాలున్నట్లు ఆర్టీసీ సిబ్బందే చెబుతున్నారు. ■ ఆర్టీసీ బస్సుల్లో స్పీడ్‌లాక్ సిస్టం ఉంటుంది. 70 కిమీ మించి వేగం వెళ్లే అవకాశం ఉండదు. ■ ప్రైవేటు బస్సుల్లో ఈ నిబంధనలు లేక గంటకు 120 కిమీ వేగంగా అడ్డదిడ్డంగా నడుపుతున్నారు.

మాతృశాఖకు ఎన్టీఆర్ వర్సిటీ రిజిస్ట్రార్ రాధికారెడ్డి

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: మూడేళ్లుగా ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా పని చేసిన డాక్టర్ రాధికారెడ్డి సోమవారం బాధ్యతలు విరమించారు. నూతన రిజిస్ట్రార్‌గా కర్నూలు ప్రభుత్వ వైద్య కళాశాల ఫోరెన్సిక్ మెడిసిన్ ఆచార్యుడు డాక్టర్ సాయి సుధీర్‌ను నియమిస్తూ.. వైద్య ఆరోగ్య శాఖ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. సైకియాట్రిస్ట్ డాక్టర్ వి.రాధికారెడ్డి మాతృ శాఖ అయిన డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)కు తిరిగి వెళ్లనున్నారు. ఆమె మూడేళ్ల కాలంలో విశ్వవిద్యాలయానికి చెల్లింపులన్నీ ఆన్‌లైన్‌లో చేసేలా చర్యలు తీసుకున్నారు. పరీక్షల మూల్యాంకనం డిజిటలైజేషన్ చేశారు. ప్రవేశాలను ఏపీ ఆన్‌లైన్‌కు అప్పగించారు. 100 శాతం వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రైవేటు కళాశాలలకు ఈ-అఫ్లియేషన్స్ కేటాయింపులు, సైకాలజీలో ఎంఫిల్ కొత్త కోర్సులు ప్రారంభించడం, విశ్వవిద్యాలయంలో ప్రత్యేక రీసెర్చ్ విభాగం ఏర్పాటుతో పాటు ఐటీ విభాగాన్ని బలోపేతం చేశారు.



కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు నుంచి ప్రశంసా పత్రాలు అందుకుంటున్న జేసీ ఇలక్కియా, బాలకృష్ణ (ఆర్డీవో, నందిగామ), చైతన్య (ఆర్డీవో, విజయవాడ), మాధురి (ఆర్డీవో, తిరువూరు), శీనానాయక్ (ఈవో, దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం), శ్రీనివాసరావు (జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్), రాము (డ్వామా పీడీ), కల్యాణిని (జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి), శ్రీనివాసరావు (జిల్లా కో-ఆపరేటివ్ అధికారి), హనుమంతరావు (జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి), సతీష్ (డీఎం, సివిల్ సప్లయిస్), నాగమల్లిక (డీఎం, మార్క్‌ఫెడ్), నాంచారరావు (డీఆర్‌డీఏ, పీడీ) మురళీకృష్ణ (మెప్మా పీడీ), ఆనంద్‌కుమార్ (ఏడీ, ఏపీ ఎంఐపీ), రమాదేవి (జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి), ప్రభాకర్‌రావు (రీజనల్ ఇంటర్మీడియట్ ఆఫీసర్), విజయకుమారి (జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి)

ఉత్తమ సేవలకు గుర్తింపు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా గణతంత్ర వేడుకలు సోమవారం ఇందిరాగాంధీ మున్సిపల్ మైదానంలో ఘనంగా నిర్వహించారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన వివిధ శాఖలకు చెందిన అధికారులకు కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు.



రాజబాబు (జిల్లా అగ్రి ట్రేడ్ మార్కెటింగ్ అధికారి), బాలాజీకుమార్ (జిల్లా ఉద్యానశాఖ అధికారి), మధు (డీఎం, డీవీ), లక్ష్మీదేవి (జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్), ప్రియదర్శిని (జిల్లా ఆయుష్ అధికారి), శ్రీనివాసరావు (పీసీబీ, ఈఈ), మోహన్‌రావు (ఏడీ, సర్వే), శ్రీనివాసరావు (జిల్లా ఎక్సైజ్ అధికారి), యు.శ్రీనివాసరావు (జిల్లా యూత్ అధికారి), సుమన్ (జిల్లా కో-ఆర్డినేటర్, ఎన్టీఆర్ వైద్యసేవ), రజనీకుమారి (హౌసింగ్ పీడీ), శ్రీశిల్ప (జిల్లా పర్యాటక అధికారిణి), సుహాసిని (డీఎంహెచ్‌వో), డా.ఏవీ రావు (జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్), శ్రీరామమూర్తి (ఏపీడీసీఏ, డ్రగ్స్ కంట్రోల్), మొహియిద్దీన్ (ఎస్ఈ, ఇరిగేషన్), ఫణి ధూర్జటి (జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి)



భాస్కర్‌రావు (ఆర్అండ్‌బీ ఎస్ఈ), మహ్మద్ ఇర్ఫాన్ (సూపరింటెండెంట్, జిల్లా జైలు), భానుప్రకాశ్‌రెడ్డి (ఏసీపీ, టెక్నికల్ వింగ్), ప్రసాదరావు (ఏసీపీ, మైలవరం), స్రవంతిరాయ్ (ఏసీపీ నార్త్ డివిజన్, విజయవాడ), లతాకుమారి (ఏసీపీ, టాస్క్‌ఫోర్స్), వాసవి సీఐ మహిళా పోలీస్ స్టేషన్ విజయవాడ), ఉమామహేశ్వరరావు (ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, విజయవాడ), దుర్గాప్రసాద్ (సీఐ సైబర్‌క్రైం), వేమూరి ప్రసాద్ (ఏపీ సూపర్‌వైజర్, అలెండ్‌పీఎం), రవి (అడిషనల్ పీఆర్‌వో), రమణారావు (డీపీఆర్‌వో), రబ (జిల్లా రవాణా అధికారి), ప్రసాద్ (వయోజన విద్యాధికారి), నాగమల్లేశ్వరరావు (భూగర్భజల శాఖ డీడీ), మురళీకృష్ణ (సోషల్ వెల్ఫేర్ జిల్లా సమన్వయ అధికారి), బాలాజీ కుమార్ (డీఎంసీ అదనపు కమిషనర్), రజియా షబినా (డీఎంసీ, పీఆర్వో), కన్నమనాయుడు (జడ్పీ సీఈవో), వెంకటరెడ్డి (ఏఈవో, దుర్గగుడి), గంగాధర్ (ఏఈవో, దుర్గగుడి), శ్రీనివాసశాస్త్రి (ముఖ్య అర్చకులు, దుర్గగుడి)

ఈఎస్ఎల్ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు నేటి నుంచి

ఈనాడు, అమరావతి: ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రజెంట్స్ ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) క్రికెట్ రాష్ట్రస్థాయి పోటీలు మంగళవారం నుంచి ప్రారంభంకానున్నాయి. రీజినల్ స్థాయిలో విజయం సాధించిన జూనియర్, సీనియర్ జట్లు ఇందుకు సన్నద్ధమయ్యాయి. హైదరాబాద్ హీరోస్, తెలంగాణ టైగర్స్, సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్, రాయలసీమ రాకర్స్, నార్త్ ఆంధ్ర నింజాస్ పోటీ పడను న్నాయి. గుంటూరు సమీపంలోని మోతడక వద్ద ఉన్న చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన హిల్ వ్యూ స్టేడియం గ్రౌండ్-1లో జూనియర్స్ జట్లు తలపడతాయి. మొదటి మ్యాచ్‌లో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్ - రాయలసీమ రాకర్స్, రెండో మ్యాచ్‌లో తెలంగాణ టైగర్స్-నార్త్ ఆంధ్ర నింజాస్ పోటీ పడతాయి. గ్రౌండ్-2లో నిర్వహించే సీనియర్స్ విభాగం మొదటి మ్యాచ్‌లో సెంట్రల్ ఆంధ్ర ఛాలెంజర్స్-రాయలసీమ రాకర్స్, రెండో మ్యాచ్‌లో తెలంగాణ టైగర్స్-నార్త్ ఆంధ్ర నింజాస్ ఆడతాయి.



భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యుత్తమమైనది



విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న రెండో అదనపు జిల్లా జడ్జి ఎ.సత్యానంద్, బీజేపీ అధ్యక్షుడు ఏకే బాషా తదితరులు

సీపీ కార్యాలయంలో సీపీ రాజశేఖరబాబు, డీసీపీలు సరిత, లక్ష్మీనారాయణ, కృష్ణప్రసన్న, అధికారులు

ఆరోగ్య వర్సిటీలో జెండా ఎగురవేస్తున్న వీసీ చంద్రశేఖర్

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యుత్తమమైనదని రెండో అదనపు జిల్లా జడ్జి ఎ.సత్యానంద్ పేర్కొన్నారు. సోమవారం న్యాయస్థానాల సముదాయంలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో ఆయన మాట్లాడారు. బీజేపీ అధ్యక్షుడు ఏకే బాషా జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం న్యాయమూర్తులు, న్యాయవాదులు మువ్వన్నెల జెండాకు గౌరవ వందనం సమర్పించారు. మాజీ అధ్యక్షుడు సోమ కృష్ణమూర్తి, అబ్దుల్ మతీన్, చేకూరి శ్రీపతిరావు తదితరులు ప్రసంగించారు.

✤ న్యాయస్థానాల సముదాయంలో విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. విద్యార్థుల నుంచి న్యాయమూర్తులు గౌరవ వందనం స్వీకరించారు. ఎన్ఆర్‌వి ఇండియన్ స్ప్రింగ్స్ స్కూల్ విద్యార్థిని తపస్వి కర్రసాము ఆకట్టుకుంది. జపాన్ ఇండియన్ కరాటే అసోసియేషన్‌కు చెందిన 20 మంది విద్యార్థులు కరాటే ప్రదర్శన నిర్వహించారు.. లాస్య బృందం తమ నృత్యంతో అలరించింది.

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే: విజయవాడ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు జాతీయ జెండా ఆవిష్కరించారు. డీసీపీలు తిరుమలేశ్వరరెడ్డి, లక్ష్మీనారాయణ, కేజీవీ సరిత, ఉదయరాణి, కృష్ణప్రసన్న, ఎస్‌వీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: నగరంలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో జాతీయ జెండాను వీసీ డాక్టర్ చంద్రశేఖర్ ఎగురవేశారు. విశ్వవిద్యాలయంలో ఉత్తమ సేవలు అందించిన 30 మంది ఉద్యోగులను అవార్డులు అందజేశారు. రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

✤ రిజిస్ట్రార్ రాధికారెడ్డి తన మాతృ శాఖకు వెళ్తున్న నేపథ్యంలో ఆమె స్థానంలో జాయింట్ రిజిస్ట్రార్ ఆజయను ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా నియమిస్తూ ఉపకులపతి చంద్రశేఖర్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తు సరఫరా



అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న సీఎండీ పుల్లారెడ్డి

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: నగరంలోని ఏపీసీపీడీసీఎల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో భాగంగా జాతీయ జెండాను సీఎండీ పి.పుల్లారెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. అందరి కృషితో కార్పొరేషన్ 'సి' గ్రేడ్ నుంచి 'బి' గ్రేడ్‌కు వచ్చిందని, ఇంకా కష్టపడి 'ఎ' గ్రేడ్ సాధించాలన్నారు. రైతులకు వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు త్వరితగతిన ఇవ్వాలని ఆదేశించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి జిల్లాల వారీగా ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు ఇచ్చారు. పనితీరులో ప్రథమ స్థానంలో నిలిచిన ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ టౌన్ డివిజన్‌లోని వివిధ కేటగిరీలో ప్రతిభ చూపిన అధికారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. టెక్నికల్ డైరెక్టర్ ఎ.మురళీకృష్ణ యాదవ్, ప్రాజెక్టు డైరెక్టర్లు టీవీఎస్ఎన్ మూర్తి, ఫైనాన్స్ డైరెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కళావైభవం.. శకట రాజసం



శిరస్త్రాణం ధరించకుంటే జరిగే అనర్థాలపై ప్రదర్శన

ఈనాడు డిజిటల్, అమరావతి: ఇందిరాగాంధీ మున్సిపల్ మైదానంలో నిర్వహించిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఆద్యంతం దేశభక్తి ఉట్టిపడేలా సాగాయి. పోలీసుల కవాతులు.. శకటాల ఆలంకరణలు.. విద్యార్థుల కేరింతలు.. ఆనందోత్సాహాల నడుమ వేడక నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన 18 శకటాలు ప్రదర్శనలో పాల్గొని ఆకట్టుకున్నాయి.. మొదటిసారి శకటాల ప్రదర్శనలో పాల్గొన్న శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ప్రచార రథం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యా, వ్యవసాయశాఖ శకటాలు ప్రథమ, వైద్యారోగ్యశాఖ, డీఆర్డీఏ శకటాలు ద్వితీయ, పర్యాటక, ఎక్సైజ్, ఈగల్ శకటాలు మూడో బహుమతిని అందుకున్నాయి. పశు సంవర్ధక, ఉద్యాన, ఏపీఎంఐపీ, పౌరసరఫరాలు, మహిళా శిశు సంక్షేమం శకటాలకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు నివారణకు తీసుకునే చర్యలను మాక్ ఆపరేషన్ ద్వారా ప్రదర్శించారు. నీటితో జాతీయ జెండా ఆకృతిని చూపించడంతో విశేష స్పందన వచ్చింది. హెల్మెట్ లేకపోతే జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ సందేశాత్మక ప్రదర్శన చేశారు. రహదారి ప్రమాదాల్లో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించిన ప్రాణాలు కాపాడిన వారికి రహదారి వీరుడు అనే అవార్డు, రూ.25 వేలు పురస్కారం ఇచ్చి సత్కరిస్తారన్న విషయం వెల్లడించారు.

ఆకట్టుకున్న కార్యక్రమాలు

సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను కట్టిపడేశాయి. దేశభక్తి పాటలకు విద్యార్థుల నృత్యాలు ఆసాంతం అలరించాయి. మహనీయుల త్యాగాలను గుర్తుచేసేలా వారు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ చాటిన డీఎస్ఎంసీ ఉన్నత పాఠశాల విద్యాధరపురం, కళాక్షేత్ర డ్యాన్స్ అకాడమీ సంయుక్తంగా మొదటి బహుమతి పొందాయి. పావని నరేంద్ర కళాక్షేత్ర డ్యాన్స్ అకాడమీ ద్వితీయ బహుమతి అందుకుంది. ఏకేటీపీ మున్సిపల్ ఉన్నత పాఠశాల సత్యనారాయణపురం, శ్రీరామ్ పబ్లిక్ పాఠశాల సింగ్‌నగర్ ఉమ్మడిగా మూడో స్థానంలో నిలిచాయి.

అలరించిన సినీసంగీత విభావరి

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్వరార్చన ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానంద కళావేదికపై నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న విశ్వ మాత ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు నిడుమోలు రమా సత్యనారాయణ మాట్లాడుతూ సంగీత కార్యక్రమాలు కళాకారులకు, సంగీత ప్రియులకు ఉత్తేజపరుస్తున్నాయని అన్నారు. అనంతరం గాయకులు సినీ గీతాలను ఆలపించారు. పరుచూరి విజయలక్ష్మి, కె.డేవిడ్ రాజు, చింతకాయల చిట్టిబాబు, సూర్య పాల్గొన్నారు.



శకట విజేతలకు పురస్కారం

కలెక్టర్, సీపీ నుంచి బహుమతులు అందుకుంటున్న విద్యా, వ్యవసాయ (ప్రథమ), వైద్య ఆరోగ్య, డీఆర్‌డీఏ (ద్వితీయ), మద్యనిషేధ, ఆబ్కారీ, పర్యాటక (తృతీయ) శాఖల అధికారులు, మొదటి బహుమతి అందుకుంటున్న ఉమెన్ పోలీస్ కంటింజెంట్ విభాగం (కవాతు) – ఈనాడు, అమరావతి

క్రికెట్ పోటీలకు కృష్ణా వర్సిటీ జట్టు



క్రీడాకారులతో అనురాధ, వెంకటేశ్వరరావు, రాజేంద్రప్రసాద్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: మైసూర్‌లోని జేఎస్ఎస్ సైన్స్ అండ్ టెక్నాలజీ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు జరిగే సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల క్రికెట్ టోర్నీలో తలపడే కృష్ణా వర్సిటీ జట్టు సోమవారం నగరం నుంచి పయనమైందని ఎంపిక కమిటీ ఛైర్‌పర్సన్ మండవ అనురాధ తెలిపారు. జట్టు సభ్యులకు కిట్ అందజేసి అభినందించారు. నలంద డిగ్రీ కళాశాల వ్యాయామ సంచాలకుడు ఎన్.వెంకటేశ్వరరావు మేనేజరుగా, ఎన్.రాజేంద్ర ప్రసాద్ కోచ్‌గా నియమితులయ్యారు. ఎస్.భానువరప్రసాద్, సీహెచ్ గోకుల్ శ్రీమణివర్మ, ఎస్ఆర్‌కే కార్తికేయ (వికెట్ కీపర్), బి.విశాల్ యాదవ్, డి.నిఖిల్, డి.సాయి అఖిల్, జె.బన్నీ, ఎల్.చిన్న (నలంద డిగ్రీ కళాశాల), ఎం.రూపేష్ వెంకట రత్నకుమార్, ఏకతాన్ సింగ్, వి.విశాల్, ఎస్‌కే జాఫర్ సిద్దిక్, టి.కృష్ణ తేజ (పీబీ సిద్ధార్థ కళాశాల), పి.లోకేష్, వి.మహేంద్ర చలపతినాయుడు (కేబీఎన్ కళాశాల), టి.రఘునందన్ (ఎస్వీడీ సిద్ధార్థ న్యాయ కళాశాల) జట్టుకు ఎంపికైనట్లు ఆమె చెప్పారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -143 రిటైల్ ధర 170 చికెన్ విత్ స్కిన్ - 247 చికెన్ స్కిన్‌లెస్ - 281.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 165, 174, 185 చికెన్ విత్ స్కిన్ - 320 చికెన్ స్కిన్‌లెస్ - 330.

దేవాదాయ శాఖ సహాయ కమిషనర్‌పై కేసు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: జగ్గయపేట మండలం తిరుమలగిరి గ్రామంలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం పూర్వ కార్యనిర్వహణాధికారి, ప్రస్తుత సహాయ కమిషనర్ ఎం.టి.ఎన్.వరప్రసాద్ మీద కోర్టు ఆదేశాల మేరకు చిల్లకల్లు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. ప్రసాదాల్లో నాణ్యతలేదని తిరుమలగిరి గ్రామానికి చెందిన ఆర్.కోటయ్య అనే భక్తుడు అప్పటి ఈవో ప్రసాద్‌కు గత ఏడాది కార్తిక మాసంలో ఫిర్యాదు చేశారు. ఈవో ఆగ్రహంతో స్వీపర్లతో దౌర్జన్యం చేయించాడని, దుర్భాషలాడుతూ, చంపేయండి అంటూ భక్తుల మధ్య స్వీపర్లతో దాడి చేయించాడని పోలీసులకు ఇచ్చి ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి సీసీ ఫుటేజీని కూడా పోలీసులకు అందించారు. అయినా పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో కోటయ్య జగ్గయ్యపేట సివిల్ కోర్టును ఆశ్రయించారు. ఈనెల 18న కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఆసిస్టెంట్ కమిషనర్ వరప్రసాద్, మరో ఇద్దరిపై చిల్లకల్లు పోలీసులు కేసు నమోదు చేశారు.

జేఎన్‌టీయూకే క్రికెట్ జట్టుకు సారథిగా నగరవాసి



సాయిఆర్యన్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ కాకినాడ క్రికెట్ జట్టుకు నగరానికి చెందిన కోటిపల్లి సాయి ఆర్యన్ సారథిగా నియమితులయ్యాడు. ఆర్యన్ ప్రస్తుతం ఆగిరిపల్లిలోని ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 22, 23వ తేదీల్లో కంచికచర్లలోని మిక్ కళాశాలలో జరిగిన జేఎన్‌టీయూకే క్రికెట్ జట్టు ఎంపిక పోటీల్లో మెరుగైన ప్రతిభ ప్రదర్శించి జట్టులో స్థానం సాధించడమే కాకుండా కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఈ నెల 27వ తేదీ నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు మైసూర్‌లోని జేఎస్ఎస్ సైన్స్ అండ్ టెక్నాలజీ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరిగే సౌత్ జోన్ అంతర్ వర్సిటీ క్రికెట్ టోర్నీలో తలపడే జేఎన్‌టీయూకే జట్టుకు సాయి ఆర్యన్ సారథ్యం వహిస్తున్నాడు.

రిజర్వేషన్లు సద్వినియోగం చేసుకోవాలి

కృష్ణలంక, న్యూస్‌టుడే: వర్గీకరణ అనంతరం రిజర్వేషన్లు సద్వినియోగం చేసుకోవాలని మంద కృష్ణమాదిగ సూచించారు. ఏపీ జెన్‌కో మాదిగ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎంబీ విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతన సంవత్సర సామాజిక సంక్షేమ డైరీ-2026ను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వర్గీకరణ ద్వారా ఉద్యోగ, ఉపాధిలో లబ్ధి పొందిన వారు సామాజిక బాధ్యతగా కనీసం ఒక పేద విద్యార్థికి విద్య నిమిత్తం ఆర్థిక సహాయం చేయాల్సిందిగా కోరారు. అనంతరం ఉద్యోగులు మంద కృష్ణమాదిగను సత్కరించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పినపాటి కిరణ్‌బాబు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో దేవరపల్లి బిక్షాలు, కె.శ్రీనివాసరావు, కె.సాల్మన్, రామారావు, విక్టర్‌బాబు పాల్గొన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మహనీయుల జీవితాలు ఆదర్శం



నెమలి : సరస్వతిదేవి విగ్రహావిష్కరణలో దాతలు

గంపలగూడెం, న్యూస్‌టుడే : దాతల ఆర్థిక సౌజన్యంతో మండలంలోని నెమలి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పలు విగ్రహాలు, కట్టడాలను సోమవారం ప్రారంభించినట్లు ప్రధానోపాధ్యాయుడు డి.చంద్రం తెలిపారు. గ్రామస్థుడైన కోట బుచ్చిరాములు తన కుమార్తె రమ్య జ్ఞాపకార్థం రూ.50 వేలు వితరణతో ముఖద్వారం నిర్మించారు. సిద్ధాంతి ఇంగువ శివప్రసాద్‌, శారద దంపతులు తమ కుమారుడు కృష్ణసుశాంత్‌శర్మ జ్ఞాపకార్థం సరస్వతీ దేవి విగ్రహం, దారా రవికుమార్‌, లక్ష్మి దంపతులు తమ కుమారుడు కృష్ణవంశీ జ్ఞాపకార్థం డాక్టర్‌ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ విగ్రహం, కుంభగిరి రాంబాబు, రవీంద్ర తమ తల్లిదండ్రులు జార్జి, సువార్తమ్మ జ్ఞాపకార్థం డాక్టర్‌ బీఆర్‌.అంబేడ్కర్‌ విగ్రహం, వనమా వేణుగోపాలరావు(సూరి) వితరణతో మహాత్మా గాంధీ, అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాలను ఏర్పాటు చేశారు. వీటి ఏర్పాటుకు దిమ్మెను పాఠశాల ఉద్యోగిని ఎస్‌.పద్మజ వితరణతో నిర్మించారు. మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని వక్తలు అన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత



గెలుపొందిన వారితో నిర్వాహకులు

గొల్లపూడి, న్యూస్‌టుడే : వడ్లమూడి బ్రదర్స్‌ ఛారిటబుల్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో సోమవారం గొల్లపూడిలోని పోసాని నరసింహారావు చౌదరి ప్రభుత్వ పాఠశాలలో క్విజ్‌, వ్యాసరచన, కథల పోటీలు నిర్వహించారు. క్విజ్‌లో నందిగామ శ్రీవిద్య హైస్కూల్‌ ప్రథమ, విజయవాడ ఫ్యూచర్‌పాత్‌ ఉన్నత పాఠశాల ద్వితీయ, వీపీ సిద్ధార్థ పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరితో పాటు వ్యాసరచన, కథల పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్‌ నిర్వాహకులు రామకృష్ణ, రచయిత్రులు వసుధారాణి, వైష్ణవి శ్రీ తదితరులు పాల్గొన్నారు.

తవ్వకాలు నిలపాలని వినతి

కొండపల్లి, న్యూస్‌టుడే : ఎన్టీటీపీఎస్‌ అభివృద్ధి పనుల పేరిట మత విశ్వాసాలను దెబ్బతీస్తున్నారని ముస్లింలు ఆరోపిస్తున్నారు. ఎన్టీటీపీఎస్‌ కోల్‌ ప్లాంట్‌కు ఆనుకొని ఉన్న షాబుఖారీ దర్గా సమీపంలో సంస్థ తవ్వకాలు నిర్వహిస్తోంది. అయితే ఆ ప్రాంతం సర్వే నంబరు 428లో ఉందని, 4.30 ఎకరాలు మసీదుకు చెందిన స్థలమని వీరు పేర్కొంటున్నారు. ప్రస్తుతం జరుగుతున్న తవ్వకాల్లో ముస్లిం సమాధులపై ఉన్న బండరాళ్లు, అస్తికలు బయట పడుతున్నాయంటున్నారు. దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకుని సంస్థ చేస్తున్న పనులను నిలిపివేసే విధంగా ఆర్డర్స్‌ ఇవ్వాలని ముస్లింలు కోరుతున్నారు. ఈ మేరకు సంబంధిత వినతిపత్రాలను సబ్‌ కలెక్టర్‌ కార్యాలయానికి సోమవారం పంపారు.

దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు, నాగరాజు తదితరులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్‌ ఆకుల శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు కార్మికులకు పిలుపునిచ్చారు. సోమవారం విస్సన్నపేటలో విజయనిర్మల అధ్యక్షతన సీఐటీయూ మండల కమిటీ సమావేశం జరిగింది. ప్రజా సంఘాల నాయకులు గంజినిబోయిన రాము, మర్రిపోయిన అప్పారావు, తిరుపతమ్మ, రాణి, చిన్నమ్మ, సన్యాల్‌ దేవమణి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నిత్యావసరాల వితరణ

సూర్యారావుపేట : డాక్టర్‌ అంబేడ్కర్‌ స్మృతివనంలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది 35 మందికి షాలోం ట్రస్ట్‌ వ్యవస్థాపకులు మేకల భాను సోమవారం నిత్యావసరాలు పంపిణీ చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705



స్పందన: జి.కొండూరు బీసీ కాలనీలోని హోసన్నా చర్చి సమీపంలో కృష్ణా జలాల కుళాయిలు మరమ్మతులకు గురై నీటి కోసం అవస్థలు పడుతున్నామని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా అధికారులకు తెలిపారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి బసవ లింగేశ్వరరావు సిబ్బందితో కుళాయిలకు మరమ్మతులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించారు. - న్యూస్‌టుడే, జి.కొండూరు

★ తిరువూరు మండలం ఆంజనేయపురంలో దోమలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని స్థానికుడు మామిడి.కుటుంబరావు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా సమస్యను గ్రామ పంచాయతీ అధికారులకు తెలిపారు. దీనిపై స్పందించిన పంచాయతీ కార్యదర్శి పారిశుద్ధ్య కార్మికులను పంపించి గ్రామంలో దోమల మందు ఫాగింగ్‌ చేయించి సమస్య పరిష్కరించారు. - న్యూస్‌టుడే, తిరువూరు

అవార్డులు పొందడం అభినందనీయం



అందుకున్న ధ్రువపత్రాలతో ఉపాధ్యాయులు

మైలవరం, న్యూస్‌టుడే : చెన్నైలోని అమిత్‌ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన గురురత్న టీచర్స్‌ అవార్డుల కార్యక్రమంలో స్థానిక ఎస్‌ఎస్‌కే హైస్కూల్లో పని చేస్తున్న తెలుగు పండిట్‌ ఎస్కే. మీరావలి, హిందీ పండిట్‌ ఎం.మధుసూదనరావు, గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు కె.నాగేశ్వరరావు అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా అప్సా డెమొక్రాటిక్‌ రాష్ట్ర అధ్యక్షుడు గొల్లపూడి మోహనరావు, పీటీఎల్‌పీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు బాబ్జి వారిని సోమవారం ప్రత్యేకంగా అభినందించారు.



మైలవరం శాసన సభ్యుడి కార్యాలయంలో..



జి.కొండూరులో మౌనం పాటిస్తూ..



విస్సన్నపేటలో విద్యార్థుల ప్రతిజ్ఞ



రెడ్డిగూడెంలో..

వందేమాతరం.. అందామందరం



మైలవరం: జాతీయ నేతల వేషధారణలో చిన్నారులు

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, సహకార సంఘాలు, విద్యా సంస్థలు, పలు రాజకీయ పార్టీల కార్యాలయాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. - న్యూస్‌టుడే, బృందం



గొల్లపూడిలో..



కొండపల్లిలో..



పెనుగొలను ఉన్నత పాఠశాలలో మార్చ్‌ఫాస్ట్‌



ఇబ్రహీంపట్నంలో..



ఎ.కొండూరు పోలీసు స్టేషన్‌లో



తిరువూరు ఆర్డీవో కార్యాలయంలో..

శివాలయాల్లో విశేష పూజలు

గంపలగూడెం, ఎ.కొండూరు, న్యూస్‌టుడే : మండలంలోని కొత్తపల్లి, పెనుగొలను, మేడూరు, గంపలగూడెం గ్రామాల్లోని శివాలయాల్లో అర్చకులు సోమవారం గంగా పార్వతీ సమేత పరమేశ్వరునికి విశేష పూజలు నిర్వహించారు. శివలింగానికి పంచామృతాభిషేకాలు, అర్చనలు, పుష్పాలతో అలంకరణ చేయగా భక్తులు దర్శించుకున్నారు. ఎ.కొండూరు మండలం కంభంపాడు గంగా విజయదుర్గా సమేత నాగమల్లేశ్వర స్వామి గుడిలో అర్చకులు ప్రత్యేక అభిషేకాలు జరిపించారు.



కొత్తపల్లి గుడిలో శివలింగం



కంభంపాడులో..

వైభవంగా ముగిసిన కల్యాణ మహోత్సవాలు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో విస్సన్నపేటలో వారం రోజులుగా జరుగుతున్న శ్రీభద్రావతీ శ్రీభావనారుషి స్వామి వార్ల కల్యాణ మహోత్సవాలు సోమవారం ముగిశాయి. అనంతరం జరిగిన అన్నసంతర్పణలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రధానార్చకులు, స్థానిక పురోహితులు, ఋత్విజులు, పండితులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ఊరేగింపుగా అమ్మవారికి సారె సమర్పణ

పైపులైను పగిలి.. వాహనాల రద్దీ!



వెంగలేరు ప్రధాన రహదారిపై కృష్ణా జలాల పైపులైను లీకవ్వడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో రోడ్డు మధ్యలో గుంత ఏర్పడి రోజు రోజుకి పెద్దదవుతోంది. దీంతో భారీ వాహనాలు దాని వద్దకు వచ్చినప్పుడు వాహనదారులు అవస్థలకు గురవుతున్నారు. త్వరగా వెళ్లాలని ద్విచక్ర వాహనదారులు వేరే మార్గంలో ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పైపులైనుకు మరమ్మతులు చేయించి గుంతను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, జి.కొండూరు

రైతులకు యూరియా పంపిణీ

కనుమూరు(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని కనుమూరు పీఏసీఎస్‌లో సోమవారం 600 మంది రైతులకు 1200 బస్తాల యూరియా పంపిణీ చేసినట్లు సంఘం సీఈవో ఎస్‌.కే.అస్లాన్‌ తెలిపారు. మరో 300 మంది రైతులు యూరియా కోసం రాగా వారందరికీ యూరియా సొసైటీలో దిగుమతి అవ్వగానే ఇచ్చేందుకు చీటీలు అందజేశామని చెప్పారు.



కలెక్టర్‌ లక్ష్మీశ, సీపీ రాజశేఖర్‌బాబు చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న శ్రీధర్‌, త్రివేణి, కృష్ణారెడ్డి, జ్యోతీలాల్‌ నాయక్‌, తిరుపయ్య, హరికృష్ణ, లక్ష్మి, రాంబాబు, నాగమణి, చంద్రశేఖర్‌, నరసింహారావు, శామ్యూల్‌, దుర్గాప్రసాద్‌, లక్ష్మీనారాయణ



కిశోర్‌, సుబ్రహ్మణ్యం, శివ సత్యనారాయణ, ఉషారాణి, చెన్నారావు

ప్రతిభావంతులకు ప్రోత్సాహం

గంపలగూడెం, న్యూస్‌టుడే : గణతంత్ర దినోత్సవ సందర్భంగా సోమవారం విజయవాడలో నిర్వహించిన వేడుకల్లో పలువురు ప్రశంసా పత్రాలు అందుకున్నారు. విధి నిర్వహణలో ఉత్తమ పనితీరుకు గంపలగూడెం పోలీస్‌ స్టేషన్‌ హెడ్‌ కానిస్టేబుల్‌ ఎం.శ్రీధర్‌, తునికిపాడులో జాతీయ రహదారి నిర్మాణానికి భూసేకరణకు కృషి చేసిన వీఆర్వో సీహెచ్‌.త్రివేణి కలెక్టర్‌ జి.లక్ష్మీశ, సీపీ ఎస్వీ రాజశేఖర్‌బాబు ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఎ.కొండూరు,న్యూస్‌టుడే : పీ- 4లో స్ఫూర్తిగా నిలిచిన తెదేపా మండల మాజీ అధ్యక్షుడు, రామచంద్రాపురానికి చెందిన గడ్డి కృష్ణారెడ్డి- ఉత్తమ మార్గదర్శి, రేపూడి తండాకు చెందిన విద్యావేత్త డాక్టర్‌ బి.జ్యోతీలాల్‌ నాయక్‌- ఉత్తమ సేవా పురస్కారం, విధి నిర్వహణలో ఉత్తమ పనితీరుకు ఎ.కొండూరు పోలీస్‌ స్టేషన్‌ కానిస్టేబుల్‌ కె.తిరుపయ్య ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

తిరువూరు: తిరువూరు నుంచి తహసీల్దార్‌ వై.నాగమణి, ఎంపీడీవో సీహెచ్‌.వి బాబు, ఏఎస్సై వై.లక్ష్మి, చౌటపల్లి ప్రభుత్వ వైద్యురాలు ఎ.కనకదుర్గ భవాని, అక్కపాలెం వీఆర్వో నాగుల్‌ మీరావలి ప్రశంసా పత్రాలు అందుకున్న వారిలో ఉన్నారు.

మైలవరం, న్యూస్‌టుడే : మైలవరం మండలం నుంచి సీఐ దాడి చంద్రశేఖర్‌, సబ్‌ రిజిస్ట్రార్‌ నరసింహారావు, ఏపీఎం శామ్యూల్‌, ఎక్సైజ్‌ ఎస్సై దుర్గాప్రసాద్‌, శీలంవారి పాలెం హెచ్‌ఎం ఉడతా లక్ష్మీనారాయణ, మార్గదర్శిగా ఉన్న ఎం.కిశోర్‌లు అవార్డులు అందుకున్నారు.

జి.కొండూరు,న్యూస్‌టుడే: మండలంలోని సున్నంపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న లేళ్ల హరికృష్ణ ఉత్తమ పంచాయతీ కార్యదర్శి అవార్డు అందుకున్నారు.

విస్సన్నపేట: మండలానికి చెందిన తెదేపా సీనియర్‌ నాయకుడు, దాత గొట్టిపాటి సుబ్రహ్మణ్యం (బుద్దయ్య), సామాజిక కార్యకర్త జోట్ల శివ సత్యనారాయణ (శివ), వ్యవసాయ విస్తరణ అధికారిణి జి.ఉషారాణి, కొండపర్వ విలేజ్‌ అసిస్టెంట్‌ ఎస్‌.చెన్నారావు జిల్లా స్థాయి అవార్డులు పొందారు.

★ తిరువూరు డివిజన్‌ స్థాయిలో మండలానికి చెందిన జి.శ్రీనివాసరావు (జూనియర్‌ అసిస్టెంట్‌, విస్సన్నపేట), బి.రమేష్‌ (డిప్యూటీ సర్వేయర్‌, తాతకుంట్ల), జె.నరేష్‌ (డేటా ఎంట్రీ ఆపరేటర్‌, ఎలక్ట్రికల్‌), సీహెచ్‌.సురేష్‌ (వీఆర్‌ఏ, పుట్రేల), పి.మల్లికార్జునరావు (ఎఫ్‌.పి షాప్‌ డీలర్‌, విస్సన్నపేట), ఎం.నాగేశ్వరరావు (ఎఫ్‌.పి షాప్‌ డీలర్‌, కలగర) ఆర్డీవో కె.మాధురి చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.

క్షీణిస్తున్న పారిశుద్ధ్యం.. ఆందోళనలో జనం

విస్సన్నపేట, న్యూస్‌టుడే



విస్సన్నపేట బస్టాండు ఏరియాలో గుట్టలుగా వ్యర్థాలు

మండల కేంద్రం విస్సన్నపేటలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా తయారైంది. దీంతో వ్యాధులు ప్రబలుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పట్టణ విస్తరణతో పాటు జనాభా పెరగడం, పలు కాలనీలు నూతనంగా ఏర్పడడం, వ్యాపార సంస్థలు, ఆసుపత్రులు, పాఠశాలలు, కళాశాలలు, పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. కానీ అందుకు తగ్గట్లు మౌలిక వసతులు కల్పించడంలో పాలకులు విఫలమవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

రహదారి సౌకర్యం లేక..

పట్టణంలో ప్రతి రోజు టన్నుల కొద్ది చెత్త పోగుపడుతున్నా.. దాన్ని తీసేందుకు సరిపడ పారిశుద్ధ్య సిబ్బందిని నియమించలేదు. దీంతో ప్రధాన రోడ్లను శుభ్రం చేయడానికే కార్మికులు పరిమితం కావాల్సి ఉండగా ఎక్కడ చూసినా చెత్త కుప్పలే కన్పిస్తున్నాయి. ఇక రహదారులను నిర్మించి ఏళ్లు గడిచినా గృహాల మధ్యలోని ఖాళీ స్థలాల నిర్వహణను పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో వాటిలో పిచ్చిచెట్లు, పొదలు పెరిగి అడవిని తలపిస్తున్నాయి. స్థలాల్లో మురుగు చేరి కాలుష్య కాసారాలుగా తయారవుతున్నాయి. ఈ నేపథ్యంలో వెలువడుతున్న దుర్వాసనను భరించలేక పోతున్నామని వాహనదారులు, ప్రయాణికులు, ప్రజలు వాపోతున్నారు. డంపింగ్‌ యార్డుకు సరైన రహదారి సౌకర్యం లేక వాహనాలు దిగబడడంతో చెత్త మొత్తం బస్టాండు, సత్తుపల్లి, నూజివీడు రోడ్ల వెంట పడేయడంతో ప్రధాన రహదారులు డంపింగ్‌ యార్డులుగా తయారవుతున్నాయని ప్రజలు, పర్యావరణ ప్రేమికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆయా సమస్యలను పరిష్కరించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

స్టడీ మెటీరియల్‌ ఆవిష్కరణ



కార్యక్రమంలో తిరుపతిరావు, ప్రసన్నరాణి, సతీష్‌ తదితరులు

మైలవరం, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లా పరిషత్‌ ఆధ్వర్యంలో పది విద్యార్థుల కోసం రూపొందించిన ప్రేరణ స్టడీ మెటీరియల్‌ను సోమవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు తిరుపతిరావు, ఎంపీపీ ప్రసన్నరాణి ఆవిష్కరించారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సతీష్‌, ఎస్‌ఎంసీ అధ్యక్షుడు టి.ప్రసాద్‌, లయన్స్‌ క్లబ్‌ నాయకులు వెంకటేశ్వరరావు, శ్రీధర్‌, రామిరెడ్డి, బాలాజీ, శివప్రసాద్‌, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంపిణీ: రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మద్దులపర్వ ఆదర్శ పాఠశాల, రెడ్డిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలల్లోని పది విద్యార్థులకు స్ఫూర్తి స్టడీ మెటీరియల్‌ పంపిణీ చేశారు. జడ్పీటీసీ సభ్యుడు పి.విజయభాస్కరరెడ్డి, ఎంఎన్‌ఆర్‌ ఫౌండేషన్‌ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరెడ్డి, తెదేపా మండల అధ్యక్షుడు వేణుగోపాలరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ధర్మశీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రెడ్డిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో..

పాఠశాలకు పూర్వ విద్యార్థి విరాళం



జానీని సన్మానిస్తున్న గ్రామస్థులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : గణతంత్ర దినోత్సవం సందర్భంగా 70 ఏళ్ల కిందట తాను చదువుకున్న ప్రాథమిక పాఠశాలకు పూర్వ విద్యార్థి షేక్‌.జానీ రూ.70 వేలను సోమవారం వితరణ చేశారు. తిరువూరు రాజుపేటకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు జానీకి 82 ఏళ్లు. ఆయన రెడ్డిగూడెం మండలం కూనపరాజుపర్వలోని అప్పటి సీఎస్‌ఐ ప్రాథమిక పాఠశాలలో(ప్రస్తుతం బెసిక్‌ ప్రాథమిక పాఠశాలగా మార్చారు) విద్యను అభ్యసించారు. పాఠశాలకు ఆర్థిక సాయం అందజేసిన ఆయన్ను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం ఈడే కనక మహాలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని పెనుగొలను ప్రధాన ప్రాథమిక పాఠశాలకు గ్రామస్థురాలైన రామాల కోటమ్మ రూ.33 వేలు విలువైన మైక్‌ సెట్‌, సౌండ్‌ సిస్టమ్‌ను సోమవారం వితరణగా అందించినట్లు హెచ్‌ఎం కె.యోహాన్‌ తెలిపారు. పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేందుకు మైక్‌ సెట్‌ అందించిన కోటమ్మను సర్పంచి ఎస్‌.లలిత, ఎంఈవో నరసింహారావు, ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ స్వాధీనం

కల్లూరు, న్యూస్‌టుడే : ఎటువంటి అనుమతులు లేకుండా ఏపీ నుంచి ఇసుక తరలిస్తున్న లారీని సీజ్‌ చేసినట్లు ఖమ్మం జిల్లా కల్లూరు ఎస్సై హరిత తెలిపారు. ఎన్టీఆర్‌ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండకు చెందిన డ్రైవర్‌ ఉప్పు దేవానందం ఎలాంటి అనుమతులు లేకుండా కల్లూరుకు ఇసుక అక్రమ రవాణా చేస్తుండటంతో ఆ లారీని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. డ్రైవర్‌తోపాటు యజమాని సురేష్‌, కల్లూరు మండలం ఎర్రబోయినపల్లి చెందిన మధ్యవర్తి రేపాకుల రామకృష్ణపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

క్యాన్సర్‌ స్క్రీనింగ్‌ ఉచిత పరీక్షలు నేడు

వత్సవాయి, న్యూస్‌టుడే: జయప్రద ఫౌండేషన్‌ ఛైర్మన్‌ దశరథ జనార్దన్‌ ఆధ్వర్యంలో వత్సవాయిలో మహిళలకు ఉచిత క్యాన్సర్‌ స్క్రీనింగ్‌ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కో-ఆర్డినేటర్‌ వెంకటనరసింహారావు తెలిపారు. వత్సవాయిలో 27వ తేదీన పెద్ద హైస్కూలు వద్ద మొగపర్తి కోటేశ్వరరావు ఇంటి ఆవరణలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్షలు చేస్తారన్నారు. సాధారణ వైద్య పరీక్షలు కూడా నిర్వహించి, మందులు ఇస్తామని చెప్పారు.

పట్టాలు కట్టుకొని వెళ్లరా?

కొందరు కొత్తూరు తాడేపల్లి నుంచి టిప్పర్లలో మట్టిని అడ్డగోలుగా తరలిస్తున్నారు. మట్టిని తరలించే క్రమంలో వాహనాలపై ఏ విధమైన పట్టాలు వేయడం లేదు. దీంతో టిప్పర్లలోని మట్టి ఆ మార్గంలో వెళ్లే పాదచారులు, వాహన చోదకుల కళ్లలో పడి వారంతా ఇబ్బందులు పడుతున్నారు. మైనింగ్‌ అధికారులు నియమించిన భద్రత సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టిప్పర్లపై పట్టాలు కట్టుకొని వెళ్లేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. - న్యూస్‌టుడే, గొల్లపూడి



భద్రత సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వాహన చోదకులు

రెడ్‌బుక్‌ మమ్మల్ని ఏం చేయలేదు

అంబటి రాంబాబు

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే- ఇబ్రహీంపట్నం : 'రెడ్‌బుక్‌లో నా పేరు ఉందో లేదో నాకేం తెలుస్తోంది. రాసిన మనిషి ఉందని చెబుతున్నారు కదా.. ఇంకా చాలా మంది పేర్లు ఉన్నాయంటున్నారు. ఆ బుక్‌ మమ్మల్ని ఏం చేయలేదు' అని మాజీ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. నకిలీ మద్యం కేసులో తాజాగా బెయిల్‌పై వచ్చిన జోగి రమేశ్‌ను ఇబ్రహీంపట్నంలోని ఆయన ఇంట్లో అంబటి పరామర్శించారు. తర్వాత మీడియాతో మాట్లాడుతూ..'రాజశేఖర రెడ్డి వెంట తిరిగిన వాళ్లం.. జగన్‌ కష్టకాలంలో ఉన్నప్పుడు ఆయన వెంట నడిచిన వాళ్లం..ఏ కష్టం వచ్చినా ఎదిరించి నిలబడ్డాం. ఈ రెడ్‌బుక్కులకు భయపడం. ప్రభుత్వం వైకాపా నాయకులను ఎంత ఇబ్బంది పెడితే వారు పార్టీ బలోపేతానికి అంత కృషి చేస్తారు' అని అంబటి తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి విడదల రజిని, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనుమానంతో ఒక కుటుంబంపై దాడి

గాయపడిన మహిళ మృతి

మైలవరం, న్యూస్‌టుడే : తన భార్యతో చరవాణిలో మాట్లాడుతున్నాడన్న అనుమానంతో ఒక కుటుంబంపై చేసిన దాడిలో గాయపడిన మహిళ విజయవాడలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మరణించినట్లు ఎస్సై కె.సుధాకర్‌ తెలిపారు. మండలంలోని దాసుళ్లపాలేనికి చెందిన అనిల్‌, తన భార్యతో ఫోన్‌ మాట్లాడుతున్నాడన్న అనుమానంతో అదే ప్రాంతానికి చెందిన వింజమూరి లక్ష్మయ్య పగ పెంచుకున్నాడు. ఈ క్రమంలో గత బుధవారం లక్ష్మయ్య తన కుమారుడు సనత్‌తో కలిసి అర్ధరాత్రి సమయంలో అనిల్‌ ఇంటి మీదకెళ్లి అతనితో పాటు అతని తల్లిదండ్రులైన మిషక్‌, సారమ్మ(52)లను తీవ్రంగా కొట్టి గాయపరిచాడు. గాయపడిన వారు విజయవాడలోని ఆసుపత్రిలో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ సారమ్మ మృతి చెందినట్లు ఎస్సై చెప్పారు. ఘర్షణ జరిగిన రోజే బాధితులు ఫిర్యాదు చేశారని, నిందితులను అరెస్ట్‌ చేస్తామని పేర్కొన్నారు. సారమ్మ మృతదేహానికి విజయవాడలోనే పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు సోమవారం అప్పగించారు.

గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : ఎన్టీటీపీఎస్‌ కాలనీ క్వార్టర్స్‌పై నుంచి గుర్తు తెలియని వ్యక్తి దూకి మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇబ్రహీంపట్నం రైతుబజార్‌ ఎదురుగా ఉన్న జే టైప్‌ క్వార్టర్స్‌ రెండో అంతస్తు నుంచి ఓ వ్యక్తి కిందకు దూకాడు. సంఘటనను చూసిన వారు అక్కడికి చేరుకునే సరికి ఆ వ్యక్తి మృతి చెందాడు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతుని వివరాల కోసం ఆరా తీశారు. అయితే ఆచూకీ లభించక పోవడంతో మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతుడు మతి స్థిమితం లేని వ్యక్తిగా పోలీసులు భావిస్తున్నారు.

పరస్పరం ఢీకొన్న కార్లు

గంపలగూడెం, న్యూస్‌టుడే : ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు పరస్పరం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అందులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా బయటపడ్డారు. ఎ.కొండూరు మండలం చీమలపాడు నుంచి వస్తున్న కారు.. గంపలగూడెం మండలం తోటమూల నుంచి వెళ్తున్న కారు నారికింపాడు వాగు వద్ద సోమవారం సాయంత్రం ప్రమాదానికి గురయ్యాయి. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

దేహ్రాదూన్‌లో
రాజ్యాంగం తొలి ప్రతి ముద్రణ


నేటికీ పదిలంగా ఉన్న రాజ్యాంగం తొలి కాపీ


దేహ్రాదూన్‌లోని సర్వే ఆఫ్ ఇండియా ముద్రణాలయం

1950 జనవరి 26న రాజ్యాంగం అమలులోకి వచ్చిన సందర్భంగా దేశ ప్రజలందరూ ఆరోజున గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకోవడం పరిపాటి. అయితే రాజ్యాంగం తొలి ప్రతిని ఎక్కడ, ఎలా ముద్రించారో తెలుసా? రాజ్యాంగ తొలి చేతిరాత ప్రతిని ప్రేమ్ నారాయణ్ రాయ్‌జాదా లిఖించగా ముద్రిత ప్రతిని ఉత్తరాఖండ్‌లోని దేహ్రాదూన్‌లో సర్వే ఆఫ్ ఇండియాలో ముద్రించారు. రాజ్యాంగ రచన పూర్తయ్యాక దాని ప్రతుల్ని ముద్రించేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. "ఇది ప్రపంచంలోకెల్లా అతిపెద్ద రాజ్యాంగం కాబట్టి దాని ముద్రణా అందుకు తగ్గట్టే ఉండాలని రాజ్యాంగ నిర్మాతలు భావించారు. అందుకే రాజ్యాంగ ప్రతుల ముద్రణ బాధ్యతను దేహ్రాదూన్‌లోని సర్వే ఆఫ్ ఇండియా సంస్థకు అప్పగించారు. ఆ సంస్థ ముద్రణాలయం వద్ద నాటికి అత్యంత అధునాతనమైన ఫొటోలిథోగ్రాఫిక్ పరిజ్ఞానం అందుబాటులో ఉంది. ఆ విధంగా సర్వే ఆఫ్ ఇండియా ఒక చరిత్రాత్మక కార్యక్రమంలో భాగస్వామి అయింది" అని ఉత్తరాఖండ్‌కు చెందిన ప్రసిద్ధ చరిత్రకారుడు, పాత్రికేయుడు శీశ్‌పాల్ గుసైన్ తెలిపారు. మన రాజ్యాంగ తొలి ముద్రిత కాపీ ఇప్పటికీ సర్వే ఆఫ్ ఇండియా వద్ద ఉంది. దేహ్రాదూన్‌లోని సర్వే ఆఫ్ ఇండియా భవనంలో మన తొలి రాజ్యాంగ ప్రతిని ముద్రించిన యంత్రాలను ఇప్పటికీ భద్రపరిచి ఉంచడం విశేషం.

పెళ్లి కోసం
మంచులో 7 కి.మీ. నడక



హిమాచల్ ప్రదేశ్‌లో మంచు విపరీతంగా కురుస్తోంది. దీంతో పెళ్లిళ్లకూ ఇబ్బందులు తప్పడం లేదు. మండీ జిల్లాలోని బునాలీఘర్‌కు చెందిన గీతేశ్ ఠాకుర్‌కు ఈ నెల 23వ తేదీన 7 కిలోమీటర్ల దూరంలోని బైచాదీ గ్రామానికి చెందిన వధువు ఉషా ఠాకుర్‌తో పెళ్లి జరగాల్సి ఉంది. తీవ్ర మంచు కారణంగా రోడ్లను మూసివేశారు. దీంతో అతడు 7 కిలోమీటర్లు నడిచి వధువు గ్రామానికి వెళ్లారు. 3, 4 అడుగుల ఎత్తున పేరుకుపోయిన మంచులోనే పెళ్లి తంతు ముగించారు. పెళ్లి అనంతరం 25వ తేదీన వధువును తీసుకుని మళ్లీ నడిచి ఇంటికి చేరుకున్నారు.

60 రోజుల్లో కమిటీల నిర్మాణం
పీసీసీ అధ్యక్షులకు కాంగ్రెస్ అధిష్ఠానం దిశానిర్దేశం

ఈనాడు, దిల్లీ: గ్రామ పంచాయతీల్లోని బూత్‌స్థాయి నుంచి జిల్లా కాంగ్రెస్ కమిటీ(డీసీసీ)ల వరకు అన్ని స్థాయిల్లో పార్టీ సంస్థాగత కమిటీల నిర్మాణాన్ని 60 రోజుల్లో పూర్తి చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశించింది. ఈ మేరకు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(పీసీసీ)లకు స్పష్టమైన మార్గదర్శనం చేసినట్లు ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ వెల్లడించారు. సోమవారం దిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయం ఇందిరాభవన్‌లో ప్రధాన కార్యదర్శులు, ఇన్‌ఛార్జులు, అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ భేటీ వివరాలను వేణుగోపాల్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. "15 రోజుల్లోపు డీసీసీలు, 30 రోజుల్లోపు బ్లాక్ కమిటీలు, 60 రోజుల్లోపు మండల, గ్రామ పంచాయతీ, బూత్‌స్థాయి కమిటీలను భర్తీ చేయాలని పీసీసీ అధ్యక్షులకు గడువు నిర్దేశించాం. ఇందులో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీలతో పాటు అన్ని సామాజిక వర్గాలకూ తగిన ప్రాధాన్యం కల్పించాలని నిర్దేశించాం. జిల్లా, బ్లాక్‌స్థాయిలో శిక్షణ తరగతులు కూడా నిర్వహించాలని స్పష్టంగా చెప్పాం' అని వేణుగోపాల్ వివరించారు.

ఎట్‌హోంలో 'ఈశాన్యం'

దిల్లీ: గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం సాయంత్రం ఎట్‌హోంకు రాష్ట్రపతి భవన్ ఆతిథ్యమిచ్చింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈసారి ఎట్‌హోంలో ఈశాన్య సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించాయి. ఈశాన్య వంటకాలనే ఆహూతులకు వడ్డించారు. వారికి ఈశాన్య రాష్ట్రాల్లో ప్రముఖంగా వాడే గమోసాతో (శాలువాలాంటి వస్త్రం) స్వాగతం పలికారు. దీనిని సంప్రదాయ ఎరి పట్టుతో తయారు చేస్తారు. ఎట్‌హోంకు ముఖ్య అతిథులుగా ఐరోపా కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లెయెన్ హాజరయ్యారు. ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని నరేంద్ర మోదీ, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తదితరులు పాల్గొన్నారు. వీరితోపాటు వివిధ రంగాల ప్రముఖులు హాజరయ్యారు.

■ ఎట్‌హోం కార్యక్రమంలో అతిథులకు ఇచ్చిన గమోసాను ధరించకుండా రాష్ట్రపతిని, ఈశాన్య రాష్ట్రాల ప్రజలను రాహుల్ గాంధీ అవమానించారని భాజపా విమర్శించింది.


ఎట్‌హోంలో రాష్ట్రపతి ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు కోస్టా, కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లెయెన్, ప్రధాని మోదీ

మూడో వరుసలో సీట్లు: కాంగ్రెస్

గణతంత్ర వేడుకల్లో మూడో వరుసలో సీట్లు కేటాయించి తమ నేతలను ప్రభుత్వం అవమానించిందని కాంగ్రెస్ ఆరోపించింది. ప్రతిపక్ష నేతలు ఖర్గే, రాహుల్‌లు మూడో వరుసలో కూర్చున్న చిత్రాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది. తొలుత మూడో వరుసలో కూర్చున్న ఖర్గేను ఆ తర్వాత తొలి వరుసలో కూర్చున్న మాజీ ఉప రాష్ట్రపతి ధన్‌ఖడ్ పక్కకు మార్చారు. ప్రతిపక్ష నేతకు ఇలాగేనా ప్రొటోకాల్ మర్యాద ఇచ్చేదని కాంగ్రెస్ నేత రణదీప్ సూర్జేవాలా ప్రశ్నించారు.

నేడు బ్యాంకు ఉద్యోగుల సమ్మె

దిల్లీ: దేశ వ్యాప్తంగా మంగళవారం ప్రభుత్వ రంగ బ్యాంకుల కార్యకలాపాలకు అంతరాయం కలగనుంది. వారానికి ఐదు రోజుల పని విధానాన్ని వెంటనే అమలు చేయాలని కోరుతూ బ్యాంకు యూనియన్ల ఐక్యవేదిక (యూఎఫ్‌బీయూ) పిలుపు మేరకు ఈ నెల 27న బ్యాంకు ఉద్యోగులు సమ్మెలో పాల్గొననున్నారు. డిమాండ్లపై చీఫ్ లేబర్ కమిషనర్‌తో ఈ నెల 23న జరిపిన చర్చలు ఫలప్రదం కాకపోవడంతో బ్యాంకు అధికారులు, సిబ్బందికి ప్రాతినిధ్యం వహిస్తున్న తొమ్మిది సంఘాల ఉమ్మడి వేదిక.. యూఎఫ్‌బీయూ సమ్మె పిలుపునిచ్చింది.


మనాలీలో చిక్కుకుపోయిన వాహనాలు

హిమాచల్‌లో తీవ్ర హిమపాతం

శిమ్లా: హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలీలో తీవ్ర హిమపాతం కారణంగా రహదారులు మూసుకుపోయి వందల మంది పర్యాటకులు చిక్కుకుపోయారు. రహదారులపై మంచు పేరుకుపోవడంతో సోమవారం వాహనాలు బారులుతీరినట్లు అధికారులు వెల్లడించారు. మంగళవారం కూడా హిమాచల్ పర్వత ప్రాంతాల్లో భారీ హిమపాతం సంభవించే అవకాశం ఉందని స్థానిక వాతావరణ శాఖ హెచ్చరించింది. దీంతో కులు, కిన్నౌర్, చంబా, లాహౌల్ - స్పితి ప్రాంతాల్లో ఆరెంజ్ హెచ్చరిక జారీ చేశారు. వాతావరణ పరిస్థితులు మెరుగుపడే వరకూ అనవసర ప్రయాణాలు చేపట్టొద్దని ప్రజలకు పోలీసులు సూచించారు. హిమపాతానికి ముందుగా మనాలీ ప్రాంతానికి వెళ్లిన పర్యాటకుల్ని వారు బసచేసిన ప్రదేశాలకే పరిమితం చేశారు. జిల్లా యంత్రాంగం పరిస్థితిని సమీక్షిస్తోంది.

అమెరికాలో విమానం కూలి ఏడుగురి దుర్మరణం

- మంచు తుపాను బీభత్సంతో 17వేల సర్వీసులు రద్దు
- 10 లక్షల మందికి నిలిచిన విద్యుత్తు

వాషింగ్టన్: అమెరికాలో మంచు తుపాను బీభత్సం కొనసాగుతోంది. బంగోర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఒక ప్రైవేటు బిజినెస్ జెట్ విమానం కూలిపోవడంతో ఏడుగురు మృతి చెందారు. సిబ్బందిలో ఒకరు తీవ్రగాయాలతో బయటపడ్డారు. బంబార్డియర్ చాలెంజర్-600 అనే ఈ విమానం టేకాఫ్ సమయంలో కూలిపోయిందని అధికారులు తెలిపారు. బోస్టన్‌కు 200 మైళ్ల దూరంలో ఉన్న 'మెయిన్ విమానాశ్రయా'న్ని ఈ ప్రమాద నేపథ్యంలో మూసివేశారు. అమెరికాలో అతి శీతల ఉష్ణోగ్రతలకు విద్యుత్తు అంతరాయాలు తోడవడంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. వాషింగ్టన్ డీసీ, టెక్సాస్, జార్జియా, మిసిసిపి, లూసియానా, ఒక్లహోమా సహా పలు రాష్ట్రాల్లో భారీగా మంచు కురుస్తోంది. నివాసాలు, రహదారులు, చెట్లు.. ఇలా అన్నీ మంచు దుప్పటి కప్పుకొన్నాయి. తీగలు తెగిపోయి దాదాపు 10 లక్షల మంది ప్రజలు చీకటిలోనే గడుపుతున్నారు. అత్యధికంగా టెన్నెసీలో మూడు లక్షల మంది, మిసిసిపి, టెక్సాస్, లూసియానాలలో లక్ష మంది చొప్పున ప్రజలకు విద్యుత్తు నిలిచిపోయింది. వేడిమిని ఇచ్చే వ్యవస్థలు పనిచేయకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. 17వేలకు పైగా విమాన సర్వీసులు రద్దుకాగా 8వేల విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి.

20 రాష్ట్రాల్లో అత్యవసర పరిస్థితికి అనుమతి

రహదారులపై మంచు పేరుకుపోవడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయి. పాఠశాలలు, కార్యాలయాలు మూతపడ్డాయి. అత్యవసర పరిస్థితిని ప్రకటించేందుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 20 రాష్ట్రాలకు అనుమతిచ్చారు. ఇళ్లు, రోడ్లపై పేరుకుపోయిన మంచును భారీ యంత్రాలతో తొలగిస్తున్నారు. ప్రజలు ఇళ్లలోనే ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీచేశారు. తూర్పు అమెరికా ప్రాంతాలకు జాతీయ వాతావరణ సేవ (ఎన్‌డబ్ల్యూఎస్) హెచ్చరికలు జారీ చేసింది. అమెరికా తూర్పు భాగంలో మూడింట రెండొంతుల ప్రాంతాలను తుపాను కమ్మేస్తుందని వెల్లడించింది.



పేగుల ఆరోగ్యాన్ని కాపాడుకుంటేనే ఆనందం

మీ పేగుల్లోని బ్యాక్టీరియా మీ నాడీ వ్యవస్థకు నిత్యం సంకేతాలు పంపిస్తుంటాయి. అవి వాపు ప్రక్రియను నియంత్రిస్తాయి. పోషకాల శోషణను నిర్వహిస్తాయి. నిద్ర నాణ్యతను ప్రభావితం చేస్తాయి. ఒక్కమాటలో చెప్పాలంటే మీ మానసిక స్థితిని కూడా నిర్ణయించే శక్తి వాటికుంది. అందుకే ఆనందంగా ఉండాలంటే పేగుల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ముఖ్యం.

– శ్రద్ధే కటియార్, వైద్య నిపుణులు

భారత్, అమెరికా ట్రేడ్ డీల్‌ను ఆ ముగ్గురే అడ్డుకున్నారు

- ట్రంప్, వాన్స్, నవారోపై సెనేటర్ టెడ్ క్రజ్ వ్యాఖ్యలు


టెడ్ క్రజ్

వాషింగ్టన్: అమెరికాలోని అధికార రిపబ్లికన్ పార్టీ సెనేటర్ టెడ్ క్రజ్ సంచలన వ్యాఖ్యలతో కూడిన 10 నిమిషాల ఆడియో టేప్ లీకైంది. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని అధ్యక్షుడు ట్రంప్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఆర్థిక సలహాదారు పీటర్ నవారో అడ్డుకున్నారని ఇందులో టెడ్ క్రజ్ పేర్కొన్నారు. టారిఫ్‌లతో బెదిరింపులకు పాల్పడుతూ ట్రంప్ అనుసరిస్తున్న వ్యూహాలు అమెరికా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయొచ్చని క్రజ్ ఆ ఆడియో క్లిప్‌లో పేర్కొన్నారు. ఈ టారిఫ్‌లపై పునరాలోచించుకోవాలని ఫోన్ చేసి అధ్యక్షుడిని కోరినట్లు చెప్పారు. అయితే ట్రంప్ తమపై తీవ్ర అసహనం వ్యక్తంచేశారని గుర్తుచేసుకున్నారు. రాబోయే ప్రమాదాల గురించి అప్పుడు తాను ఆయనతో మాట్లాడానన్నారు. 'ప్రజల నిత్యావసర ధరలు పెరుగుతాయి. మీరు అభిశంసనలు ఎదుర్కొనే అవకాశం ఉంటుంది' అని ఆయనకు చెప్పినా ప్రయోజనం లేకపోయిందన్నారు. టక్కర్ కార్ల్‌సన్ అనే అమెరికన్ పాడ్‌కాస్టర్ చేతిలో పాచికలా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ పనిచేస్తున్నారని ఆరోపించారు. టెడ్ క్రజ్ వ్యాఖ్యలు అమెరికాలోని రిపబ్లికన్ పార్టీ ప్రభుత్వంలో ఏర్పడిన చీలికకు సంకేతమని పరిశీలకులు అంటున్నారు. ట్రంప్ విధానాలను అధికార పార్టీ ప్రజాప్రతినిధులే వ్యతిరేకిస్తున్నారని చెబుతున్నారు.

బద్రీనాథ్-కేదార్‌నాథ్ ఆలయాల్లో
హిందువులకే ప్రవేశం!
ప్రతిపాదించిన ఆలయ కమిటీ



దేహ్రాదూన్: ఉత్తర భారతంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయాల్లోకి ఇకపై హిందువులను మాత్రమే అనుమతించనున్నారు. ఆలయాల్లోకి హిందూయేతరుల ప్రవేశంపై నిషేధం విధించాలని బద్రీనాథ్-కేదార్‌నాథ్ ఆలయ కమిటీ ప్రతిపాదించింది. త్వరలో జరగబోయే ఆలయ కమిటీ బోర్డు సమావేశంలో ఈ ప్రతిపాదనలను ఆమోదించనున్నారు. ఈ విషయాన్ని బద్రీనాథ్-కేదార్‌నాథ్ ఆలయ కమిటీ ఛైర్మన్ హేమంత్ ద్వివేది ధ్రువీకరించారు. ఈ రెండు ఆలయాలతో పాటు కమిటీ పరిధిలోకి వచ్చే మిగతా దేవాలయాల్లోనూ ఇదే ప్రవేశ నిబంధన వర్తించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే గంగోత్రి ధామ్‌లోకి హిందూయేతరులు ప్రవేశించకుండా నిషేధం విధించారు. ఈ మేరకు ఆదివారం జరిగిన శ్రీ గంగోత్రి టెంపుల్ కమిటీ సమావేశంలో దీనిపై ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలోనే బద్రీనాథ్-కేదార్‌నాథ్ ఆలయ ప్రవేశాల పైనా ప్రతిపాదనలొచ్చాయి. అయితే, ఈ కొత్త నిబంధనలు ఎప్పటినుంచి అమల్లోకి తెస్తారన్న విషయాన్ని మాత్రం ఇంకా నిర్ణయించలేదు. శీతాకాలం నేపథ్యంలో ఆరు నెలల పాటు మూసుకుని ఉండే బద్రీనాథ్ ఆలయ ద్వారాలను ఏప్రిల్ 23న తెరవనున్నారు. ఇక, గంగోత్రి, యమునోత్రి ఆలయాలు అక్షయ తృతీయను పురస్కరించుకుని ఏప్రిల్ 19న తెరచుకోనున్నాయి.

భారత నూలుకు రాయితీపై బంగ్లా వస్త్రపరిశ్రమ కన్నెర్ర

- 1 నుంచి బంద్ పాటిస్తామంటూ హెచ్చరిక



ఇంటర్నెట్ డెస్క్: బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథిగా మహమ్మద్ యూనస్ పగ్గాలు చేపట్టినప్పటి నుంచి క్షీణిస్తున్న భారత్-బంగ్లా దౌత్య, వాణిజ్య సంబంధాల్లో తాజాగా మరో ప్రతికూల అంకం తెరపైకి వచ్చింది. ఇప్పటివరకు భారత్ నుంచి బంగ్లాదేశ్ దిగుమతి చేసుకునే నూలుపై సుంకం విధించడం లేదు. ప్రత్యేక రాయితీతో కూడుకున్న ఈ సదుపాయాన్ని వెంటనే తొలగించాలని అక్కడి వస్త్ర పరిశ్రమలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ డిమాండ్ తీర్చకుంటే ఫిబ్రవరి 1 నుంచి వస్త్ర పరిశ్రమలు మూసివేస్తామని బంగ్లా ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. ఈ విషయాన్ని ఆ దేశ వాణిజ్యశాఖ అక్కడి నేషనల్ బోర్డ్ ఆఫ్ రెవెన్యూకు రాసిన లేఖలో వెల్లడించింది. ఏళ్లుగా సుంకం లేకుండా భారత్ నుంచి చౌకగా నూలును దిగుమతి చేసుకుంటుండడం వల్ల స్థానిక స్పిన్నింగ్ యూనిట్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని కర్మాగార వర్గాలు తెలిపినట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. జనవరి చివరి నాటికి భారత నూలుకు సుంకం లేకుండా దిగుమతి చేసుకునే సౌకర్యాన్ని ఉపసంహరించుకోకపోతే దేశవ్యాప్తంగా అన్ని స్పిన్నింగ్ యూనిట్లలో కార్యకలాపాలు నిలిపేస్తామని దేశీయ మిల్లర్లు హెచ్చరించారు. భారతీయ నూలు కారణంగా తమ దేశ వస్త్ర పరిశ్రమలో రూ.12వేల కోట్ల కంటే ఎక్కువ విలువైన అమ్ముడుపోని నిల్వలు మిగిలిపోయాయని తెలిపారు. పలు వస్త్ర పరిశ్రమలు మూతకు గురయ్యాయన్నారు.

75 దేశాలకు వీసాల బ్రేక్‌తో
అందుబాటులోకి 50 వేల గ్రీన్‌కార్డులు

ఇంటర్నెట్ డెస్క్: వలసదారుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తోన్న అమెరికా ప్రభుత్వం.. ఇటీవల 75 దేశాల పౌరులకు వీసా ప్రాసెసింగ్‌ను నిలిపివేసింది. ఈ నిర్ణయంతో 2027 సంవత్సరానికి గానూ గ్రీన్‌కార్డు కోటా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. కుటుంబ ఆధారిత గ్రీన్‌కార్డులను.. ఉద్యోగ ఆధారిత కేటగిరీకి బదిలీ చేస్తే అదనపు గ్రీన్‌కార్డులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని ఇమ్మిగ్రేషన్ అటార్నీ ఎమిలీ న్యూమన్ వెల్లడించారు. సాధారణంగా వీసా ప్రాసెసింగును నిలిపివేయకపోతే.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ 75 దేశాలకు దాదాపు 67వేల ఇమ్మిగ్రెంట్ వీసాలను జారీ చేసేవారు. ఈ నెల 21 నుంచి ఈ దేశాల పౌరులకు వీసా ప్రాసెసింగ్ నిలిపివేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గానూ అక్టోబరు 1 నుంచి ఇప్పటికే ఈ దేశాలకు చెందిన పౌరులకు కొన్ని వీసాలు జారీ అయ్యాయి. ఈ లెక్కన చూసుకుంటే.. ఈ దేశాలపై నిషేధం అమలైతే వచ్చేఏడాది అదనంగా మరో 50వేల గ్రీన్‌కార్డులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని ఇమ్మిగ్రేషన్ అటార్నీ వివరించారు.

కుటుంబ ఆధారిత కోటాలో పాక్ పౌరులే ఎక్కువ

పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్, రష్యా, అఫ్గానిస్థాన్, బ్రెజిల్, ఈజిప్టు, ఇరాన్, ఇరాక్ సహా మొత్తం 75 దేశాల పౌరులకు తమ దేశ ఇమ్మిగ్రెంట్ వీసా ప్రాసెసింగ్‌ను అమెరికా నిలిపివేసింది. అమెరికా ప్రభుత్వ పథకాలపైనే వారు ఎక్కువగా ఆధారపడి జీవించే అవకాశాలు ఉన్నాయని, అందుకే ఈ చర్యకు ఉపక్రమించామని అగ్రరాజ్యం తెలిపింది. కొత్త వలసదారులు తమకు భారంగా మారరని నిర్ధారణ అయ్యేంత వరకూ ఈ నిలిపివేత అమల్లో ఉంటుందని పేర్కొంది. 2024 డేటా ప్రకారం.. కుటుంబ ఆధారిత గ్రీన్‌కార్డుల కోటాలో అత్యధికం పాకిస్థాన్ (15వేలు) పౌరులకు దక్కాయి. ఆ తర్వాతి స్థానంలో బంగ్లాదేశ్ (8వేల గ్రీన్‌కార్డులు) ఉంది.

కులగణనపై మోదీ సర్కారుకు చిత్తశుద్ధి లేదు: కాంగ్రెస్

దిల్లీ: తాము డిమాండ్ చేసిన ప్రకారం కుల గణన జరపడానికి అంగీకరించిన మోదీ ప్రభుత్వం ఆ విషయంలో కొత్త మెలిక పెట్టిందని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ సోమవారం ఆరోపించారు. 2027 జనగణనలో తొలి దశ కింద చేపట్టే ఇళ్ల జాబితా, గృహగణనలో ప్రజలను 33 ప్రశ్నలు అడుగుతారు. వాటిలో 12వ ప్రశ్న కుటుంబ పెద్ద షెడ్యూల్డ్ కులం లేదా తెగకు చెందినవారా లేక 'ఇతర కులాలకు' చెందినవారా అని అడుగుతోందని రమేశ్ వివరించారు. ఇతర కులాలు అనడంకన్నా కుటుంబ పెద్ద వెనుకబడిన (ఓబీసీ) కులాలకు చెందినవారా లేక జనరల్ కేటగిరీకి చెందినవారా అని ఎందుకు అడగడం లేదని నిలదీశారు. దీన్నిబట్టి దేశంలో న్యాయంగా, సమగ్రంగా కుల గణన జరపాలనే చిత్తశుద్ధి మోదీ ప్రభుత్వానికి ఉందా అనే ప్రశ్న తలెత్తుతోందని పేర్కొన్నారు. కులగణన ప్రక్రియను ఖరారు చేసే ముందు మోదీ ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీలతో, రాష్ట్ర ప్రభుత్వాలు, పౌర సంస్థలతో చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. 2025లో తెలంగాణ ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వే చేపట్టేముందు అన్ని పక్షాలతో ఇలాంటి చర్చలు జరిపిందని తెలిపారు.

పిరమిడ్ కుంభకోణం
రూ.1,986 కోట్ల ఆస్తులు జప్తు చేసిన ఈడీ

దిల్లీ: దేశవ్యాప్తంగా లక్షలాది మదుపరులను మోసగించి రూ. 60,000 కోట్ల వరకు వసూలు చేసిన చండీగఢ్ పిరమిడ్ కంపెనీ పీఏసీఎల్ (పెర్ల్ గ్రూపు) సంస్థకు చెందిన రూ.1,986 కోట్ల విలువైన 37 స్థిరాస్తులను జప్తుచేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోమవారం ప్రకటించింది. దీంతో ఈ కేసులో ఈడీ ఇంతవరకు జప్తు చేసిన పీఏసీఎల్ ఆస్తుల విలువ రూ. 7,589 కోట్లకు చేరింది. తాజాగా జప్తు చేసిన ఆస్తులు పంజాబ్ (లూడియానా), జైపుర్ (రాజస్థాన్)లలో ఉన్నాయి.

మయన్మార్‌లో భారత్ సైన్యం రహస్య ఆపరేషన్

- శౌర్యచక్ర అవార్డు ప్రకటనతో వెలుగులోకి



ఇంటర్నెట్ డెస్క్: మయన్మార్ భూభాగంలో శిబిరాలు ఏర్పాటు చేసుకొని దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న మిలిటెంట్లను భారత్ ఓ రహస్య ఆపరేషన్ ద్వారా అంతమొందించిందా? వారి శిబిరాలను ధ్వంసం చేసిందా? 'శౌర్యచక్ర' పురస్కార ప్రకటన ఈ ప్రశ్నలకు సమాధానం అవుననే తెలియజేస్తోంది. ఇలాంటి ఆపరేషన్ గురించి కేంద్రం ధ్రువీకరించడం చాలా అరుదు. 21వ పారా స్పెషల్‌ఫోర్స్‌కు చెందిన లెఫ్టినెంట్ కర్నల్ ఘటాగె ఆదిత్య శ్రీకుమార్‌కు కేంద్రం 'శౌర్యచక్ర' అవార్డును ప్రకటించింది. మయన్మార్‌లో అత్యంత కచ్చితత్వంతో ఆపరేషన్ చేపట్టి మిలిటెంట్ క్యాంప్‌ను ధ్వంసం చేసినందుకు ఆదిత్య శ్రీకుమార్‌ను ఈ పురస్కారంతో సత్కరించినట్లు ప్రకటించింది. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను మాత్రం వెల్లడించలేదు. దేశ వ్యతిరేక మూకలకు చెందిన శిబిరాలను లక్ష్యంగా చేసుకున్నామని మాత్రం తెలిపింది. 2025 జులై 11 నుంచి 13 వరకు భారత్-మయన్మార్ సరిహద్దు ప్రాంతంలో ఈ ఆపరేషన్ జరిగింది. ఇందులో 9 మంది మిలిటెంట్లు హతమయ్యారు. మయన్మార్‌లోని సగైంగ్ ప్రాంతంలో డ్రోన్లు, క్షిపణులతో జరిపిన ఈ దాడుల్లో తమ సంస్థకు చెందిన అగ్ర నాయకులు మరణించినట్లు గతేడాది జులైలో యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అస్సాం (ఇండిపెండెంట్) (ఉల్ఫా (ఐ)) ప్రకటించింది. ఈ దాడి చేసింది భారత సైన్యమేనని అప్పట్లో ఆ సంస్థ ఆరోపించింది. దీనిపై నాడు కేంద్రం నుంచి ఎలాంటి స్పష్టత రాలేదు. అయితే.. శౌర్యచక్ర అవార్డు ప్రకటనతో ఇది వెలుగులోకి వచ్చింది.

వెనెజువెలాపై ఉపయోగించిన ఆయుధం 'ది డిస్కాంబోబులేటర్'
పేరు వెల్లడించిన డొనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్: వెనెజువెలా ఆపరేషన్‌లో ఉపయోగించిన రహస్య ఆయుధం పేరును అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఆ దేశ సైన్యాన్ని నిర్వీర్యం చేసేందుకు తమ బలగాలు 'ది డిస్కాంబోబులేటర్' వాడినట్లు తెలిపారు. దీన్ని వాడగానే ప్రత్యర్థుల ఆయుధాలు పని చేయలేదని పేర్కొన్నారు. దీని గురించి ఎక్కువగా మాట్లాడేందుకు తనకు అనుమతి లేదని చెప్పారు. 'వారి వద్ద రష్యా, చైనా రాకెట్లున్నాయి. కానీ వాటిని ప్రయోగించలేకపోయారు. మేము రాగానే.. వారు బటన్స్ నొక్కినా అవేవీ పనిచేయలేదు' అని వెల్లడించారు. వెనెజువెలాపై మెరుపుదాడి చేసిన సమయంలో అగ్రరాజ్యం ఓ రహస్య ఆయుధాన్ని ఉపయోగించినట్లు కథనాలు వచ్చాయి. సీక్రెట్ సోనిక్ వెపన్‌ను వినియోగించినట్లు కొన్నిరోజుల క్రితం ధ్రువీకరించిన ట్రంప్.. తాజాగా దాని పేరు తెలిపారు.

లభ్యమైన ఆఖరి బందీ మృతదేహం

జెరూసలెం: ఇజ్రాయెల్-హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం రెండోదశ ప్రారంభం కావడానికి మార్గం సుగమమైంది. ఆఖరి బందీ మృతదేహం ఎట్టకేలకు లభించింది. ఇజ్రాయెల్ పోలీసు అధికారి రాన్ గ్విలి భౌతికకాయం కోసం గత కొంతకాలంగా హమాస్ అన్వేషణ కొనసాగిస్తోంది. గాజాలో తమ అధీనంలో ఉన్న ప్రాంతాల్లో వెతికింది. ఆ ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో ఇజ్రాయెల్ ఆక్రమిత గాజాలోనే భౌతికకాయం ఉండొచ్చని మధ్యవర్తులకు సమాచారమిచ్చింది. దీంతో ఇజ్రాయెల్ రంగంలోకి దిగింది. హమాస్ సూచనల ప్రకారం అన్వేషణ ప్రారంభించింది. రాన్ గ్విలీ మృతదేహం దొరికిందని, డీఎన్‌ఏ పరీక్షల్లోనూ ఈ విషయం నిర్ధారణ అయిందని ఇజ్రాయెల్ సోమవారం ప్రకటించింది. ఇది అద్భుతమైన ఘనత అని ఆ దేశ ప్రధాని నెతన్యాహు పేర్కొన్నారు. ఆఖరి బందీ మృతదేహం దొరికితే రఫా క్రాసింగ్‌ను తెరుస్తామని ఇజ్రాయెల్ ఆదివారం తెలిపింది.

పార్టీ మార్పు కథనాలపై స్పందించేందుకు శశిథరూర్ నిరాకరణ

తిరువనంతపురం: తాను సీపీఎంలో చేరుతున్నానంటూ వస్తున్న వార్తలపై స్పందించేందుకు కాంగ్రెస్ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ నిరాకరించారు. దుబాయ్‌లో సాహిత్య వేడుకలకు హాజరైన ఆయన్ను.. సీపీఎంలో చేరబోతున్నారా అని సోమవారం విలేకరులు ప్రశ్నించారు. 'సీపీఎంలో చేరేందుకు దుబాయ్‌లో ఆ పార్టీ నేతలతో సమావేశమైనట్లు వచ్చిన కథనాలపై ఇక్కడ (దుబాయ్‌లో) మాట్లాడదలచుకోలేదు' అని పేర్కొన్నారు. ఇదే అంశంపై కాంగ్రెస్, సీపీఎంలు స్పందించాయి. 'శశిథరూర్ సీనియర్ నేత. పార్టీతో ఏవైనా సమస్యలు ఉంటే ఆయన పరిష్కరించుకుంటారు. అంతేతప్ప కాంగ్రెస్‌ను ఆయన వీడట్లేదు' అని ఆ పార్టీ నేత, కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు వీడీ సతీశన్ తెలిపారు.

కోర్టుకు సమర్పించే దస్త్రాల్లో లైంగిక వేధింపుల బాధితురాలి పేరు వద్దు
పోలీసులకు దిల్లీ హైకోర్టు ఆదేశం

దిల్లీ: లైంగిక వేధింపుల కేసుల్లో బాధితురాళ్ల పేరు, చిరునామా, తల్లిదండ్రుల వివరాలను కోర్టుకు సమర్పించే దస్త్రాల్లో ప్రస్తావించొద్దని దిల్లీ హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు అన్ని పోలీస్‌స్టేషన్ల అధికారులకు తగిన సూచనలు ఇవ్వాలని దిల్లీ పోలీస్ కమిషనర్‌కు న్యాయమూర్తి జస్టిస్ స్వరణ కాంత శర్మ సూచించారు. పోక్సో కేసులో నిందితుడు బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోగా.. దర్యాప్తు అధికారి సమర్పించిన నివేదికలో బాధితురాలి పేరును ప్రస్తావించారు. దీనిని తీవ్రంగా పరిగణించిన న్యాయమూర్తి.. ఈ తరహా కేసుల్లో బాధితురాళ్ల పేరు, తల్లిదండ్రుల వివరాలు కోర్టుకు అందజేసే ఏ రికార్డుల్లోనూ ఉండకూడదని స్పష్టం చేశారు. కేసు దర్యాప్తు దశలో నిందితుడికి బెయిల్ ఇవ్వలేమని పేర్కొంటూ అభ్యర్థనను తిరస్కరించారు.







దిల్లీలోని కర్తవ్యపథ్‌లో సోమవారం గణతంత్ర వేడుకలకు సంప్రదాయ గుర్రపు బగ్గీలో వస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా ★ గణతంత్ర వేడుకల్లో ఆకట్టుకున్న మహారాష్ట్ర శకటం ★ డీఆర్‌డీవో ప్రదర్శించిన దీర్ఘశ్రేణి నౌకా విధ్వంసక క్షిపణి నమూనా ★ బుల్లెట్ బైకులపై ఒళ్లుగగుర్పాటు చెందే విన్యాసాలు ప్రదర్శిస్తున్న సశస్త్ర సీమాబల్, సీఆర్‌పీఎఫ్ దళాలకు చెందిన మహిళా సిబ్బంది ★ బీఎస్ఎఫ్ ఒంటె దళం కవాతు

వసుంధర

vasundhara@eenadu.in

పాటల రాణి!

పుట్టినప్పట్నుంచీ పోఖిలా లెఖ్తెపి జీవితంలో సంగీతం ఓ భాగం. ఈమెది అసోంలోని టిముంగ్ అనే గ్రామం. తండ్రి ఊళ్లో జరిగే కార్యక్రమాల్లో సంగీత వాద్యాలు వాయించేవారు. ఆ పాటలూ, కథలూ వింటూ పెరిగిన పోఖిలా సహజంగానే సంగీతమ్మీద మనసు పారేసుకున్నారు. దీనికితోడు స్కూల్లో ప్రతి శనివారం పాటల పోటీ లుండేవి. వాటిలో ఎప్పుడూ విజేతగా నిలిచేవారు పోఖిలా. దానికోసం నాన్న నుంచి ఎన్నో పాటలూ నేర్చుకున్నారామె.



పదేళ్లకే స్థానిక పోటీల్లో పాల్గొనడం మొదలుపెట్టారు. యూత్ ఫెస్టివల్స్‌లోనూ విజేతగా నిలవడంతో రేడియోలో పాడే అవకాశమొచ్చింది. కానీ అప్పట్లో తమ 'కర్బీ' పాటల్లో ఆధునిక మ్యూజిక్ ఛాయల్లేవని సొంతంగా బాణీలు కట్టడం మొదలుపెట్టారు పోఖిలా. సంప్రదాయ జానపదాలకు ఆధునిక మ్యూజిక్‌ని జోడించడమే కాదు... క్యాసెట్లనూ అందుబాటులోకి తెచ్చారు. ఆ పాటలకి దేశవ్యాప్తంగా ఆదరణ వచ్చేలా చేశారు. దాదాపు అయిదు దశాబ్దాల్లో వందల పాటలు పాడారామె. తన తెగకు మూల స్తంభంగా నిలిచి... ఓ గుర్తింపునీ తెచ్చారు. తమ ఆదివాసి కళ అంతరించిపోకుండా కాపాడారు. తన కృషికి గుర్తింపుగా ఎన్నో పురస్కారాలు అందుకున్న ఆమె.. అసోం రాష్ట్ర ప్రభుత్వం నుంచి శిల్పి, అసోం గౌరవ్ అవార్డులనూ సొంతం చేసుకున్నారు. 'క్వీన్ ఆఫ్ మెలోడీ'గా గుర్తింపు తెచ్చుకున్న పోఖిలా... తాజాగా పద్మశ్రీ అవార్డుకి ఎంపికవ్వడం కళపట్ల ఆమెకున్న అంకితభావానికి సంస్కృతిని కాపాడేందుకు ఆమె చేస్తున్న కృషికీ గుర్తింపే!

పెళ్లి తర్వాత అరణ్యవాసం...

బస్తర్, దంతేవాడ, సుక్మా... ఛత్తీస్‌గఢ్‌లోని ఈ జిల్లాల్లో పనిచేయడం ఎవరికైనా సవాలే. భర్త రామచంద్రతో కలిసి ఇక్కడ ఆదివాసీలకు మూడున్నర దశాబ్దాలుగా వైద్య సేవలు అందిస్తున్నారు సునీత గోడ్‌బోలే. మొదట్నుంచీ ఈమెకు సేవాభావం ఎక్కువ. చదువుకునే రోజుల్లో మహారాష్ట్రలోని రాయగఢ్‌లో స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేసేవారు. ఆయుర్వేద వైద్యులైన రామచంద్ర... సతారాలో వైద్య సేవలు అందించేవారు. వీళ్ల ఆర్.ఎస్.ఎస్. అనుబంధ 'వనవాసి కల్యాణ ఆశ్రమం' తరఫున పనిచేసేవారు. ఆశ్రమం కోరడంతో పెళ్లైన రెండు వారాలకే ఛత్తీస్‌గఢ్‌లో వైద్య సేవలు అందించడానికి వెళ్లారీ దంపతులు. దంతేవాడ సమీపంలోని బర్సూర్‌లో ఆసుపత్రి తెరిచారు. స్థానికులు ఎక్కువగా మంత్రగాళ్లను ఆశ్రయించేవారు తప్ప, వీళ్ల దగ్గరకు వచ్చేవారు కాదు. దాంతో వీళ్లే గ్రామాలకు వెళ్లి మెడికల్ క్యాంపుల్ని నిర్వహించడం మొదలుపెట్టారు. మలేరియా, టీబీ, ఎనీమియా ఎక్కువగా కనిపించేవి. మెరుగైన చికిత్సకు సమీపంలోని పట్టణాలకు వెళ్లమంటే ముందుకువచ్చేవారు కాదు. దాంతో గ్రామాల్లో 'ఆరోగ్య మిత్ర మండలి'ని ఏర్పాటుచేసి వాళ్ల సాయంతో పనిచేసేవారు. స్థానిక భాష నేర్చుకుంటూ, వాళ్లలో ఒకరిగా కలిసిపోయి సేవలు అందించడంతో స్థానికుల ఆరోగ్య పరిస్థితి ఇప్పుడు ఎంతో మెరుగైంది. అందుకు దక్కిన గౌరవమే పద్మశ్రీ.



ప్రమాదంతో మొదలైన ప్రయాణం..!

ప్రకృతి అందాలకు పెట్టింది పేరు కేరళ. అలాంటి రాష్ట్రంలోని అలప్పుజ జిల్లాలో 1980 వరకూ ఒక్క సహజ అడవి కూడా లేదట. అలాంటిచోట అడవిని సృష్టించారు దేవకి అమ్మ. 'నేను పుట్టిపెరిగింది ముత్తుకుళం. మాది వ్యవసాయ కుటుంబం. ఔషధ మొక్కలు, వృక్షాల గురించి నాన్న చెబుతుండేవారు. దాంతో నాకు దీనిపై ఆసక్తి ఏర్పడింది. మెట్టినింట్లోనూ మగవాళ్లంతా వ్యాపారాలు, ఉద్యోగాలు చేస్తుంటే... ఆడవాళ్లు వ్యవసాయం చేసేవారు. దాంతో నేనూ వరి పండించడంలో భాగమయ్యా. కానీ ఓ కారు ప్రమాదం నన్ను మంచానికి పరిమితం చేసింది. ఇంట్లో ఖాళీగా ఉండలేక విసుగొచ్చేది. దాన్నుంచి తప్పించుకోవడానికి మొక్కల్ని నాటాలనుకున్నా. అప్పుడు నాకు తెలియదు, ఈ ఆలోచన అడవిని సృష్టిస్తుందని. మావారు గోపాలకృష్ణ పిళ్లై, అమ్మాయి ధంకమణి మొక్కలు, విత్తనాలు తెచ్చి ఇస్తుండేవారు. చూడటానికి వచ్చిన బంధువులూ మొక్కల్నే తెచ్చేవారు. దాంతో పెరడంతా నిండిపోయింది. ఇంటి వెనకున్న బంజరు భూమిని చదును చేసి, సాగు మొదలుపెట్టా. అలా ఐదెకరాల్లో సహజ అడవిని నెలకొల్పా. దానికి 'తపోవనం' అని పేరుపెట్టా' అంటారు దేవకి. 45 ఏళ్లుగా మొక్కల్ని నాటడం, అవసరమైన ఎరువులు అందించడం... ఇదే దేవకి అమ్మ దినచర్య. గ్లోబల్ వార్మింగ్‌కు, వాతావరణ మార్పులకు అతీతంగా ఉండే ఈ చిట్టడవిని సందర్శించే వాళ్లూ ఎక్కువే. అందరికీ ఇక్కడి మొక్కలు, వృక్ష సంపద గురించి వివరించే బాధ్యతనూ తీసుకున్నారు దేవకి. ఈ శ్రమంతా ఎందుకు అని అడిగితే... 'వాతావరణ మార్పుల్ని ఎదుర్కోవాలంటే... అడవుల్ని సృష్టించాలి. ఇందుకు ఏళ్ల సమయం పడుతుంది. కాబట్టి ఆసక్తి చూపించేవాళ్లు తక్కువ. కాస్త శ్రమిస్తే తగిన ఫలితం వస్తుందనడానికి తపోవనమే ఉదాహరణ. అందుకే దీని గురించి అందరికి చెప్పాలి' అనే దేవకి అమ్మను అనేక కేంద్రరాష్ట్ర అవార్డులు వరించాయి. ఇప్పుడు పద్మశ్రీ కూడా అందులో చేరింది.



అందరు అమ్మాయిల్లానే మంచి భవిష్యత్తు కోసం కలలు కందామె. వాటి సాధనే లక్ష్యంగా అడుగులు వేసింది. కానీ, అనుకోని ప్రమాదం ఆమెను దివ్యాంగురాల్ని చేసింది. ఆ కుదుపు నుంచి బయటపడి 'సోలో ట్రావెలర్'గా మారి... జీవితాన్ని ఆస్వాదిస్తున్నా' అంటోన్న నేహా భట్ గురించి తెలియాలంటే...



నేహా

వాయిదాలు వేస్తూ... జీవితాన్ని కోల్పోవద్దు..!

ఉద్యోగం, మంచి ఇల్లు, ఆర్థిక భద్రత... ఇలా ఏ లోటూ లేని జీవితాన్ని కోరుకోని వాళ్లుంటారా. 2021 వరకు నాకూ ఇవే లక్ష్యాలు. మాది గుజరాత్‌లోని మహువా. మధ్యతరగతి కుటుంబం. నాన్న ఎలక్ట్రీషియన్. పనుంటేనే తిండి, లేదంటే పస్తులే. 'నువ్వు బాగా చదువుకుంటే ఈ పరిస్థితుల్లో మార్పు వస్తుంది' అని నాన్న రోజూ చెప్పేవారు. కానీ, చదివించే స్థోమత లేక ఇంటర్‌తోనే సరిపెట్టుకున్నా. వృత్తివిద్యా కోర్సుల్లో చేరి ప్రాథమిక బోధనా కోర్సును నేర్చుకున్నా. ఓ ప్రైమరీ స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పనిచేయడం మొదలుపెట్టా. నా మొదటి జీతం రూ.3వేలు. ఏళ్లు గడిచేకొద్దీ జీతం పెరుగుతూ వచ్చి రూ.30వేలకి చేరుకుంది.



అమ్మానాన్నల కోరిక...

'ఎప్పటికైనా మనకంటూ సొంతిల్లు ఉండాలి నేహా' అని చెబుతుండేవారు అమ్మానాన్నలు. దాని నిర్మాణానికి ఇదే మంచి సమయం అనిపించింది. ఆ పని మీదే స్థలం చూడాలని బయలుదేరా. నేను ఎక్కిన బస్సు ఎదురుగా వస్తున్న వ్యాన్‌ని ఢీకొని ఘోర ప్రమాదానికి గురైంది. మొదటి సీట్‌లో కూర్చున్న నేను స్పృహ కోల్పోయాను. రెండు రోజుల తర్వాత తెలివి వచ్చాక తెలిసింది సర్జరీ చేసి కాలు తొలగించారని. ముఖం చిట్లిపోయి ఓ వైపంతా బ్యాండేజ్ వేశారు. అద్దంలో చూసుకోవాలంటేనే భయం వేసింది. ఒక్కసారిగా కలలు, లక్ష్యాలు అన్నీ తలకిందులయ్యాయి. మంచానికే పరిమితం అయ్యాను. కోలుకున్నాక కొన్ని నెలల వరకూ గది నుంచి బయటికి రాలేదు. డిప్రెషన్ సరేసరి. ప్రమాద ఘటన పదేపదే కలలోకి వచ్చి ఆందోళనకు గురయ్యేదాన్ని.

ఒక్క మాటతో..

ఆర్థిక పరిస్థితులు మళ్లీ మొదటికి వచ్చాయి. నన్ను ఆ ఆలోచనల నుంచి బయటకు తీసుకురావడానికి అమ్మానాన్నలు చేయని ప్రయత్నం లేదు. ఈ క్రమంలోనే నా స్నేహితుల ద్వారా... సుధా చంద్రన్ గురించి తెలుసుకున్నా. కృత్రిమ కాలితో ఆమె తన ప్యాషన్‌ని కొనసాగించిందని తెలిసి... నేనూ ఆ ప్రయత్నం చేయాలనుకున్నా. కానీ, స్థోమత లేక వెనకడుగు వేశా. నా స్నేహితులు క్లౌడ్ ఫండింగ్ ద్వారా కొద్ది మొత్తాన్ని సమకూర్చారు. తర్వాతే అసలు సవాళ్లు మొదలయ్యాయి. బయటకి వెళ్లేటప్పుడు వింతగా చూసేవారు. వెక్కిరింతలు, హేళనలు. అందుకే ఇంటినుంచే పనిచేయాలనుకున్నా. ఒక్క ఉద్యోగమూ దొరకలేదు. అప్పుడు టీ స్టాల్‌ని ప్రారంభించా. కొద్ది రోజుల్లోనే మంచి ఆదరణను సంపాదించుకున్నా.

ఆలోచన అలా వచ్చిందే...

ఈక్రమంలోనే ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ చూశాను. పరిస్థితులకు ఎదురీది నిలిచానంటూ ఓ వినియోగదారుడు నా గురించి చెబుతూ రికార్డ్ చేసిన వీడియో అది. ఎన్ని ప్రశంసలో. అవే నాలో మళ్లీ కొత్త ఆశలు చిగురించేలా చేశాయి. నాలాంటి వారికి స్ఫూర్తినివ్వాలి అనుకున్నా. సోలో ట్రావెలింగ్ ఆలోచన కూడా అలా వచ్చిందే. 2024 నుంచి ఒంటరి ప్రయాణాలు ప్రారంభించా. స్థానిక కొండలు, గుట్టలు ఎక్కడంతో మొదలై... గుజరాత్‌లోని అత్యంత ఎత్తైన పర్వతం గిర్‌నార్‌ను అధిరోహించా. ఇటీవల కేదార్‌నాథ్ యాత్రను పూర్తిచేశా. ఆ వీడియోల్ని యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పంచుకుంటున్నా. మంచి ఆదాయాన్నీ సంపాదిస్తున్నా. ఇదంతా ఒక ఎత్తయితే... ఈ ప్రయాణాలు నాకు ఎన్నో జీవిత పాఠాలను నేర్పాయి. ప్రస్తుతంలో బతకడం, చిన్న విజయాల్ని ఆస్వాదించడం, భవిష్యత్తు గురించి ఆలోచిస్తూ ప్రస్తుతాన్ని కోల్పోకూడదని, కోరికల్ని వాయిదా వేయకూడదని... ఇలా చాలానే నేర్చుకున్నా. నా ఫాలోయర్లకూ వీటినే చెబుతూ ఉంటా.

సేవలకి... దక్కిన గౌరవం!

దిల్లీలో నిర్వహించే గణతంత్ర వేడుకను దగ్గర నుంచి చూడాలనేది ప్రతి భారతీయుడి కల. అలాంటిది ఝార్ఖండ్‌లో హజారీబాగ్ జిల్లాకి చెందిన ఇద్దరు మహిళలు వేరు వేరు రంగాల్లో అందించిన సేవలకు గానూ ఈ వేడుకల్లో పాల్గొన్నారు. వాళ్లు ఎవరంటే...



సేవ చేయాలి..!

ప్రజలకు సేవ చేయాలి... పేద, మధ్యతరగతి కుటుంబాలకి ఆరోగ్యాన్ని చేరువ చేయాలనే ఉద్దేశంతో జన ఔషధి కేంద్రాన్ని నడుపుతోంది రాఖీ సిన్హా. అంతేకాదు, మందులపై 75 శాతం రాయితీతో గ్రామీణ ప్రజల ఆరోగ్యానికి రక్షణ కల్పిస్తోంది. ఈమెది హజారీబాగ్‌లోని చర్హి. పీఎంబీజేకే (ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి కేంద్రం)తో ప్రజలకు ఆమె చేసిన సేవకిగానూ గణతంత్ర వేడుకల్లో పాల్గొనే అవకాశం అందుకుంది. రాష్ట్రంలోని జన ఔషధి కేంద్రాలను పరిశీలించగా రాఖీ రెండో స్థానంలో నిలిచింది. 'ఈ గౌరవం నాదే కాదు. జన ఔషధి నుంచి ప్రయోజనం పొందిన గ్రామస్థులందరిదీ. ఈ పథకం నాకు సమాజంలో మంచి గుర్తింపుని తెచ్చింది. సేవ చేయడానికి మంచి అవకాశం ఇచ్చింది' అంటోంది రాఖీ.



అంకిత భావంతో పనిచేస్తున్నా..!

తల్లీ పిల్లలు ఇద్దరికీ పోషకాహారం అందించాలి. ఇందుకు ప్రభుత్వం చేపట్టిన ప్రతి పథకాన్నీ వాళ్లకి చేరువచేయాలనుకున్నారు దారుదిహ్ గ్రామానికి చెందిన మీనా దేవి. రెండు దశాబ్దాలుగా అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్నారీమె. గ్రామంలో పిల్లలు, మహిళలకు పోషకాహారానికి సంబంధించిన పథకాలను సమర్థవంతంగా చేరువ చేస్తున్నారు మీనా. అంగన్‌వాడీలో చిన్నారుల్ని ప్రేమగా చూసుకోవడం, వేళకు పోషకాహారాన్ని అందించడం... ఇలా తన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తూ ప్రజల మనసుల్ని గెలుచుకున్నారీమె. గతంలో జిల్లాలో పలు ప్రశంసలు అందుకున్నారు. 'ప్రభుత్వం నాకు అప్పగించిన బాధ్యతను అకింత భావంతో నిర్వర్తిస్తా. ఈ విజయం మా గ్రామం మొత్తానిది' అంటున్నారు మీనా. నిజాయతీగా విధులు నిర్వర్తించి గణతంత్ర వేడుకల్లో పాల్గొనే అవకాశం అందుకున్నారు.

చేనేత గొప్పతనం చాటడానికి!

స్వాతంత్రోద్యమ సమయంలో గాంధీజీ పోరాటానికి ఖాదీ ఓ ఆయుధంగా మారింది. ఇంతటి గొప్ప చరిత్ర కలిగిన ఈ చేనేత వస్త్రాన్ని కొందరు కళాకారులు తమ పనితనంతో సజీవంగా ఉంచుతున్నారు. వారిలో కేరళ రాష్ట్రం, కోజికోడ్ సర్వోదయ సంఘానికి చెందిన కమల షింజిత్, శ్యామల బాలకృష్ణన్ గురించి చెప్పుకోవాలి. ఈ రాష్ట్రంలో కుప్పడం నేయగలిగిన కొద్దిమందిలో నైపుణ్యం కలిగినవాళ్లలో వీరూ ఉన్నారు. అలానే, కన్నూర్ జిల్లా పయ్యన్నూర్... ఫిర్కా గ్రామోదయ ఖాదీ సంఘానికి చెందిన కె.వి.బిందు, ఎలిజబెత్ జార్జ్‌ల చేతి పనితనమూ ప్రత్యేకమే. ముఖ్యంగా ఈ కేంద్రం అడిచు నేతు విధానానికి ప్రసిద్ధి. గతంలో ప్రధాని మోదీ ధరించిన మనీలా షర్టింగ్ దుస్తులు ఇక్కడ తయారైనవేనట. ఈ క్రమంలోనే వీరి నైపుణ్యాన్నీ, కృషినీ గుర్తించిన కేంద్ర ప్రభుత్వం గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు ఈ కళాకారిణులను ఆహ్వానించింది. దీంతో వీరంతా తమ చేనేత యూనిట్‌ల పనితనాన్నీ, ఖాదీ గొప్పతనాన్నీ చూపాలనుకున్నారు. ఇందుకోసం కమల, శ్యామల ఖాదీ చీరల్నీ, బిందు, ఎలిజబెత్‌లు చుడీదార్లను ధరించి హాజరయ్యారు. అంతేనా, కమల త్రివర్ణంలో ఉన్న చీరను తన వెంట తీసుకెళ్లారు. ఈ ప్రయత్నం 'దేశ గౌరవాన్ని చాటి చెప్పడానికీ, మా కళ మరింత మందికి తెలియడానికీ' అని అంటారామె.




మహిళ లేకుండా అభివృద్ధి లేదు..!

ఈసారి బిహార్ గణతంత్ర వేడుకల్లో మహిళా సాధికారత ప్రతిబింబించేలా శకటాలను రూపొందించింది. అభివృద్ధి, కొనసాగుతున్న పథకాలు, వాటిలో మహిళల పాత్రను వివరించింది. పరేడ్‌లో రాష్ట్ర సంస్కృతికీ, ఆర్థిక పురోగతికీ స్త్రీలు చేసిన కృషిని ఇతివృత్తాలతో తెలియచెప్పేలా ఈ 12 శకటాలను రూపొందించింది. పర్యావరణం, పునరుత్పాదక శక్తి, విద్య, న్యాయ, సాంస్కృతిక రంగాల్లో రాష్ట్ర మహిళల ప్రాధాన్యతను మరింత పెంచాలని అంటోంది. ఇందుకు స్టీరింగ్ పట్టుకున్న మహిళ, కర్జా సౌర విద్యుత్, వ్యవసాయం, గ్రామీణ శ్రేయస్సు, సీతాదేవి జన్మ స్థలమైన పునౌరాధామ్‌లను 'అభివృద్ధి చెందిన బిహార్' పేరుతో ప్రదర్శించింది ఇక్కడి ప్రభుత్వం. 'అభివృద్ధి అంటే రోడ్లు, భవనాలు పెరగడమే కాదు. స్త్రీలకు అన్ని రంగాల్లో అవకాశాలు పెరగాలి, స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే సేచ్ఛ ఇవ్వాలని ప్రపంచానికి చాటిచెప్పింది.



ఆ విల్లు ఇప్పుడు చెల్లుతుందా?

డియర్ వసుంధర



జి. వరలక్ష్మి
న్యాయవాది

మా నానమ్మ పొలాన్ని తన తదనంతరం నాకూ అన్నయ్యకీ చెందేలా రాసిచ్చింది. అయితే, దాన్ని రిజిస్టర్ చేయలేదు. ఏడాది క్రితం అన్నయ్య ప్రేమ విఫలమై ఆత్మహత్య చేసుకుని చనిపోయాడు. తనపై బెంగతో నానమ్మా మరణించింది. ఇప్పుడు ఆ ఆస్తి నా పేరు మీదకి వస్తుందా? ఇందుకు నేనేం చేయాలి? – ఓ సోదరి

తప్పక వస్తుంది. వీలునామాకి రిజిస్ట్రేషన్ లేకపోయినా చెల్లుతుంది. ఎటొచ్చి దానిమీద సాక్షి సంతకాలు ఉన్నాయో లేదో చూసుకోండి. వీలునామా చూపించి మీ పేరు మీదకు భూమిని మార్చమంటే రెవెన్యూ అధికారులు ఒప్పుకోరు. రిజిస్టర్ విల్లు కాదు కాబట్టి... దానికోసం మీరు సంబంధిత కోర్టులో డిక్లరేషన్ ఆఫ్ టైటిల్ కోసం దావా వేయాల్సి ఉంటుంది. మీ వారసత్వానికి ఎవరైనా అడ్డు చెప్పేవాళ్లు ఉంటే వారిని ప్రతివాదులుగా చేర్చాలి. ప్రతివాదులు ఎవరూ అడ్డుపడక పోతే తొందరగా తేలుతుంది. సంబంధిత రెవెన్యూ అధికారిని కూడా ప్రతివాదిగా చేర్చాలి. కోర్టు కాగితాలు, సాక్ష్యాలు పరిశీలించి తీర్పు ఇస్తుంది. ఆలస్యం చేయకండి. ఓ మంచి లాయర్‌ని సంప్రదించి అడుగులు వేయండి.

బంగారం - వెండి




26న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,63,150	1,49,550	3,75,000
విజయవాడ	-----	-----	-----
ప్రొద్దుటూరు	1,65,500	1,52,260	3,56,000
రాజమహేంద్రవరం	1,61,950	1,46,450	3,75,000
విశాఖపట్నం	1,62,700	1,49,150	3,23,000
తమిళనాడు	-----	1,50,250	3,75,000

శకటాల మీద ఆమె స్ఫూర్తి!

గణతంత్ర వేడుకల్లో ఎక్కువమందిని ఆకర్షించేది వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన శకటాలే! ఈసారి మహిళా ముఖంతో అలరించినవి చాలానే. కొన్ని మాత్రం వాళ్ల స్ఫూర్తినీ మోసుకొచ్చాయిలా...

మణిపుర్ తమ రాష్ట్ర వ్యవసాయ ప్రయాణాన్ని ప్రదర్శించింది. తమ ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లకు చేరుతున్న వైనాన్ని శకట రూపంలో చూపింది. వీళ్ల హాథీ చిల్లీ, చక్ హావో బ్లాక్ రైస్, థామెంగలోంగ్ నారింజ వంటి జీఐ ట్యాగ్ పొందిన పంటలకు దానిపై చోటిచ్చారు. స్థానిక రైతులు అంతర్జాతీయ వినియోగదారులను ఆకర్షిస్తున్నారు. వాళ్లలో మహిళా రైతుల పాత్రా ఎక్కువే. అందుకే స్త్రీ సాధికారతకు గుర్తుగా సంప్రదాయ వస్త్రాల్లో పంటను చేతిలో పట్టుకున్న మహిళ ప్రాధాన్యంగానే శకటాన్ని తీసుకొచ్చారు.





ఇండోర్ రాణి అహల్యాబాయి హోల్కర్‌ది 300వ జయంతి. దైవ భక్తి, దేశ సంస్కృతిని కాపాడటంలోనే కాదు... బలమైన నాయికగానూ ఆమెది ప్రధాన పాత్రే. కాబట్టే శివలింగం పట్టుకున్న ఆమె విగ్రహంతోనే శకటాన్ని తీసుకొచ్చింది మధ్యప్రదేశ్. ఆమె కట్టించిన దేవాలయాలు, కోటలే కాదు... మహేశ్వరం చీరలను నేస్తున్న మహిళల మ్యూరల్స్‌కి దానిమీద చోటిచ్చారు. సంస్కృతి, మన పూర్వికుల నేతతోపాటు స్త్రీ సాధికారతకు ఆమె ఇచ్చిన ప్రాధాన్యాన్నీ ఈ సందర్భంగా చెప్పారు. అలాగే దేశంలో మాతృశక్తి ప్రాధాన్యమెంతో ఆమె రూపంలో చూపించారు.

'సాయిల్ టు సిలికాన్' థీమ్‌తో వచ్చింది ఒడిశా శకటం. వ్యవసాయం నుంచి సాంకేతికత వైపు తమ రాష్ట్రం దూసుకెళ్తున్న వైనాన్ని వివరించింది. వ్యవసాయ జీవనం, సంప్రదాయ కళలు, వాటిల్లో మహిళా భాగస్వామ్యాన్ని చెబుతూనే సెమీ కండక్టర్ల తయారీ వంటి కొత్త రంగాల్లో దూసుకెళ్తున్న వైనాన్నీ చూపించింది. దాని ముందు భాగంలో చోటిచ్చిందీ మహిళకే! రాష్ట్ర పురోగతిలో, ఆర్థికాభివృద్ధిలో స్త్రీ పాత్ర... ఆమెకిస్తున్న ప్రాధాన్యాలకు గుర్తుగా ఆమె విగ్రహానికి చోటిచ్చారు. స్త్రీ సాధికారత, సమాన అవకాశాలకు చిహ్నంగానూ ఈ శకటాన్ని చెబుతున్నారు.



సూపర్ ఫుడ్‌గా పిలిచే వాటిల్లో ఫూల్ మఖానా తప్పక ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా దీనికి ఆదరణ ఎక్కువే. అలాంటి ఫూల్ మఖానా ఈసారి గణతంత్ర వేడుకల్లో సందడి చేసింది. బిహార్ ఆక్వా- ఆగ్రో ఉత్పత్తిగా మఖానా పేరు పొందింది. అక్కడ పెద్ద మొత్తంలో ఉత్పత్తి అవుతోంది కూడా. ప్రపంచానికి ఎగుమతి అవుతోంది. జీఐ ట్యాగ్‌నీ పొందింది. బిహార్‌లోని మిథిలాంచల్ ప్రాంతంలోనే 90 శాతం మఖానా ఉత్పత్తి అవుతోంది. దీని వెనక మహిళల కష్టమే ఎక్కువ. అందుకే దీన్ని సంప్రదాయ నైపుణ్యం, మహిళా సాధికారత, గ్లోబల్ ఆంత్రప్రెన్యూర్‌షిప్‌కీ ముఖ్యంగా బిహార్ రాష్ట్ర సంస్కృతికీ, ఆర్థిక పురోగతికీ చిహ్నంగానూ చెబుతారు. కేంద్ర ప్రభుత్వం అక్కడ నేషనల్ మఖానా బోర్డునీ ఏర్పాటుచేసి... గ్లోబల్ బ్రాండింగ్‌నీ చేపడుతోంది. ఇంత ప్రాధాన్యం ఉంది కాబట్టే, తమ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తూ ఫూల్ మఖానానే గణతంత్ర వేడుకల కోసం ఎంచుకుంది బిహార్ ప్రభుత్వం. భారత్ పర్వ్ ఎగ్జిబిషన్‌లో దీన్ని 'మఖానా: లోకల్ సే గ్లోబల్ కీ తాలీ మే సూపర్ ఫుడ్' అంటూ ప్రత్యేకంగా శకటం మీద ప్రదర్శించింది. విత్తనాలు నాటడం దగ్గర్నుంచి నీటిలో మొక్కల పెంపకం, విత్తనాల సేకరణ, ఎండబెట్టడం, స్నాక్‌గా తయారుచేయడం, ప్యాకేజింగ్ వరకు అన్ని దశలకూ దానిమీద చోటిచ్చారు.



ఈ తప్పులు చేయకండి...

చర్మ సంరక్షణ పేరుతో తెలియకుండా చేసే కొన్ని పొరపాట్లు... హాని చేస్తాయి. అవేంటో చూద్దామా?

- శుభ్రత పేరుతో తరచూ సబ్బులు వాడితే ముఖం పొడిబారుతుంది. అలానే సబ్బుని నేరుగా ముఖం మీద రుద్దకూడదు. ముందు చేతులపై రుద్ది ఆ నురుగునే ముఖానికి రాయాలి. అది కూడా సున్నితంగా మర్దనా చేసుకుంటే మురికి వదులుతుంది. బదులుగా గాఢత తక్కువగా ఉండే ఫేస్‌వాష్‌లను వినియోగించొచ్చు.
- సహజ పదార్థాలనే కదా చర్మసంరక్షణకు వాడుతున్నామని ఏదీ అతిగా ఉపయోగించొద్దు. వెల్లుల్లి, బేకింగ్ సోడా, బొగ్గు... లాంటి వాటిని మొటిమలు తగ్గడానికి అనో మచ్చలు మానడానికి అనో రాస్తే అవి చర్మ సంబంధిత సమస్యలకు కారణం అవుతాయి. ముఖ్యంగా యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో చెప్పే సలహాలను గుడ్డిగా అనుసరించకండి.



- ముఖానికి ప్యాక్ వేసుకోవాలన్నా, ఫేషియల్ చేయించుకోవాలన్నా... ముందు క్లెన్సింగ్ చేయడం తప్పనిసరి. అలా కాకుండా నేరుగా ముఖంపై వేస్తే మొటిమలు వస్తాయి. అలానే పూర్తయ్యాక వెంటనే సబ్బుతో ముఖం కడుక్కోకూడదు. అది చర్మాన్ని పొడిబారేలా చేస్తుంది. దాని ఫలితమూ దెబ్బతింటుంది.
- కొంతమంది చర్మం ఆరోగ్యంగా ఉండాలని మృతకణాలు తొలగించేందుకు రోజూ స్క్రబ్‌ని వాడుతుంటారు. అతిగా చేస్తే ఈ పని వల్ల లాభం జరగకపోగా స్కిన్ అలర్జీ వచ్చే ప్రమాదముంది. వారానికి ఒకటి రెండు సార్ల కన్నా ఎక్కువ స్క్రబ్బింగ్ చేయాల్సిన అవసరం లేదు.

ఛాంపియన్

గత నెల దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌లో సంజు శాంసన్‌ను పక్కన పెట్టి శుభ్‌మన్ గిల్‌ను ఓపెనర్‌గా ఆడిస్తుంటే.. సామాజిక మాధ్యమాల్లో ఇదేం న్యాయం అన్న ప్రశ్నలు తలెత్తాయి. సంజునే తుది జట్టులో ఉండాల్సిందనే అభిప్రాయాలు వినిపించాయి. సిరీస్ చివర్లో సంజుకు అవకాశం దక్కింది. టీ20 ప్రపంచకప్ జట్టులో గిల్ మీద వేటు వేసి సంజుకే ఓపెనర్‌గా ఛాన్స్ ఇచ్చారు. కానీ ఇప్పుడు సంజు ఆట చూస్తుంటే అతను తుది జట్టులో చోటుకు అర్హుడేనా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కివీస్‌తో మిగతా రెండు టీ20ల్లో సత్తా చాటుకోకపోతే ప్రపంచకప్‌లో శాంసన్‌ను ఓపెనర్‌గా చూడడం కష్టమే.

సమయం లేదు శాంసన్!



సంజు శాంసన్

ఈనాడు క్రీడావిభాగం

మిగతా దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే క్రికెట్ సంస్కృతి కొంచెం తక్కువగా ఉండే కేరళ నుంచి వచ్చిన సంజు శాంసన్.. తన ప్రతిభతో టీనేజీలోనే జాతీయ స్థాయిలో మంచి గుర్తింపే సంపాదించాడు. ఐపీఎల్‌లో మెరుపులు మెరిపించడం ద్వారా పదేళ్ల కిందటే, 20 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. కానీ దశాబ్దం తర్వాత చూస్తే.. ఇప్పటికీ జట్టులో తన స్థానం సుస్థిరం కాలేదు. కొన్నేళ్లుగా అతను టీ20 జట్టులో రెగ్యులర్ ఆటగాడిగానే ఉన్నప్పటికీ.. తుది జట్టులో మాత్రం స్థానం పదిలం చేసుకోలేకపోయాడు. అందుక్కారణం నిలకడ లేమే. 55 టీ20ల్లో అతను 24.57 సగటే నమోదు చేయగలిగాడు. 2024లో కేవలం అయిదు మ్యాచ్‌ల వ్యవధిలో అతను మూడు శతకాలు బాదడం విశేషం. అందులో రెండు దక్షిణాఫ్రికాలో సాధించాడు. అయితే ఈ మూడు శతకాలను మినహాయిస్తే.. టీ20ల్లో సంజు గణాంకాలు పేలవం. చివరగా శతకం సాధించాక.. 18 టీ20ల్లో శాంసన్ ఒక్క అర్ధశతకమే సాధించాడు. ఈ కాలంలో తన సగటు 17 మాత్రమే. శుభ్‌మన్ గిల్ ఓపెనర్‌గా అవకాశం దక్కించుకోవడం వల్ల గత నెల దక్షిణాఫ్రికాతో అయిదు టీ20ల సిరీస్‌లో ఒక్క మ్యాచే ఆడగలిగాడు. కానీ గిల్ వైఫల్యం నేపథ్యంలో అతడిపై వేటు వేసి న్యూజిలాండ్‌తో సిరీస్‌కే కాక టీ20 ప్రపంచకప్‌నకు కూడా సంజునే ఓపెనర్‌గా ఎంపిక చేశారు సెలక్టర్లు. కానీ కివీస్‌తో తొలి మూడు టీ20ల్లో శాంసన్ వరుసగా 10, 6, 0 పరుగులే చేయగలిగాడు. మూడో టీ20లో హెన్రీ బౌలింగ్‌లో పేలవ రీతిలో బౌల్డయ్యాక సంజు మీద తీవ్ర విమర్శలు తప్పలేదు. అతడి టెక్నిక్ మీద అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మంచి వేగం ఉన్న పేసర్లను ఎదుర్కోవడంలో అతను తడబడుతున్నాడు. ఫామ్‌తో తంటాలు పడుతున్నపుడు క్రీజులో నిలదొక్కుకోవడం మీద దృష్టిపెట్టకుండా అతను నేరుగా షాట్లకు ప్రయత్నించి ఔటవుతున్నాడు. అవతల అభిషేక్ శర్మ రూపంలో దూకుడైన ఓపెనర్ ఉన్న నేపథ్యంలో సంజుకు కుదురుకోవడానికి కొంత సమయం తీసుకున్నా ఇబ్బంది లేదు. కానీ అతనా దిశగా ఆలోచించట్లేదు. ఐపీఎల్ మొదలుకుని అంతర్జాతీయ క్రికెట్ వరకు శాంసన్‌కు ఉన్న అతి పెద్ద సమస్య నిలకడ లేమి. వరుసగా రెండు మూడు మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడి అంచనాలు పెంచడం.. ఆ తర్వాత వరుసగా విఫలమవడం.. ఇదీ వరస. అందువల్లే దేశవాళీల్లోనే కాక అంతర్జాతీయ క్రికెట్లోనూ తన గణాంకాలు అంత గొప్పగా ఉండవు. ప్రతిభకు లోటు లేకపోయినా.. దానికి న్యాయం చేసే నిలకడ లేకపోవడంతో అతను ఇప్పటికీ జట్టులో స్థానం కోసం పోరాడాల్సిన స్థితిలో ఉన్నాడు.

పొంచి ఉన్న ఇషాన్ ముప్పు: కివీస్‌తో సిరీస్ ఆరంభానికి ముందు పరిస్థితి చూస్తే.. ప్రపంచకప్‌లో సంజునే ఓపెనర్ అన్నట్లు కనిపించింది. కానీ ముస్తాక్ అలీ ట్రోఫీలో సత్తా చాటి అనుకోకుండా టీ20 జట్టులోకి వచ్చిన ఇషాన్ కిషన్.. ఇప్పుడు సంజు స్థానానికి ఎసరు పెట్టేలా కనిపిస్తున్నాడు. తిలక్ వర్మ శస్త్రచికిత్స వల్ల కివీస్‌తో సిరీస్‌కు దూరం కావడంతో ఇషాన్‌కు తుది జట్టులో అవకాశం దక్కింది. దీన్ని అతను బాగానే ఉపయోగించుకుంటున్నాడు. రెండో టీ20లో మెరుపు ఇన్నింగ్స్ (32 బంతుల్లో 76)తో 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. మూడో టీ20లోనూ అతను ఉన్నంతసేపు చెలరేగాడు. ప్రపంచకప్‌నకు తిలక్ వర్మ అందుబాటులోకి రానున్నాడు. మిడిలార్డర్లో కీలక బ్యాటర్‌గా ఎదిగిన అతడికి తుది జట్టులో చోటు ఖాయం. తన కోసం తుది జట్టులో ఎవరు స్థానాన్ని ఖాళీ చేస్తారన్నది ప్రశ్న. సంజు, ఇషాన్ ఇద్దరూ వికెట్ కీపర్ బ్యాటర్లే కాబట్టి ఒకరిపై వేటు తప్పదు. ప్రస్తుత ఫామ్ ప్రకారం ఇషానే తుది జట్టులో స్థానానికి అర్హుడు. అతను ఓపెనింగ్ కూడా చేయగలడు కాబట్టి ఇబ్బంది లేదు. కాకపోతే అభిషేక్ కూడా ఎడమ చేతి వాటం బ్యాటర్ కావడంతో ఇషాన్‌ను పక్కన పెట్టాలని జట్టు యాజమాన్యం భావించవచ్చు. కానీ చివరి రెండు టీ20ల్లో శాంసన్ ఆటతీరు మారకపోతే మాత్రం ఇషానే తుది జట్టులో ఉంటాడేమో!

"సంజు సాంకేతికంగానే కాక మానసికంగానూ కొన్ని సమస్యలు ఎదుర్కొంటున్నాడు. కొందరు బౌలర్ల వేగం అతణ్ని తడబాటుకు గురి చేస్తోంది. 130 కిలోమీటర్ల వేగంతో బంతులేస్తే అతను బాగా ఎదుర్కొంటాడు. వేగం అంతకంటే మించినా, తగ్గినా, బంతుల్లో వైవిధ్యం చూపించినా ఇబ్బంది పడుతున్నాడు. బంతి వేగానికి తగ్గట్లుగా అతడి బ్యాట్ వేగాన్ని సర్దుబాటు చేసుకోవాలి. పరిమిత ఓవర్ల క్రికెట్లో వికెట్ కీపర్ బ్యాటర్ స్థానానికి విపరీతమైన పోటీ ఉండడం వల్ల నంజు ఒత్తిడి ఎదుర్కొంటున్నట్లు కనిపిస్తోంది. కానీ శాంసన్ ప్రతిభావంతుడు. భారత జట్టుకు విజయాలు అందించే సామర్థ్యం అతడికి ఉంది"

- డబ్ల్యూవీ రామన్, టీమ్‌ఇండియా మాజీ ఆటగాడు


ఇషాన్ కిషన్

తిలక్ చివరి రెండు టీ20లకూ..


తిలక్ వర్మ

దిల్లీ: టీమ్‌ఇండియా బ్యాటర్ తిలక్ వర్మ న్యూజిలాండ్‌తో చివరి రెండు టీ20 మ్యాచ్‌లకు కూడా దూరమయ్యాడు. ఇంకా అతడు పూర్తి ఫిట్‌నెస్ సాధించలేదు. ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న తిలక్ కోలుకుంటున్నాడు. ప్రస్తుతం అతడు బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో ఉన్నాడు. చివరి రెండు మ్యాచ్‌లకు తిలక్ అందుబాటులో ఉంటాడని మొదట భావించారు. కానీ అతడు పూర్తిగా కోలుకోలేదు. దీంతో అతడి స్థానంలో జట్టులోకి వచ్చిన శ్రేయస్ అయ్యర్‌ను ఆఖరి రెండు మ్యాచ్‌లకూ కొనసాగించాలని సెలక్షన్ కమిటీ నిర్ణయించింది. పూర్తి ఫిట్‌నెస్ సాధించడానికి తిలక్‌కు మరింత సమయం అవసరమని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా చెప్పాడు. టీ20 ప్రపంచకప్ సన్నాహక మ్యాచ్ నేపథ్యంలో తిలక్.. ఫిబ్రవరి 3న భారత జట్టుతో కలుస్తాడన్నాడు.

నేడు జింబాబ్వేతో భారత్ ఢీ

మధ్యాహ్నం 1 నుంచి

అండర్-19 ప్రపంచకప్

బులవాయో: అండర్-19 ప్రపంచకప్‌లో జోరు మీదున్న భారత యువ జట్టు మరో పోరుకు సిద్ధమైంది. సూపర్ సిక్సెస్ (గ్రూప్-2)లో తన తొలి మ్యాచ్‌లో మంగళవారం జింబాబ్వేతో తలపడనుంది. ఆయుష్ మాత్రే నేతృత్వంలోని భారత్.. గ్రూప్ దశలో అమెరికా, బంగ్లాదేశ్, న్యూజిలాండ్‌లపై విజయం సాధించింది. బ్యాటర్లు అభిజ్ఞాన్ కుండు, వైభవ్ సూర్యవంశీల ఫామ్ జట్టుకు సానుకూలాంశం. జింబాబ్వే నుంచి భారత్‌కు పెద్దగా పోటీ ఎదురుకాకపోవచ్చు.

న్యూజిలాండ్‌తో మ్యాచ్ కోసం సోమవారం విశాఖ చేరుకున్న కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్. బుధవారం నాలుగో టీ20 జరగనుంది.



నాట్ కొట్టుడు


నాట్ సీవర్ 100*

- డబ్ల్యూపీఎల్‌లో తొలి సెంచరీ నమోదు
- ఆర్సీబీకి మరో ఓటమి

వడోదర: మహిళల ప్రిమియర్ లీగ్‌లో దూసుకుపోతున్న ఇంగ్లిష్ ఆల్‌రౌండర్ నాట్ సీవర్.. లీగ్ చరిత్రలో సెంచరీ చేసిన తొలి బ్యాటర్‌గా నిలిచింది. సోమవారం నాట్ సీవర్ (100 నాటౌట్; 57 బంతుల్లో 16×4, 1×6) అజేయ సెంచరీ సాధించడంతో ముంబయి 15 పరుగుల తేడాతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుపై విజయం సాధించింది. మొదట నాట్ సీవర్‌తో పాటు హేలీ మాథ్యూస్ (56; 39 బంతుల్లో 9×4) చెలరేగడంతో ముంబయి 4 వికెట్లకు 199 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఆర్సీబీ బౌలర్లలో లారెన్ బెల్ (2/21) మినహా అందరూ తేలిపోయారు. అనంతరం బెంగళూరు 9 వికెట్లకు 184 పరుగులు చేసింది. హేలీ మాథ్యూస్ (3/10), షబ్నిమ్ ఇస్మాయిల్ (2/25)ల ధాటికి చాలా ముందే ఆర్సీబీ పరాజయం ఖాయమైపోగా.. రిచా ఘోష్ (90; 50 బంతుల్లో 10×4, 6×6) అద్భుతంగా పోరాడినప్పటికీ ఫలితాన్ని మార్చలేకపోయింది. 7 మ్యాచ్‌ల్లో ముంబయికిది మూడో గెలుపు కాగా.. 5 విజయాలతో ముందే ప్లేఆఫ్స్ బెర్తును ఖరారు చేసుకున్న బెంగళూరు వరుసగా రెండో ఓటమిని ఖాతాలో వేసుకుంది.

టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన ముంబయి, ఆరంభంలోనే సజన (7) వికెట్‌ను కోల్పోయినప్పటికీ.. హేలీ, నాట్‌సీవర్ పోటీ పడి బౌండరీలు బాదడంతో స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. కొత్త బంతి బౌలర్ బెల్ తప్పితే.. మిగతా ఆర్సీబీ బౌలర్లందరినీ ఈ జోడీ ఉతికి ఆరేసింది. ఇటు వికెట్లు పడక, అటు పరుగులు ఆగక బెంగళూరు దిక్కుతోచని స్థితిలో పడింది. తొలి వికెట్ తీసిన లారెనే.. 15వ ఓవర్లో హేలీని బౌల్డ్ చేయడంతో రెండో వికెట్ భాగస్వామ్యానికి 131 పరుగుల వద్ద తెర పడింది. తర్వాత హర్మన్‌ప్రీత్ (20)తో కలిసి ఇన్నింగ్స్‌కు మెరుపు ముగింపునిచ్చింది నాట్‌సీవర్. చివరి ఓవర్లో నాలుగో బంతికి ఆమె శతకం పూర్తయింది. అనంతరం ఆర్సీబీ ఛేదన పేలవంగా మొదలైంది. హేలీ, షబ్నిమ్ పోటీ పడి వికెట్లు తీయడంతో ఆ జట్టు 77 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి ఘోర పరాభవం దిశగా సాగింది. అయితే వందైనా చేస్తుందా అనుకున్న ఆర్సీబీ.. రిచా మెరుపులతో ఊహించని స్కోరు సాధించింది.

ముంబయి ఇండియన్స్ ఇన్నింగ్స్: హేలీ మాథ్యూస్ (బి) బెల్ 56; సజన ఎల్బీ (బి) బెల్ 7; నాట్ సీవర్ నాటౌట్ 100; హర్మన్‌ప్రీత్ (సి) వోల్ (బి) నడైన్ 20; అమన్‌జ్యోత్ (బి) శ్రేయాంక 4; అమేలియా నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 11 **మొత్తం:** (20 ఓవర్లలో 4 వికెట్లకు) **199; వికెట్ల పతనం:** 1-16, 2-147, 3-189, 4-198; **బౌలింగ్:** లారెన్ బెల్ 4-0-21-2; సయాలి సత్ఘరే 4-0-42-0; అరుంధతి రెడ్డి 3-0-36-0; నడైన్ డిక్లెర్క్ 4-0-40-1; శ్రేయాంక పాటిల్ 3-0-34-1; రాధ 2-0-24-0

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: గ్రేస్ హారిస్ (సి) రహీల (బి) షబ్నిమ్ 15; స్మృతి మంధాన (సి) పూనమ్ (బి) హేలీ 6; వోల్ (సి) రహీల (బి) హేలీ 9; గౌతమి నాయక్ (బి) షబ్నిమ్ 1; రాధ యాదవ్ (సి) షబ్నిమ్ (బి) హేలీ 0; రిచా ఘోష్ (సి) సంస్కృతి (బి) అమేలియా 90; నడైన్ డిక్లెర్క్ (సి) నాట్‌సీవర్ (బి) అమేలియా 28; అరుంధతి (సి) అండ్ (బి) అమన్‌జ్యోత్ 14; సయాలి రనౌట్ 0; శ్రేయాంక నాటౌట్ 12; ఎక్స్‌ట్రాలు 9 **మొత్తం:** (20 ఓవర్లలో 9 వికెట్లకు) **184; వికెట్ల పతనం:** 1-20, 2-26, 3-31, 4-31, 5-35, 6-77, 7-129, 8-129, 9-184; **బౌలింగ్:** షబ్నిమ్ ఇస్మాయిల్ 4-0-25-2; నాట్ సీవర్ 4-0-43-0; హేలీ మాథ్యూస్ 2-0-10-3; అమన్‌జ్యోత్ 4-0-51-1; వైష్ణవి శర్మ 2-0-15-0; అమేలియా కెర్ 4-0-37-2

డబ్ల్యూపీఎల్‌లో ఈనాడు
దిల్లీ × గుజరాత్
వేదిక: వడోదర, రా॥ 7.30

అసలు విందు ముందుంది


సునీల్ గావస్కర్

దిల్లీ: రాబోయే టీ20 ప్రపంచకప్ కోసం భారత జట్టు సన్నద్ధత చాలా బాగుందని దిగ్గజ బ్యాటర్ సునీల్ గావస్కర్ అన్నాడు. న్యూజిలాండ్‌తో అయిదు టీ20ల సమరంలో హ్యాట్రిక్ విజయాలతో రెండు మ్యాచ్‌లు ఉండగానే సిరీస్‌ను టీమ్‌ఇండియా చేజిక్కించుకున్న నేపథ్యంలో సన్నీ స్పందించాడు. "ఈ సిరీస్ కేవలం సూప్ లాంటిది. అసలు విందు ఫిబ్రవరి 7న మొదలవుతుంది. న్యూజిలాండ్‌తో సిరీస్ గెలిచారు. ఇక టీ20 ప్రపంచకప్‌ను నిలబెట్టుకునే పని చూడాలి. భారత ఆటగాళ్ల సన్నద్ధత బాగుంది. కొందరు బ్యాటర్లకు పెద్దగా ఆడే అవకాశం కూడా రాలేదు. వాళ్లందరూ లయ, హిట్టింగ్ మీద దృష్టిసారించారు. జట్టు ప్రపంచకప్‌ను ఎంతమాత్రం తేలిగ్గా తీసుకోవట్లేదు. పూర్తి ఆత్మవిశ్వాసంతో సాగుతోంది. బ్యాటింగ్ ఆర్డర్లో కింది వరుసలో హార్దిక్ పాండ్య, రింకు సింగ్ లాంటి ఆటగాళ్లున్నారు. గత రెండు మ్యాచ్‌ల్లో వారికి బ్యాటింగ్ చేసే అవకాశమే రాలేదంటే, సులువుగా గెలిచేశారంటే జట్టు బ్యాటింగ్ లోతు, సామర్థ్యం ఎలాంటివో అర్థం చేసుకోవచ్చు" అని సన్నీ పేర్కొన్నాడు.

గుకేశ్ విజయం

విజ్క్ ఆన్ జీ (నెదర్లాండ్స్): టాటా స్టీల్ మాస్టర్స్ చెస్ టోర్నీలో రెండు వరుస పరాజయాల అనంతరం ప్రపంచ ఛాంపియన్ గుకేశ్ విజయం సాధించాడు. ఎనిమిదో రౌండ్లో వ్లాదిమిర్ ఫెడోసీవ్ (స్లొవేనియా)పై 41 ఎత్తుల్లో నెగ్గాడు. మరో భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేశి.. సహచర ఆటగాడు అరవింద్ చిదంబరంతో గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. అర్జున్ 3.5, గుకేశ్ 4 పాయింట్లతో ఉన్నారు. యాగిజ్ ఖాన్ (తుర్కియే)తో గేమ్‌లో ప్రజ్ఞానంద పాయింట్ పంచుకున్నాడు. అతడి ఖాతాలో 3 పాయింట్లున్నాయి. అనీష్ గిరి (నెదర్లాండ్స్) చేతిలో అబ్దుసతారోవ్ (ఉజ్బెకిస్థాన్) కంగుతిన్నాడు. అయినప్పటికీ అబ్దుసతారోవ్ 5.5 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

భారత యువ షట్లర్లకు సవాల్

బ్యాంకాక్: భారత యువ షట్లర్లకు సవాల్.. మంగళవారం థాయ్‌లాండ్ మాస్టర్స్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీ ఆరంభం కానుంది. పురుషుల సింగిల్స్ విభాగంలో ప్రియాంశు రజావత్, కిరణ్ జార్జ్, తరుణ్ మన్నెపల్లి బరిలో దిగుతున్నారు. ఈ యువ షట్లర్లు సత్తా చాటేందుకు ఇది మంచి అవకాశం. 2023 ఆర్లీన్స్ మాస్టర్స్ సూపర్ 300 టైటిల్ నెగ్గిన రజావత్.. తొలి పోరులో నాలుగో సీడ్ బ్రయాన్ యాంగ్ (కెనడా)తో తలపడనున్నాడు. 2023 జాతీయ క్రీడల్లో స్వర్ణం గెలిచిన తరుణ్.. వాంగ్‌చరొయెన్ (థాయ్‌లాండ్)ను ఎదుర్కోనున్నాడు.

ఎలీట్ గ్రూప్‌లోకి బిహార్

పట్నా: బిహార్ తిరిగి రంజీ ఎలీట్ గ్రూప్‌లో స్థానం దక్కించుకుంది. సోమవారం ప్లేట్ గ్రూప్ ఫైనల్లో 568 పరుగుల తేడాతో మణిపుర్‌ను చిత్తు చేసింది. ఆఖరి రోజు ఓవర్‌నైట్ స్కోర్ 505/5తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆతిథ్య జట్టు 505/6 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. రఘువేంద్ర సింగ్ (ఓవర్‌నైట్ స్కోర్ 90) ఔట్ కావడంతో ఇన్నింగ్స్‌ను ముగించింది. తొలి ఇన్నింగ్స్‌లో 258 పరుగుల ఆధిక్యం సాధించిన బిహార్ ప్రత్యర్థికి 764 పరుగుల లక్ష్యం నిర్దేశించింది భారీ ఛేదనలో మణిపుర్ ఏ దశలోనూ లక్ష్యం దిశగా పయనించలేదు. 56.1 ఓవర్లలో 195 పరుగులకే ఆలౌటైంది. జోతిన్ (74) మినహా బ్యాటర్లు చేతులెత్తేశారు. తొలి ఇన్నింగ్స్‌లో బిహార్ 522 పరుగులు చేయగా.. మణిపుర్ 264 పరుగులకే ఆలౌటైంది.

ఛాంపియన్ ఇంటికి


పెగులా

- పెగులా చేతిలో కీస్ ఓటమి
- క్వార్టర్స్‌లో సినర్, స్వైటెక్, అనిసిమోవా


కీస్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్లో మహిళల సింగిల్స్ డిఫెండింగ్ ఛాంపియన్ మాడిసన్ కీస్ (అమెరికా) కథ ముగిసింది. సోమవారం ప్రిక్వార్టర్స్‌లో తొమ్మిదో సీడ్ కీస్ 3-6, 4-6తో ఆరో సీడ్ జెస్సికా పెగులా (అమెరికా) చేతిలో వరుస సెట్లలో ఓడింది. పెగులాతో ఆడిన గత మూడు మ్యాచ్‌ల్లో రెండు గెలిచిన కీస్.. ఈసారి మాత్రం ఆ జోరు చూపించలేకపోయింది. తొలి సెట్ నుంచే కీస్ తడబాటు మొదలైంది. 1-4తో వెనుకబడిన ఆమె.. సెట్ కోల్పోయింది. రెండో సెట్లోనూ కీస్ ఆట మారలేదు. దీంతో తొలి గేమ్‌లో ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసిన పెగులా 3-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. అదే దూకుడుతో సెట్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. 6 డబుల్‌ఫాల్ట్స్, 28 అనవసర తప్పిదాలు చేసిన కీస్.. ఓటమి కొనితెచ్చుకుంది. రెండో సీడ్ ఇగా స్వైటెక్ (పోలెండ్) క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లింది. ప్రిక్వార్టర్స్‌లో ఆమె 6-0, 6-3తో మాడిసన్ ఇంగ్లిస్ (ఆస్ట్రేలియా)ను చిత్తు చేసింది. తొలి గేమ్‌లో స్వైటెక్ దూకుడు ముందు మాడిసన్ ఏమాత్రం నిలవలేకపోయింది. ఆరు గేమ్‌లను తానే గెలుచుకున్న స్వైటెక్ తేలిగ్గా సెట్‌ను సొంతం చేసుకుంది. రెండో సెట్లో ఇంగ్లిస్ కాస్త మెరుగ్గానే ఆడినా.. స్వైటెక్ జోరు కొనసాగించింది. నాలుగో గేమ్‌లో ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసి 4-1తో ఆధిక్యంలో నిలిచింది. అదే దూకుడుతో సెట్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. నాలుగో సీడ్ అనిసిమోవా (అమెరికా), అయిదో సీడ్ రిబకినా (కజకిస్థాన్) కూడా క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించారు. అనిసిమోవా 7-6 (7-4), 6-4తో వాంగ్ (చైనా) పోరాటానికి తెరదించగా.. రిబకినా 6-1, 6-3తో మెర్టిన్స్ (బెల్జియం)పై గెలిచింది.


సినర్ ముందుకు: టైటిల్ ఫేవరెట్ యానిక్ సినర్ (ఇటలీ) క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లాడు. ప్రిక్వార్టర్స్‌లో ఈ డిఫెండింగ్ ఛాంపియన్ 6-1, 6-3, 7-6 (7-2)తో డర్దెరి (ఇటలీ)పై గెలిచాడు. ఆరంభం నుంచి సినర్ దూకుడుగా ఆడాడు. రెండో గేమ్‌లోనే ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసి ఆపై 3-0తో ఆధిక్యంలోకి వెళ్లిన సినర్.. తేలిగ్గా తొలి సెట్ గెలుచుకున్నాడు. రెండో సెట్లో డర్దెరి నుంచి కాస్త ప్రతిఘటన ఎదురైంది. కానీ ఎనిమిదో గేమ్‌లో బ్రేక్ సాధించిన సినర్.. ఆపై సెట్ గెలిచి ఆధిక్యాన్ని రెట్టింపు చేసుకున్నాడు. మూడో సెట్ హోరాహోరీగా సాగింది. టైబ్రేకర్‌లో పైచేయి సాధించిన సినర్.. మ్యాచ్‌ను గెలుచుకున్నాడు. మ్యాచ్‌లో సినర్ 19 ఏస్‌లు, 46 విన్నర్లు కొట్టాడు. మరో ప్రిక్వార్టర్స్‌లో అయిదో సీడ్ ముసెటి (ఇటలీ) 6-2, 7-5, 6-4తో తొమ్మిదో సీడ్ ఫ్రిట్జ్ (అమెరికా)ను ఓడించాడు. ఇంకో మ్యాచ్‌లో ఎనిమిదో సీడ్ షెల్టన్ (అమెరికా) 3-6, 6-4, 6-3, 6-4తో కాస్పర్ రూడ్ (నార్వే)పై నెగ్గాడు.

యుకి ఔట్: పురుషుల డబుల్స్‌లో భారత స్టార్ యుకి బాంబ్రి పోరాటం ముగిసింది. మూడో రౌండ్లో యుకి-గొరాన్‌సన్ (స్వీడన్) జంట 6-7 (7-9), 3-6తో ఆర్నాల్డో లూస్-మాటోస్ (బ్రెజిల్) జోడీ చేతిలో ఓడింది.

ఆ రోజు తేల్చేస్తాం: పీసీబీ

లాహోర్: టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్ పోటీపడడంపై అనిశ్చితి కొనసాగుతోంది. దీనిపై శుక్రవారం లేదా సోమవారం తుది నిర్ణయం తీసుకుంటామని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) చెప్పింది. బంగ్లాదేశ్‌కు మద్దతుగా తాము కూడా ప్రపంచకప్ నుంచి తప్పుకొంటామని పాకిస్థాన్ బెదిరిస్తున్న సంగతి తెలిసిందే. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిచ్చే టోర్నీ ఫిబ్రవరి 7న ఆరంభం కానుంది. ప్రపంచకప్ కోసం పాకిస్థాన్ ఆదివారం 15 మంది సభ్యుల జట్టును ప్రకటించింది. ఒకవేళ టోర్నీలో ఆడితే భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు పీసీబీ వర్గాలు చెప్పాయి. షెడ్యూలు ప్రకారం భారత్, పాకిస్థాన్ జట్లు ఫిబ్రవరి 15న తలపడాల్సివుంది.

బీసీసీఐ మాజీ అధ్యక్షుడు బింద్రా కన్నుమూత



దిల్లీ: బీసీసీఐ మాజీ అధ్యక్షుడు ఇందర్‌జిత్ సింగ్ బింద్రా ఆదివారం కన్నుమూశారు. ఆయన వయసు 84 ఏళ్లు. బింద్రా 1993 నుంచి 1996 వరకు బీసీసీఐ అధ్యక్షుడిగా పనిచేశారు. 1978 నుంచి 2014 వరకు పంజాబ్ క్రికెట్ సంఘం (పీసీఏ) అధ్యక్షుడిగా వ్యవహరించారు. బింద్రా, మరో బీసీసీఐ మాజీ అధ్యక్షుడు జగ్మోహన్ దాల్మియా.. 1987 ప్రపంచకప్ ఆతిథ్య హక్కులు భారత్‌కు దక్కడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన మృతి పట్ల బీసీసీఐ సంతాపం వ్యక్తం చేసింది. 'బింద్రా దూరదృష్టిగల పాలకుడు. ఆయన నాయకత్వం ప్రపంచ క్రికెట్లో భారత్ పాత్రను పునర్నిర్వచించింది" అని బోర్డు అధ్యక్షుడు మిథున్ మన్హాస్ అన్నాడు.

బ్రాడ్‌మన్ టోపీకి రూ.4 కోట్ల 21 లక్షలు



గోల్డ్‌కోస్ట్: ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్ డొనాల్డ్ బ్రాడ్‌మన్ ఉపయోగించిన బ్యాగీ గ్రీన్ టోపీకి భారీ ధర పలికింది. 1947-48లో భారత క్రికెటర్ శ్రీరంగ వాసుదేవ్ సొహోనికి బ్రాడ్‌మన్ బహుమతిగా ఇచ్చిన టోపీని సోమవారం వేలం వేయగా.. రూ.4 కోట్ల 21 లక్షలకు అమ్ముడుపోయింది. శ్రీరంగ వాసుదేవ్ కుటుంబం ఈ టోపీని 75 ఏళ్ల నుంచి భద్రపరిచింది. ఈ టోపీ లోపల బ్రాడ్‌మన్, వాసుదేవ్ పేర్లు ఉన్నాయి. గతంలోనూ బ్రాడ్‌మన్ టోపీలను వేలం వేయగా భారీ ధర పలికాయి. 1947-48లో లాలా అమర్‌నాథ్ సారథ్యంలోని భారత జట్టు.. ఆస్ట్రేలియా పర్యటించింది. అయిదు టెస్టుల సిరీస్‌ను 4-0తో ఓడింది. ఒక మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలి ఆస్ట్రేలియా పర్యటన అదే.

విండీస్.. హోప్ సారథ్యంలో


సెయింట్ జాన్స్: టీ20 ప్రపంచకప్‌లో పాల్గొనే వెస్టిండీస్ జట్టుకు షై హోప్ సారథ్యం వహించనున్నాడు. ఫిబ్రవరి 7న ఆరంభమయ్యే ఈ మెగా టోర్నీలో పోటీపడే విండీస్ జట్టును సెలక్టర్లు సోమవారం ప్రకటించారు. మాజీ కెప్టెన్ జేసన్ హోల్డర్, రొమారియో షెపర్డ్, రోమన్ పావెల్ కూడా ఈ జట్టులో చోటు దక్కించుకున్నారు. ఇటీవల అఫ్గానిస్థాన్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో హోప్‌తో పాటు హోల్డర్, షెపర్డ్, పావెల్ ఆడలేదు. 2012, 2016 ప్రపంచకప్‌లలో విజేతగా నిలిచిన విండీస్.. ఈసారి టోర్నీలో ఇంగ్లాండ్, నేపాల్, స్కాట్లాండ్, ఇటలీతో గ్రూప్-సిలో ఉంది. టోర్నీ తొలి మ్యాచ్‌లో స్కాట్లాండ్‌తో కరీబియన్ జట్టు తలపడనుంది.

వెస్టిండీస్ జట్టు: షై హోప్ (కెప్టెన్), జాన్సన్ చార్లెస్ (వైస్ కెప్టెన్), రోస్టన్ చేజ్, మాథ్యూ ఫోర్డ్, హెట్‌మయర్, హోల్డర్, అకీల్ హొసీన్, షమర్ జోసెఫ్, బ్రెండన్ కింగ్, మోటీ, రోమన్ పావెల్, రూథర్‌ఫర్డ్, శాంప్సన్, జేడెన్ సీల్స్, రొమారియో షెపర్డ్.

అవయవ దాత ఆశయాన్ని బతికించేదెలా?

జీవన్‌దాన్ కింద అవయవాల సేకరణలో ఏపీ రికార్డు

- అవసరార్థులకు మార్పిడిలో వెనుకంజ
- రాష్ట్రంలో 9 ప్రభుత్వాసుపత్రుల్లోనే ఓటీసీలు



ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్రంలో జీవన్‌దాన్ కార్యక్రమం కింద జీవన్మృతుల నుంచి శరీర భాగాలు సేకరిస్తున్నప్పటికీ.. సరైన చికిత్సా కేంద్రాలు, నిపుణులు లేకపోవడంతో వాటిని వినియోగించుకోలేకపోతున్నారు. గతేడాది రికార్డు స్థాయిలో 301 మంది దాతల నుంచి అవయవాలు సేకరించారు. వాటిలో ఎక్కువ భాగం పొరుగు రాష్ట్రాలకు తరలించాల్సి వచ్చింది. ఏపీలో కేవలం తొమ్మిది ప్రభుత్వాసుపత్రుల్లోనే అవయవ మార్పిడి శస్త్రచికిత్సల కేంద్రాలు (ఓటీసీ) ఉన్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఈ చికిత్సకు భారీగా ఖర్చవుతుండటంతో అవసరార్థులు వెనుకంజ వేస్తున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో అరకొరగా..

రాష్ట్రంలో 63 కేంద్రాలు ఓటీసీలుగా నమోదయ్యాయి. వాటిలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 9 మాత్రమే అవయవ మార్పిడికి, మరో ఏడు అవయవాల సేకరణ (నాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆర్గాన్ హార్వెస్టింగ్ సెంటర్- ఎన్‌టీఓహెచ్‌సీ)గా నమోదు చేసుకున్నాయి. అవయవ మార్పిడి అనుమతి పొందిన మిగతా ఆసుపత్రులన్నీ ప్రైవేటువే. కనీసం 100 పడకలున్న ఆసుపత్రిని ఓటీసీగా మార్చే అవకాశముంది. ఓటీసీలుగా స్థాయి పొందేందుకు రాష్ట్రంలో 40 ప్రభుత్వాసుపత్రులకు అర్హత ఉంది. వీటిలో 10 జిల్లా, 24 ప్రాంతీయ, 6 సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు. అన్ని జిల్లాల్లోనూ అవయవాల సేకరణ, మార్పిడికి అవకాశాలున్నాయి. అయితే, ఈ చికిత్స కోసం వైద్యులు ప్రత్యేకంగా కోర్సులు చేయాల్సి ఉంది. అనుభవమూ తప్పనిసరి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆ కోర్సులు చేసిన నిపుణులకు కొరత ఉంది. చికిత్స సమయంలో ఇబ్బందులు రావొచ్చని, ఇన్‌ఫెక్షన్లు సోకవచ్చని, మరణం సంభవించవచ్చన్న భావనతో ప్రభుత్వాసుపత్రులు వెనుకంజ వేస్తున్నాయి.

దాతలు ముందుకొస్తున్నా..

అవయవదానంపై అపోహలు తొలగేలా జీవన్‌దాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అవగాహన శిబిరాలు మంచి ఫలితాలే ఇస్తున్నాయి. పుట్టెడు దుఃఖంలోనూ బాధిత కుటుంబ సభ్యులు అవయవదానానికి ముందుకొస్తున్నారు. కొన్నిసార్లు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జీవన్మృతులను సకాలంలో గుర్తించకపోవడం వల్ల వారి శరీరభాగాలు పనికి రాకుండా పోతున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుతం 4,300 మందికి పైగా వివిధ అవయవాల కోసం ఎదురుచూస్తున్నారు. స్థానికంగా ఈ శస్త్రచికిత్సలకు సరిపడా సదుపాయాలు సమకూరిస్తే వారికి మేలు చేకూరుతుంది. అవయవాల కోసం దరఖాస్తు విధానం, కేటాయింపుపై అవగాహన పెంచాల్సి ఉంది.

కిడ్నీ మార్పిళ్లే ఎక్కువ..

రాష్ట్రంలో జీవన్‌దాన్ కార్యక్రమాన్ని 2015లో ప్రారంభించగా, ఇప్పటివరకు 1,296 అవయవాలు సేకరించారు. పదేళ్లలో జీవన్మృతులైన 403 మంది నుంచి 703 కిడ్నీలు, 316 కాలేయాలు, 181 ఊపిరితిత్తులు, 91 గుండెలు సేకరించారు. వాటిలో కిడ్నీ మార్పిళ్లే ఎక్కువగా జరిగాయి. విశాఖ కేజీహెచ్‌లో 47, గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో 17, కర్నూలులో దాదాపు 10 వరకు సజీవ దాతల నుంచి కిడ్నీ మార్పిడి చేశారు. తిరుపతి పద్మావతి ఆసుపత్రిలో కొన్ని గుండె మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించారు. కాలేయం మార్పిడి చాలా తక్కువగా జరగ్గా.. ఊపిరితిత్తుల మార్పిడి ఊసేలేదు. వీటిలోనూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేసిన శస్త్రచికిత్సలు చాలా తక్కువ. జీవన్మృతుల నుంచి సేకరించిన గుండె, ఊపిరితిత్తులను పొరుగు రాష్ట్రాల అవసరాలకు కేటాయిస్తున్నారు.

- **రాష్ట్రంలో కిడ్నీ మార్పిడికి అనుమతులున్న ఓటీసీలు:** పలాసలోని కిడ్నీ పరిశోధన కేంద్రం- సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, విశాఖలోని కేజీహెచ్, మంగళగిరి ఎయిమ్స్, ఏలూరులోని అల్లూరి సీతారామరాజు అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఆశ్రమ్ ఆసుపత్రి), తిరుపతిలోని స్విమ్స్, గుంటూరు, విజయవాడ, కర్నూలు ప్రభుత్వాసుపత్రులు.
- **కాలేయ మార్పిడికి:** విశాఖలోని విమ్స్, తిరుపతిలోని స్విమ్స్, గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి
- **గుండెకు సంబంధించి:** గుంటూరు, కర్నూలు ప్రభుత్వాసుపత్రులు, తిరుపతిలోని స్విమ్స్, శ్రీపద్మావతి చిల్డ్రన్ హార్ట్ సెంటర్
- **ఊపిరితిత్తుల మార్పిడికి:** కర్నూలు ప్రభుత్వాసుపత్రి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి

- పిల్లల విద్యా రుసుములూ చెల్లించలేని పరిస్థితి
- పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన ఆర్.కృష్ణన్ భార్య ఆవేదన



సుశీల

చెన్నై(సైదాపేట), న్యూస్‌టుడే: పిల్లల విద్యా రుసుములు కూడా చెల్లించలేని పరిస్థితిలో ఉన్నానని పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన ఆర్.కృష్ణన్ భార్య సుశీల ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని తెలిపారు. తమిళనాడులోని నీలగిరి జిల్లా కోత్తగిరి కుంజప్పనై గ్రామంలో ఆలు కురుంబర్ గిరిజన సామాజికవర్గానికి చెందిన చిత్రకారుడు, దివంగత ఆర్.కృష్ణన్‌కు ప్రభుత్వం తాజాగా పద్మశ్రీ అవార్డు ప్రకటించింది. ఆయన భార్య సుశీల సోమవారం మీడియాతో మాట్లాడుతూ... తన భర్త తాత రాళ్లు, గోడలపై చిత్రీకరించేవారని తెలిపారు. వాటిని చూసి తన భర్త చిత్రలేఖనం నేర్చుకున్నారన్నారు. వేంగై చెట్టు రసాన్ని ఉపయోగించి పలు రంగులను సృష్టించారని పేర్కొన్నారు. పలుచోట్ల చిత్రలేఖన ప్రదర్శనలు నిర్వహించి, ప్రముఖుల నుంచి ప్రశంసలు పొందారని తెలిపారు. గతేడాది మార్చిలో మృతి చెందారన్నారు. తన భర్తకు పద్మశ్రీ అవార్డు లభించటం సంతోషంగా ఉందని, ప్రాణాలతో ఉన్నప్పుడు వచ్చుంటే బాగుండేదని చెప్పారు. పెద్ద కుమార్తె చదువు మధ్యలో ఆపేసిందని, కుమారుడు 9వ తరగతి, రెండో కుమార్తె 7వ, చివరి కుమార్తె 4వ తరగతి చదువుతున్నారని వివరించారు. కూలి పనులు చేసి పిల్లలను పోషిస్తున్నానని పేర్కొన్నారు. కళాశాల ఫీజు కట్టలేక పెద్ద కుమార్తె చదువు మధ్యలో ఆపాల్సి వచ్చిందన్నారు. నలుగురు పిల్లలతో కష్టపడుతున్నానని వెల్లడించారు.

ఏనుగు కళేబరాన్ని.. 32 ముక్కలుగా కోసి ఖననం

అటవీ శాఖ సిబ్బంది నిర్వాకం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో ఏనుగు చనిపోగా అటవీ అధికారి తన సిబ్బందితో కలిసి కళేబరాన్ని 32 ముక్కలుగా కోసి ఖననం చేసిన ఘటన కలకలం రేపింది. ఒడిశాలోని కొంధమాల్ జిల్లా బలిగుడ అటవీ డివిజన్ బెల్ఘర్ రేంజ్‌లో ఈ ఉదంతం చోటు చేసుకుంది. జనవరి 5న వేటగాళ్లు అమర్చిన విద్యుత్ కంచెకు తగిలి ఏనుగు చనిపోయింది. ఆ ఘటన తన పరిధిలో జరిగిందని.. ఉన్నతాధికారులు తనపై చర్యలు తీసుకుంటారని ఇన్‌ఛార్జి రేంజర్ బినయకుమార్ భయపడ్డారు. 8మంది సిబ్బంది సహకారంతో ఏనుగు కళేబరాన్ని ముక్కలు చేసి ఓ నర్సరీలో గొయ్యి తవ్వి పాతిపెట్టించారు. అయినప్పటికీ విషయం బయటకు పొక్కడంతో ఉన్నతాధికారులు దర్యాప్తునకు ఆదేశించారు. దొరికిపోతానని భావించిన బినయకుమార్.. ఏనుగు శరీర భాగాలను తవ్వితీసి కలహండి జిల్లాలోని కెసింగ రాణా పరిధిలోని మరో ప్రాంతానికి తరలించి, పాతి పెట్టించారు. తన పరిధిలో ఏ ఏనుగూ చనిపోలేదని నివేదిక ఇచ్చారు. ఉన్నతాధికారులు రంగంలోకి దిగి పరిశీలించగా నర్సరీలో మట్టి తవ్విన ఆనవాళ్లు కనిపించాయి. దాని ఆధారంగా విచారణ చేపట్టగా అసలు విషయం బయటపడింది. బినయకుమార్‌ను సస్పెండ్ చేసిన అధికారులు, ఎనిమిది మంది సిబ్బందికి నోటీసులు ఇచ్చారు.

పీఎంశ్రీ బడి.. భవితకు పెట్టుబడి

- విద్యార్థులకు సకల సౌకర్యాలు
- వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణ.. ఇంటర్న్‌షిప్
- పిల్లల అభివృద్ధికి బడిలోనే బలమైన పునాది
- దక్షిణాదిలో అత్యధిక పాఠశాలలకు ఆమోదం పొందిన ఏపీ



ఈనాడు, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన బోధన, అభ్యసనతోపాటు వారి సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పీఎంశ్రీ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తోంది. దేశంలో ఉత్తర్‌ప్రదేశ్ (1,725) తర్వాత అత్యధికంగా కేంద్రం నుంచి 935 పీఎంశ్రీ పాఠశాలలను మన రాష్ట్రం సాధించింది. ఈ పాఠశాలల్లో సదుపాయాల కల్పనకు కేంద్రం 60% నిధులు ఇస్తుండగా.. రాష్ట్ర ప్రభుత్వం 40% వెచ్చిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో పీఎంశ్రీ బడుల్లో మౌలిక సదుపాయాలకు రూ.407.53 కోట్లను కేంద్రం మంజూరు చేసింది. ఇప్పటికే పాఠశాలల్లో సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) ఆధ్వర్యంలో పనులు సాగుతున్నాయి. ఈ పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిర్వహణ నిధులను రూ.50 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు విడుదల చేశారు.

వృత్తి విద్యా కోర్సులు

ఈ పాఠశాలల్లో 9-12 తరగతుల వరకు విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులు అందిస్తున్నారు. మొదటి, రెండో విడతలో మంజూరు చేసిన 794 పాఠశాలల్లో 10 ట్రేడ్‌లలో కోర్సులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు శిక్షణ అందించేందుకు 1,898 మంది శిక్షకులను నియమించారు. వీరిలో 400 మంది జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎన్ఎస్‌డీసీ) ధ్రువీకరించిన వృత్తి విద్యా ఉపాధ్యాయులు. పిల్లలకు ప్రాక్టికల్ నాలెడ్జ్ కోసం బడుల్లో 1,898 ప్రయోగశాలలను ఏర్పాటు చేశారు.

✦ విద్యార్థులకు దసరా, సంక్రాంతి సెలవుల్లో సమీపంలోని పరిశ్రమలు, సంస్థల్లో ఇంటర్న్‌షిప్ సైతం ఇప్పిస్తున్నారు. 10,240 మంది విద్యార్థులు 80 గంటల ఇంటర్న్‌షిప్ పూర్తి చేశారు. చదువుతో పాటు ఉపాధి కల్పించేలా ఈ కోర్సులను డిజైన్ చేశారు. ప్రస్తుతం 9,700 మంది ఇంటర్న్‌షిప్ చేస్తున్నారు. ✦ వృత్తి విద్య కోర్సు పాఠ్యపుస్తకాలను ఉచితంగా అందించారు. ఆరు నుంచి 8 తరగతుల విద్యార్థులకు ఎన్‌సీఈఆర్టీ రూపొందించిన 'కౌశల్ బోధ్' పుస్తకాలను అందిస్తున్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు కేంద్రాలు

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం పీఎంశ్రీ పాఠశాలల్లో ఆటిజం కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. బడుల్లో తరగతి గదులు అందుబాటులో ఉంటే వాటిని ఆటిజం కేంద్రాలుగా మారుస్తారు. డిజిటల్ అభ్యసన పరికరాలు, సెన్సరీ కిట్లు, ఇతర ప్రత్యేక సామగ్రి అందిస్తారు. వ్యక్తిగత అభ్యాస విధానం (పాల్)ను అమలు చేస్తున్నారు. విద్యార్థులు వారి స్థాయిల ఆధారంగా ఆన్‌లైన్‌లో నేర్చుకోవచ్చు.

పీఎంశ్రీ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పించనున్న సదుపాయాలు

✦ స్వచ్ఛమైన తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్లు ✦ మరుగుదొడ్లు, చేతులు కడుక్కునేందుకు పాయింట్లు ✦ విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్ల పంపిణీ, వెండింగ్ మెషీన్ల ఏర్పాటు ✦ విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవసరమైన ఫర్నిచర్ ✦ భౌతిక, రసాయన, జీవశాస్త్ర ప్రయోగశాలలు ✦ బడులకు ఇంటర్నెట్ సదుపాయం, అన్నింటిలోనూ సీసీ కెమెరాల ఏర్పాటు ✦ కంప్యూటర్ ల్యాబ్‌లు, స్మార్ట్ తరగతి గదులు, గ్రంథాలయాలు ✦ క్రీడా మౌలిక సదుపాయాలతో ఆట స్థలాల అభివృద్ధి ✦ బాలికలకు ఆత్మరక్షణ శిక్షణ, పిల్లల కెరీర్‌కు కౌన్సెలింగ్ ✦ విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు స్కౌట్స్, గైడ్స్ కార్యకలాపాలు ✦ పాఠశాల బ్యాండ్లు, సంగీతం లాంటి కళల్లో శిక్షణ.

కార్పొరేట్‌కు దీటుగా సదుపాయాలు

పీఎంశ్రీ పాఠశాలల్లో కార్పొరేట్ బడులకు దీటుగా అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నాం. ఈ బడులకు కేంద్రం ఎక్కువగా నిధులు మంజూరు చేస్తోంది. విద్యా శాఖ మంత్రి లోకేశ్ చొరవతో దక్షిణాది రాష్ట్రాల్లో ఏపీనే ఎక్కువ బడులకు ఆమోదం పొందింది. పిల్లలకు నాణ్యమైన విద్య, సమగ్ర వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాభివృద్ధి, సాంకేతికత అందిస్తున్నాం.

– బి.శ్రీనివాసరావు, ఎస్పీడీ, ఎస్ఎస్ఏ

న్యాయవ్యవస్థకు రాజ్యాంగం మార్గదర్శి

- గణతంత్ర దినోత్సవం... దేశ ప్రజల విశ్వాసానికి ప్రతీక
- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్



హైకోర్టు ఆవరణలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, వందనం సమర్పిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకుర్

ఈనాడు, అమరావతి: న్యాయవ్యవస్థకు రాజ్యాంగం మార్గదర్శిగా నిలుస్తోందని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్ అన్నారు. చట్టాధిపత్యం, వివక్ష రహిత సమాజం, పౌరహక్కుల పరిరక్షణ, ప్రజల సంకల్పాధిపత్యం అనే మూల సూత్రాలు.. దేశ ప్రజాస్వామ్య బలాన్ని ప్రతిబింబిస్తున్నాయని స్పష్టంచేశారు. దేశ ప్రజల విశ్వాసానికి ప్రతీకగా ప్రతి గణతంత్ర దినోత్సవమూ నిలుస్తోందని చెప్పారు. హైకోర్టు ఆవరణలో గణతంత్ర దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం సభను ఉద్దేశించి ప్రసంగించారు. 'దేశాభివృద్ధిలో పేదరికం, సామాజిక వివక్ష వంటి అడ్డంకుల్ని అధిగమించేందుకు సామాజిక, ఆర్థిక సంక్షేమ పథకాలను, నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత తదితర రంగాల్లో నూతన కార్యక్రమాలను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. వేగవంతమైన న్యాయ సహాయం ప్రతి పౌరుడికీ చేరేలా చేయడం న్యాయవ్యవస్థ ప్రధాన కర్తవ్యం. దేశం ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నా ప్రజాస్వామ్య నిబద్ధతలో ఎప్పుడూ వెనకడుగు వేయలేదు' అని అన్నారు. అనంతరం అదనపు సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ, అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, బార్ కౌన్సిల్ అధ్యక్షుడు ద్వారకానాథ్‌రెడ్డి, అడ్వొకేట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కేవీ రఘువీర్ తదితరులు ప్రసంగించారు. పలువురు న్యాయమూర్తులు, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్, రిజిస్ట్రార్లు, న్యాయవాదులు, న్యాయమూర్తుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై పోరాటానికి 'పద్మభూషణ్' స్ఫూర్తినిచ్చింది

- డా.నోరి దత్తాత్రేయుడు



డా.నోరి దత్తాత్రేయుడిని గజమాలతో సత్కరిస్తున్న నందమూరి బాలకృష్ణ. చిత్రంలో డా.కె.కృష్ణయ్య, జేఎస్ఆర్ ప్రసాద్

హైదరాబాద్, న్యూస్‌టుడే: భారత ప్రభుత్వం తనకు పద్మభూషణ్ పురస్కారం ప్రకటించడం సంతోషంగా ఉందని ప్రఖ్యాత క్యాన్సర్ పరిశోధకులు డా. నోరి దత్తాత్రేయుడు అన్నారు. సోమవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన విలేకరులతో ప్రత్యేకంగా మాట్లాడారు. "అమెరికాలో, ప్రపంచవ్యాప్తంగా నాకు ఎన్నో అవార్డులు వచ్చాయి.. నేను చేసిన సేవలు, ఆవిష్కరణలు, పరిశోధనలకు గుర్తుగా నా దేశం పద్మభూషణ్ ప్రకటించడం ఎంతో సంతృప్తి కలిగించింది. రాబోయే రోజుల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లో, దేశంలో క్యాన్సర్ మహమ్మారిపై పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లాలన్న నా దృఢ సంకల్పానికి ఈ అవార్డు ఛాలెంజ్ వంటిది. ఈ స్ఫూర్తిని కొనసాగిస్తా. నేను ఇచ్చిన రోడ్‌మ్యాప్‌ను తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు అంగీకరించారు. దానిని సమర్థంగా అమలు చేసే బాధ్యత నాపై ఉంది. కొన్ని క్యాన్సర్లు రాకుండా నివారించే అవకాశం ఉంటుంది. వాటిని రాబోయే ఆరేడేళ్లలో పూర్తిగా తుడిచివేయాలనే లక్ష్యాన్ని కొనసాగిస్తా. మరికొన్ని క్యాన్సర్లపై ప్రజల్లో సరైన అవగాహన కల్పిస్తే.. అవి పెరగకుండా ఆపొచ్చు. ఈ దిశగా పనిచేస్తా. నాకు ఈ అవకాశం ఇచ్చిన తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు, అవార్డు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు' అని తెలిపారు. ఈ సందర్భంగా డా.నోరి దత్తాత్రేయుడిని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (బీఐఏసీహెచ్ అండ్ ఆర్ఐ) ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ ఘనంగా సన్మానించారు. బీఐఏసీహెచ్ అండ్ ఆర్ఐ ట్రస్టు బోర్డు సభ్యుడు జేఎస్ఆర్ ప్రసాద్, సీఈవో డా.కె. కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ స్వరపేటికతో జాతీయ గీతాలాపన

ఈ ఆసుపత్రిలో చికిత్సలో భాగంగా కృత్రిమ స్వరపేటికలను అమర్చుకున్న 75 మందికిపైగా రోగులు సోమవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆసుపత్రిలో జాతీయ గీతాలాపన చేశారు. లండన్‌కు చెందిన 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్' సంస్థ.. దీన్ని ప్రపంచ రికార్డుగా గుర్తించి ధ్రువపత్రం అందించింది.



దాచేపల్లి తంగెడ వంతెన వద్ద కృష్ణానది నీరు

కృష్ణమ్మకు ఏమైంది?

కృష్ణా నది నీరు రెండు నెలలుగా రంగు మారి కనిపిస్తోంది. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం పొందుగల నుంచి మాచవరం మండలం వరకు మొత్తం 20 కి.మీ. మేర నీరు నీలం ఆకుపచ్చ రంగులోకి మారిపోయింది. దుర్వాసనా వస్తోంది. ఇసుకపై ఆనవాళ్లను బట్టి రసాయనాలే ఇందుకు కారణమని అర్థమవుతున్నా అధికారుల్లో చలనం లేదు. గుంటూరు నుంచి కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది వచ్చి కొన్ని నమూనాలు తీసుకెళ్లారు. ఆ నివేదిక ఇంతవరకూ బయటపెట్టలేదు. అటు తెలంగాణ, ఇటు ఆంధ్ర రెండు వైపులా ఇదే పరిస్థితి ఉండటంతో ఎవరికి వారు తమకు సంబంధం లేదన్నట్లు ఉంటున్నారని సమీప గ్రామాల ప్రజలు వాపోతున్నారు. – ఈనాడు, నరసరావుపేట, న్యూస్‌టుడే, దాచేపల్లి

3 నెలలు.. 54 ప్రాజెక్టులకు శంకుస్థాపనలు

(మొదటి పేజీ తరువాయి)

కల్పించనున్నట్లు సంస్థలు దాఖలు చేసిన డీపీఆర్‌లో పేర్కొన్నాయి.

2024 జూన్ నుంచి ఆమోదించిన ప్రాజెక్టులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పెట్టుబడుల ఆకర్షణపై దృష్టి పెట్టింది. ఈ ప్రయత్నాలతో వివిధ సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. ఇప్పటి వరకు నిర్వహించిన 14 ఎస్ఐపీబీ సమావేశాల్లో వివిధ రంగాలకు చెందిన 211 కంపెనీల ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. వాటి ద్వారా రూ.8,74,705 కోట్ల పెట్టుబడులు. 8,35,675 మందికి ఉపాధి కల్పించనున్నట్లు సంస్థలు డీపీఆర్‌లో తెలిపాయి. వాటిని దశల వారీగా గ్రౌండింగ్ చేసే చర్యలను ప్రభుత్వం చేపట్టింది.

✦ ఎస్ఐపీబీ ఆమోదించిన ప్రాజెక్టుల్లో కొన్నింటిని గ్రౌండింగ్ (49 కొత్త ప్రాజెక్టులు.. 9 కంపెనీల విస్తరణ ప్రాజెక్టులు కలిపి) చేయడంపై అధికారులు దృష్టి సారించారు. ఆయా కంపెనీలకు అవసరమైన అనుమతులు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో ఇప్పటికే అందించారు.

✦ ప్రభుత్వంతో ఎంవోయూ కుదుర్చుకున్న ఓ కొత్త ప్రాజెక్టుతో పాటు.. ఇప్పటికే రాష్ట్రంలో ఉత్పత్తిలో ఉన్న మరో మూడు కంపెనీల విస్తరణ ప్రాజెక్టులు పూర్తయ్యాయి. ఈ ఒప్పందాల ద్వారా రూ.3,707 కోట్ల పెట్టుబడులు.. 3,591 మందికి ఉపాధి కల్పించినట్లు సంస్థలు తెలిపాయి.

✦ కొత్తగా ఎంవోయూలు చేసుకున్న 7 సంస్థలు, మరో కంపెనీ విస్తరణ ప్రాజెక్టుకు అధికారులు శంకుస్థాపన పూర్తి చేశారు. ఈ ప్రతిపాదనల ద్వారా రూ.10,119 కోట్ల పెట్టుబడులు.. 13,091 మందికి ఉపాధి లభించనుంది.

✦ ఇంకా మిగిలిన 46 ప్రాజెక్టులకు (జనవరిలో 13, ఫిబ్రవరిలో 20, మార్చిలో 13 ప్రాజెక్టులు) శంకుస్థాపన నిర్వహించేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

ఎస్ఐపీబీ అనుమతించిన మొత్తం పెట్టుబడులు.. ఉపాధి వివరాలు

రంగం	ప్రాజెక్టుల సంఖ్య	పెట్టుబడులు (రూ.కోట్లలో)	ఉపాధి
విద్యుత్	54	2,86,013	3,51,149
పరిశ్రమలు, వాణిజ్యం	75	4,17,784	3,18,550
ఏపీమారిటైం బోర్డు	2	1,660	2,050
ఐటీ శాఖ	37	1,55,854	1,42,974
పర్యాటక శాఖ	29	7,052	13,826
ఫుడ్ ప్రాసెసింగ్	14	6,342	7,126
మొత్తం	211	8,74,705	8,35,675

దోపిడీకి ఆక్సిజన్ అందిస్తున్నారు!

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు రూ.33.73 కోట్లు చెల్లించారు. 2018 నుంచి క్యూబిక్ మీటరు ఎల్ఎంవోకు 12 శాతం జీఎస్టీతో కలిపి శ్రీభరత్ ఫార్మా రూ.31.36 వసూలు చేస్తోంది. దీనికి ఏటా 2 శాతం చొప్పున ధర పెంచుతోంది. అదనంగా రవాణా రుసుములు వసూలు చేస్తోంది. అదే కర్నూలులోని ప్రైవేటు ఆసుపత్రులు మాత్రం క్యూబిక్ మీటరు ఎల్ఎంవోను రూ.12.90కే కొనుగోలు చేస్తున్నాయంటే వ్యత్యాసం ఎంతగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇదే నగరానికి చెందిన ఎలెన్‌బరీ ఇండస్ట్రియల్ గ్యాసెస్ సంస్థ హైదరాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే సెంట్రల్ ఆసుపత్రికి రవాణా ఛార్జీలతో కలిపి క్యూబిక్ మీటరుకు రూ.19.29కి సరఫరా చేస్తుండటం గమనార్హం. దీంతోపాటు అక్కడి సిలిండర్ల నిర్వహణ బాధ్యతలను కూడా తన సిబ్బందితోనే చేయిస్తోంది. నిర్వహణ బాధ్యతలతో సంబంధం లేకుండా విశాఖలోని భీమిలీ సమీపంలో ఓ సొసైటీకి క్యూబిక్ మీటరుకు రూ.15.12కే అందిస్తోంది.

మూడేళ్లలో రూ.వంద కోట్లకు పైగా నష్టం

రానున్న మూడేళ్ల పాటు శ్రీభరత్ ఫార్మా సంస్థ నుంచే ఎల్ఎంవో కొనుగోలు చేస్తే.. ఒక్క కర్నూలు సర్వజన ఆసుపత్రి నుంచే వాస్తవ ధర కంటే అదనంగా రూ.9.25 కోట్లు చెల్లించాల్సి వస్తుంది. కర్నూలు కాకుండా ఆ సంస్థ రాష్ట్రంలోని 24 ఆసుపత్రులకు ఎల్ఎంవో సరఫరా చేస్తోంది. ఫలితంగా ప్రభుత్వానికి రూ.వంద కోట్లకు పైగా నష్టం వాటిల్లుతుందని విజిలెన్స్ తేల్చింది. ఈ మేరకు అధికారులు సమగ్ర నివేదిక పంపి ఆరు నెలలు గడిచినా ఎలాంటి చర్యలు కానరావడం లేదు.

వైకాపా నాయకులకు ముడుపులు

ఆక్సిజన్ కొనుగోలు ఒప్పందాలు రద్దు కాకుండా చూసే బాధ్యతను కొందరు వైకాపా నాయకులు తీసుకోవడం మరో కీలక విషయం. గత తెదేపా ప్రభుత్వ హయాంలో శ్రీభరత్ ఫార్మాతో ఒప్పందం జరిగినప్పటికీ.. తర్వాతి కాలంలో లొసుగులు, అక్రమాలు వెలుగు చూశాయి. ఒప్పందం జరిగిన ఏడు నెలలకే వైకాపా అధికారంలోకి వచ్చింది. గత ప్రభుత్వంలో వారి అండదండలతోనే అధిక ధరలకు ఎల్ఎంవో సరఫరా జరిగింది. దీంతో పలువురికి ప్రతినెలా రూ.లక్షల్లో ముడుపులు అందాయి. వీరే ప్రస్తుత ప్రభుత్వంలో కొందరు అధికారులతో మాట్లాడుకుని చర్యలు తీసుకోకుండా ఏర్పాట్లు చేసుకున్నారని ప్రచారం సాగుతోంది.

చంటి బిడ్డేగా.. టికెట్ ఉండదేమోలే!

- ఆర్టీసీ బస్సుల్లోలాగే.. విమానం ఎక్కేసిన కుటుంబం
- ఆఖరి నిమిషంలో గుర్తించి దించేసిన సిబ్బంది

రాజేంద్రనగర్, శంషాబాద్, న్యూస్‌టుడే: ఆ తల్లీ, కొడుకు, అతడి రెండున్నరేళ్ల పిల్లాడితో మొదటిసారి విమానం ఎక్కుతున్నారు. వారికి నిబంధనలు తెలియవు. సాధారణంగా రైలు, బస్సుల్లో ప్రయాణిస్తుంటే అంత చిన్న వయసున్న పిల్లాడికి టికెట్ ఉండదు కదా.. అలాగే అనుకొని విమాన టికెట్ కొనుగోలు చేయలేదు. తల్లీకొడుకులు మాత్రమే టికెట్ తీసుకుని శంషాబాద్ విమానాశ్రయం లోపలికి ప్రవేశించారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో చిన్నపిల్లాడితో సహా విమానంలోకీ వెళ్లిపోయారు. ఖాళీగా ఉన్న పక్కసీట్లో పిల్లవాడిని కూర్చోబెట్టారు. ఆ సీటు రిజర్వ్ చేసుకున్న వ్యక్తి వచ్చి అడిగేసరికి వాగ్వాదానికి దిగారు. అప్పుడుగానీ ఎయిర్ హోస్టెస్ అసలు సమస్య గుర్తించలేకపోయారు. బాబుకి టికెట్ కొనలేదనే విషయం గుర్తించి, ఆమె అధికారులకు సమాచారం అందించారు. వారు మహిళను, ఆమె కుమారుడిని, మనవడిని కిందికి దించి పోలీసులకు అప్పగించారు. పోలీసులు వారిని విచారించగా పట్నాకు వెళ్తున్నట్లు చెప్పారు. రెండున్నరేళ్ల అబ్బాయికి టికెట్ తీసుకోవాలనే విషయం తమకు తెలియదని పోలీసులతో చెప్పారు. తెలియకుండా తప్పు చేశారనే భావనతో పోలీసులు కేసు నమోదు చేయకుండా వదిలేసినట్లు సమాచారం.



కోడె ముందు కాలుదువ్విన కోడి!

ఎవరు నువ్వు.. మా అంతే ఉన్నావ్.. పందెంలో నీ పని పడతాం అంటూ కోడి పుంజులు కోడె దూడ ముందు కాలు దువ్వాయి. వాటి హడావుడిని ఆ బుజ్జి దూడ అమాయకంగా చూస్తూ ఉండిపోయింది. చిత్తూరులో సోమవారం నిర్వహించిన గణతంత్ర వేడుకల సందర్భంగా పశుసంవర్ధక శాఖ స్టాల్‌లో మేకలు, పుంగనూరు జాతి ఆవులు, నాటుకోళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలా వచ్చిన 2 అడుగుల ఓ పుంగనూరు దూడ, నాటు పుంజులను కలిపి ఔత్సాహికులు ఫొటో తీయగా వాటి హావభావాలు సందర్శకులను ఆకర్షించాయి. – ఈనాడు, చిత్తూరు

ఖరీఫ్ నాటికి వెలిగొండ నుంచి సాగునీరు

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ఈనాడు, అమరావతి: వెలిగొండ ప్రాజెక్టును శరవేగంగా పూర్తి చేసి, ఈ ఖరీఫ్ నాటికి సాగునీరు అందించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోందని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. వెలిగొండకు మీరు ఏం చేశారని.. క్రెడిట్ చోరీ అంటున్నారని వైకాపా అధ్యక్షుడు జగన్‌ను ప్రశ్నించారు. తెదేపా ప్రభుత్వ హయాంలోనే 80 శాతం ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయని ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. జగన్ ప్రభుత్వంలో ప్రాజెక్టు నిర్మాణానికి రూ.3 వేల కోట్ల మేర పరిపాలన అనుమతులిచ్చి, రూ.170 కోట్లే ఖర్చు చేశారని చెప్పారు.

మీ నియంత్రణలో ఉండేది ఆ ఒక్కటే..



మీ నియంత్రణలో ఉండేది ఒక్కటి మాత్రమే. అదేంటంటే.. మీకెదురయ్యే పరిస్థితులకు మీరెలా ప్రతిస్పందిస్తారన్నది. వాస్తవానికి ఆ ఒక్కటి చాలు మీ జీవితాన్ని మార్చుకోవడానికి. ప్రతి విషయంపైనా భావోద్వేగాలకు లోనై అతిగా స్పందించడం, మీ పురోగతికి ఏమాత్రం ఉపయోగపడని అంశాల గురించి ఎక్కువగా ఆలోచించడం మానండి. అప్పుడు మీరు ప్రశాంతంగా ఉంటూ మీ జీవితంపైనే దృష్టి కేంద్రీకరిస్తారు.

– జిల్ ఫియో, కంటెంట్ క్రియేటర్

చేయండి... ఐఐటీలో బీఈడీ

జనవరి ముగుస్తోంది. పరీక్షల ధ్యాసలో పిల్లలుంటే... వారితో తర్వాత ఏం చేయించాలన్న ఆలోచనలో తల్లిదండ్రులుంటారు. మంచి కోర్సులంటే... ఇంజినీరింగ్... మెడిసిన్‌లనే అనుకుంటాం... ఎన్ఐటీలు, ఐఐటీల్లో సీటొస్తే చాలనుకుంటాం... కానీ సంప్రదాయ కోర్సులకు భిన్నమైనవి.. ప్రతిష్ఠాత్మక సంస్థల్లో లభించేవీ.... కెరీర్‌లో త్వరగా స్థిరత్వాన్నిచ్చే కోర్సులూ ఉన్నాయి... రండి తెలుసుకుందాం...



ఐఐటీలు, ఎన్ఐటీలంటే సాంకేతిక సారథులను అందించే మేటి సంస్థలని మనకు తెలుసు. బీటెక్, ఎంటెక్‌లలో అత్యున్నత ప్రమాణాలతో విద్యను అందించే ఈ విద్యా సంస్థలు ఇంటిగ్రేటెడ్ బీఎడ్ కోర్సును ఆఫర్ చేస్తున్నాయి. నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం(ఐటీఈపీ) పేరుతో బీఎస్సీ బీఎడ్ కోర్సును అందిస్తున్నాయి. నేషనల్ కామన్ ఎంట్రన్స్ టెస్టు(ఎన్‌సీఈటీ)తో ప్రవేశం లభిస్తుంది. డిగ్రీతో బీఎడ్ కోర్సు నాలుగేళ్లలోనే పూర్తి చేసుకోవచ్చు. దీంతో ఏడాది సమయం ఆదాతో పాటు మేటి అవకాశాలూ సొంతం చేసుకోవచ్చు.

ఎక్కడ?

ఐఐటీలు: ఖరగ్‌పూర్, భువనేశ్వర్, జోధ్‌పూర్, రోపార్.

ఎన్ఐటీలు: వరంగల్, కాలికట్, పుదుచ్చేరి, త్రిపుర, జలంధర్

ఎప్పుడు? ప్రకటన ఫిబ్రవరిలో వెలువడుతుంది.

- రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్(ఆర్ఐఈ)లు సైతం అత్యుత్తమ ఉపాధ్యాయ విద్యను అందిస్తున్నాయి. దేశంలో పేరున్న ఈ సంస్థలు ఇంటిగ్రేటెడ్ బీఏ/బీఎస్సీ- ఎడ్ కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి.
- ఇక్కడ చదువుకున్నవారు వృత్తిపరంగా ముందు వరుసలో ఉంటారు. ప్రాంగణ నియామకాల్లో ఎంపికై, తక్కువ వ్యవధిలోనే ఉన్నత స్థాయికీ చేరుకోగలరు.
- ఇంటర్ ఎంపీసీ విద్యార్థులైతే ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ ఎడ్ కోర్సులో చేరి ఆరేళ్లకే ఎమ్మెస్సీతో బీఎడ్ పూర్తి చేసుకోవచ్చు.

ప్రకటన: ఫిబ్రవరి / మార్చిలో

యాక్చువరీ ఫెలో అవుతారా?

- ఓ ఇన్సూరెన్స్ కంపెనీ తెచ్చిన పథకం మన ఆలోచనలను మార్చొచ్చు... ఆర్థిక పరిస్థితిని తీర్చిదిద్దొచ్చు.
- ఈ పథకాల రూపకల్పన ఎన్నో సామాజిక, గణిత పరిణామాల వడపోతతో ముడిపడి ఉంటుంది.
- ఇంత సంక్లిష్టమైన జాబ్‌ను చేసేది యాక్చువరీ నిపుణులు. మనం తీసుకునే పలు రకాల బీమా పాలసీలకు ప్రీమియం నిర్ణయం చేది వీళ్లే. ● మన దేశం మొత్తం మీద యాక్చువరీ ఫెలోలు 761 మంది ఉన్నారంటేనే వీరెంత ముఖ్యమైన వృత్తులో. వీరి ఎంపిక ఎంత కఠినంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

మ్యాథ్స్, స్టాటిస్టిక్స్‌లో ఆసక్తి ఉన్నవారు యాక్చురియల్ సైన్స్ బాటలో భవిష్యత్తు నిర్మించుకోవచ్చు. ప్రపంచవ్యాప్తంగా రిస్క్ మేనేజ్‌మెంట్, ఇన్సూరెన్స్, ఫైనాన్స్ రంగాల్లో వీరి సేవలెంతో కీలకం. అందుకే వీరిని ప్రొఫెషనల్ రిస్క్ ఆర్కిటెక్ట్స్‌గానూ పిలుస్తారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యాక్చువరీస్ ఆఫ్ ఇండియా(ఐఏఐ) ఈ పరీక్షలు నిర్వహించి, సర్టిఫికెట్ అందిస్తుంది. ఇందులో ఉత్తీర్ణత సాధించడం కొంచెం కష్టమే. అయినప్పటికీ ఓర్పు, క్రమశిక్షణ, నిరంతర అధ్యయనంతో ఇబ్బందుల అధిగమించవచ్చు. కొన్ని కళాశాల్లో బీకాం కోర్సులలో కలిపి యాక్చూరియల్ సైన్స్ కోర్సును అందిస్తున్నారు. మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, ఎకనామిక్స్ సబ్జెక్టులపై ఆసక్తి, లాజికల్ ఆలోచన శక్తి ఉన్నవారు రాణించగలుగుతారు. ఈ కోర్సులో ఉన్న 4 స్టేజీలు (13 పేపర్లు) పూర్తిచేసిన వారిని ఫెలోగా పిలుస్తారు. మన దేశ అవసరాలకు 2030 నాటికి పాతిక వేల మంది ఫెలోల అవసరముంది అంచనా. తొలి రెండు స్టేజీలు పూర్తిచేసినా చాలు. ఉపాధి పొందవచ్చు.

-ఈ కోర్సులో ప్రవేశానికి ఏటా జనవరి, జులైలో ఏసెట్ నిర్వహిస్తున్నారు.

పొట్లం కట్టినట్టు... అవకాశాలు!

- ఎన్నో సంస్థలు.. చాక్లెట్లు, బిస్కెట్లు, చిరుతిళ్లు, ఆహార పదార్థాలు, వివిధ రకాల సామగ్రి, ఔషధాలు.. వీటన్నింటినీ ఎంతో సృజనాత్మకతతో ప్యాక్ చేస్తున్నాయి. అందుకే ప్రతి ఉత్పత్తి సంస్థకూ ప్యాకేజింగ్ నిపుణుల సేవలెంతో కీలకం. అందువల్ల ఈ విభాగంలో ఆసక్తి ఉన్నవారు ప్యాకేజింగ్ కోర్సులు పూర్తిచేసి, మేటి సంస్థల్లో సులువుగానే ఉద్యోగాలు పొందగలరు.
- ఔషధ కంపెనీలు, ఆహార తయారీ సంస్థలు, ప్యాకేజింగ్ సంస్థలు, వస్తు తయారీ, ఈ కామర్స్, శీతల పానీయాలు, సౌందర్య సాధనాలు, గృహోపకరణాల ఉత్పత్తులను తయారుచేస్తోన్న పరిశ్రమల్లో ప్యాకేజింగ్ నిపుణులకు పెద్దఎత్తున అవకాశాలు లభిస్తున్నాయి.
- ఈ రంగంలో నైపుణ్యాలు పెంచేందుకు కామర్స్ అండ్ ఇండస్ట్రీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ (ఐఐపీ) సంస్థను నెలకొల్పారు. దీనికి ముంబయి, చెన్నై, దిల్లీ, కోల్‌కతా, హైదరాబాద్, అహ్మదాబాద్‌లో కేంద్రాలున్నాయి. వీటిలో డిప్లొమా, పీజీ డిప్లొమా, పీజీ ప్యాకేజింగ్ కోర్సులు అందిస్తున్నారు.
- ప్రభుత్వ పాలిటెక్నిక్, హైదరాబాద్‌లోనూ ప్యాకేజింగ్ డిప్లొమా కోర్సు పదో తరగతి విద్యార్హతతో అందిస్తున్నారు. పాలీసెట్‌తో ప్రవేశం కల్పిస్తారు.

ఐఐపీ కోర్సుల వివరాలు

- డిప్లొమా కోర్సులో గ్రాడ్యుయేట్లు ఎవరైనా చేరవచ్చు. వయసు నిబంధన లేదు. ఏదైనా పరిశ్రమ అనుభవం ఉండాలి. 18 నెలల కోర్సును కరస్పాండెంట్ విధానంలో అందిస్తున్నారు. పీజీ డిప్లొమా కోర్సులో సైన్స్, ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లకు అవకాశం ఉంది. డిగ్రీలో మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా చదివుండాలి. వయసు 30 ఏళ్లకు మించరాదు.
- ఎంఎస్ ప్యాకేజింగ్ టెక్నాలజీ... మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మైక్రో బయాలజీ లేదా బయో టెక్నాలజీ వీటిలో ఏదైనా ఒక సబ్జెక్టును డిగ్రీలో చదివుండాలి. అగ్రికల్చర్, ఫుడ్ సైన్స్, పాలిమర్ సైన్స్.. కోర్సులవారూ అర్హులే. వయసు 30 ఏళ్లకు మించరాదు. ఈ ప్రకటన మేలో వెలువడుతుంది.

- ఈనాడు చదువు డెస్కు

మన్యంతో మమేకమయ్యేలా..!





దట్టమైన అడవి, ఉరకలెత్తే జలపాతాలు, నిండుగా ప్రవహించే గోదావరికి నెలవు పోలవరం జిల్లా మన్యం ప్రాంతం. పర్యాటకులకు మరింత అనుభూతిని కలిగించేందుకు మారేడుమిల్లి ప్రాంతంలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా 'వనవిహారి', 'జంగిల్ స్టార్ నేచర్ క్యాంపు'లో సఫారీకి ప్రత్యేక వాహనాన్ని తయారు చేయించారు. పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అధునాతన సదుపాయాలతో రిసార్టుల నిర్మాణాలూ వేగంగా జరుగుతున్నాయి.

– న్యూస్‌టుడే, మారేడుమిల్లి

సూర్యలంక ఆతిథ్యం.. విహంగాలకు గమ్యస్థానం



వామన కాకి



ఎర్రచెంపల పిగిలి పిట్ట



నల్ల నడుము బంగారు వీపు వడ్రంగి పిట్ట

సూర్యలంక అటవీ భూములు, తీర ప్రాంతంలో విదేశీ, స్వదేశీ విహంగాలు సందడి చేస్తున్నాయి. పచ్చని చెట్లపై రంగురంగుల పక్షులు చేస్తున్న విన్యాసాలు చూపరులను కట్టిపడేస్తున్నాయి. ఏటా శీతాకాలంలో సైబీరియా, హిమాలయ ప్రాంతాల నుంచి వేల కి.మీ ప్రయాణించి ఇక్కడికి వస్తున్నాయి. అతి శీతల పరిస్థితుల నుంచి తమను తాము కాపాడుకోవడానికి, సంతానోత్పత్తిని వృద్ధి చేసుకోవడానికి వలస బాట పడుతున్నాయి. ప్రస్తుతం సూర్యలంకలోని మడ అడవులు, చిత్తడి నేలలు, అటవీ భూముల్లోని చెట్లపై వంద రకాలకు పైగా పక్షులు తాత్కాలిక నివాసం ఏర్పాటు చేసుకున్నాయి. సమృద్ధిగా ఆహారం లభించడం, వాతావరణం అనుకూలంగా ఉండటంతో ఈ తరహా విహంగాల రాక అధికమైంది. తిరిగి మార్చి, ఏప్రిల్ నెలల్లో తమ పిల్లలతో కలిసి గమ్యస్థానాలకు వెళ్తుంటాయి.

– న్యూస్‌టుడే, బాపట్ల



జల గర్భంలో జనగణమన!

గణతంత్ర దినోత్సవం సందర్భంగా పలువురు ఔత్సాహికులు సముద్ర గర్భంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి దేశభక్తిని చాటుకున్నారు. విశాఖలోని రుషికొండ బీచ్ వద్ద సముద్రంలో వైజాగ్ స్కూబా డైవింగ్ నిపుణులు మువ్వన్నెల జెండాను ఆవిష్కరించి, పలు విన్యాసాలు చేపట్టారు. ఏపీ వాటర్ స్పోర్ట్స్ అధ్యక్షుడు, విశ్రాంత నేవీ అధికారి బి.బలరామ్‌నాయుడు మార్గదర్శకత్వంలో ఐదుగురి బృందం సభ్యులు తీరం నుంచి 3 కి.మీ. వెళ్లి 77 అడుగుల లోతున ఈ కార్యక్రమం నిర్వహించారు. నంద్యాలలోని రామకృష్ణ విద్యాసంస్థల డైరెక్టర్ హేమంత్‌రెడ్డి, స్నేహితులు కూడా విశాఖ సముద్రంలో 'డైవ్ అడ్డా' సహకారంతో స్కూబా డైవ్ చేస్తూ జాతీయ జెండాను ప్రదర్శించారు.

– న్యూస్‌టుడే- విశాఖపట్నం (సాగర్‌నగర్), నంద్యాల పాత పట్టణం



రేపటి పౌరుల మువ్వన్నెల భారత్

కర్ణాటకలోని దక్షిణ కన్నడ జిల్లా మూడబిదిరెలోని 'ఆళ్వాస్' విద్యాసంస్థ ప్రాంగణంలో గణతంత్ర వేడుకలను నిర్వహించారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హెచ్.పి.సందేశ్, విద్యాసంస్థల అధిపతి మోహన్ ఆళ్వా తదితరుల సమక్షంలో 6,257 మంది విద్యార్థులు ఒకే చోట నిలబడి మువ్వన్నెల 'భారత్'ను ఇలా అద్భుతంగా ఆవిష్కరించారు.

– న్యూస్‌టుడే, బెంగళూరు (కెంగేరి)

అమెరికా సరిహద్దుల్లో.. 20 నిమిషాలకో భారతీయుడి అరెస్ట్

2025 గణాంకాలను వెల్లడించిన యూఎస్‌సీబీపీ

ఇంటర్నెట్‌డెస్క్: గతేడాది అమెరికా సరిహద్దుల వద్ద ప్రతి 20 నిమిషాలకు ఓ భారతీయుడు అరెస్టు అయినట్లు అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ విభాగం వెల్లడించింది. 2025 జనవరి-డిసెంబరు మధ్యలో 23,830 మంది భారతీయులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపింది. 2024లో ఈ సంఖ్య 85,119గా ఉంది. గతేడాది అదుపులోకి తీసుకున్న వారి సంఖ్య తక్కువగానే ఉన్నప్పటికీ.. ఇలా పట్టుబడుతున్న అక్రమ వలసదారుల్లో అత్యధికులు భారతీయులే ఉండటం గమనార్హం. సరిహద్దు వద్ద నిబంధనలను కఠినంగా అమలు చేస్తుండటంతో సరిహద్దులు దాటుతున్న వారి సంఖ్య తగ్గినప్పటికీ.. పూర్తిస్థాయిలో మాత్రం ఆగిపోలేదు.

23 వేల కిలోల ఎర్రచందనం ఉప ఉత్పత్తులకు వేలం

అటవీశాఖకు రూ.2.19 కోట్ల ఆదాయం

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: దేశీయ మార్కెట్ల అవసరాలకుగాను ఎర్రచందనం వేర్లు, చెట్ల నుంచి వేరు చేసిన కొమ్మలు, చిన్న చిన్న కర్రలకు అటవీశాఖ నిర్వహించిన ఈ-వేలానికి మంచి స్పందన లభించింది. దేశంలోని హస్తకళాకారులు, ఫార్మా కంపెనీలకు అందుబాటులో ఉండేలా ఈ-కొనుగోలు పోర్టల్ ద్వారా 3,19,985 కిలోలను 34 లాట్లుగా విభజించి ఈ నెల 23న అటవీశాఖ టెండర్లను నిర్వహించింది. అందులో 23,522 కిలోలు అమ్ముడుపోవడంతో అటవీశాఖకు రూ.2,19,79,870 ఆదాయం లభించింది.

పుణ్యక్షేత్రాల సందర్శనకు కారవాన్‌లు

మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



కారవాన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: కారవాన్‌లో పుణ్యక్షేత్రాలను సందర్శించే కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటకశాఖ శ్రీకారం చుట్టడం సంతోషకరమని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. భక్తుల కోసం సకల సౌకర్యాలతో రూపొందించిన కారవాన్ (వాహనం)ను సోమవారం నెల్లూరులో ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. కారవాన్ ఏర్పాటుకు నెల్లూరు వాసి వై.శ్రీనివాసరెడ్డి ముందుకు రావడం అభినందనీయమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు భాగస్వామ్యంతో ఈ వాహనాలను ప్రారంభించి పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు భక్తులకు అందుబాటులో ఉంచనున్నట్లు వెల్లడించారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలను టూరిజం సర్క్యూట్‌లుగా అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు చర్యలు చేపట్టారని వివరించారు.

మిస్టరీగా రూ.400 కోట్ల దారిదోపిడీ కేసు!

- కర్ణాటక-గోవా సరిహద్దుల్లో ఘటన.. నాసిక్‌లో ఫిర్యాదు
- కంటెయినర్లు లేవు.. నంబర్లు లేవు.. ఆధారాల్లేవ్
- కేసుపై కర్ణాటక, మహారాష్ట్ర పోలీసుల భిన్నవాదనలు

ఈనాడు, బెంగళూరు: గుజరాత్ నుంచి మహారాష్ట్ర, గోవా మీదుగా తిరుపతి వైపు నోట్ల కట్టలతో వెళ్తున్న రెండు కంటెయినర్లు కర్ణాటకలో దారిదోపిడీకి గురయ్యాయన్న ఫిర్యాదు.. కలకలం రేపుతోంది. ఆ డబ్బు ఎవరో దోచేశారనే కోణంలో మహారాష్ట్ర పోలీసులు దర్యాప్తు ప్రారంభించగా, అలాంటి ఘటన జరిగినట్లు తమ దృష్టిలోనే లేదని కర్ణాటక చెబుతోంది. దీనిపై ఇరు రాష్ట్రాల పోలీసులు భిన్నమైన ప్రకటనలు చేస్తుండగా, ఇది ఎన్నికల్లో పంచేందుకు తరలిస్తున్న సొమ్ము అని కాంగ్రెస్, భాజపాలు పరస్పరం నిందించుకోవడం రాజకీయంగా వేడి రాజేసింది. వివిధ వర్గాల నుంచి సేకరించిన సమాచారం ప్రకారం.. మహారాష్ట్రలోని నాసిక్ గ్రామీణ ఠాణాలో డిసెంబరు 17న సందీప్ దత్త పాటిల్ అనే వ్యక్తి ఓ ఫిర్యాదు చేశాడు. 'అక్టోబరు 22న విశాల్ నాయుడు, కిశోర్ శేఠ్ అనే వ్యక్తులు నన్ను కిడ్నాప్ చేశారు. వీరి వెనకాల ఉన్నది విరాట్ గాంధీ. అక్టోబర్ 22న రూ.400 కోట్లతో వెళ్తున్న రెండు కంటెయినర్లు దోపిడీకి గురయ్యాయి. పైగా, ఆ సొమ్ము కాజేసింది నేనేనంటూ వారిద్దరూ నెలన్నర పాటు నన్ను వేధించారు. వారి నుంచి తప్పించుకుని వచ్చి ఫిర్యాదు చేస్తున్నా' అని పేర్కొన్నాడు. ఫిర్యాదు కంటే ముందు సందీప్ దత్త ఓ వీడియో కూడా పోస్ట్ చేశాడు. అందులో రూ.వెయ్యి కోట్లు దోపిడీకి గురైనట్లు ప్రస్తావించాడు. ఈ వీడియో వైరల్ కావడంతో మహారాష్ట్ర ప్రభుత్వం కేసు నమోదు చేసి, తీవ్రత దృష్ట్యా ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. విచారణలో భాగంగా సిట్ అధికారులు జనవరి 16న కర్ణాటకలోని బెళగావి జిల్లా ఖానాపుర పోలీస్ స్టేషన్‌కు ఓ లేఖ రాసి, కేసు దర్యాప్తులో సహకరించాలని కోరారు. అంతకుమించి ఏ వివరాలూ ప్రస్తావించలేదు.

అంతా మిథ్యేనా?

ఈ కేసుపై బెళగావి ఎస్పీ రామరాజన్ సోమవారం 'ఈనాడు'తో మాట్లాడారు. 'ఈ ఘటన బెళగావి-గోవా మార్గంలోని చోర్లా ఘాట్ ప్రాంతంలో జరిగినట్లు చెబుతున్నారు. మాకు మహారాష్ట్ర సిట్ పంపిన లేఖలో ఏ సమాచారమూ లేదు. ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్-32 ప్రకారం ఇది దాదాపు గాలివార్త కేసుగానే భావిస్తున్నాం. కేసు పెట్టేందుకు మా వద్ద ఎలాంటి రుజువుల్లేవు. బాధితుల ఫిర్యాదూ లేదు. కనీసం దోపిడీకి గురైన కంటెయినర్ల నంబర్లు కూడా ఇవ్వలేదు. అయినా, కేసు పూర్వాపరాలు కనుక్కోవాలని మా పోలీసులను మహారాష్ట్రకు పంపాం. వారికి అక్కడి అధికారులు సహకరించలేదు. వాళ్ల అదుపులో ఉన్న నిందితులతో మాట్లాడేందుకూ అనుమతివ్వలేదు' అని చెప్పారు. మహారాష్ట్ర సిట్‌కు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని, లేదంటే ఆ కేసు మాకు వదిలేసినా విచారిస్తామని ఎస్పీ స్పష్టంచేశారు. దీనిపై కర్ణాటక హోంమంత్రి డాక్టర్ జి.పరమేశ్వర్ కూడా స్పందించారు. 'మహారాష్ట్ర పోలీసులు మాకూ ఏ సమాచారమూ ఇవ్వలేదు. మా డీజీపీ మహారాష్ట్ర డీజీపీతో మాట్లాడారు. వారు కోరితే సహకరిస్తాం. ఇప్పటిదాకా మా పోలీసులెవ్వరూ ఈ కేసు దర్యాప్తులో భాగస్వాములు కాలేదు. నాసిక్ పోలీసులు లేఖ పంపినందునే, వివరాల సేకరణకు మా పోలీసులను అక్కడికి పంపామ'ని వెల్లడించారు.

రాజకీయంగా కుదుపు

దారిదోపిడీ కేసు రాజకీయంగా మలుపు తిరుగుతోంది. ఈ సొమ్మును రానున్న అస్సాం, పశ్చిమ బెంగాల్, కేరళ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ నేతలే తరలిస్తున్నట్లు భాజపా ఆరోపించింది. దీన్ని కర్ణాటక మంత్రులు ప్రియాంక్ ఖర్గే, సతీశ్ జార్ఖిహోళి ఖండించారు. 'ఈ దోపిడీ గురించి సమాచారమిచ్చిందే మహారాష్ట్ర పోలీసులు. మహారాష్ట్రతో పాటు గోవాలో ఉన్నవి భాజపా ప్రభుత్వాలే. ఈ కేసులో అరెస్టైన వ్యక్తుల్లో కొందరు గుజరాత్ వారున్నారు. అక్టోబరు 22న ఘటన జరిగినట్లు చెబుతుండగా, అది ముంబయి కార్పొరేషన్ ఎన్నికలకు సన్నాహాలు చేస్తున్న సమయమ'ని గుర్తుచేశారు. 'తరలిస్తున్న సొమ్ము పాత రెండు వేల రూపాయల నోట్లని పోలీసులు అంటున్నారు. అవి నేడు చెల్లుబాటులో లేవు. కాబట్టి, దీని విచారణ బాధ్యత కేంద్రమే తీసుకోవాల'ని మంత్రులు డిమాండ్ చేశారు. అంత సొమ్ము తరలిస్తున్నట్లు తమకు సమాచారముంటే, పోలీసు భద్రత కల్పించేవారమని మరో మంత్రి ఎంబీ పాటిల్ చెప్పారు.

కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న భాజపా

- ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే



సమావేశంలో పాల్గొన్న అర్చన ప్రసాద్, శ్రీమతి, మరియం ధావలే, మల్లు లక్ష్మి

ఈనాడు, హైదరాబాద్, న్యూస్‌టుడే, నల్లకుంట: సామాన్యులను విస్మరించి కార్పొరేట్లకు పట్టం కట్టేలా భాజపా వ్యవహరిస్తోందని, ఈ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజాక్షేత్రంలో ఎండగడతామని ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే అన్నారు. మహాసభల ప్రతినిధుల సమావేశాల సందర్భంగా సోమవారం హైదరాబాద్ ఆర్టీసీ కల్యాణ మండపంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, అస్సాం, ఆంధ్రప్రదేశ్, త్రిపుర, ఒడిశా, మణిపుర్ రాష్ట్రాల్లో సహజ వనరులను కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టడానికి భాజపా ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మణిపుర్ రాష్ట్రం ఘర్షణలతో అట్టుడికి, ఒత్తిడి పెరిగిన తర్వాతే అక్కడ భాజపా ముఖ్యమంత్రిని మార్చారనీ.. శాంతియుత పరిస్థితుల కోసం ఎలాంటి ప్రయత్నాలూ చేయలేదని విమర్శించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా పోరాడలేని భయానక పరిస్థితులు నెలకొన్నాయన్నారు. సమావేశంలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, జాతీయ ఉపాధ్యక్షురాలు ప్రొఫెసర్ అర్చన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

★ రెండో రోజు మహాసభ సమావేశంలో నాలుగు తీర్మానాలు ఆమోదం పొందాయి. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దాడులను నిరసిస్తూ.. పాలస్తీనా, వెనిజువెలాకు సంఘీభావంగా తీర్మానాలు చేశాం. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరుతో బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓట్లను తొలగించగా, దానిని వ్యతిరేకిస్తూ మరో తీర్మానం చేశాం. దేశవ్యాప్తంగా ముస్లింలు, క్రైస్తవులతోపాటు ఇతర అల్పసంఖ్యాకవర్గాలపై దాడులను నిరసిస్తూ మరో తీర్మానాన్ని మహాసభలో చర్చించగా ఆమోదం పొందింది.

– శ్రీమతి, ఐద్వా జాతీయ అధ్యక్షురాలు

మీ భవిష్యత్తును లిఖించుకోండి



భవిష్యత్తులో మీరు ఎలా ఉండాలనుకుంటున్నారు, అందుకోసం ఏం చేయాలనుకుంటున్నారు అన్న వివరాలను ఓ పుస్తకంలో రాసుకోండి. ఆ లక్ష్యాన్ని సంవత్సరాలు, నెలలు, వారాల వారీగా చిన్న చిన్న లక్ష్యాలుగా విభజించుకోండి. లక్ష్యం వైపు మిమ్మల్ని తీసుకెళ్లే మూడు ముఖ్యమైన విషయాలను గుర్తించి వాటిని మొదలుపెట్టండి. ఫలితం గురించి పక్కన పెట్టి ఆ రోజు చేయాల్సిన పనిని పూర్తిచేయండి. పెద్ద లక్ష్యాలను చిన్న భాగాలుగా విడగొట్టి వాటిని క్రమం తప్పకుండా చేయడమే అసలైన విజయ రహస్యం.

– డాన్‌కో, రచయిత

ప్రయాణికులను రక్షించారు.. చికిత్స ఆలస్యమై మృత్యుఒడికి చేరారు..

గుండెపోటుతో ఏపీఎస్‌ఆర్టీసీ బస్సు డ్రైవర్ మృతి



డ్రైవరు నాగరాజు

చౌటుప్పల్, కానూరు, న్యూస్‌టుడే: ఛాతీలో నొప్పిగా అనిపించడంతో ప్రయాణికుల భద్రతను ఆలోచించిన డ్రైవర్ బస్సును పక్కకు నిలిపారు. తరువాత ఓ ఆటో ఎక్కి ఏదైనా ఆసుపత్రికి తీసుకెళ్లాలని కోరారు. కానీ ఆ ప్రాంతంలో సరైన ఆసుపత్రుల్లేక.. ఉన్నచోట వైద్యుల్లేక చికిత్స ఆలస్యమవడంతో ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన తెలంగాణలోని చౌటుప్పల్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ తాడిగడప వసంత్‌నగర్ కట్టకు చెందిన నాగరాజు(38) విజయవాడ బస్‌డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఆదివారం రాత్రి ఏపీఎస్‌ఆర్టీసీ అమరావతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్(ఏపీ16 జడ్ 0323)లో బయలుదేరి, సోమవారం తెల్లవారుజామున హైదరాబాద్‌కు చేరుకున్నారు. విశ్రాంతి తీసుకుని మధ్యాహ్నం 12.30కు హైదరాబాద్ మియాపూర్ బస్‌స్టేషన్ నుంచి 18 మంది ప్రయాణికులతో విజయవాడకు బయలుదేరారు. అబ్దుల్లాపూర్‌మెట్‌కు వచ్చాక ఆయాసంగా అనిపిస్తోందని బస్సును నిలిపి మెడికల్ దుకాణంలో ఔషధాలు కొనుక్కున్నారు. 3.30కు చౌటుప్పల్ వద్దకు రాగానే ఛాతీలో నొప్పిగా ఉందని అటెండర్ చంద్రారెడ్డికి చెప్పి బస్సును సర్వీసు రోడ్డులోకి మళ్లించి ఆపారు. ప్రయాణికులను వేరే బస్సులో పంపాలని సూచించారు. ఓ ఆటోను పిలిచి తన దగ్గరున్న డబ్బులిచ్చి దగ్గర్లోని ఏదైనా ఆసుపత్రికి తీసుకెళ్లాలని కోరారు. ఆటోడ్రైవర్ శ్రీశైలం మొదట గాంధీపార్కు సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా.. అక్కడ డాక్టర్ లేరని చెప్పారు. మరో ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా సీరియస్ కేసులు తాము చూడమని చెప్పడంతో.. ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే ఆయన చనిపోయినట్లు చెప్పారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. చౌటుప్పల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాకినాడ జిల్లాలో అన్‌బ్రాండెడ్ సిగరెట్లు స్వాధీనం

311 అట్టపెట్టెల్లోని సరకు విలువ రూ.2 కోట్లుగా అంచనా

సర్పవరం(కాకినాడ గ్రామీణం), న్యూస్‌టుడే: కాకినాడకు కూతవేటు దూరంలోని తూరంగి గ్రామంలో సోమవారం అక్రమంగా నిల్వచేసిన సుమారు రూ.2 కోట్ల విలువైన అన్‌బ్రాండెడ్(పన్నులు చెల్లించని) సిగరెట్లను విజిలెన్స్ డీఎస్పీ తాతారావు ఆధ్వర్యంలో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ గ్రామీణ మండలం తూరంగిలో పచ్చిగోళ్ల అప్పారావు అనే వ్యక్తి కిరాణా సరకులు నిల్వచేయడానికి రెండు నెలల క్రితం స్నేహితుడి ద్వారా ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నారు. దానిలో 311 అట్టపెట్టెల నిండా అన్‌బ్రాండెడ్ సిగరెట్లను ఉంచారు. ఆ సరకును అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఏయే వాహనాల ద్వారా ఎక్కడి నుంచి తీసుకొచ్చారనేది పోలీసులు విచారిస్తున్నారు.





అన్‌బ్రాండెడ్ సిగరెట్లను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు ★ అట్టపెట్టెల్లో నిల్వ ఉంచిన సరకు

EENADU Vol: 52, Issue: 167 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

అపోహలు నమ్మితే అంతే!



వాస్తవాలను తెలుసుకోలేకపోవటం కన్నా అబద్ధాలను నమ్మితేనే ఎక్కువ అనర్థం. ఆరోగ్యం విషయంలో ఇది ముమ్మాటికీ నిజం. లేనిపోని అపోహలు, అప నమ్మకాలు ఆరోగ్యానికి హానికరం. ఇవి అసలు కారణాన్ని గుర్తించనీయకుండా సమస్య మరింత జటిలమయ్యేలా చేస్తాయి. సరైన చికిత్స తీసుకోనీయకుండా అడుగడుగునా అడ్డు తగులుతుంటాయి. పెద్దవారు, తెలిసినవారు చెప్పారనో.. అలవాటుగా వస్తోందనో గుడ్డిగా ఆచరించటానికి బదులు నిజమేంటో తెలుసుకొని మసలుకోవటం చాలా ముఖ్యం.

పప్పు తింటే చీము పట్టదు

పుండు పడిదంటే చాలు. చీము పడుతుందనే భావనతో పప్పు తినటం మానేస్తుంటారు. ఆసుపత్రుల్లో శస్త్రచికిత్స చేయించుకున్నవారూ ఇలాగే చేస్తుంటారు. 'నిన్ననే ఆపరేషన్ అయ్యింది, అప్పుడే పప్పు పెడతారా?' అని డాక్టర్లనే ప్రశ్నిస్తుంటారు. చదువుకోనివారే కాదు, చదువుకున్నవారూ 'పప్పు తినొచ్చా?' అని తరచూ అడుగుతుంటారు. పప్పు తినటానికీ చీముకు సంబంధం లేదు. బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్ తలెత్తటం లేదా ఇన్‌ఫెక్షన్లకు రోగనిరోధక శక్తి ప్రతిస్పందించటం మూలంగానే చీము పడుతుంది. నిజానికి గాయం త్వరగా మానటానికి మాంసకృత్తులు (ప్రొటీన్) అత్యవసరం. ఇందుకు పప్పులు బాగా తోడ్పడతాయి. మనదేశంలో మాంసాహారం తినటమే తక్కువ. దీంతో సహజంగానే చాలామందిలో ప్రొటీన్ తక్కువగా ఉంటుంది. శాకాహారంలో ప్రధానంగా పప్పులతోనే ప్రొటీన్ లభిస్తుంది. వీటిని కూడా మానేస్తే ప్రొటీన్ లోపానికి దారితీస్తుంది. ఫలితంగా రోగనిరోధక శక్తి తగ్గుతుంది. కాబట్టి గాయం త్వరగా మానాలన్నా, రోగనిరోధకశక్తి పెరగాలన్నా పప్పులు తినటం తప్పనిసరి. చీము పడుతుందనే భయం వద్దు. చీముకు కారణం బ్యాక్టీరియా అని తెలియని రోజుల్లో ఇలాంటి అపోహలు ఉండేవి. అవి ఇంకా కొనసాగుతూనే వస్తుండటం దురదృష్టకరం.

● పెరుగు, మజ్జిగతోనూ చీము పట్టదు.

అతి నీరు అనర్థమే



శరీరం శుభ్రపడుతుందనే భావనతో కొందరు పొద్దున లేవగానే లీటర్ల కొద్దీ నీరు తాగుతుంటారు. ఇలా అతిగా, ఒకేసారి తాగటం ఏమాత్రం మంచిది కాదు. తాగిన నీరు శరీరంలో అలాగే ఉండిపోదు. మూత్రం రూపంలో బయటకు వచ్చేస్తుంది. మూత్రంతో పాటు సోడియం వంటి లవణాలూ బయటకు పోతాయి. అనవసరంగా ఎక్కువగా నీరు తాగినప్పుడు అతిగా మూత్రం వస్తే సోడియం మోతాదులు పడిపోయి, హైపోనేట్రీమియాకు దారితీయొచ్చు. దీంతో ప్రవర్తన మారిపోవచ్చు, మత్తుగా అనిపించొచ్చు. కొందరికి మూర్ఛ, మెదడు దెబ్బతినటం వంటి తీవ్ర సమస్యలూ తలెత్తొచ్చు. కాబట్టి తగినంత నీరు తాగితే చాలని గుర్తించాలి. మూత్రం రంగు గాఢంగా లేకుండా, లేత పసుపు రంగులో వచ్చేలా చూసుకుంటే చాలు. నీటి అవసరం చేసే పనులు, వాతావరణాన్ని బట్టి ఉంటుంది. చలికాలంలో, ఏసీ గదిలో గడిపేవారికి తక్కువగా.. ఎండాకాలంలో, ఎండలో పనిచేసేవారికి ఎక్కువగా నీరు కావాలి. వృద్ధులకు తప్ప మిగతా అందరికీ దాహం వేస్తున్న విషయం తెలుస్తుంది. దాహం వేసినా, వేయకపోయినా సరిపడినంత నీరు తాగటం తప్పనిసరి. ఎక్కువ తాగితే శరీరం శుభ్రపడుతుందని అనుకోవటం తగదు. అధిక రక్తపోటు మందులు వేసుకునేవారు దీని విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. బీపీ మాత్రల్లో అప్పటికే సోడియాన్ని తగ్గించే గుణముంటుంది. బీపీ ఉందని కొందరు ఉప్పు దాదాపుగా మానేస్తుంటారు. ఇలాంటివారు నీరు అతిగా తాగితే మరింత ప్రమాదం ముంచుకొస్తుంది.

జ్వరం వచ్చినా అన్నం తినొచ్చు



జ్వరం వచ్చినప్పుడు అన్నం తినకూడదని చాలామంది నమ్ముతుంటారు. కడుపు మాడిస్తే జ్వరం త్వరగా తగ్గుతుందని భావిస్తుంటారు. ఇది అపోహ మాత్రమే. నిజానికి అన్నం తింటే తక్షణం శక్తి లభించి, బలహీనత తగ్గుతుంది. సాధారణంగా బ్యాక్టీరియా, వైరల్ ఇన్‌ఫెక్షన్లతో శరీరం పోరాడే క్రమంలో జ్వరం వస్తుంటుంది. ఉష్ణోగ్రత పెరగటం వల్ల శరీరం మీద ఎక్కువ భారం పడుతుంది కూడా. మరోవైపు ఆవిరి, చెమట రూపంలో నీరు ఎక్కువగా పోవటం వల్ల ఒంట్లో నీటిశాతం తగ్గుతుంది. ఇలాంటి సమయంలో సరైన ఆహారం తీసుకోవటం తప్పనిసరి. ముఖ్యంగా ద్రవాలు ఎక్కువగా తీసుకోవాలి. కూరగాయల రసాలు, జావ, గంజి, కొబ్బరి నీరు, మజ్జిగ వంటివి తీసుకుంటే మేలు. అలాగని ఘనాహారం అసలే తీసుకోకూడదని కాదు. తేలికగా జీర్ణమయ్యే అన్నం, కిచిడీ, బ్రెడ్, బాగా ఉడికించిన కూరగాయల వంటివి తినొచ్చు. ఏది తిన్నా శుభ్రంగా ఉండాలి. తాజాగా వండినదే తినాలి. దంపుడు బియ్యం అరగటం కష్టం. కాబట్టి తెల్ల బియ్యంతో వండిన అన్నమే తినాలి. అయితే నూనె పదార్థాలు, వేపుళ్లు, బిర్యానీ, మసాలా పదార్థాల వంటివి మాత్రం తినొద్దు.

● జ్వరం వచ్చినప్పుడు మాంసం తింటే కామెర్లు వస్తాయని కొందరు భావిస్తుంటారు. ఇదీ నిజం కాదు. మాంసానికీ కామెర్లకూ సంబంధం లేదు. అయితే సరిగా వండటం ముఖ్యం. బాగా ఉడికిస్తే మాంసంలోని సాల్మోనెల్లా, కాంపైలోబ్యాక్టర్ వంటి బ్యాక్టీరియా చనిపోతాయి. అప్పుడు ఇన్‌ఫెక్షన్లేమీ రావు. అయితే మాంసం త్వరగా జీర్ణం కాదు. ఇది కొందరికి ఇబ్బంది కలిగించొచ్చు. ఇలాంటివారు జ్వరం తగ్గేవరకూ తినకుండా ఉండటమే మంచిది.

కామెర్లకు చప్పిడి వద్దు



కామెర్లు వస్తే పూర్తిగా చప్పిడి ఆహారం పెడుతుంటారు. కూరగాయలు, నూనె, ఆకుకూరల వంటివేవీ ఇవ్వకుండా కడుపు మాడ్చేస్తుంటారు. నిజానికి కామెర్లు వస్తే కూరగాయలు మానెయ్యాలని గానీ నూనె అసలే వాడొద్దని గానీ ఎక్కడా లేదు. అన్నం, కూరగాయల వంటి తేలికగా జీర్ణమయ్యే పదార్థాలు తినొచ్చు. నూనె మొత్తంగా మానెయ్యాల్సిన అవసరం లేదు. కొద్దిగా నూనె వేసి వండిన కూరగాయలేవైనా తినొచ్చు. కాకపోతే కామెర్లు తీవ్రమైన సందర్భాల్లో ప్రొటీన్ ఎక్కువగా తింటే కొన్ని సమస్యలు తలెత్తొచ్చు. ఇలాంటివారికి ప్రొటీన్ తక్కువగా తీసుకోవాలని సూచిస్తుంటాం. అందువల్ల మాంసాహారం తినొద్దు. పప్పులు, పన్నీరు, గుడ్డు తెల్లసొన వంటివి తినొచ్చు. పండ్లు, కూరగాయలు ఎక్కువగా తినాలి. సరైన ఆహారం తీసుకోకపోతే పోషణలోపం తలెత్తి సమస్య మరింత తీవ్రమవుతుందని గుర్తించాలి. కామెర్లకు కారణం వైరస్‌లు. వీటి ఇన్‌ఫెక్షన్‌ను రోగనిరోధక శక్తి బలంగా ఎదుర్కోవాలంటే సరైన ఆహారం తీసుకోవటం అవసరం. కాబట్టి మొత్తంగా ఆహారం మానేస్తే మొదటికే మోసం వస్తుంది.

నోట్లో వేళ్లేసి కక్కితే అనర్థమే

పొద్దున పళ్లు తోముకొని, ముఖం కడుక్కునేటప్పుడు చాలామంది నోట్లో వేళ్లు వేసి, గట్టిగట్టిగా కాండ్రిస్తూ కక్కుతుంటారు. రాత్రంతా పొట్టలో కళ్లె, పైత్యరసం వంటివి పేరుకుంటాయని, వాటిని బయటకు తీయకపోతే పొట్టంతా ఉబ్బరిస్తుందని, తిన్నది జీర్ణం కాదని భావిస్తుంటారు. ఇది పూర్తిగా అబద్ధం, అశాస్త్రీయం. నోట్లో వేళ్లు వేసి కక్కటం వల్ల గొంతులో పుండ్లు పడే ప్రమాదముంది. మరీ బలంగా కక్కితే అన్నవాహిక పగిలిపోయిన సందర్భాలూ ఉన్నాయి. కొందరికి అన్నవాహిక అడుగుభాగం చిట్లిపోయి (మాలరీ వీస్ టేర్) రక్తస్రావం కావొచ్చు. కొన్నిసార్లు ఇది ప్రాణాంతకంగానూ పరిణమించొచ్చు. మనలో అందరికీ ప్రతి నిమిషం జీర్ణాశయంలోకి పైత్యరసం చేరుతూనే ఉంటుంది. ఇది కొవ్వు పదార్థాలు జీర్ణం కావటానికి తోడ్పడుతుంది. దీన్ని అనవసరంగా బయటకు తీయాల్సిన అవసరం లేదు.

నీరు మారితే జలుబు రాదు



'మేం ఊరెళ్లామండీ. నీరు మారింది. జలుబు చేసింది' అని చెబుతుంటారు. వెంటనే వేడినీరు తాగటం వంటివి చేస్తుంటారు. నీరు మారటం వల్ల జలుబు చేయదు. ఊరెళ్లినప్పుడు బస్సులోనో, రైలులోనో అప్పటికే జలుబుతో బాధపడేవారు తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు, వెలువడే తుంపర్లతో కూడిన గాలిని పీల్చుకోవటం వల్ల వైరస్ వ్యాపిస్తుంది. తుంపర్లు అంటుకున్న వస్తువుల మీద చేతిని ఆనించి, అదే చేత్తో ముక్కు, నోరు, కళ్లు రుద్దుకోవటంతోనూ ఒకరి నుంచి మరొకరికి సోకుతుంది. అంతే తప్ప నీటితో జలుబు చేయదు. వర్షంలో తడిసినా జలుబు రాదు.

● జామకాయ, నిమ్మకాయ వంటి వాటితోనూ జలుబు చేయదు. అయితే ఎవరికైనా ఆయా పదార్థాలు పడకపోతే అలర్జీ లక్షణాలు కనిపించే అవకాశముంది.

చికెన్ తింటే వేడి చేయదు

కోడికూర, గుడ్లు తింటే వేడి చేస్తుందని కొందరు భావిస్తుంటారు. ఇందులో నిజం లేదు. కూరలో కారం, మసాలాలు బాగా వేయటం వల్ల కడుపులో మంట పుట్టొచ్చు. దీన్ని వేడిగా అనుకోవచ్చు. కొందరికి మాంసాహారంతో మల విసర్జన సాఫీగా కాదు. దీంతో మలద్వారం వద్ద నొప్పి, మంట కలగొచ్చు. అప్పటికే మొలలు, మలద్వార చీలికలు గలవారికిది మరింత బాధ కలిగిస్తుంది. విసర్జన సమయంలో రక్తం పడొచ్చు. దీన్ని వేడిగా పొరపడుతుంటారు. మాంసం బాగా ఉడకకపోయినా, చెడిపోయినా ఇన్‌ఫెక్షన్ తలెత్తి రక్త విరేచనాలు పట్టుకోవచ్చు. ఇందులోనూ కడుపులో నొప్పి, మంట పుడుతుంది. మలంలో రక్తం పడొచ్చు కూడా. దీన్ని కూడా వేడిగా భావిస్తుంటారు. ఏవైనా పదార్థాలు పడనివారికి కొన్ని చిక్కులు కలుగుతుండొచ్చు గానీ ఆహార పదార్థాలతో వేడి చేస్తుందని అనుకోవటం పూర్తిగా అపోహ.



డా॥ ఎం.వి.రావు
జనరల్ ఫిజీషియన్
యశోదా హాస్పిటల్
సోమాజిగూడ
హైదరాబాద్

నడుస్తుంటే తూలుతున్నా

సమస్య
సలహా

సమస్య: నాకు 44 ఏళ్లు. ఐదేళ్లుగా నడుస్తున్నప్పుడు తూలుతున్నట్టు అనిపిస్తోంది. అప్పుడప్పుడూ ఏదో తోసినట్టయ్యి, శరీరం పక్కకు తిరుగుతుంటుంది. ఆగిన కారులో కూర్చున్నప్పుడు కదులుతున్నట్టు అనిపిస్తుంటుంది. డాక్టర్‌కు చూపించుకుంటే విటమిన్ బి12 లోపం లక్షణాలని చెప్పి, మాత్రలు ఇచ్చారు. అవి వేసుకున్నా, ఆహారంలో మార్పులు చేసుకున్నా ఫలితం లేదు. దీనికేంటి పరిష్కారం? – కె. విశ్వనాథ్

సలహా: శరీరం తూలటానికి మెదడు, లోపలి చెవి సమస్యలు రెండూ కారణమవుతుంటాయి. వినికిడికి, శరీర స్థిరత్వానికి తోడ్పడే లోపలి చెవిలోని భాగాల నుంచి అందే సమాచారాన్ని వెస్టిబ్యులోకాక్లియర్ అనే నాడి మెదడుకు చేరవేస్తుంది. చిన్న మెదడు, అలాగే కళ్లు, కీళ్ల నుంచి అందే సమాచారం కూడా ఇందులో కీలక పాత్ర పోషిస్తాయి. మీ లక్షణాలను బట్టి చూస్తే మీరు వెస్టిబ్యులార్ మైగ్రేన్‌తో బాధపడుతున్నట్టు అనిపిస్తోంది. ఇదో రకం పార్శ్వనొప్పి. సాధారణంగా పార్శ్వనొప్పిలో తలనొప్పి పుడుతుంది. కానీ ఇందులో తలనొప్పి ఉండొచ్చు, ఉండకపోవచ్చు. శరీరం తూలినట్టు, తోసినట్టు, తల తిప్పుతున్నట్టూ అనిపించొచ్చు. తలతిప్పు (వర్టిగో) సమస్యలోనూ తూలటం గమనిస్తుంటాం. అందువల్ల ఆయా లక్షణాలు, ఇబ్బందులను గమనించి, సమస్యను నిర్ధారించాల్సి ఉంటుంది. మీరు చెవి, ముక్కు, గొంతు (ఈఎన్‌టీ) నిపుణులు, న్యూరాలజిస్ట్ ఇద్దరినీ కలవాల్సి ఉంటుంది. ఈఎన్‌టీ నిపుణులు చెవి సమస్యలను నిర్ధారిస్తారు. చెవి సమస్యలేవీ లేనట్టయితే న్యూరాలజిస్టును సంప్రదించాల్సి ఉంటుంది. వెస్టిబ్యులార్ మైగ్రేన్‌కు బీటా హిస్టిన్ మాత్రలు మేలు చేస్తాయి. వీటిని దీర్ఘకాలం వాడాల్సి రావొచ్చు. తలనొప్పి ఉన్నట్టయితే అది ఎప్పుడెప్పుడు మొదలవుతుందో గుర్తించాలి. నిద్రలేమి, సమయానికి తినకపోవటం, రక్తంలో గ్లూకోజు పడిపోవటం, కొన్నిరకాల పదార్థాలు, దూర ప్రయాణాల వంటివి పార్శ్వనొప్పిని ప్రేరేపిస్తుంటాయి. ఇలాంటి ప్రేరకాలకు గురికాకుండా చూసుకోవాలి. విటమిన్ బి12 లోపంతోనూ తోసినట్టు, తిప్పినట్టు అనిపించొచ్చు. అయితే మీరు రక్త పరీక్షతో బి12 లోపాన్ని నిర్ధారించుకున్నారో, లేదో తెలియజేయలేదు. లోపం తీవ్రంగా ఉంటే మాత్రలు ఉపయోగపడవు. జీర్ణాశయం నుంచి శరీరం దీన్ని అంతగా గ్రహించుకోదు. బి12 ఇంజెక్షన్లు తీసుకుంటేనే ఫలితం కనిపిస్తుంది. విటమిన్ డి తీసుకోవటం కూడా ముఖ్యమే.






- డా॥ ఎన్.విష్ణుస్వరూప్ రెడ్డి,
సీనియర్ ఈఎన్‌టీ సర్జన్

మీ ఆరోగ్య సమస్యలను sukhi@eenadu.in కు పంపొచ్చు.

మద్యంతో తీవ్ర పక్షవాతం!

పక్షవాతం తీవ్ర సమస్య. మెదడులో రక్తస్రావం కావటం (హెమరేజిక్) మూలంగా తలెత్తే పక్షవాతం మరీ తీవ్రమైన సమస్య. దీని బారినపడ్డవారిలో 50% వరకూ మరణిస్తుంటారు. 30% మందిని తీవ్ర వైకల్యం వేధిస్తుంది. కేవలం 20% మందే ఏడాది తర్వాత తమ పనులు తాము చేసుకునే స్థితికి చేరుకుంటారు. అందువల్ల దీన్ని నివారించుకోవటమే ఉత్తమం. దీనికి మంచి మార్గం మద్యం జోలికి వెళ్లకుండా ఉండటం. తాజా అధ్యయనం ఇదే చెబుతోంది. అసలే తాగని లేదా కొద్దిగా తాగేవారితో పోలిస్తే అతిగా మద్యం తాగేవారికి 11 ఏళ్లు ముందుగానే మెదడులో రక్తస్రావంతో ముడిపడిన పక్షవాతం ముంచుకొస్తున్నట్టు బయటపడింది. కొద్దిగా మద్యం తాగేవారు సగటున 75 ఏళ్ల వయసులో పక్షవాతం బారినపడితే.. అతిగా తాగేవారు సగటున 64 ఏళ్ల వయసులోనే దీనికి గురవుతున్నారని తేలింది. హెమరేజిక్ పక్షవాతంతో ఆసుపత్రి పాలైన 1,600 మందిని పరిశీలించి ఈ విషయాన్ని గుర్తించారు. మద్యం జోలికి వెళ్లకపోవటం, అలవాటుంటే తగ్గించుకోవటం మంచిదని ఈ అధ్యయన ఫలితాలు సూచిస్తున్నాయి. ఇది పక్షవాతమే కాదు, సూక్ష్మ రక్తనాళాలు సమస్యతో మెదడులోని భాగాలు దెబ్బతినే (సీఎస్‌వీడీ) సమస్య తగ్గటానికీ తోడ్పడుతుంది. సీఎస్‌వీడీతో రెండోసారి పక్షవాతం రావటం, విషయగ్రహణ సామర్థ్యం తగ్గటం, దీర్ఘకాలం వైకల్యం వేధించటం వంటి ప్రమాదాలు పొంచి ఉంటాయి మరి.



కిడ్నీలు విఫలమై, డయాలిసిస్ చేయించుకుంటున్నవారికి చేప నూనె మాత్రలు మేలు చేస్తున్నట్టు తాజాగా బయటపడింది. వీటితో తీవ్ర గుండె సమస్యల ముప్పు తగ్గుతున్నట్టు వెల్లడైంది. కిడ్నీ విఫలమైనవారిలో సంభవిస్తున్న మరణాలకు గుండె-రక్తనాళాల జబ్బు ప్రధాన కారణంగా నిలుస్తున్న నేపథ్యంలో ఈ అధ్యయన ఫలితాలు ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి.

కిడ్నీజబ్బు బాధితులకు చేప నూనె మాత్ర రక్ష


ప్రపంచవ్యాప్తంగా దాదాపు 10% మంది దీర్ఘకాల కిడ్నీజబ్బుతో బాధపడుతున్నారని అంచనా. ప్రస్తుతం 20 లక్షల కన్నా ఎక్కువమంది డయాలిసిస్ లేదా కిడ్నీ మార్పిడి చేయించుకుంటున్నారు. గుండె-రక్తనాళ సమస్యలతో మరణిస్తున్నవారిలో సుమారు 11.5% మంది కిడ్నీజబ్బు బాధితులే ఉంటుండటం గమనార్హం. కిడ్నీలు, గుండె పరస్పరం ఆధారపడి ఉంటాయి. ఒక దాని మీద మరోటి ప్రభావం చూపుతాయి. కిడ్నీలు సరిగా పనిచేయకపోతే రక్తంలో నీరు, వ్యర్థాలు ఎక్కువవుతాయి. దీంతో గుండె మీద అధిక భారం పడుతుంది. మరింత బలంగా పనిచేయాల్సి వస్తుంది. ఇది క్రమంగా గుండె జబ్బుకు దారితీస్తుంది. కొన్నిసార్లు గుండె పూర్తిగా చేతులెత్తేయొచ్చు కూడా. వాపుప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్) నివారణకు, గుండెను కాపాడుకోవటానికి ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు తోడ్పడతాయనే విషయం ఇప్పటికే తెలుసు. అయితే డయాలిసిస్ చేయించుకుంటున్నవారిలో వీటి ప్రభావం గురించి కచ్చితంగా తెలియదు. ఈ నేపథ్యంలో మోనాష్ యూనివర్సిటీ, అంతర్జాతీయ సంస్థలు ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలతో కూడిన చేప నూనె మాత్రల మీద అధ్యయనం నిర్వహించాయి. ఇవి కిడ్నీ వైఫల్య బాధితుల్లో మరణం, తీవ్ర గుండెజబ్బుల ముప్పును తగ్గిస్తున్నట్టు గుర్తించాయి. చేప నూనె మాత్రలతో గుండెజబ్బు మూలంగా మరణించే ముప్పు సగానికి సగం తగ్గగా, గుండెపోటు ముప్పు గణనీయంగా తగ్గుముఖం పట్టింది. పక్షవాతం, అలాగే కాళ్లూ చేతులు తొలగించటానికి కారణమయ్యే రక్తనాళ సమస్యలు తలెత్తే ప్రమాదమూ తగ్గటం విశేషం.



పేగు బ్యాక్టీరియా ఆరోగ్యంగా..

మన పేగుల్లో కోట్లాది సూక్ష్మక్రిములుంటాయి. వీటిల్లో మంచి చేసేవే కాదు, కీడు కలిగించేవీ ఉంటాయి. మంచి బ్యాక్టీరియా జీర్ణకోశ వ్యవస్థ మొత్తమంతా ఉంటుంది గానీ పెద్ద పేగులో ఇంకాస్త ఎక్కువ. ఇవి తిన్న ఆహారం జీర్ణం కావటానికి, పోషకాలను శరీరం గ్రహించుకోవటానికి తోడ్పడతాయి. ఆకలిని నియంత్రించే హార్మోన్లు విడుదల కావటానికి, కొన్నిరకాల విటమిన్ల సంశ్లేషణకు, అలాగే రోగనిరోధక వ్యవస్థ సక్రమంగా పనిచేయటానికి దోహదం చేస్తాయి. అయితే కొన్నిసార్లు మంచి, చెడు బ్యాక్టీరియా మధ్య సమతుల్యత లోపిస్తుంటుంది. దీన్ని సరిచేసుకొని, పేగుల ఆరోగ్యాన్ని కాపాడుకోవటం మంచిది.

ఆహారం మార్పు: శాకాహారంలో నీటిలో కరిగే, కరగని పీచు రెండూ ఉంటాయి. ఇవి జీర్ణక్రియ సజావుగా సాగేలా చేయటం ద్వారా పేగులు ఆరోగ్యంగా ఉండేలా చూస్తాయి. కాబట్టి రోజూ పండ్లు, కూరగాయలు విధిగా తీసుకోవాలి. పళ్లెంలో ఆకుపచ్చ, నారింజ, ఎరుపు, పసుపు, ఊదా.. ఇలా రకరకాల రంగుల ఆహార పదార్థాలు ఉండేలా చూసుకుంటే మంచిది. ఎక్కువ ఉప్పు, వేపుళ్లు, కృత్రిమ తీపి పదార్థాలు, మాంసం తగ్గించుకోవాలి కూడా.



మనసు ప్రశాంతంగా: దీర్ఘకాల మానసిక ఒత్తిడి పేగు బ్యాక్టీరియా మీద ప్రతికూల ప్రభావం చూపుతుంది. పేగు లోపలి పైపొరను దెబ్బతీసే హార్మోన్లను విడుదలయ్యేలా పురికొల్పుతుంది. దీంతో పొర దెబ్బతిని, హానికర బ్యాక్టీరియా, విషతుల్యాలు రక్తంలోకి లీక్ కావొచ్చు. కాబట్టి మానసిక ఒత్తిడిని తగ్గించుకొని, ప్రశాంతంగా ఉండేందుకు ప్రయత్నించాలి.

నడుం నొప్పికి ఆక్యుపంక్చర్

వృద్ధుల్లో చాలామంది నడుం నొప్పితో ఇబ్బంది పడుతుంటారు. మూడు నెలలు దాటినా నొప్పి తగ్గకపోతే దీర్ఘకాల సమస్యగా పరిగణిస్తుంటారు. కొందరికి మందులు, ఫిజియోథెరపీ వ్యాయామాలతో నొప్పి తగ్గుతుంటుంది. కానీ కొందరికి వీటితో పెద్దగా ఫలితం కనిపించదు. ఇలాంటివారికి మందులతో పనిలేని ఆక్యుపంక్చర్ చికిత్స మేలు చేస్తున్నట్టు జామా పత్రికలో ప్రచురితమైన అధ్యయనం పేర్కొంది. ఆక్యుపంక్చర్‌లో సన్నటి సూదులను చర్మం కింద గుచ్చుతారు. ఇవి ఆయా కేంద్రాలను ఉత్తేజితం చేసి నొప్పులు తగ్గటానికి తోడ్పడతాయి. వృద్ధుల్లో దీని ప్రభావాలను గుర్తించటానికి 65 ఏళ్లు పైబడిన 800 మందిని ఎంచుకొని, 12 వారాల పాటు అధ్యయనం చేశారు. కొందరికి మందులు మాత్రమే ఇవ్వగా, మరికొందరికి మందులతో పాటు ఆక్యుపంక్చర్ చికిత్స కూడా చేశారు. ఇంకొందరికి ఆక్యుపంక్చర్ చికిత్సను మరింత ఎక్కువ కాలమూ ఇచ్చారు. వీరిలో మందులు మాత్రమే వేసుకున్నవారితో పోలిస్తే ఆక్యుపంక్చర్ చికిత్స తీసుకున్నవారిలో నడుం నొప్పి మరింతగా తగ్గినట్టు గుర్తించారు. ఆరు నెలల తర్వాత తమ పనులు తాము చేసుకోవటమూ మెరుగైంది. ఏడాది తర్వాత వైకల్యమూ తగ్గినట్టు గుర్తించారు. అలాగే ఆందోళన లక్షణాలూ తగ్గాయి. నడుం నొప్పి తగ్గటానికి అప్పటికే రకరకాల మందులు వేసుకుంటున్నవారికి ఆక్యుపంక్చర్ ఒక ప్రత్యామ్నాయం కాగలదని పరిశోధకులు సూచిస్తున్నారు.

మగవారికీ ఈస్ట్రోజన్

జాగ్రత్తలు ఇవీ..

ఈస్ట్రోజన్ అనగానే అది స్త్రీ హార్మోన్ అనే గుర్తుకొస్తుంది. కానీ ఇది మగవారి ఆరోగ్యానికీ కీలకమే. మగ హార్మోన్ అని పిలుచుకునే టెస్టోస్టిరాన్ పురుషుల్లో ఎక్కువగా ఉండే మాట నిజమే అయినా.. కొద్దిమొత్తంలో ఈస్ట్రోజన్ కూడా ఉంటుంది. దీని మోతాదులు పడిపోతే ఎముకల పటుత్వం, మానసిక ధోరణి దగ్గరి నుంచి గుండె ఆరోగ్యం వరకూ అన్నీ అస్తవ్యస్తమవుతాయి తెలుసా?

ఆడవారిలో రజస్వల, రుతుస్రావం తీరుతెన్నుల్లో ఈస్ట్రోజన్ ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఇది మహిళల్లో కన్నా మగవారిలో తక్కువగా విడుదలవుతుంది. అరోమాటేజ్ అనే ఎంజైమ్ టెస్టోస్టిరాన్ హార్మోన్‌ను ఈస్ట్రోజన్‌గా మారుస్తుంది. స్వల్ప మోతాదుల్లోనే ఉన్నప్పటికీ మగవారిలో ఇది గణనీయమైన ప్రభావాన్నే చూపుతుంది. ఈస్ట్రోజన్ తగ్గిపోతే శారీరకంగా, మానసికంగానే కాదు.. శృంగార పరంగానూ చిక్కులు తెచ్చిపెడుతుంది. సాధారణంగా పురుషుల్లో ఈస్ట్రోజన్ మోతాదులు 10-40 పీజీ/ఎంఎల్ ఉంటే ఆరోగ్యకర స్థాయిలో ఉన్నట్టు భావిస్తారు. ఇవి తగ్గినా, పెరిగినా సమస్యలకు దారితీస్తుంది.



పెరిగితే ఏమవుతుంది?

మగవారిలో వయసు మీద పడుతున్నకొద్దీ టెస్టోస్టిరాన్ తగ్గుతూ వస్తుంటుంది. అదే సమయంలో ఈస్ట్రోజన్ పెరుగుతుంటుంది. చాలామందిలో ఇదేమీ ఇబ్బంది కలిగించదు. కానీ దీని మోతాదులు బాగా పెరిగితే కొన్ని సమస్యలు తెచ్చిపెడుతుంది.

● వీర్యం ఉత్పత్తి కావటంలో ఈస్ట్రోజన్ కూడా పాలు పంచుకుంటుంది. ఇది తగ్గితే వీర్యం ఉత్పత్తి నెమ్మదిస్తుంది. నాణ్యత కూడా తగ్గుతుంది. ఫలితంగా సంతానం కలగటంలో ఇబ్బంది తలెత్తొచ్చు.

● ఈస్ట్రోజన్ ఎక్కువైతే రొమ్ముకణజాలం మామూలు కన్నా ఎక్కువగా పెరగొచ్చు. దీంతో మగవారికి రొమ్ములు వచ్చినట్టు అనిపిస్తుంది.

● స్తంభనలోపం, కుంగుబాటు వంటి సమస్యలూ తలెత్తొచ్చు.

తగ్గితే ఏమవుతుంది?

పురుషుల్లో ఈస్ట్రోజన్ తగ్గటం వల్ల తలెత్తే ప్రధాన సమస్య ఎముక క్షీణించటం. దీంతో ఎముకలు బలహీనపడి, పెళుసుబారతాయి. ఫలితంగా ఎముకలు చిన్న చిన్న దెబ్బలకే విరిగే ప్రమాదముంది.

● ఈస్ట్రోజన్ తగ్గటం శృంగార జీవితం మీదా ప్రభావం చూపుతుంది. టెస్టోస్టిరాన్ శృంగారాసక్తిని కలిగించే మాట నిజమే అయినా ఈస్ట్రోజన్ రక్తనాళాలను ఆరోగ్యంగా ఉంచటం ద్వారా అంగ స్తంభనకు తోడ్పడుతుంది. అందుకే టెస్టోస్టిరాన్ మోతాదులు బాగానే ఉన్నా ఈస్ట్రోజన్ తగ్గితే శృంగారసక్తి తగ్గుతుంది. అంగం సరిగా స్తంభించకపోవటం, స్తంభించినా ఎక్కువసేపు కొనసాగకపోవటం ఇబ్బంది పెడతాయి.

● మూడ్, విషయగ్రహణ తీరు మారటం మరో సమస్య. ఈస్ట్రోజన్ తగ్గటం వల్ల తరచూ మూడ్ మారటం, చిరాకు, ఆందోళన, దిగులు, నిరాశ, ఏకాగ్రత కుదరకపోవటం వంటి లక్షణాలూ కనిపిస్తాయి.

● ఈస్ట్రోజన్ తగ్గితే బొజ్జ పెరిగే ప్రమాదమూ ఉంది. దీంతో గుండెజబ్బులు తలెత్తే ముప్పూ పెరుగుతుంది.

జాగ్రత్తలు ఇవీ..

ఈస్ట్రోజన్ హార్మోన్ మోతాదులు తక్కువ, ఎక్కువ కాకుండా ఆరోగ్యకర స్థాయిలో ఉంచుకోవటానికి కొన్ని జాగ్రత్తలు తీసుకోవటం మంచిది.

● శరీరంలో కొవ్వు ఎక్కువ, తక్కువ కాకుండా చూసుకోవటం ముఖ్యం. అరోమాటేజ్ పనితీరు పాక్షికంగా కొవ్వు కణజాలంలో జరుగుతుంది. అందువల్ల కొవ్వు బాగా తగ్గినవారిలో దీని ఉత్పత్తి తగ్గుతుంది. అదే సమయంలో కొవ్వు ఎక్కువగా ఉన్నవారిలో ఈస్ట్రోజన్ ఉత్పత్తి పెరుగుతుంది కూడా. కాబట్టి కొవ్వు విషయంలో జాగ్రత్త అవసరం.

● దీర్ఘకాలంగా పోషణలోపంతో ఇబ్బంది పడుతున్నట్టయితే టెస్టోస్టిరాన్, ఈస్ట్రోజన్ రెండూ పడిపోతాయి. అందువల్ల హార్మోన్ల ఉత్పత్తికి తోడ్పడే ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్లు, విటమిన్లు విధిగా తీసుకోవాలి. జింక్, పొటాషియం, విటమిన్ డి పరోక్షంగా టెస్టోస్టిరాన్, ఈస్ట్రోజన్ ఉత్పత్తికి తోడ్పడతాయి.

● క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం హార్మోన్ల ఉత్పత్తికి తోడ్పడటం నిజమే. అయితే శరీరం కోలుకోవటానికి తగినంత సమయం ఇవ్వకుండా మరీ అతిగా వ్యాయామాలు చేస్తే టెస్టోస్టిరాన్, ఈస్ట్రోజన్ రెండింటి మోతాదులూ పడిపోయే ప్రమాదముంది.

● కంటి నిండా నిద్రపోవటం, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవటమూ ముఖ్యమే. ఎందుకంటే నిద్రలేమి, మానసిక ఒత్తిడితో కార్టిజాల్ హార్మోన్ మోతాదులు పెరుగుతాయి. ఇది లైంగిక హార్మోన్ల ఉత్పత్తికి అడ్డు తగులుతుంది. రాత్రిపూట రోజూ 7-8 గంటలు నిద్రించేలా చూసుకోవాలి. యోగా, ధ్యానం, ప్రాణాయామం వంటివి చేయాలి.

ఈనాడు సినిమా

చెడుకు పీడ కల.. రణబాలి


విజయ్

"ప్రజల కోసం పురాణంగా మారిన వ్యక్తి. చెడుకు పీడ కలగా మారిన పురాణ పురుషుడు. అతని పేరే 'రణబాలి'' అంటున్నారు కథానాయకుడు విజయ్ దేవరకొండ. ఆయన టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని రాహుల్ సంకృత్యాన్ తెరకెక్కిస్తున్నారు. 'టాక్సీవాలా' విజయం తర్వాత వీళ్లిద్దరి కాంబోలో రెండో సినిమా ఇది. టీ సిరీస్ ఫిల్మ్స్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. రష్మిక కథానాయిక. ఆర్నాల్డ్ వోస్లూ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ఈ సినిమాకి 'రణబాలి' అనే పేరును ఖరారు చేస్తూ.. సోమవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా టైటిల్ గ్లింప్స్‌ని విడుదల చేశారు. 1854 - 1878 మధ్య బ్రిటిష్ పాలనా కాలంలో జరిగిన వాస్తవ చారిత్రక సంఘటనల ఆధారంగా ఈ సినిమా ముస్తాబవుతోంది. పచ్చటి పైర్లతో అలరారే మన గ్రామ సీమల్ని బ్రిటిష్ క్రూర పాలకులు కరవు ప్రాంతాలుగా ఎలా మార్చారో.. మన సమాజంలో హిట్లర్ ఊచకోతను మించిన మారణ హోమాన్ని ఎలా సృష్టించారో గ్లింప్స్‌లో హృద్యంగా చూపించారు. ఇందులో మాతృభూమి కోసం ఆ తెల్లదొరలపై తిరుగుబాటు చేసే యోధుడిగా విజయ్ కనిపించిన తీరు ఆకట్టుకుంది. గ్లింప్స్ ఆఖర్లో తను బ్రిటిష్ అధికారిని గుర్రానికి కట్టి రైల్వే ట్రాక్‌పై ఈడ్చుకు వెళ్లే సన్నివేశం ఆకర్షణగా నిలిచింది. ఇక ఈ సినిమాలో జయమ్మగా రష్మిక కనిపించనుండగా.. సర్ థియోడోర్ హెక్టార్ అనే బ్రిటిష్ అధికారి పాత్రలో ఆర్నాల్డ్ అలరించనున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా సెప్టెంబరు 11న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి సంగీతం: అజయ్ - అతుల్, ఛాయాగ్రహణం: నీరవ్ షా.



మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌లకు చిరంజీవి సత్కారం

ఈ జాతీయ గౌరవం ఓ మైలురాయి

గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పురస్కారాల్లో తమకు పద్మ పురస్కారాలు రావడం పట్ల హీరో మమ్ముట్టి, నటులు మురళీ మోహన్, రాజేంద్ర ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు వీళ్లంతా సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటనలు విడుదల చేశారు. ''మాతృభూమికి నా కృతజ్ఞతలు. పద్మ భూషణ్.. ఈ పౌర పురస్కారంతో నన్ను సత్కరించినందుకు దేశానికి, ప్రజలకు, ప్రభుత్వానికి నా హృదయపూర్వక ధన్యవాదాలు'' అని మమ్ముట్టి ఎక్స్‌లో పేర్కొన్నారు.

లేటుగా వచ్చినా లేటెస్ట్‌గా..

''ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసిన పద్మ అవార్డు రావడం సంతోషంగా ఉంది. లేటుగా వచ్చినా లేటెస్ట్‌గా వచ్చింది. అన్నీ మనం అనుకున్నప్పుడే రావు. ఏదైనా ఎదురు చూపుల తర్వాత దొరికితే దానికి విలువ ఎక్కువ. ఇంత మంచి అవార్డును ఇచ్చిన ప్రధాని నరేంద్రమోదీ, ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, చలన చిత్ర పరిశ్రమ ప్రముఖులందరికీ కృతజ్ఞతలు'' అని మురళీ మోహన్ పేర్కొన్నారు.

మర్చిపోలేని రోజు

భారత ప్రభుత్వం తనకు పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించడం జీవితంలో మర్చిపోలేని రోజని రాజేంద్రప్రసాద్ అన్నారు. కళల్ని గౌరవించి, ఈ అవార్డుకు ఎంపిక చేసిన కేంద్ర ప్రభుత్వానికి, జ్యూరీ సభ్యులకు హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ''48ఏళ్లుగా నేను ఏ వేషం వేసినా.. ఏ ప్రయోగం చేసినా ప్రేక్షకులు అందించిన ప్రేమే నాకు ఈరోజు ఇంతటి గుర్తింపు తెచ్చింది. ఈ రుణం ఎప్పటికీ తీర్చుకోలేను'' అని రాజేంద్ర ప్రసాద్ అన్నారు.

పద్మశ్రీ విజేతలకు చిరు సన్మానం..


నటులు మురళీ మోహన్, రాజేంద్ర ప్రసాద్‌లకు పద్మశ్రీ పురస్కారాలు దక్కడం పట్ల కథానాయకుడు చిరంజీవి సంతోషం వ్యక్తం చేశారు. వ్యక్తిగతంగా వాళ్లిద్దరి నివాసాలకు వెళ్లి.. వారిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. తెలుగు సినిమాకి లభించిన ఈ జాతీయ గౌరవం ఒక మైలురాయిగా చిరు పేర్కొన్నారు. ఇక ఈ సందర్భంగానే కళలు, విజ్ఞానం, వైద్యం, సాహిత్యం, క్రీడలు లాంటి రంగాల్లో విశేష సేవలందించిన 2026 పద్మ అవార్డు విజేతలందరికీ హృదయపూర్వకంగా అభినందనలు తెలిపారు చిరంజీవి.

ఇంత పెద్ద గౌరవం.. ఆయన మన మధ్య లేరు!


ధర్మేంద్ర, హేమా మాలిని

సినీ పరిశ్రమకు చేసిన సేవలను గుర్తించి దివంగత బాలీవుడ్ నటుడు ధర్మేంద్రకు కేంద్రం దేశ రెండో అత్యున్నత పురస్కారమైన పద్మ విభూషణ్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై ఆయన భార్య హేమా మాలిని ఆనందం వ్యక్తం చేశారు. కానీ.. ఈ అవార్డు అందుకోవడానికి ఆయన మన మధ్య లేకపోవడం బాధగా ఉందన్నారు. ''మా కుటుంబం మొత్తం చాలా సంతోషంగా ఉంది. ధర్మేంద్ర ఈ పురస్కారానికి అర్హుడు. అభిమానులు, సినీ పరిశ్రమకు చెందినవారంతా ఇప్పుడు ధర్మేంద్ర గురించి, ఆయన చేసిన మంచి పనుల గురించి మాట్లాడుకుంటున్నారు. అవి వింటుంటే మా హృదయాలు ఆనందం, గర్వంతో నిండిపోతున్నాయి. ఆయనకు పద్మ విభూషణ్ పురస్కారం రావాలని ఎంతోమంది కోరుకున్నారు. ఆయన ఎప్పుడూ అవార్డుల కోసం పని చేయలేదు. తన పాత్రకు పూర్తి న్యాయం చేయాలని నిరంతరం శ్రమించారు. ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచారు. ఆయనకు జీవిత సాఫల్య పురస్కారాలు తప్ప ఒక్క ఫిల్మ్ ఫేర్ కూడా రాలేదు. ఇప్పుడు ఇంత పెద్ద అవార్డును తీసుకోవడానికి ఆయన మన మధ్య లేకపోవడం బాధాకరం'' అన్నారు హేమ. ధర్మేంద్రకు పురస్కారాన్ని ప్రకటించినందుకు కేంద్ర ప్రభుత్వానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

కలలో కూడా ఊహించలేదు


మాధవన్

వైవిధ్యభరితమైన పాత్రలతో విశేష ప్రేక్షకాదరణ సొంతం చేసుకున్న నటుడు మాధవన్‌కు భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాన్ని ప్రకటించింది. దీనిపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ''ఇది నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. ఇది నా కలలకు కూడా అందనిది. మనసు కృతజ్ఞతతో నిండిపోయింది. దేవుడి దయ, పెద్దల ఆశీర్వాదం, అభిమానుల ప్రేమాభిమానాల వల్లే ఇది సాధ్యమైంది. ఇది భారతీయ సినిమాకు దక్కిన గౌరవం''అని అన్నారు.


సుకుమారి.. యాదగిరి వచ్చాడు

'ఓ..! సుకుమారి' సినిమాతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు తిరువీర్, ఐశ్వర్య రాజేశ్. ఈ ఇద్దరూ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని భరత్ దర్శన్ తెరకెక్కిస్తున్నారు. మహేశ్వర రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. తిరువీర్ ఈ సినిమాలో యాదగిరి అనే పాత్ర పోషిస్తున్నట్లు తెలియజేస్తూ సోమవారం ఫస్ట్‌లుక్ విడుదల చేశారు. అందులో తను లుంగీ, స్లీవ్‌లెస్ బనియన్, భుజంపై తువ్వాలుతో పల్లెటూరి కుర్రాడిగా కనిపించిన తీరు ఆకట్టుకుంది. ఇది పూర్తిగా గ్రామీణ నేపథ్యంగా సాగే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి సంగీతం: భరత్ మంచిరాజు, ఛాయాగ్రహణం: సీహెచ్ కుషేందర్.


తిరువీర్

పరేడ్‌లో అవకాశం నా అదృష్టం

సంజయ్ లీలా భన్సాలీ



ప్రముఖ హిందీ చిత్ర దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ అరుదైన ఘనత సాధించారు. దిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో సినీ రంగానికి ప్రాతినిధ్యం వహించిన తొలి దర్శకుడిగా చరిత్ర సృష్టించారు. ఈ పరేడ్‌లో సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖతో కలిసి 'భారత్ గాథ' థీమ్‌తో ఈ శకటాన్ని సంజయ్ రూపొందించారు. భారతీయ కళావైభవం ఎదిగిన తీరును ఇందులో పొందుపరిచారు. రుషుల సద్బోధతో మొదలైన కథా కాలక్షేపం.. భారతీయ కళలుగా రూపాంతరం చెందుతూ.. ఆధునిక సినిమా ప్రయాణాన్ని సమన్వయపరుస్తూ ఉండేలా అద్భుతంగా దీనిని రూపొందించారు. భారతీయ సినీ రంగంలో వచ్చిన మార్పులు ప్రతిబింబించేలా ఉన్న ఈ శకటం వినూత్న ప్రయత్నంగా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. శకటం ప్రధాన భాగంలో 'బాక్సాఫీసు' గుర్తుతో పాటు 'కమింగ్ సూన్' అక్షరాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దీనిపై సంజయ్ స్పందిస్తూ.. ''భారతీయ కథను ప్రపంచానికి తీసుకెళ్లడం.. భారతదేశపు బలమైన సాంస్కృతిక కార్యక్రమాలలో ఒకటిగా సినిమాను చేసుకోవాలనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతను ఇది ప్రతిబింబిస్తుంది. ఈ పరేడ్‌లో సినీ రంగానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం.. సమాచార, ప్రసార మంత్రిత్వశాఖతో కలిసి ఈ శకటాన్ని రూపొందించడం సినీ రంగానికి దక్కిన గౌరవం''అంటూ ఇది తనకు దక్కిన అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఈ శకటం మొదటి భాగంలో బోధించే విధానం నుంచి లిఖించే విధానానికి ఎదిగిన తీరు చూపారు. దీన్ని వివరిస్తూ.. వినాయకుడు మహాభారతాన్ని లిఖించడం చూపారు. చివరిభాగంలో భారతదేశ ఆధునిక మీడియా దృశ్యాన్ని ప్రదర్శించారు. పాతకాలపు కెమేరాలు, వార్తా పత్రికలు, బాక్సాఫీస్ చిత్రాలు మొదలైన వాటిని పొందుపరిచారు.

ఆ సన్నివేశం తర్వాత నిజంగానే ఏడ్చేశా!

ఎప్పట్నుంచో తాను ఎదురు చూస్తున్న పాత్ర ఈ సినిమాతో దొరికిందని, దాంతో ఇందులోని శాంతి పాత్రని వందశాతం మనసుపెట్టి చేశానన్నారు ఈషారెబ్బా. స్వతహాగా తనకు యాక్షన్ ప్రధానమైన సినిమాలంటే ఇష్టమనీ, ఈ సినిమాలోని యాక్షన్ కోణం కూడా తనకు ఎంతో తృప్తినిచ్చిందన్నారు. అచ్చ తెలుగు కథానాయికైన ఈషారెబ్బా ఇటీవల 'ఓం శాంతి శాంతి శాంతిః' చిత్రంలో నటించారు. ఇందులో తరుణ్‌భాస్కర్ కథానాయకుడు. ఎ.ఆర్. సజీవ్ దర్శకత్వం వహించారు. సృజన్ యరబోలు, ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణ, అనూప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్, నవీన్ సనివారపు నిర్మాతలు. ఈ చిత్రం ఈ నెల 30న ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా కథానాయిక ఈషారెబ్బా సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.


ఈషా రెబ్బా

''మంచి కథతో రూపొందిన సినిమా ఇది. మలయాళంలో విజయవంతమైన 'జయ జయ జయ జయహే' చిత్రానికి రీమేక్‌గా రూపొందింది. ఆ సినిమా చూడగానే కథ ఎంతగా నచ్చిందో, అందులో అమ్మాయి పాత్ర అంతకంటే బాగా నచ్చింది. అబ్బాయిలు, అమ్మాయిలు... అందరూ కనెక్ట్ అయ్యే బలమైన కథ. ఆలోచన రేకెత్తించే సందేశం ఉన్నా, అది కూడా హాస్యకోణంలోనే ఉండటం ఈ సినిమా ప్రత్యేకత. నేను శాంతి అనే యువతిగా కనిపిస్తా. కరోనా సమయంలో నేను నేర్చుకున్న మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ ఈ పాత్రకి బాగా పనికొచ్చింది''.

- ''గోదావరి నేపథ్యంలో సాగే ఈ కథలో పాత్రలన్నీ ఆ యాసలో మాట్లాడుతుంటాయి. నేను పుట్టి పెరిగింది తెలంగాణలో అయినా, మా అమ్మ తరపు బంధువులంతా రాజమండ్రికి చెందినవారే. అక్కడికి పండగలప్పుడు వెళ్లి వచ్చేదాన్ని. దాంతో నాకు ఆ యాస మాట్లాడటం పెద్దగా ఇబ్బంది అనిపించలేదు. తరుణ్‌భాస్కర్ మాత్రం చాలా జాగ్రత్తలు తీసుకుని డబ్బింగ్ చెప్పారు. సినిమాలో చెంపదెబ్బకు సంబంధించిన సన్నివేశాలు చాలానే ఉంటాయని ముందే తెలుసు. అయితే చట్నీ అంటిన చేత్తో కొట్టే సన్నివేశంలో నిజంగానే గట్టిగా కొట్టారు తరుణ్ భాస్కర్. సన్నివేశం పండాలని, చట్నీ ముఖానికి అంటుకోవాలని దర్శకుడు నిజంగానే కొట్టమన్నారట. ఆ సన్నివేశంలో కనిపించే నా కన్నీళ్లు నిజమైనవే. సన్నివేశం పూర్తయ్యాక నిజంగానే ఏడ్చేశా''.
- ''నా కెరీర్‌లో ఎక్కువ విరామం వచ్చింది ఈ సినిమాకి ముందే. అంతకు ముందు చేసిన సినిమా సరైన ఫలితాన్ని ఇవ్వలేదు. దాంతో ఆచితూచి కథలపై నిర్ణయం తీసుకున్నా. ఈ సినిమా ప్రయాణం సాగుతుండగా నా పెళ్లి గురించి సాగిన ప్రచారం నా దృష్టికి కూడా వచ్చింది. అయితే అందులో నిజం లేదు. మా నాన్న కూడా ఇదే అడిగారు. నేను ఒకరితో సన్నిహితమైన అనుబంధం కొనసాగిస్తున్న మాటైతే నిజం. పెళ్లిపై అయితే ఇంకా నిర్ణయం తీసుకోలేదు. 'అంతకుముందు ఆ తరువాత' చేశాక ఈ అమ్మాయి ఇలాంటి సీరియస్ పాత్రలే చేస్తుందేమో అనుకున్నారు చాలా మంది. దాంతో 'అమీతుమీ' సహా చాలా సినిమాల్లో ఉత్సాహవంతమైన పాత్రలు చేశా. 'త్రీ రోజెస్' వెబ్ సిరీస్ కూడా అదే తరహాలో సాగుతుంది. కొత్తగా రెండు కథలు విన్నా. తమిళంలో ఓ సినిమాలో నటిస్తున్నా''.

బ్రిటిషర్లపై తిరగబడ్డ యోధుడు

'డేవిడ్ రెడ్డి'గా బాక్సాఫీస్ బరిలో సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు కథానాయకుడు మంచు మనోజ్. ఆయన టైటిల్ పాత్ర పోషిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని హనుమరెడ్డి యక్కంటి తెరకెక్కిస్తున్నారు. భరత్ మోటుకూరి, నల్లగంగుల వెంకట్ రెడ్డి నిర్మిస్తున్నారు. మరియా ర్యబోషప్క కథానాయిక. పార్తీబన్, కాంచన కీలక పాత్రలు పోషిస్తున్నారు. సోమవారం రిపబ్లిక్‌డే సందర్భంగా ఈ చిత్ర ఫస్ట్‌లుక్స్‌ను విడుదల చేశారు. రూత్‌లెస్, బ్రూటల్ పేరుతో విడుదలైన ఆ రెండు లుక్స్‌లో మనోజ్ నలుపు రంగులో మునుపెన్నడూ చూడని రీతిలో ఆసక్తికరంగా కనిపించారు. ''1897 - 1920 మధ్య బ్రిటిష్ పాలన నేపథ్యంలో సాగే చిత్రమిది. ఆ క్రూర బ్రిటిష్ పాలనకు ఎదురొడ్డి నిలిచి, పోరాడిన యోధుడిగా మనోజ్ కనిపిస్తారు'' అని చిత్ర వర్గాలు తెలిపాయి.


మంచు మనోజ్

అరచేతులే అణ్వాయుధం


దివ్యభారతి, సుధీర్

అతని అరచేతులే ఒక అణ్వాయుధంతో సమానం. తనతో తలపడితే విస్ఫోటనమే. యుద్ధంలోనూ.. బయటా పోటెత్తే సంద్రాన్ని తలపిస్తాడు. తన శత్రువుల్నే తన బలంగా మలచుకుని పోరాటం చేసిన ఆ యువకుడి కథేమిటో తెలియాలంటే 'గోట్' చూడాల్సిందే. సుడిగాలి సుధీర్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రమిది. గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్స్.. అనేది ఉపశీర్షిక. దివ్యభారతి కథానాయిక. వేద వ్యాస్ దర్శకుడు. చంద్రశేఖర్ రెడ్డి ఎమ్ నిర్మాత. ఫిబ్రవరిలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. రైజ్ ఆఫ్ గణ... పేరుతో ఇందులోని పాటని విడుదల చేసింది చిత్రబృందం. లియోన్ జేమ్స్ స్వరపరిచిన ఈ పాటని కాసర్ల శ్యామ్ రచించారు. వినోద్ ఎలుమలై ఆలపించారు. నిర్మాత మాట్లాడుతూ ''సుడిగాలి సుధీర్ కెరీర్‌లో ఓ మైలురాయిలాంటి చిత్రమిది. హీరో పాత్ర ఎలా ఉంటుందో చాటి చెప్పే రైజ్ ఆఫ్ గణ... పాటకి మంచి స్పందన లభిస్తోంది'' అన్నారు. ఈ చిత్రానికి నేపథ్య సంగీతం: మణిశర్మ, ఛాయాగ్రహణం: రసూల్ ఎల్లోర్.

ఓటీటీలో ఈ వారం

థ్రిల్‌ని పంచే సిరీస్‌లు.. వినోదాలను వడ్డించే సినిమాలతో ఎప్పటిలాగే కొత్త కంటెంట్‌తో సన్నద్ధమయ్యాయి ఓటీటీలు. పలు భాషల్లో థియేటర్లలో విడుదలై ఇప్పుడు ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలోనూ సందడి చేయనున్నాయి. ప్రేక్షకుల్ని మురిపిస్తూనే.. సీటు అంచున కూర్చోబెట్టేందుకు ఈ వారం పలు సినిమాలు, సిరీస్‌లు సిద్ధమయ్యాయి.

గుస్తాఖ్ ఇష్క్(సినిమా)	మంగళవారం	జియో హాట్‌స్టార్
ది రెక్కింగ్ క్రూ(సినిమా)	బుధవారం	అమెజాన్ ప్రైమ్ వీడియో
వండర్ మ్యాన్(సిరీస్)	బుధవారం	జియోహాట్‌స్టార్
బ్రిడ్జర్టన్ సీజన్ 4(సిరీస్)	గురువారం	నెట్‌ఫ్లిక్స్
పతంగ్(సినిమా)	శుక్రవారం	సన్‌నెక్ట్స్

ఇది మోడల్ దెయ్యం..



'ఇది మోడల్ దెయ్యం.. భయపెట్టాలని చూడట్లేదు కానీ..ఓ మూలన కూర్చొని మొబైల్ చూస్తూ ఉంటుంది' అంటూనే దేవుడికి దూరంగా.. దెయ్యానికి దగ్గరగా అయ్యాడు మలయాళ నటుడు నివిన్ పౌలీ. ఆయన అజు వర్గీస్, రియా శిబు, ప్రీతి ముకుందన్ కలిసి నటించిన చిత్రం 'సర్వం మాయ'. హారర్ కామెడీగా అఖిల్ సత్యన్ తెరకెక్కించారు. మలయాళ బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధించి బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన చిత్రమిది. థియేటర్లలో నవ్వులు పూయిస్తూనే.. భావోద్వేగాలతో ప్రేక్షకుల మదిని దోచుకున్న ఈ సినిమా ఈ శుక్రవారం నుంచి జియోహాట్‌స్టార్ వేదికగా మీ ఇళ్లలో సందడి చేయనుంది.

వెంటాడడం కాదు.. వేటాడడానికి



బాలీవుడ్ నటి భూమి పెడ్నేకర్ ప్రధాన పాత్రలో అమృత్ రాజ్‌గుప్తా తెరకెక్కించిన సిరీస్ 'దల్దాల్'. సమర తిజోరి, ఆదిత్య రావల్ కీలకపాత్రల్లో నటించారు. గతం మనల్ని వెంటాడడానికి రాలేదు.. వేటడడానికి వచ్చిందంటూ ఇటీవల విడుదలైన ట్రైలర్‌లో డీసీపీ రీటా పాత్రలో కనిపించింది భూమి. ముంబయి క్రైమ్ బ్రాంచ్‌లో కొత్తగా అధికారంలో చేరి.. కళ్లముందే ఎందరో హత్యకు గురవుతుండడం చూస్తుంది. దానికి సంబంధించిన ఓ సీరియల్ కిల్లర్‌ను వేటాడాలని నిర్ణయించుకుంటుంది. కానీ, తన చుట్టూ ఉన్న వారే ఇందులో భాగమని తెలుసుకున్నాక పరిస్థితులతో ఆమె ఎలా పోరాడిందనేది తెలియాలంటే ఈ సిరీస్ చూడాల్సిందే. క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సిరీస్ శుక్రవారం నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియోలో ప్రసారం కానుంది.



మోహన్‌బాబుకు అరుదైన గౌరవం

ప్రముఖ నటుడు మోహన్‌బాబు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం నుంచి గవర్నర్ ఎక్సలెన్స్ పురస్కారం అందుకున్నారు. సినీ, విద్యారంగాలకు ఆయన చేసిన సేవల్ని గుర్తించి ఆ రాష్ట్రప్రభుత్వం ఈ పురస్కారాన్ని ప్రకటించింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం కోల్‌కతాలోని లోక్‌భవన్‌లో ఆ రాష్ట్ర గవర్నర్ సీవీ ఆనందబోస్ చేతులమీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

రవితేజ చిత్రం... ఇరుముడి


నక్షత్ర, రవితేజ

స్వామియే శరణం అయ్యప్ప... అంటూ తెరపైన భక్తి కోణాన్ని ప్రదర్శించనున్నారు కథానాయకుడు రవితేజ. ఆయన తన 77వ చిత్రం కోసం దర్శకుడు శివ నిర్వాణతో జట్టు కట్టారు. ఈ కలయికలోని సినిమాని 'ఇరుముడి' పేరుతో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ రూపొందిస్తోంది. ప్రియ భవానీ శంకర్ కథానాయిక. బేబి నక్షత్ర కీలక పాత్రని పోషిస్తోంది. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మాతలు. రవితేజ పుట్టినరోజును పురస్కరించుకుని సోమవారం ఈ సినిమా పేరుతో కూడిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. ఆ పోస్టర్‌లో రవితేజ అయ్యప్ప దీక్షలో కనిపిస్తున్నారు. రవితేజ ఎక్స్ ద్వారా ఈ పోస్టర్‌ని పంచుకుంటూ ''జీవితంలో సరైన సమయంలో కొన్ని కథలు మనల్ని ఎంచుకుంటాయి. అలాంటి ఓ కథలో నేను భాగమైనందుకు అదృష్టంగా భావిస్తున్నా. స్వామియే శరణం అయ్యప్ప...'' అంటూ వ్యాఖ్య చేశారు. ''ఇదొక అద్భుతమైన స్క్రిప్ట్. కచ్చితంగా విజయం సాధించే సినిమా. కమర్షియల్ సినిమాల్లో ఓ గేమ్ ఛేంజర్'' అంటూ ఎక్స్‌లో ఓ పోస్టుని పంచుకున్నారు. ఈ చిత్రానికి స్వరాలు సమకూరుస్తున్న సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్.

ఏప్రిల్‌లో పేట్రియాట్


మోహన్‌లాల్

మహేశ్ నారాయణన్ దర్శకత్వంలో మలయాళ అగ్ర కథానాయకులు మోహన్‌లాల్, మమ్ముట్టి కాంబోలో తెరకెక్కుతోన్న చిత్రం 'పేట్రియాట్'. ఈ సినిమాలో ఫహాద్ ఫాజిల్, నయనతార, గౌతమి, రాజీవ్ మేనన్, కుంచకో బోబన్, రేవతి తదితరులు నటిస్తున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ సినిమా విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది చిత్రబృందం. ఈ సినిమా ఏప్రిల్ 23న థియేటర్లలో విడుదల కానుందని పేర్కొంటూ.. ఇన్‌స్టాలో ఓ పోస్టర్‌ను పంచుకుంది.

మోహన్‌లాల్ ఎల్367

మోహన్‌లాల్ తన తదుపరి చిత్రం ఎల్367ని సామాజిక మాధ్యమాలలో అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమాని తొలి దర్శకత్వం 'మెప్పాడియన్' చిత్రంతో జాతీయ అవార్డు సాధించిన విష్ణు మోహన్ తెరకెక్కించనున్నారు. గోకులం మూవీస్ బ్యానర్‌పై గోకులం గోపాలన్ నిర్మించనున్నారు. ఈ సినిమా థ్రిల్లర్ కథాంశంతో రూపొందుతున్నట్లు సమాచారం.

సరికొత్త బంగారు శిఖరం

- తొలిసారిగా ఔన్సు 5000 డాలర్లకు
- విదేశీ మారకపు ద్రవ్యంగా పుత్తడి



అంతర్జాతీయ విపణిలో మేలిమి బంగారం ఔన్సు (31.10 గ్రాముల) ధర తొలిసారిగా 5,000 డాలర్లను అధిగమించింది. రెండేళ్లలోనే ఈ ధర రెట్టింపుకాగా, మిలియనం బులియన్ వర్తకానికి ఆశ్చర్యం వ్యక్తమైంది. అనిశ్చితుల్లో సురక్షిత పెట్టుబడి సాధనంగా భావించే బంగారంపైకి పెట్టుబడులు రావడం, ఫలితంగా ధర పెరగడం సహజంగానే జరుగుతుంటుంది. అయితే ఈసారి పెరిగినంత వేగంగా పసిడి ధర మునుపెన్నడూ దూసుకెళ్లలేదని చెబుతున్నారు. ఐదేళ్లలోనే ఔన్సు వెండి ధర 100 డాలర్లను మించి, 117 డాలర్ల వద్ద కదలాడుతోంది.

ఇవీ కారణాలు

రష్యా - ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభం నుంచి బంగారం, వెండి పైకి పెట్టుబడులు పెరుగుతూ వస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన ట్రంప్, వివిధ దేశాల ఉత్పత్తులపై విధిస్తున్న సుంకాలతో పాటు వెనెజువెలా, ఇరాన్, గ్రీన్‌లాండ్ వ్యవహారాల్లో ప్రదర్శిస్తున్న దూకుడు వల్ల వాణిజ్య యుద్ధ భయాలు అధికమవ్వడం.. బంగారం ధరలకు మద్దతిస్తోంది.

- సార్వభౌమ బాండ్లతో పాటు కరెన్సీ మార్కెట్ల నుంచీ పెట్టుబడులు లోహాలపైకి వస్తున్నాయి. గత వారంలో జపాన్ బాండ్ మార్కెట్లో గణనీయ అమ్మకాలు వచ్చాయి.
- కొన్ని అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రభుత్వ రుణాలు గణనీయ స్థాయిలకు చేరాయి. ఇది కూడా మదుపర్లలో ఆందోళనను పెంచుతూ, వారు ఈక్విటీ మార్కెట్ల నుంచి లోహాలవైపు వచ్చేందుకు కారణమవుతున్నాయి.
- అమెరికా డాలర్ విలువ కూడా కొన్ని కరెన్సీలతో పోలిస్తే గతవారంలో అధికంగా బలహీనపడింది. గత మే నెల తరవాత, ఇలా జరగడం ఇప్పుడే. ఫలితంగా ఆయా దేశీయులు, బంగారాన్ని తక్కువ మొత్తంతోనే కొనగలిగారు.
- గతేడాదిలో 65% వరకు ప్రతిఫలాన్ని అందించిన పసిడి, కొత్త సంవత్సరంలో ఇప్పటికే 15% రాణించింది.

అంచనాలు ఎలా ఉన్నా..

- బంగారం ధరలు మరింత పెరుగుతాయనే అంచనాలు వెలువడుతున్నాయి. అయితే ఆర్థిక స్థోమతను గమనించుకుంటూ, ఈ పెట్టుబడులపై ముందుకు సాగాలని విశ్లేషకులు సూచిస్తున్నారు. దేశీయంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడటం, ఇక్కడ 9% వరకు పన్నులు-సుంకాలు పడుతున్నందున, అంతర్జాతీయ విపణితో పోలిస్తే, ఇక్కడ బంగారం ధర అధికంగా ఉంటుంది.

2000 సంవత్సరం నుంచి 1600% ప్రతిఫలం

బంగారంపై పెట్టుబడులను పెట్టినవారికి 2000 సంవత్సరం నుంచే ఇప్పటికి 1600% ప్రతిఫలం లభించిందని అంచనా. వివిధ దేశాల కేంద్రీయ బ్యాంకులు కూడా, విదేశీ మారకపు ద్రవ్యంలో పసిడి వాటాను పెంచుకుంటూ పోవడమూ, ఈ లోహం ధర అంచనాలకు మించి ఎక్కువ చేరేందుకు కారణమవుతోంది. 2024 వరకు వివిధ దేశాల విదేశీ మారకపు ద్రవ్యం విలువ 4 లక్షల కోట్ల డాలర్లుగా ఉండగా, అధికారిక పసిడి నిల్వల విలువ 2-3 లక్షల కోట్ల డాలర్లుగా నిలిచింది. గతేడాదిలో ఈ పరిస్థితి మారింది. బంగారం విలువ దూసుకెళ్తూ ప్రస్తుతం 5 లక్షల కోట్ల డాలర్లకు చేరిందని బ్లూమ్‌బర్గ్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కేంద్రీయ బ్యాంకులు గతేడాది తొలి 9 నెలల్లో 634 టన్నుల బంగారాన్ని కొన్నాయని, ఏడాది ముగిసేసరికి ఇది 900 టన్నులకు చేరి ఉంటుందని అంచనావేస్తున్నారు. అంటే డాలర్‌కు బదులుగా, విదేశీ మారకపు ద్రవ్యంగా పసిడిని పోగుచేసుకుంటున్నాయి.

సురక్షిత పెట్టుబడి సాధనంగా ఎందుకంటే..

ఒక దేశ ఆర్థిక పరిస్థితికి అనుగుణంగా బంగారం ధర తగ్గదు. ఇతర పెట్టుబడి సాధనాలపై అధిక ప్రతిఫలం లభిస్తే, ఈ లోహం నుంచి పెట్టుబడులు తరలి వెళ్తుంటాయి. ఒక కంపెనీ/ప్రభుత్వాలు జారీ చేసే ఈక్విటీలు/బాండ్ల పరిస్థితికి ఇందుకు భిన్నంగా ఉంటుంది. వాటి స్థితి మెరుగ్గా ఉంటేనే, లాభాలొస్తాయి.

- అమెరికాలో వడ్డీరేట్లు ఇంకా తగ్గే పరిస్థితి ఉందని అంచనా. అప్పుడు బాండ్లపై ప్రతిఫలం పరిమితమవుతుంది. ఇది బంగారానికి కలిసి వస్తుంది.

సరఫరా ఎంత ఉంటుంది?

ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు 2,16,265 టన్నుల బంగారాన్ని ఉత్పత్తి చేసి ఉంటారన్నది ప్రపంచ స్వర్ణ మండలి అంచనా. ఇంకా 64,000 టన్నుల బంగారం భూమిలో ఉండొచ్చని యూఎస్ జియోలాజికల్ సర్వే అంచనా. మనదేశంలో ప్రతి శుభకార్యానికీ బంగారం కొనడం సంప్రదాయం. మనదేశంలోని గృహస్థుల వద్ద 3.8 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.350 లక్షల కోట్లు) బంగారం ఉందని మోర్గాన్‌స్టాన్లీ అంచనా వేసింది. దేశ జీడీపీలో 89 శాతానికి ఇది సమానమని పేర్కొంది. చైనాలో కేంద్రీయ బ్యాంకుతో పాటు ప్రజలు కూడా బంగారాన్ని అధికంగా కొంటున్నారు. ఇవన్నీ పసిడి ధరలు పెరిగేందుకు కారణమవుతున్నాయి.

2025లో మన దిగుమతులు 68 బి.డా.

గతేడాదిలో మనదేశం అధికారికంగా 58.8 బిలియన్ డాలర్ల (సుమారు రూ.5.4 లక్షల కోట్ల) విలువైన 630 టన్నుల బంగారం, 9.2 బి.డా. (రూ.85,000 కోట్ల) విలువైన 7158 టన్నుల వెండిని దిగుమతి చేసుకుంది. మన మొత్తం దిగుమతుల విలువ 750 బి.డా. (సుమారు రూ.69 లక్షల కోట్లు) కాగా, ఈ లోహాల బిల్లు వాటా 68 బి.డా. (రూ.6.25 లక్షల కోట్లు) అందులో 9 శాతానికి సమానం.

- ఈనాడు వాణిజ్య విభాగం

ఈనాడు బిజినెస్

సరికొత్తగా రెనో డస్టర్

రూ.21,000తో ప్రీ-బుకింగ్ ప్రారంభం



రెనో సంస్థ, మధ్యస్థాయి ఎస్‌యూవీ డస్టర్‌ను భారత విపణిలోకి సోమవారం మళ్లీ తీసుకొచ్చింది. మూడు ఇంజిన్ ఆప్షన్లలో ఇది లభ్యమవుతుంది. ఇందులో బలమైన హైబ్రిడ్ ఇంజిన్ వేరియంట్ కూడా ఉంది. టర్బో టీసీఈ 160, 1.4 కిలోవాట్ అవర్ బ్యాటరీ, 1.8 లీటర్ టీసీఈ స్ట్రాంగ్ హైబ్రిడ్ ఇంజిన్, టర్బో టీసీఈ 100 ఇంజిన్ ఆప్షన్లు ఉన్నాయి. గూగుల్ అసిస్టెంట్ ఇన్‌బిల్ట్‌గా ఉంది. ఎలక్ట్రిక్ టెయిల్ గేట్, 6-వే పవర్ డ్రైవర్ సీటు, ఫ్రంట్ వెంటిలేటెడ్ సీట్లు, అడాస్ ప్యాకేజ్, 360 డిగ్రీ కెమెరా వంటి సదుపాయాలున్నాయి. ఆర్-పాస్ పేరుతో ప్రీ-బుకింగ్‌లను ప్రారంభించింది. రూ.21,000 చెల్లించి ఈ పాస్ తీసుకుంటే డస్టర్ ఎస్‌యూవీని ప్రత్యేక పరిచయ ధరకే అందిస్తామని వెల్లడించింది. మార్చి మధ్యలో ధరలు వెల్లడిస్తామని, ఏప్రిల్ మధ్య నుంచి డెలివరీలు ప్రారంభిస్తామని వివరించింది. హైబ్రిడ్ వేరియంట్ దీపావళికి వస్తుందని తెలిపింది.

ప్రీమియర్ ఎనర్జీస్ సోలార్ సెల్ ప్లాంటు ప్రారంభం

సౌరవిద్యుత్ పరికరాల తయారీ సంస్థ ప్రీమియర్ ఎనర్జీస్, తన రూ.11,000 కోట్ల విస్తరణ ప్రణాళికలో భాగంగా తెలంగాణలో మహేశ్వరం దగ్గరున్న ఇ-సిటీలో 400 మెగావాట్ల సోలార్ సెల్ తయారీ ప్లాంటును ప్రారంభించింది. దేశీయ గిరాకీని తీర్చడానికి తన వార్షిక సోలార్ సెల్, మాడ్యూల్ తయారీ సామర్థ్యాన్ని రెట్టింపు చేసి.. వరుసగా 10.6 గిగావాట్లు, 11.1 గిగావాట్లు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రీమియర్ ఎనర్జీస్ ముఖ్య వ్యాపార అధికారి వినయ్ రుస్తగి వెల్లడించారు. 2028 నాటికి తన విస్తరణ లక్ష్యాలను సాధించడానికి సుమారు రూ.11,000 కోట్ల పెట్టుబడి పెట్టే ప్రక్రియలో కంపెనీ ఉంది. తాజాగా ప్రారంభించిన ప్లాంటుతో సౌర సెల్ తయారీ సామర్థ్యం 3.2 గిగావాట్ల నుంచి 3.6 గిగావాట్లకు పెరిగిందని వినయ్ తెలిపారు.

ఐరోపా కార్లు, వైను ఇక చౌక!

- దిగుమతి సుంకంలో కోత ఉండొచ్చు
- ఈయూతో ఎఫ్‌టీఏ ప్రకటన నేడు

మనదేశం - ఐరోపా సమాఖ్య (ఈయూ) మధ్య కుదరబోయే ఒప్పందం వల్ల జౌళి, పాదరక్షలతో పాటు కార్లు, వైన్ వంటి వస్తువులపై దిగుమతి సుంకాలు తగ్గుతాయని భావిస్తున్నారు. మనదేశంలోకి 100 బిలియన్ డాలర్ల వరకు పెట్టుబడులను ఈయూ పెట్టే అవకాశం ఉంది. 27 దేశాల సమాఖ్య అయిన ఈయూతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద(ఎఫ్‌టీఏ) చర్చలు ముగిశాయని, మంగళవారం ఒప్పందం వెలుగుచూస్తుందని వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ సోమవారం ప్రకటించారు. నిబంధనలు ఖరారై, ఒప్పందంపై ఈ ఏడాది సంతకాలు జరుగుతాయని, 2027 ఆరంభంలో ఇది అమల్లోకి వస్తుందని తెలిపారు. ఈయూ పార్లమెంటు అనుమతులు ఇందుకు అవసరం కావడం ఇందుకు నేపథ్యం. భారత్‌లో మాత్రం మంత్రివర్గ అనుమతి ఉంటే సరిపోతుంది. ఇప్పటిదాకా జరిగిన అన్ని ఎఫ్‌టీఏల్లో ఇది అత్యుత్తమమైనదని వాణిజ్య మంత్రి పీయూశ్ గోయల్ అభివర్ణించారు.

ద్వైపాక్షిక వాణిజ్యం
136.53 బి. డాలర్లు(2024-25)

మనదేశం కోరింది ఇదీ: జౌళి, తోళ్లు, దుస్తులు, రత్నాభరణాలు, హస్తకళలు వంటి కార్మిక ఆధారిత ఎగుమతులపై సున్నా సుంకాన్ని కోరింది.

ఐరోపా ఏం కోరిందంటే: వాహనాలు, వైన్ సహా ఆల్కహాల్ పానీయాలపై సుంకాల్లో కోత విధించాలని కోరింది.



భారత, ఈయూ సుంకాలివీ: భారత వస్తువులపై ఈయూ 3.8% టారిఫ్ విధిస్తోంది. అయితే కార్మిక ఆధారిత రంగాల ఉత్పత్తులపై 10% సుంకం అమలవుతోంది. ఈయూ వస్తువులపై సగటున 9.3% సుంకాన్ని భారత్ విధిస్తోంది. కానీ వాహనాలు (70-110%), విడిభాగాలు (35.5%), ప్లాస్టిక్స్ (10.4%), రసాయనాలు-ఫార్మా (9.9%)పై అధిక సంకాలు విధిస్తున్నాం. ఆల్కహాల్ పానీయాలపై 100-125% సుంకాన్ని విధిస్తున్నాం.

విలాస కార్ల విస్తరణకు వీలు: బీఎమ్‌డబ్ల్యూ

ఈయూ నుంచి దిగుమతి అయ్యే కార్లపై కస్టమ్స్ సుంకాన్ని తగ్గిస్తే, భారత్‌లో విలాస కార్ల విభాగ వృద్ధికి ఊతమిచ్చినట్లవుతుందని బీఎమ్‌డబ్ల్యూ గ్రూప్ ఇండియా ప్రెసిడెంట్, సీఈఓ హర్దీప్ సింగ్ బ్రార్ పేర్కొన్నారు. దేశీయంగా మొత్తం ప్యాసింజరు కార్ల విభాగంలో, విలాస కార్ల విభాగం వాటా 1 శాతమే. పూర్తిగా తయారైన కార్ల(సీబీయూ)పై సుంకం తగ్గిస్తే మరింత విస్తరణకు వీలవుతుందని బ్రార్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం 40,000 డాలర్ల కంటే తక్కువ ధర ఉన్న కార్ల దిగుమతిపై 70% కస్టమ్స్ సుంకం ఉంది. ఆ ధరపైన 110% సుంకం వర్తిస్తుంది. 15,000 డాలర్ల కంటే తక్కువ విలువున్న కార్లపై సుంకాన్ని భారత్ 40 శాతానికి తగ్గిస్తుందనే అంచనాలు వెలువడుతున్నాయి.

బడ్జెట్‌కు ముందైనా.. పరుగుపెట్టేనా

- జనవరిలో ఇప్పటివరకు 4% నష్టపోయిన సూచీలు
- ఎఫ్ఐఐ అమ్మకాలు, అంతర్జాతీయ ఉద్రిక్తతల ప్రభావం



నష్టాల బాటలో పయనిస్తున్న మన స్టాక్ మార్కెట్.. బడ్జెట్‌కు ముందైనా పుంజుకుంటుందేమోనని మదుపర్లు ఎదురుచూస్తున్నారు. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టే 2026-27 బడ్జెట్‌లో, మార్కెట్‌కు మద్దతునిచ్చే నిర్ణయాలు ఉండొచ్చనే ఆశలతో.. సాధారణంగా మదుపర్లు బడ్జెట్‌కు ముందు రోజుల్లో కొనుగోళ్లకు మొగ్గుచూపుతుంటారు. ఇటీవలి కొన్ని సంవత్సరాల్లో ఇదే ధోరణి కనిపించింది. ఈసారి కూడా అదే పరిస్థితి కొనసాగొచ్చేమో అనే ఆశాభావం ఉంది. ఈ ఏడాది జనవరిలో ఇప్పటివరకు సెన్సెక్స్, నిఫ్టీ 4 శాతానికి పైగా నష్టపోయాయి. విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలు, బలహీన రూపాయి, కార్పొరేట్ కంపెనీల ఆర్థిక ఫలితాలు స్తబ్దుగా ఉండటం, అంతర్జాతీయ భౌగోళిక ఉద్రిక్తతలు, సుంకాల ఆందోళనలు ఇందుకు కారణమయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రీ బడ్జెట్ ర్యాలీ చోటుచేసుకుంటే.. మదుపర్లకు కాస్త ఊరటే.

గత సందర్భాల్లో ఇలా..: 'గతంలోనూ జనవరిలో స్టాక్ మార్కెట్లు నష్టాలనే నమోదుచేశాయి. బడ్జెట్‌పై ఆశలతో, గణతంత్ర దినోత్సవం (జనవరి 26) తర్వాత పుంజుకునేవ'ని స్వస్తికా ఇన్వెస్ట్‌మెంట్‌లో రీసెర్చ్ హెడ్‌గా ఉన్న సంతోశ్ మీనా చెబుతున్నారు. 2025 జనవరిలోనూ సెన్సెక్స్ 638.44 పాయింట్లు (0.81%) నష్టపోయింది. 2024, 2023, 2022, 2021, 2020 జనవరిలోనూ ఇదే పరిస్థితి పునరావృతమైంది.

	2026 జనవరిలో ఇప్పటివరకు	గతవారంలో
సెన్సెక్స్	-3683 పాయింట్లు (4.32%)	-2,033 (2.43%)
నిఫ్టీ	-1081 పాయింట్లు (4.13%)	-646 (2.51%)

బడ్జెట్‌పై అంచనాలు: అంతర్జాతీయ అనిశ్చితుల దృష్ట్యా వృద్ధికి తోడ్పాటు, సూక్ష్మ ఆర్థిక స్థిరత్వం మధ్య సమతూకం పాటించేలా 2026-27 వార్షిక బడ్జెట్లో నిర్ణయాలు ఉండొచ్చని యాక్సిస్ సెక్యూరిటీస్ నివేదిక తెలిపింది. మార్కెట్లు ఈసారి బడ్జెట్ నుంచి ఇలాంటి నిర్ణయాలనే కోరుకునే అవకాశం ఉందని అభిప్రాయపడింది. మూలధన లాభాల పన్నుపై ఆశాజనక నిర్ణయాలు ఉంటాయని ఆశిస్తున్నారు.

కోడి గుడ్లు
27న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	505	తూ/ప గోదావరి	505
వరంగల్	507	విశాఖపట్నం	510
విజయవాడ	550	చిత్తూరు	573

స్టెమ్ ఫ్రెషర్ల నియామకాలు తగ్గుతున్నాయ్



నైపుణ్యం కలిగిన ఉద్యోగులకే మొగ్గు: టీమ్‌లీజ్

ఫ్రెషర్ల (తాజా ఉత్తీర్ణుల) విషయంలో దేశీయ కంపెనీలు ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. ముఖ్యంగా సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమేటిక్స్ (స్టెమ్) విభాగాలకు చెందిన ఫ్రెషర్ల నియామకాలు తగ్గుతున్నాయి. పనిచేయడానికి సిద్ధంగా నైపుణ్యాలు కలిగిన వారినే కంపెనీలు కోరుకుంటున్నాయని స్టాఫింగ్, నియామక సేవల సంస్థ టీమ్‌లీజ్ నివేదిక వెల్లడించింది. 2024-25లో 2,00,000 నుంచి 2,20,000 మంది స్టెమ్ ఫ్రెషర్ల నియామకాలు జరిగాయి. 2025-26లో ఈ సంఖ్య 1,50,000కు పరిమితం కావచ్చని ఈ సంస్థ అంచనా వేసింది. నైపుణ్యం కలిగిన వారిపై కంపెనీలు దృష్టిపెట్టడాన్ని ఇది సూచిస్తోంది.

✦ క్లౌడ్ ప్లాట్‌ఫామ్‌లు, డేటా పైప్‌లైన్‌లు, ఆటోమేషన్, ఏఐ టూల్స్‌తో తాజా పట్టభద్రులు పనిచేయాల్సి ఉంటుందని నిపుణులు, స్టార్టప్ వ్యవస్థాపకులు చెబుతున్నారు. ఈ నైపుణ్యం కలిగిన వారిని నియమించుకోవడం చాలా కీలకం కానుందని భావిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 70-74% ఫ్రెషర్లను తీసుకోవడానికి సన్నాహాలు చేస్తున్నాయని టీమ్‌లీజ్ సీఈఓ నీతి శర్మ వెల్లడించారు.

✦ ముఖ్యంగా అంకుర సంస్థలు తక్కువ సిబ్బందికి మొగ్గుచూపుతున్నాయి. అయితే నియామకాలను కొనసాగిస్తున్నాయి. ఏఐ, డేటా అనలిటిక్స్ నైపుణ్యాలున్న ఉద్యోగులను తీసుకోవడానికి ఆసక్తి చూపుతున్నాయి.

✦ స్టెమ్ ఫ్రెషర్ల నియామకాలు 2021-22లో 4,00,000 నుంచి 2022-23లో 2,30,000కు, 2023-24లో 1,50,000కు పరిమితమైంది. నియామకాల సెంటిమెంట్ మెరుగుపడటం, ఏఐ/క్లౌడ్ గిరాకీ వల్ల, గత ఆర్థిక సంవత్సరంలో నియామకాలు 15-18% మెరుగుపడి 2 లక్షలను మించినట్లు శర్మ పేర్కొన్నారు.

వేతనాల తీరు ఇలా..: స్టెమ్ విభాగాల వారికి.. సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్, డేటా ఉద్యోగాల్లో వేతనాల వృద్ధి అధికంగా ఉంది. స్టెమ్ ఫ్రెషర్లకు సగటు వార్షిక వేతనం 2024లో రూ.3 లక్షలు కాగా, 2025లో రూ.4 లక్షలకు పెరిగింది. ప్రారంభ స్థాయి టెక్ నియామకాల్లో మార్పులు ఇందుకు కారణమని, ఏఐ, డేటా ఉద్యోగులకు కంపెనీలు మొగ్గుచూపుతున్నాయని శర్మ వెల్లడించారు.

యాక్సిస్ బ్యాంక్ లాభం రూ.7,010 కోట్లు

ముంబయి: యాక్సిస్ బ్యాంక్, డిసెంబరు త్రైమాసికంలో రూ.7,010.65 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.6,742.99 కోట్లతో పోలిస్తే ఇది 4% అధికం. స్టాండలోన్ పద్ధతిన బ్యాంక్ లాభం రూ.6,303.77 కోట్ల నుంచి రూ.6,489.57 కోట్లకు చేరుకుంది. బ్యాంకు నికర వడ్డీ ఆదాయం 5% వృద్ధితో రూ.14,287 కోట్లకు చేరింది. 14% రుణ వృద్ధి ఇందుకు దోహదం చేసింది. నికర వడ్డీ మార్జిన్ 0.29% తగ్గి 3.64 శాతానికి పరిమితం అయింది. స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి త్రైమాసికం కిందటితో పోలిస్తే 1.46% నుంచి 1.4 శాతానికి మెరుగైంది. మొత్తం మీద కేటాయింపులు 2024-25 డిసెంబరు త్రైమాసికం నాటి రూ.2155.63 కోట్ల నుంచి రూ.2245.92 కోట్లకు పెరిగాయి. ఇతర బ్యాంకులతో పోలిస్తే లేబర్‌కోడ్ అమలు వల్ల తమ బ్యాంకుపై తక్కువ ప్రభావమే (రూ.25 కోట్లు) పడిందని సీఎఫ్ఓ పునీత్ శర్మ తెలిపారు.

పీవీఆర్ ఐనాక్స్ స్నాక్స్ వ్యాపారం మారికో చేతికి

దిల్లీ: పీవీఆర్ ఐనాక్స్ తన ఖరీదైన స్నాక్స్ వ్యాపారాన్ని ఎఫ్ఎమ్‌సీజీ దిగ్గజం మారికోకు విక్రయిస్తోంది. 4700బీసీ బ్రాండుపై జీ మేజ్ ప్రైవేట్ లిమిటెడ్ (జెడ్ఎంపీఎల్) ద్వారా ఈ వ్యాపారాన్ని పీవీఆర్ ఐనాక్స్ నిర్వహిస్తోంది. పూర్తిగా నగదు రూపేణా జరగనున్న ఈ లావాదేవీ విలువ రూ.226.80 కోట్లు అని కంపెనీ తెలిపింది. రుణ భారాన్ని తగ్గించుకునేందుకు, తనకు కీలకమైన సినిమా కార్యకలాపాలపై మరింత దృష్టి పెట్టేందుకు, ఈ విక్రయాన్ని చేపడుతున్నట్లు తెలిపింది. నిర్దేశిత ఒప్పందం కుదిరిన తేదీ నుంచి 30 రోజుల్లోగా దీనిని పూర్తి చేయనున్నట్లు పేర్కొంది. ఈ విక్రయం అనంతరం రుణ రహిత కంపెనీగా మారుతామని పీవీఆర్ ఐనాక్స్ తెలిపింది.

5 రంగాల్లో రూ.50.6 లక్షల కోట్లు

2035 కల్లా ఏఐ వాటాపై నివేదిక

అభివృద్ధి చెందుతున్న దేశాలు కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను గణనీయ స్థాయిలో వినియోగిస్తున్నాయని కన్సల్టింగ్ సంస్థ పీడబ్ల్యూసీ తెలిపింది. 'ఏఐ ఎడ్జ్ ఫర్ వికసిత్ భారత్' పేరుతో ఈ నివేదికను సంస్థ విడుదల చేసింది. దీని ప్రకారం 2035 నాటికి మనదేశంలో 5 ప్రాధాన్యతా రంగాల్లో ఏఐ వాటా 550 బిలియన్ డాలర్ల (రూ. 50.6 లక్షల కోట్ల)కు చేరుతుందని అంచనా వేసింది. ఈ నివేదిక ప్రకారం..

వ్యవసాయంలో

దేశంలో ప్రాధాన్యతా రంగాలైన వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, ఇంధనం, విద్య, తయారీ రంగాల వృద్ధిలో ఏఐ కీలక పాత్ర పోషించే అవకాశం కనిపిస్తోంది. వ్యవసాయం మనదేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉంది. వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవాలంటే, ఈ రంగం స్థూల విలువ జోడింపు (జీవీఏ) 2046-47 ఆర్థిక సంవత్సరం నాటికి 2,359 బిలియన్ డాలర్ల (సుమారు రూ.217 లక్షల కోట్ల)కు చేరాల్సిన అవసరం ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇది 637 బి.డాలర్లు (సుమారు రూ. 58.60 లక్షల కోట్లు)గా ఉంది. ఈ రంగం తీవ్రమైన ఉత్పాదకత సవాళ్లను ఎదుర్కొంటోంది. భారతీయ రైతుల్లో సుమారు 86% మంది చిన్న లేదా సన్నకారు రైతులే ఉన్నారు. వీరు ఒక హెక్టారు కంటే తక్కువ భూమి కలిగి ఉన్నారు. వ్యవసాయ దిగుబడులు మెరుగుపర్చడానికి, వ్యవసాయంలో దీర్ఘకాలిక స్థిరత్వాన్ని తీసుకురావడానికి డిజిటల్ సాధనాలను ముఖ్యంగా ఏఐని వేగంగా స్వీకరించడం ఈ రంగానికి చాలా అవసరమని నివేదిక తెలిపింది.



విద్యా బోధనలో

✦ విద్యాబోధనలో నాణ్యత పెంచడం, పాలన, నైపుణ్య అమరికను మెరుగుపర్చడంలో ఏఐ సాయపడుతుంది. విద్యార్థులు మరింతగా ఉపాధి పొందేందుకు సహకరిస్తుంది.

✦ ఏఐ ఎడ్జ్ ఫ్రేమ్ వర్క్‌ను కూడా నివేదిక వివరించింది. దేశ అభివృద్ధికి ఏఐని అనుసంధాన వ్యవస్థగా మార్చడానికి రూపొందించిన 3ఏ2ఐ ఫ్రేమ్‌వర్క్‌ను పీడబ్ల్యూసీ తన నివేదికలో ప్రవేశపెట్టింది. ఇందులో మన దేశం ఏఐ స్వీకరణ నుంచి ఆశించే 5 ఫలితాలను తెలిపింది. వీటిలో కార్యాచరణ నైపుణ్యం, స్థిరత్వం, మంచి పాలన, స్థితిస్థాపకత, ఆర్థిక క్రమశిక్షణ ఉన్నాయి.

ఇంధన రంగంలో

తయారీ, వ్యవసాయం రెండింటిలోనూ వృద్ధికి ఇంధన రంగాన్ని కీలకమైన సహాయకారిగా అభివర్ణించారు. పారిశ్రామిక విస్తరణ, ఆధునిక వ్యవసాయ పద్ధతులకు మద్దతు ఇస్తున్నందున, వికసిత్ భారత్ లక్ష్యాలను సాధించడానికి సమర్థ, ఉత్పాదక ఇంధన వ్యవస్థ కీలకంగా ఉండనుంది.

వైద్య సేవల్లో

జిల్లా ఆసుపత్రులకు అనుసంధానించిన వైద్య కళాశాలల ద్వారా తృతీయ, సూపర్ స్పెషాల్టీ కేర్‌ను విస్తరించడం వల్ల అధిక నైపుణ్యం కలిగిన ఉద్యోగాలను సృష్టించొచ్చు. వైద్య ప్రతిభను నిలుపుకోవడంలో కూడా సహాయపడొచ్చు. ఇది వైద్య పర్యాటకానికీ దోహదపడుతుంది. రోగ నిర్ధారణ సామర్థ్యాన్ని మెరుగుపర్చడంలో ఏఐ సాయపడుతుంది.

తయారీ ప్రక్రియలో

తయారీరంగంలో సెమీ కండక్టర్లు, సోలార్ ప్యానళ్లు, టెలికమ్యూనికేషన్లు, ఎలక్ట్రానిక్స్ వంటి రంగాల్లో వేగవంత వృద్ధికి ఏఐ ఉపయోగపడుతుంది. ప్రపంచ వాల్యూ చైన్‌లలో భారత్ పాత్రనూ పెంచుతుంది.

భారత్‌లో డ్రీమ్‌లైనర్‌లకు మంచి భవిష్యత్తు

మరిన్ని ఆర్డర్లు రావొచ్చు: బోయింగ్



ఒకేసారి 200-300 మంది ప్రయాణికులను, నాన్‌స్టాప్‌గా 15,000 కిలోమీటర్ల దూరంలోని ప్రాంతాలకు చేరవేయగలిగే పెద్ద విమానం డ్రీమ్‌లైనర్ (బోయింగ్ 787) లకు భారత్‌లో మంచి భవిష్యత్ ఉందని, రాబోయే రోజుల్లో మరిన్ని ఆర్డర్లు వచ్చే అవకాశం ఉందని అమెరికా విమాన తయారీ సంస్థ బోయింగ్ అంచనా వేసింది. సమీప భవిష్యత్తులో కంపెనీ మంచి వృద్ధి సాధించనుందని బోయింగ్ ఇండియా, దక్షిణాసియా అధ్యక్షుడు సలీల్ గుప్తే తెలిపారు. భారత్- అమెరికా మధ్య టారిఫ్ ఉద్రిక్తతలు కొనసాగుతున్నా.. భారత ఏరోస్పేస్ రంగ పారిశ్రామికీకరణ లక్ష్యంగా ఇరు దేశాలు ముందుకు వెళ్తున్నాయని అన్నారు. స్వల్పకాలిక సవాళ్లలో కొన్నింటిని అధిగమిస్తామనే ధీమాను సలీల్ వ్యక్తం చేశారు. గత ఏడాది జూన్‌లో అహ్మదాబాద్ నుంచి లండన్‌కు వెళ్తున్న ఎయిరిండియా డ్రీమ్‌లైనర్ విమానం ప్రమాదానికి గురై, వందల మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) దర్యాప్తు జరుపుతోందని, త్వరలోనే నివేదిక వెలువడచ్చని పేర్కొన్నారు.

✦ బోయింగ్ 787 విమానాలను మనదేశంలో ఎయిరిండియా సొంతంగా నిర్వహిస్తోంది. ఎయిరిండియా చేతిలో మొత్తం 33 డ్రీమ్‌లైనర్‌లు ఉన్నాయి. ఇందులో 26 సంస్థకు చెందిన బీ787-8 మోడళ్లు కాగా, విస్తారా నుంచి ఆరు బీ787-9 విమానాలు, ఒక కొత్త విమానం ఉన్నాయి. 2022 జనవరిలో ఎయిరిండియా ప్రైవేటీకరణ జరిగిన తర్వాత, వచ్చేనెల 1న సరికొత్త డ్రీమ్‌లైనర్ వాణిజ్య కార్యకలాపాలను ఎయిరిండియా ప్రారంభించనుంది. నార్స్ అట్లాంటిక్ ఎయిర్‌వేస్ నుంచి లీజుకు తీసుకున్న కొన్ని డ్రీమ్‌లైనర్‌లను ఇండిగో నిర్వహిస్తోంది.

బడ్జెట్ రూపకల్పన బృందం ఇదీ



వచ్చే ఆదివారం (ఫిబ్రవరి 1న) 2026-27 బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. వరుసగా 9వ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ద్వారా ఆమె రికార్డు సృష్టించనున్నారు. ఒకవైపు అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, మరోవైపు మన దేశం 7.4% వృద్ధి సాధిస్తున్న తరుణంలో ఈ బడ్జెట్ వెలువడనుంది. మోదీ 3.0 ప్రభుత్వంలో ఇది మూడో పూర్తిస్థాయి బడ్జెట్. బడ్జెట్ రూపకల్పన కోసం ఆర్థిక శాఖలో ముఖ్యమైన అధికారుల బృందం కృషి చేస్తోంది. ఆ కీలక వ్యక్తులను ఒకసారి చూద్దాం..

అనురాధ ఠాకూర్, ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి



బడ్జెట్ రూపకల్పనలో ఈమె చాలా కీలకం. ఈ విభాగానికి అధిపతిగా, 2026-27 ఆర్థిక సంవత్సరానికి వనరుల కేటాయింపు, స్థూల ఆర్థిక నియామవళిని నిర్ణయిస్తారు. బడ్జెట్ పత్రాలను రూపొందించే విభాగానికి నాయకత్వం వహిస్తున్నారు. 1994 బ్యాచ్ హిమాచల్ ప్రదేశ్ క్యాడర్‌కు చెందిన ఠాకూర్‌కు ఇదే మొదటి బడ్జెట్. 2025 జులై 1న ఆర్థిక వ్యవహారాల కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఈ విభాగానికి నేతృత్వం వహిస్తున్న మొదటి మహిళా ఐఏఎస్ అధికారి కావడం విశేషం.

అరవింద్ శ్రీవాస్తవ, రెవెన్యూ కార్యదర్శి




పన్ను ప్రతిపాదనలను (బడ్జెట్ ప్రసంగంలోని పార్ట్-బి) ఈయన రూపొందిస్తారు. ప్రత్యక్ష పన్నులు (ఆదాయపు పన్ను, కార్పొరేట్ పన్ను), పరోక్ష పన్నులు (జీఎస్టీ, కస్టమ్స్)ను ఈయన బృందం నిర్ణయిస్తుంది. రెవెన్యూ కార్యదర్శిగా అరవింద్‌కు కూడా ఇదే మొదటి బడ్జెట్. ఇంతకు ముందు ఆయన ఆర్థిక శాఖలో సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు. ఈసారి బడ్జెట్‌లో కస్టమ్స్ సుంకాలు, టీడీఎస్ హేతుబద్ధీకరణపై అంచనాలు ఉండటంతో, ఆదాయ సమీకరణలో ఈ పాత్ర కీలకంగా మారింది.

ఉమ్లున్‌మంగ్ ఉల్నామ్, వ్యయాల కార్యదర్శి



ప్రభుత్వ వ్యయాలకు ఈయన బాధ్యుడు. ప్రభుత్వ వ్యయాలు, రాయితీల హేతుబద్ధీకరణ, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు వంటి వాటిని పర్యవేక్షిస్తారు. ద్రవ్యలోటును కట్టడి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటు వచ్చే ఆర్థిక సంవత్సరానికి అంచనాలను ఈయన బృందం ఇస్తుంది.

ఎం.నాగరాజు, ఆర్థిక సేవల కార్యదర్శి



అందరికీ ఆర్థిక సేవలు, సామాజిక భద్రతా పథకాలను అమలు చేయడంలో ఆర్థిక సేవల విభాగం కీలక పాత్ర పోషిస్తుంది. ప్రభుత్వ రంగ బ్యాంకులు, బీమా కంపెనీలు, పించన్ పథకాల పనితీరుపై ఈయన విభాగం దృష్టిపెడుతుంది. రుణాల వృద్ధి, డిజిటల్ వ్యవస్థల స్వీకరణ, సామాజిక భద్రతా పథకాలు సహా ప్రభుత్వ ఆర్థిక అజెండాను తీసుకెళ్లడంతో ఈ విభాగం చాలా కీలకం.

అరుణిష్ చావ్లా, దీపం కార్యదర్శి



ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణ, ప్రైవేటీకరణ నిర్ణయాలను ఈ విభాగం అమలుచేస్తుంది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాలను విక్రయించడం ద్వారా పన్నులేతర ఆదాయ లక్ష్యాలను అందుకోవడం కోసం ఈ విభాగం పనిచేస్తుంది.

కె.మోసెస్ చాలై, ప్రభుత్వ సంస్థల విభాగ కార్యదర్శి



కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల మూలధన వ్యయాల ప్రణాళికలకు బాధ్యత వహిస్తారు. బడ్జెట్ కేటాయింపులతో పాటు, సమర్థంగా వినియోగించేలా చర్యలు చేపడతారు. ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తుల విక్రయం, మొత్తం ఆర్థిక పరిస్థితిని పర్యవేక్షించడంలో ఈయన విభాగం పాత్ర చాలా కీలకం.

వి.అనంత నాగేశ్వరన్, ముఖ్య ఆర్థిక సలహాదారు



బడ్జెట్‌కు అవసరమైన స్థూలఆర్థిక అంశాల వివరాలను ఈయన కార్యాలయం ఇస్తుంది. వృద్ధి అంచనాలు, రంగాల వారీ పనితీరు, అంతర్జాతీయ సమస్యలను అంచనా వేయడం వంటివి ఇందులో ఉన్నాయి. ఆర్థిక సంస్కరణలు, ద్రవ్య విధానాలు, ఆర్థిక వ్యూహాల విషయంలో ఆర్థిక మంత్రికి ఈయన కార్యాలయం సలహాలు అందిస్తుంది.




దరఖాస్తు చేశారా?

- ☛ ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో బిల్డింగ్ కన్సల్టెంట్ ఉద్యోగాలు (98)
  చివరి తేదీ: 29.01.2026
- ☛ హాల్‌లో డిప్లొమా, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు
  చివరి తేదీ: 30.01.2026

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు




◆ తొమ్మిదో సిక్కు గురువు గురుతేజ్ బహదూర్ ఎన్నో బలిదానం వార్షికోత్సవం సందర్భంగా కురుక్షేత్ర (హరియాణా)లోని జ్యోతిసరలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్మారక తపాల బిళ్ల, ప్రత్యేక నాణెం, కాఫీ - టేబుల్ పుస్తకాలను ఆవిష్కరించారు.
జ: 350వ వార్షికోత్సవం

◆ హరున్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ నివేదిక ప్రకారం ఏ రెండు భారత నగరాలు ప్రపంచంలోని టాప్ 10 బిలియనీర్ నగరాల జాబితాలో ఇటీవల చోటు దక్కించుకున్నాయి?
జ: ముంబయి, దిల్లీ (ముంబయి మూడో స్థానంలో, దిల్లీ 9వ స్థానంలో నిలిచాయి. ఈ నివేదికలో 119 మంది బిలియనీర్లతో న్యూయార్క్ నగరం అగ్రస్థానంలో ఉంది. 97 మంది బిలియనీర్లతో లండన్ రెండో స్థానంలో, 92 మంది బిలియనీర్లతో ముంబయి మూడో స్థానంలో నిలిచాయి. దిల్లీ 57 మంది బిలియనీర్లతో 9వ స్థానంలో నిలిచింది.)

◆ 2024-25 ఆర్థిక సంవత్సరంలో దేశంలో అత్యధికంగా దేశీయ పర్యాటకులు సందర్శించిన ప్రాంతాల్లో ఏది అగ్రస్థానంలో నిలిచింది?
జ: తాజ్‌మహల్ (తర్వాతి స్థానాల్లో కోణార్క్ సూర్య దేవాలయం, దిల్లీలోని కుతుబ్ మినార్, దిల్లీలోని ఎర్రకోట, ఔరంగాబాద్‌లోని బీబీకా మక్బారాలు నిలిచాయి.)

మరింత సమాచారం

సీనియర్ ఇంటర్ రసాయనశాస్త్రం — ఘనస్థితి



ఫైనల్ పరీక్షలు - 2026
ముఖ్యమైన ప్రశ్నలు - జవాబులు



1. సమన్వయ సంఖ్య అంటే ఏమిటి?

జ: 'ఒక ఘనపదార్థంలో ఒక పరమాణువు లేదా అయాన్‌కు అత్యంత సమీపంలో ఉన్న పరమాణువులు లేదా అయాన్ల సంఖ్యను దాని 'సమన్వయ సంఖ్య' అంటారు'.

2 మార్కులు

2. స్ఫటిక జాలకం, యూనిట్ సెల్ మధ్య భేదాన్ని ఏ విధంగా గుర్తిస్తారు?

జ: స్ఫటిక జాలకం: పునరావృతమయ్యే మూలాన్ని ఒక బిందువుగా సూచించే బిందు సమూహాన్ని స్ఫటిక జాలకం లేదా ప్రాదేశిక జాలకం అంటారు.

యూనిట్ సెల్: త్రిమితీయ మౌలిక నిర్మాణాన్ని 'యూనిట్ సెల్' అంటారు. దీని అమరికలో స్ఫటిక నిర్మాణం వస్తుంది.

4 మార్కులు


3. షాట్కీ లోపం అంటే ఏమిటి?

జ: షాట్కీ లోపం: 1) శుద్ధ జాలకంలో ఖాళీ ఉంటే దాన్ని షాట్కీ లోపం అంటారు. జాలకం సాధారణ స్థానం నుంచి ఒక పరమాణువు లేదా అయాన్‌ను తీసివేస్తే వచ్చేది బిందు లోపం.

2) అయానిక స్ఫటికాల్లో విద్యుత్తు ఆవేశాల తటస్థ స్థితిని నిలబెట్టాలి. అందుకోసం ఒక కాటయాన్ అయాన్ వల్ల ఖాళీ ఏర్పడితే దాంతోపాటు ఆ అయాన్‌కు విరుద్ధ ఆవేశం ఉన్న ఆనయాన్ అయాన్ కూడా తన స్థానం నుంచి వెళుతుంది.

3) ప్రధానంగా ఎక్కువ అయానిక స్వభావం ఉండి, కాటయాన్, ఆనయాన్ సైజులు ఒకేలా ఉండే సమ్మేళనాల్లో ఉంటుంది. అలాంటి సమ్మేళనాల్లో కో ఆర్డినేషన్ సంఖ్య అధికంగా ఉంటుంది. ఉదా: NaCl, CsCl

4) పటంతో వివరణ:



షాట్కీ లోపం

5. F-కేంద్రాలు అంటే ఏమిటి?

జ: F-కేంద్రాలు: జంటలేని ఎలక్ట్రాన్లు ఆక్రమించుకున్న ఆనయానిక్ స్థానాలను F-కేంద్రాలు అంటారు. ఇవి స్ఫటికాలకు రంగును ఇస్తాయి. స్ఫటికం మీద పడిన దృగ్గోచర కాంతిలోని శక్తిని ఈ ఎలక్ట్రాన్లు శోషించుకుని ఉత్తేజిత స్థితికి చేరడం ఫలితంగా రంగు వస్తుంది. F-కేంద్రాలు ఎలైల్ హాలైడ్లు, క్షార లోహాలతో వేడిచేయడం ద్వారా ఏర్పడతాయి.

ఉదా: NaCl స్ఫటికాన్ని Na - బాష్పంతో వేడిచేసినప్పుడు F-కేంద్రాలు ఏర్పడటం వల్ల పసుపు రంగు వర్ణం ఏర్పడుతుంది.

ముఖ్యమైన ప్రశ్నలు-జవాబులు

రచయిత: డాక్టర్ పి. త్రినాథ రాజా

జనరల్ స్టడీస్ — భౌతిక శాస్త్రం

టన్నుల బరువు తేలి.. సన్నని సూది మునిగి!





బావి నుంచి నీటిని తోడేటప్పుడు బకెట్ బావి నీటిలో ఉన్నప్పుడు తేలికగా ఉంటుంది, ఒకసారి ఆ నీటి నుంచి బయటకు రాగానే బరువు అనిపిస్తుంది. అదే విధంగా గ్లాసు నీటిలో ఐస్ ముక్క వేస్తే మునిగిపోకుండా, తేలుతుంది. అంటే ఒక వస్తువు మునుగుతుందా లేదా తేలుతుందా అని నిర్ణయించేది దాని బరువు మాత్రమే కాదు, ద్రవంపై ఆ వస్తువు ప్రయోగించే ఏదో అదృశ్యబలం అని అర్థమవుతుంది. దానిపై పోటీ పరీక్షార్థులు సరైన అవగాహన పెంపొందించుకోవాలంటే వస్తువుల ఆకృతికి, వాటి సాంద్రతకు, అవి నీటిని లేదా ద్రవాన్ని స్థానభ్రంశం చెందించే విధానానికి మధ్య సంబంధాన్ని గ్రహించాలి. పదార్థ సాంద్రత వస్తువు స్థితిని మార్చే తీరును, వస్తువులను ద్రవాలు పైకి నెట్టే విధానాన్ని, సాపేక్ష సాంద్రత గురించి తెలుసుకోవాలి.

తేలియాడే వస్తువులు

తుపాను వచ్చినప్పుడు ఇళ్లు, భవనాలు, వాహనాలు నీటిలో కొట్టుకు పోతుంటాయి. కానీ ఆ వర్షానికి కారణమయ్యే మేఘాలు గాలిలో ప్రయాణిస్తుంటాయి. చిన్న రాయిని నీటిలో వేస్తే మునిగిపోతుంది. కానీ వేల టన్నుల బరువు ఉన్న ఓడ నీటిపై తేలుతూ వెళ్లిపోతుంది. చిన్న కాగితాన్ని గాలిలో వదిలేస్తే అది కొద్ది సమయంలో భూమిని చేరుకుంటుంది. కానీ వందల మంది ప్రయాణికులు ఉన్న విమానం గాలిలోకి ఎగిరిపోతుంది. మనిషి నీటిలో పడితే మునిగిపోతాడు. అదే వ్యక్తి నీటిలో పడి చనిపోయిన తర్వాత కొన్ని రోజుల్లో పైకి తేలుతాడు. బూరెలు, గారెలు, పొంగడాలు, జంతికలు, అప్పడాలు నూనెలో వేగిన అనంతరం పైకి తేలతాయి. ఎంతో బరువైన మంచు దిబ్బలు నీటిపై తేలుతూ కనిపిస్తాయి. కారణం వస్తువు తేలియాడటంలో కొన్ని కీలకమైన భౌతికశాస్త్ర నియమాలు పని చేస్తుంటాయి. అందులో సాంద్రత, ఉత్ప్లవనం ప్రధానమైనవి.

సాంద్రత: ప్రమాణ ఘన పరిమాణంలో ఉండే ద్రవ్యరాశిని సాంద్రత అంటారు.

సూత్రం $d = \frac{M}{V}$

SI ప్రమాణం Kg/m^3,

CGS ప్రమాణం g/cm^3

$1 g/cm^3 = 1000\ K/m^3$.

1 లీటరు నీరు 1 కేజీ బరువు ఉంటుంది. అందుకే నీటి సాంద్రత $1 g/cm^3$ ఉంటుంది.

ప్రకటన-1 : వస్తువు ద్రవ్యరాశి స్థిరంగా ఉన్నప్పుడు సాంద్రత, ఘనపరిమాణానికి విలోమానుపాతంలో ఉంటుంది.


నిత్యజీవిత ఉదాహరణలు:



◆ పూరీలు, బోండాలు వాటి పరిమాణం పెరగడం వల్ల నూనెపై తేలుతాయి. ◆ నీరు.. మంచు మాదిరి గడ్డ కట్టినప్పుడు వ్యాకోచిస్తుంది. అందువల్ల దాని సాంద్రత తగ్గి నీటిపై తేలుతుంది. నీరు ఇలా 4°C - 0°C వరకు వ్యాకోచిస్తుంది. దీనినే నీటి అసంగత వ్యాకోచం అంటారు. నీటి అసంగత వ్యాకోచం వల్ల నదులు, సముద్రాలు ఎప్పుడూ పైనుంచి గడ్డకడతాయి. శీతల ప్రాంతాల్లో నీటిపైపులు పగిలిపోతూ ఉంటాయి. ◆ వేడిగాలి ఎల్లప్పుడూ పైకే వెళుతుంది. అందుకే వెంటిలేటర్లని ఇంటి పైభాగంలో ఏర్పాటు చేస్తారు. ◆ నీటిలో పడి చనిపోయిన వ్యక్తి ఘనపరిమాణం పెరగడం వల్ల నీటిపై తేలుతాడు. ◆ వేడి గాలి వల్ల బెలూన్లు గాలిలో ఎగురుతాయి.

ప్రకటన-2 : వస్తువు ఘనపరిమాణం స్థిరంగా ఉన్నప్పుడు ద్రవ్యరాశి పెరిగితే సాంద్రత పెరుగుతుంది.

నిత్యజీవిత ఉదాహరణలు:




★ ఉప్పు నీటిలో గుడ్డు తేలడం. ★ కుళ్లిపోయిన గుడ్లు నీటిలో తేలడం. ★ పుచ్చిపోయిన గింజలు నీటిపై తేలడం. ★ నదిలో నుంచి సముద్రంలోకి వచ్చే ఓడ పైకి లేవడం. ★ సముద్రంలో మనుషులు సులువుగా ఈదగలగడం. ★ ఉప్పు, కారం, మసాలాలు ఎక్కువ తినేవారికి గుండె జబ్బులు రావడం.

సాపేక్ష సాంద్రత: నీటి సాంద్రత $1 g/cm^3$. అందువల్ల అన్ని వస్తువుల సాంద్రతను నీటిసాంద్రతతో పోల్చి చెబుతారు. దీనినే సాపేక్ష సాంద్రత అంటారు.


$$\text{సాపేక్ష సాంద్రత} = \frac{\text{వస్తు సాంద్రత}}{\text{నీటి సాంద్రత}}$$

సాపేక్ష సాంద్రతకు ప్రమాణాలు లేవు. ద్రవాల సాపేక్ష సాంద్రతను డెన్సిటోమీటరు, హైడ్రోమీటరుతో కొలుస్తారు. పాలలో స్వచ్ఛతను మాత్రం లాక్టోమీటరుతో కొలుస్తారు. పాలలో ఉండే చక్కెరను లాక్టోజ్ అంటారు. డెన్సిటోమీటరు, హైడ్రోమీటరు, లాక్టోమీటరు అనేవి ప్లవన సూత్రాలపై ఆధారపడి పని చేస్తాయి. ప్లవన సూత్రాలను ఆర్కిమెడిస్ వివరించాడు.




హైడ్రో మీటరు

❖ వస్తువు సాపేక్ష సాంద్రత 1 కంటే ఎక్కువ ఉంటే అది నీటిలో మునిగిపోతుంది. 1 కంటే తక్కువ ఉంటే నీటిపై తేలుతుంది. ❖ ద్రవాలన్నింటిలో ఎక్కువ సాపేక్ష సాంద్రత కలిగింది పాదరసం. దాని విలువ 13.6. ఇది నీటిలో మునిగిపోతుంది. దీంతో టారిసెల్లీ అనే శాస్త్రవేత్త వాతావరణ పీడనాన్ని కొలిచే భారమితిని తయారు చేశాడు. ద్రవరూపంలో ఉండే లోహం పాదరసం. అందుకే ఇనుము బంతి కూడా పాదరసంలో తేలుతుంది. ఇనుము సాపేక్ష సాంద్రత 7.8 మాత్రమే.



టారిసెల్లీ




రూథర్‌ఫర్డ్

❖ అతి ఎక్కువ సాపేక్ష సాంద్రత ఉన్న లోహం ఆస్మియం 22.6. ❖ బంగారం సాపేక్ష సాంద్రత 19.3. దీని తాంతవత, స్తరణీయత అన్ని లోహాల కంటే ఎక్కువ. అందువల్లే కేంద్రకాన్ని కనుక్కున్న రూథర్‌ఫర్డ్ తన ప్రయోగాలకు బంగారు రేకును ఉపయోగించాడు. బంగారం స్వచ్ఛతను క్యారెట్‌లలో కొలుస్తారు. 24 క్యారెట్ల బంగారం స్వచ్ఛమైంది (99.99), ఆభరణాలకు వాడే బంగారం స్వచ్ఛత 22 క్యారెట్లు (91.6%). అందుకే దీనినే 916 బంగారం అంటారు.

ఆర్కిమెడిస్ సూత్రం

ఓడలను, జలాంతర్గాములను ఆర్కిమెడిస్ చెప్పిన ప్లవన సూత్రాల ద్వారా తయారుచేస్తారు. ఇదే సూత్రం బంగారం స్వచ్ఛతను కనుక్కోవడానికి కూడా వాడతారు.



ఆర్కిమెడిస్

ప్లవన సూత్రం-1: వస్తువు ద్రవం లోపల మునిగినప్పుడు, అది తొలగించే ద్రవం ద్రవ్యరాశి, వస్తువు ద్రవ్యరాశి కంటే ఎక్కువ ఉంటే అది నీటిపై తేలుతుంది. **ఉదా:** పడవ, ఓడ, ప్లాస్టిక్ బాటిల్, రామసేతు రాయి.

ప్లవన సూత్రం-2: వస్తువు ద్రవంలో మునిగినప్పుడు అది తొలగించే ద్రవం ద్రవ్యరాశి, వస్తువు ద్రవ్యరాశి సమానమైతే అది నీటిపై తేలుతుంది. **ఉదా:** వాటర్ ప్యాకెట్.

ప్లవన సూత్రం-3: వస్తువు ద్రవంలో మునిగినప్పుడు అది తొలగించే ద్రవం ద్రవ్యరాశి, వస్తువు ద్రవ్యరాశి కంటే తక్కువ అయితే అది మునిగిపోతుంది. **ఉదా:** రాయి, రంధ్రం పడిన ఓడ.

ఉత్ప్లవన బలం: గాలిలో మేఘాలు, నీటిలో వస్తువులు తేలడానికి కారణమయ్యే బలం ఉత్ప్లవన బలం. దీనికి సూత్రం F = PA.

ప్రవాహిలో వస్తువు మునిగి ఉన్నప్పుడు, వస్తువు వల్ల తొలగిపోయిన ప్రవాహి బరువు, దానిపై పనిచేసే ఉత్ప్లవన బలానికి సమానం. ఇక్కడ P అంటే పీడనం. పీడనానికి SI ప్రమాణాలు పాస్కల్.

$$\text{పాస్కల్ అంటే} = \frac{\text{న్యూటన్}}{(\text{మీటర్})^2}$$

★ ఘన, ద్రవ, వాయు పదార్థాలన్నీ పీడనాన్ని కలిగిస్తాయి.

★ $P = \frac{F}{A}$ అంటే ఎక్కువ వైశాల్యం ఉన్న వస్తువులు తక్కువ పీడనాన్ని కలిగిస్తాయి.

అనువర్తనాలు:



▲ లగేజీ బ్యాగులకు వెడల్పు పట్టీలు ఉండటం. ▲ ట్రాక్టర్ వెనుక చక్రాలు ఎక్కువ వైశాల్యంతో ఉండటం. ▲ అధిక బరువుతో వెళ్లే వాహనాలకు ఎక్కువ సంఖ్యలో చక్రాలు ఉంటాయి.



రచయిత: బి. మధు కుమార్

ఆ దశాబ్దమే బంగారు విప్లవ కాలం!



మానవ నాగరికతకు వ్యవసాయమే పునాది. జనాభా అంతటికీ ఆహారాన్ని, శ్రామికుల్లో ఎక్కువమందికి ఉపాధిని ఈ రంగమే అందిస్తోంది. పెరుగుతున్న జనాభా డిమాండ్ మేరకు వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో నూతన ఆవిష్కరణలు, సుస్థిర పద్ధతులు అవసరమయ్యాయి. దేశంలో హరితవిప్లవం, ప్రభుత్వ విధానాల కారణంగా ఆహారధాన్యాల విషయంలో స్వయంసమృద్ధి సాధ్యమైంది. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ స్థితిగతులు, దేశాలు, ప్రాంతాల వారీగా ప్రధాన పంటలు, వాటి అనుకూల వాతావరణంపై పోటీ పరీక్షార్థులకు ప్రాథమిక పరిజ్ఞానం ఉండాలి. వివిధ పంటల శాస్త్రీయనామాలు, ప్రసిద్ధి చెందిన పశుజాతులు, పంటల పరిశోధనా కేంద్రాలు, పశుపోషక సమాజాల గురించి తెలుసుకోవాలి.

వ్యవసాయం

1. కిందివాటిలో హరిత విప్లవం గురించి వాక్యాలను సరిచూడండి.
   - ఎ) హరిత విప్లవం వల్ల మృత్తికలు క్రమేణా తమ నాణ్యతను కోల్పోతాయి. అలాగే ఈ విప్లవం జీవవైవిధ్యాన్ని ప్రభావితం చేసింది.
   - బి) హరిత విప్లవం వల్ల తక్కువ ప్రయోజనం పొందిన పంట ప్రధానంగా పప్పుదినుసులు.
   - సి) హరిత విప్లవం వల్ల లబ్ధి పొందిన కూరగాయల పంట బంగాళాదుంపలు.
   - డి) హరిత విప్లవం వల్ల భూగర్భజలాలు క్రమేణా తగ్గి అధికభాగం కలుషితమయ్యాయి.

   1) ఎ, బి, సి, డి సరైనవి.
   2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
   3) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
   4) ఎ, సి, డి సరైనవి; బి సరికాదు.

2. కిందివాటిని జతపరచండి.

మేక జాతి	రాష్ట్రం
ఎ) చందా, చేగు	1) పంజాబ్
బి) షమ్మిన్	2) ఉత్తర్‌ప్రదేశ్
సి) జమునాపరి	3) కశ్మీర్
డి) బీటల్	4) హిమాచల్‌ప్రదేశ్, హరియాణా

   1) ఎ-1, బి-2, సి-3, డి-4 2) ఎ-4, బి-1, సి-3, డి-2
   3) ఎ-4, బి-3, సి-2, డి-1 4) ఎ-1, బి-3, సి-4, డి-2

3. కింది వాక్యాలను సరిచూడండి.



   - ఎ) జనపనార పంటకు సరాసరి ఉష్ణోగ్రతలు 24° నుంచి 35° వరకు ఉండాలి. సరాసరి వర్షపాతం 150 సెం.మీ. ఉండాలి.
   - బి) జనుము, దాని కాండాన్ని నానబెట్టి, నార తీసే విధానాన్ని 'రాటింగ్' అంటారు.
   - సి) గంగానది ఒక ప్రధాన పాయ పద్మానది లోయలో పండే జనుము రకాన్ని 'దేవ్రా' అంటారు.
   - డి) బ్రహ్మపుత్ర నది లోయ ప్రాంతంలో (జమున పరీవాహక ప్రాంతంలో) పండే జనుమును 'సిరాజ్ గంజ్ జనుము' అంటారు.

   1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
   2) ఎ, బి, సి, డి సరైనవి.
   3) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.
   4) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.

4. కిందివాటిని జతపరచండి.

పశురంగ పరిశోధనా సంస్థ	ప్రాంతం
ఎ) జాతీయ పందుల పరిశోధనా కేంద్రం	1) ఇజ్జత్ నగర్
బి) కేంద్ర గేదెల పరిశోధనా సంస్థ	2) రాంచి
సి) కేంద్ర పశు పరిశోధనా సంస్థ	3) గువాహటి
డి) కేంద్ర పశువైద్య పరిశోధనా సంస్థ	4) హిస్సార్

   1) ఎ-1, బి-2, సి-3, డి-4 2) ఎ-4, బి-3, సి-2, డి-1
   3) ఎ-1, బి-4, సి-2, డి-3 4) ఎ-3, బి-4, సి-2, డి-1

5. కిందివాటిని సరిచూడండి.



   - ఎ) కోకో పంటకు ప్రధాన మూలస్తంభంగా నిలిచింది లాటిన్ అమెరికా.
   - బి) రష్యాలోని ఉమ్మడి వ్యవసాయ క్షేత్రాలను 'కోల్‌కోజులు' అని పిలుస్తారు.
   - సి) చైనాలోని ఉమ్మడి వ్యవసాయ క్షేత్రాన్ని 'కమ్యూన్' అని పిలుస్తారు.
   - డి) స్థానిక ప్రజలను ఆస్ట్రేలియాలో 'అబారిజన్స్' అంటారు.

   1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
   2) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.
   3) ఎ, బి, సి, డి సరైనవి.
   4) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.

6. కిందివాటిని జతపరచండి.

గేదెల జాతి	ప్రాంతం
ఎ) యహసనా గేదె జాతి	1) కర్ణాటక
బి) దాంగ్రి ఎద్దు జాతి	2) రాజస్థాన్
సి) నగోరి ఎద్దు జాతి	3) మహారాష్ట్ర
డి) అమృత్‌మహల్ ఎద్దులు	4) గుజరాత్

   1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-1, బి-2, సి-3, డి-4
   3) ఎ-1, బి-3, సి-2, డి-4 4) ఎ-4, బి-1, సి-3, డి-2

7. కిందివాటిలో మత్స్య పరిశ్రమకు సంబంధించిన వాక్యాలను సరిచూడండి.



   - ఎ) సముద్రంలోని ఉపరితల జలాలపై నివసించే చేపలను 'పెలాజిక్ చేపలు' అంటారు.
   - బి) సముద్రపు జలాల అడుగున నివసించే చేపలను 'డెమార్సస్ చేపలు' అంటారు.
   - సి) సముద్రం నుంచి నదీజలాల్లోకి, నదీజలాల నుంచి సముద్రంలోకి రుతువును అనుసరించి కదిలే చేపలను 'అనాండ్రమస్ చేపలు' అంటారు.
   - డి) సముద్రపు జలాల్లో అడుగున చెట్ల కాండాలు, మొక్కలకు అంటిపెట్టుకుని నివసించే జీవులను 'బెంథాస్ జీవులు' అంటారు.

   1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు
   2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
   3) ఎ, బి, సి, డి సరైనవి.
   4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

జనరల్ స్టడీస్ - జాగ్రఫీ

8. కిందివాటిని జతపరచండి.

పంటల రకాలు	ప్రాంతాలు/రాష్ట్రాలు
ఎ) సోర్నావారి - జైద్ కాలపు పంట	1) కేరళ
బి) అగహని - ఖరీఫ్ కాలపు పంట	2) ఒడిశా
సి) బియారి - జైద్ కాలపు పంట	3) తమిళనాడు
డి) విరిప్పు - జైద్ కాలపు పంట	4) బిహార్

   1) ఎ-1, బి-4, సి-2, డి-3 2) ఎ-4, బి-3, సి-2, డి-1
   3) ఎ-4, బి-1, సి-2, డి-3 4) ఎ-3, బి-4, సి-2, డి-1

9. కిందివాటిలో కాఫీకి సంబంధించిన వాక్యాలను సరిచూడండి.



   - ఎ) కాఫీ పంటకు సరాసరి ఉష్ణోగ్రతలు 15°C - 28°C మధ్య ఉండాలి. సరాసరి వర్షపాతం 150 - 200 సెం.మీ. మధ్య ఉండాలి.
   - బి) కాఫీ రోబెస్టా అత్యంత నాణ్యమైంది. దీనికి చీడ, పీడలను తట్టుకునే శక్తి ఉంటుంది. ఇది ప్రధానంగా ఇండోనేసియాలో పెరుగుతుంది.
   - సి) కాఫీ అరాబికా అనేది ఎత్తయిన భూముల్లో పెరుగుతుంది. ఇథియోపియాలో ఈ పంట ఎక్కువ. ఇది సువాసనతో ఉంటుంది.
   - డి) ప్రపంచంలో అత్యధికంగా కాఫీ ఉత్పత్తి చేసే దేశం బ్రెజిల్.

   1) ఎ, బి, సి, డి సరైనవి.
   2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
   3) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు
   4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

10. కిందివాటిని జతపరచండి.

తేయాకు రకాలు	దేశాలు
ఎ) గ్రీన్ టీ	1) ఇండియా, శ్రీలంక
బి) ఓలాంగ్ టీ	2) బ్రెజిల్
సి) ఎర్బమేట్	3) చైనా
డి) బ్లాక్ టీ	4) తైవాన్

   1) ఎ-1, బి-3, సి-4, డి-2 2) ఎ-3, బి-4, సి-2, డి-1
   3) ఎ-2, బి-3, సి-4, డి-1 4) ఎ-1, బి-4, సి-3, డి-2

11. కింది వాక్యాలను సరిచూడండి.
   - ఎ) హరిత విప్లవంలో భాగంగా 1960-61లో సాంద్ర వ్యవసాయ జిల్లాల కార్యక్రమాన్ని ప్రారంభించారు.
   - బి) 1968లో సాంద్ర వ్యవసాయ ప్రాంతాల కార్యక్రమం 114 జిల్లాల్లో ప్రారంభించారు.
   - సి) భారత్‌లో నేషనల్ ఆయిల్‌సీడ్స్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును 1985-86లో ప్రారంభించారు.
   - డి) దేశంలో 1919 నుంచి పశుగణన ప్రారంభించారు.

   1) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
   2) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
   3) ఎ, బి, సి, డి సరైనవి.
   4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

12. కిందివాటిని జతపరచండి.

పశుపోషక ఆధారిత సమాజాలు	ప్రాంతాలు
ఎ) మల్దారీలు	1) ఉత్తరాఖండ్
బి) థంగర్	2) పశ్చిమ మధ్యప్రదేశ్, రాజస్థాన్
సి) బంజారా	3) గుజరాత్
డి) బోటియా	4) మహారాష్ట్ర

   1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-3, బి-4, సి-2, డి-1
   3) ఎ-1, బి-4, సి-3, డి-2 4) ఎ-4, బి-1, సి-2, డి-3

13. కింది వాక్యాలను సరిచూడండి.



   - ఎ) ఎం.ఎస్.స్వామినాథన్ సతత హరితవిప్లవాన్ని 2005లో ప్రారంభించారు.
   - బి) ప్రధాని నరేంద్ర మోదీ 2014లో త్రివర్ణ విప్లవానికి నాంది పలకాలని సూచించారు. దీనిలో ప్రధానంగా పప్పుధాన్యాలు, పశుసంపద, సౌరశక్తి ఉంటాయి.
   - సి) చేపల అధ్యయనాన్ని 'ఇక్తియాలజీ' అంటారు. చేపల పెంపకాన్ని 'పిసి కల్చర్'గా పిలుస్తారు.
   - డి) మనదేశంలో 1991-2003 మధ్య కాలాన్ని బంగారు విప్లవంగా పిలుస్తారు.

   1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
   2) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.
   3) ఎ, బి, సి, డి సరైనవి.
   4) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.

14. కిందివాటిని జతపరచండి.

పంటలు	శాస్త్రీయనామాలు
ఎ) రబ్బరు	1) హుర్డెమ్ వల్గేర్
బి) రాగి	2) పెన్నెసెటం గ్లాకం
సి) జొన్న	3) హెవియా బ్రెజిలియాన్సిస్
డి) బార్లీ	4) ఇల్యుసైన్ కొరకాన

   1) ఎ-3, బి-4, సి-2, డి-1 2) ఎ-4, బి-3, సి-2, డి-1
   3) ఎ-1, బి-4, సి-3, డి-2 4) ఎ-1, బి-3, సి-4, డి-2

15. కిందివాటిని సరిచూడండి.
   - ఎ) సిసిలీలో ప్రధానంగా మర్సాలా రకపు ద్రాక్ష దొరుకుతుంది.
   - బి) అర్ధచంద్రాకృతిలో ఉండే గోధుమ ప్రాంతం అర్జెంటైనాలోని పంపాలు ప్రాంతం.
   - సి) షెర్రీ రకపు ద్రాక్ష ప్రధానంగా స్పెయిన్‌లో దొరుకుతుంది.
   - డి) అట్లాంటిక్ మహాసముద్రాన్ని 'హెర్రింగ్ పాండ్' అని పిలుస్తారు.

   1) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
   2) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు
   3) ఎ, బి, సి, డి సరైనవి.
   4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.



రచయిత: బండ్ల శ్రీధర్

సమాధానాలు


1-1, 2-3, 3-2, 4-4, 5-3, 6-1, 7-3, 8-4, 9-1, 10-2, 11-3, 12-2, 13-3, 14-1, 15-3.

ఎలక్ట్రానిక్స్

జంక్షన్ డయోడ్

p - n జంక్షన్

p - రకం అర్ధవాహకాన్ని, n - రకం అర్ధవాహకంతో అనుకూలంగా జత చేసినప్పుడు ఆ రెండు స్పృశించుకునే స్థానాన్ని కూడలి లేదా జంక్షన్ అంటారు.



✦ ఈ జంక్షన్ p - రకం, n - రకం అర్ధవాహకాలను విడదీస్తుంది. అయితే ఈ రెండింటి మధ్య ఉన్న స్పర్శ వల్ల n - భాగం నుంచి కొన్ని ఎలక్ట్రాన్లు p - భాగంలోకి, p - భాగంలోని కొన్ని హోల్స్ n - భాగంలోకి ప్రవేశిస్తాయి. ఈ విధంగా జంక్షన్‌కు రెండువైపులా ఆనుకుని ఎలక్ట్రాన్లు, హోల్స్ ఒకదాన్ని మరొకటి తటస్థీకరించుకుంటాయి.


✦ జంక్షన్‌కు దగ్గరలో ఉన్న p - భాగంలో రుణాత్మక అయాన్లు, n - భాగంలో ధనాత్మక అయాన్లు మిగిలి ఉంటాయి.

✦ జంక్షన్‌కు దగ్గరలో ఉన్న n - భాగం ధనావేశంగా, p - భాగం రుణావేశంగా మారతాయి.

✦ p - n జంక్షన్‌కు దగ్గరగా చలించే ఆవేశ వాహక కణాల లేమి (లేకపోవడం) వల్ల ఏర్పడిన ప్రాంతాన్ని లేమి పొర లేదా లేమి ప్రాంతం (Depletion Layer - D) అంటారు.

✦ n - భాగంలోని D ప్రాంతంలో స్వేచ్ఛా ఎలక్ట్రాన్లు ఉండవు. p - భాగంలోని D ప్రాంతంలో హోల్స్ ఉండవు. D ప్రాంతంలో చలించని దాత, గ్రహీత అయాన్లు మాత్రమే ఉంటాయి.


✦ జంక్షన్ Jకు రెండువైపులా నిశ్చల ధనాత్మక, రుణాత్మక ఆవేశాలు ఉండటం వల్ల వాటి హద్దుల్లో కొంత పొటెన్షియల్ భేదం (V_D) ఉంటుంది. దీన్ని అవరోధ పొటెన్షియల్ (Potential Barrier) అంటారు. ఈ పొటెన్షియల్ ఎలక్ట్రాన్లు, హోల్స్ చలనాన్ని నివారిస్తుంది.



p - n జంక్షన్ డయోడ్


టర్మినల్ కలిగిన p - రకం, n - రకం అర్ధవాహకాల్లో ఏర్పడిన p - n జంక్షన్‌ను p - n జంక్షన్ డయోడ్ అంటారు.

వాలు బయాస్: p - n జంక్షన్ డయోడ్‌లో p భాగాన్ని బ్యాటరీ ధనావేశ టర్మినల్‌కు, n భాగాన్ని రుణావేశ టర్మినల్‌కు కలిపినప్పుడు డయోడ్ వాలు బయాస్‌లో ఉన్నట్లు అర్థం.



(వాలు బయాస్)

ఎదురు బయాస్: p - n జంక్షన్ డయోడ్‌లో p భాగాన్ని బ్యాటరీ రుణావేశ టర్మినల్‌కు, n భాగాన్ని ధనావేశ టర్మినల్‌కు కలిపితే డయోడ్ ఎదురు బయాస్‌లో ఉన్నట్లు అర్థం.



(ఎదురు బయాస్)

ఎలక్ట్రానిక్స్ రంగంలో అర్ధవాహకాలు ప్రముఖ పాత్ర పోషిస్తాయి. వాహక పట్టీలోని ఎలక్ట్రాన్ల సంఖ్య, సంయోజక పట్టీలోని హోల్స్ సంఖ్యకు సమానమైతే దాన్ని స్వభావజ అర్ధవాహకం అంటారు. ప్రత్యేకంగా ఎంపిక చేసిన మలిన పదార్థాలను చాలా తక్కువ మోతాదుల్లో స్వభావజ అర్ధవాహకాలకు కలిపి తయారుచేసిన వాటినే 'అస్వభావజ అర్ధవాహకాలు' అంటారు. డోపింగ్ పదార్థం ఆధారంగా వీటిని p - రకం, n - రకం అర్ధవాహకాలుగా విభజించారు. పోటీపరీక్షార్థులకు ఆయా అంశాలపై అవగాహన తప్పనిసరి.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఫిజిక్స్

విద్యుత్‌ను ప్రవహింపజేస్తే.. వెలుగులనిచ్చే డయోడ్‌లు

***p - n* జంక్షన్ ధర్మాలు:**

వాలు బయాస్‌లో ఉన్నప్పుడు అల్ప నిరోధాన్ని కలిగించి విద్యుత్ ప్రవాహాన్ని సృష్టించవచ్చు.

▮ ఎదురు బయాస్‌లో ఉన్నప్పుడు అధిక నిరోధాన్ని కలిగిస్తే, వలయంలో విద్యుత్‌ను ప్రవహించనీయదు.

ఉపయోగాలు:

కొన్ని రకాల p - n జంక్షన్ డయోడ్‌లు విద్యుత్‌ను ప్రవహింపజేస్తే వెలుగుతాయి. వీటిని వాడుక భాషలో ఎల్ఈడీ (Light Emitting diode - LED) అంటారు.

▮ ప్రస్తుతం LEDలను ఉపయోగించి బల్బులు, వీధిదీపాలు, అలంకరణ బల్బులు, కాలిక్యులేటర్లు, మొబైల్‌ఫోన్స్, టీవీ తెరలు తయారు చేస్తున్నారు.

▮ p - n డయోడ్‌ను ఎలక్ట్రానిక్ స్విచ్‌గా ఉపయోగిస్తారు.

▮ p - n జంక్షన్ డయోడ్‌ను ఏకధిక్కారి (Rectifier)లా వినియోగిస్తారు. ఏకధిక్కారి అంటే AC విద్యుత్‌ను DCగా మార్చే పరికరం.

▮ ఈ Rectifier పరికరాలను టీవీ, కంప్యూటర్, రేడియో లాంటి పరికరాల్లో AC విద్యుత్‌ను DCగా మార్చేందుకు వాడతారు.

ట్రాన్సిస్టర్లు

ఎలక్ట్రానిక్స్ రంగంలో ప్రాథమికంగా ఉపయోగపడే పరికరాల్లో ట్రాన్సిస్టర్లు ముఖ్యమైనవి.

❖ ఒక p - రకం లేదా n - రకం అర్ధవాహకాన్ని దానికి వ్యతిరేకంగా ఉండే రెండు అర్ధవాహకాల మధ్య జోడిస్తే ఏర్పడే రెండు p - n జంక్షన్లు ఉన్న ఎలక్ట్రానిక్ సాధనాన్ని 'ట్రాన్సిస్టర్' అంటారు.

❖ p - n జంక్షన్ డయోడ్‌లో ఒక జంక్షన్ మాత్రమే ఉంటుంది. దీనికి p-రకం లేదా n-రకం అస్వభావజ వాహకాన్ని జోడించి సరైన రీతిలో కలిపితే రెండు p - n జంక్షన్లు ఏర్పడతాయి. ఇలాంటి పరికరాన్ని 'జంక్షన్ ట్రాన్సిస్టర్' అంటారు.

❖ జె.బర్డీన్, వాల్టర్ బ్రాటెయిన్, విలియం షాక్లీ అనే శాస్త్రవేత్తలు చేసిన ఈ ఆవిష్కరణకు 1956లో నోబెల్ బహుమతి లభించింది. ట్రాన్సిస్టర్లను నేటి ఆధునిక ఎలక్ట్రానిక్ పరికరాలకు హృదయంలా పరిగణించవచ్చు.

ట్రాన్సిస్టర్లు - రకాలు

అర్ధవాహకాలను జోడించే విధానం ఆధారంగా ట్రాన్సిస్టర్లను రెండు రకాలుగా విభజించవచ్చు. అవి:

☛ p - n - p ట్రాన్సిస్టర్ ☛ n - p - n ట్రాన్సిస్టర్

p - n - p ట్రాన్సిస్టర్: p - n జంక్షన్‌లోని n - భాగానికి కుడివైపు మరొక p - రకం అర్ధవాహకాన్ని జోడిస్తే మూడు అర్ధవాహకాలు ఉన్న p - n - p ట్రాన్సిస్టర్ ఏర్పడుతుంది.

| p | n | p |


n - p - n ట్రాన్సిస్టర్: p - n జంక్షన్‌లోని p - భాగానికి ఎడమ వైపు మరొక n - రకం అర్ధవాహకాన్ని జోడిస్తే మూడు అర్ధవాహకాలు ఉన్న n - p - n ట్రాన్సిస్టర్ ఏర్పడుతుంది.


| n | p | n |

● ఎలక్ట్రానిక్ వలయాల్లో కలిపేందుకు వీలుగా మూడు అర్ధవాహకాలకు మూడు టర్మినళ్లు ఉంటాయి. అవి:

☛ ఉద్గారకం (Emitter) E ☛ ఆధారం (Base) B
☛ సేకరణి (Collector) C

▼ వీటి ఆధారంగా p - n - p, n - p - n ట్రాన్సిస్టర్లను కింది విధంగా సూచించవచ్చు.





▲ పై పటాల్లో విద్యుత్ ప్రవాహ దిశ వ్యతిరేకం అని గమనించవచ్చు.

ట్రాన్సిస్టర్లు - ధర్మాలు

పటంలో చూపిన విధంగా ట్రాన్సిస్టర్‌లో విద్యుత్ ప్రవాహం సంప్రదాయక వాలు బయాస్‌లో ఉంటుంది.

◆ ప్రతి ట్రాన్సిస్టర్ నిర్మాణంలో రెండు p - n జంక్షన్లు ఉంటాయి.

◆ ఒక p - n జంక్షన్ వాలు బయాస్‌లో ఉండి అల్ప నిరోధాన్ని ఇచ్చి అధిక విద్యుత్‌ను ప్రవహించేలా చేస్తుంది.

◆ అదే సమయంలో మరొక p - n జంక్షన్ ఎదురు బయాస్‌లో ఉండి అధిక నిరోధాన్ని ఇచ్చి విద్యుత్ ప్రవాహాన్ని అడ్డుకుంటుంది.

ట్రాన్సిస్టర్ల ఉపయోగాలు

మైక్రో ఎలక్ట్రానిక్స్‌లో ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ (I.C)లలో ట్రాన్సిస్టర్లు ప్రముఖ పాత్ర పోషిస్తాయి. ఈ పరికరాలను చిప్‌ల పేరుతో అనేక ఆధునిక ఎలక్ట్రానిక్ పరికరాల్లో ఉపయోగిస్తారు.

▼ ఎలక్ట్రానిక్ వలయాల్లో ట్రాన్సిస్టర్లను వివిధ అవధుల్లో ఉండే పౌనఃపున్యాలను ఉత్పత్తి చేసే డోలకాల్లో (Oscillators) ఉపయోగిస్తారు.

▼ సామర్థ్య జనకాల్లో సామర్థ్య స్థిరతను ట్రాన్సిస్టర్లతో నియంత్రించవచ్చు.

▼ ట్రాన్సిస్టర్లను వలయాల్లో ఓల్టేజ్‌ను పెంచేందుకు ఆంప్లిఫయర్లుగా వినియోగించవచ్చు.



రచయిత
వట్టిపల్లి కృష్ణ కిశోర్
విషయ నిపుణులు

903 Word of the Day

Impede

Telugu meaning: అడ్డుకోవడం, నిరోధించడం

English meaning: The word impede (ఇంపీడ్) is a verb that means to slow down, obstruct, or hinder progress.

Synonyms: Hinder, Obstruct

Antonyms: Assist, Facilitate

Usage: 1. Poor infrastructure continues to impede economic development in several rural regions.


2. Frequent policy changes can impede long-term planning and investor confidence.

Current Affairs



The Government has announced 131 Padma awards for the year 2026. The list includes five Padma Vibhushan, 13 Padma Bhushan and 113 Padma Shri awardees, cutting across public life, arts, cinema, literature, sports, science and social service. Among the awardees, 19 are women and 16 honours are being conferred posthumously.

✦ Among those chosen for the Padma Vibhushan, the country's second-highest civilian award, are veteran actor Dharmendra Singh Deol (posthumous), former Kerala chief minister V S Achuthanandan (posthumous), classical violinist N Rajam, former Supreme Court judge K T Thomas and noted writer P Narayanan. The award recognises exceptional and distinguished service.



President Droupadi Murmu has approved gallantry awards for 70 Armed Forces personnel, including six posthumous awards. Group Captain Shubhanshu Shukla, who made history by becoming the first Indian to visit the International Space Station, has been honoured with the Ashoka Chakra, the country's highest peacetime gallantry award.




Novak Djokovic became the first player to achieve 400 match wins in Grand Slam tournaments. The Serbian star secured this monumental milestone with a 6-3, 6-4, 7-6 (4) victory over Botic van de Zandschulp in the third round at the Australian Open on 24 January 2026.

For more Current Affairs: Scan QR code

డిమిత్రి ఇవనోవిచ్ మెండలీవ్

శాస్త్రవేత్తలు విశేషాలు



ఈయన రష్యాకు చెందిన ప్రముఖ రసాయన శాస్త్రవేత్త. పరమాణు నిర్మాణం, మూలకాలపై విస్తృత పరిశోధనలు చేశారు. భౌతిక, రసాయన ధర్మాలను ఉపయోగించి మూలకాలను వర్గీకరించారు. ఆవర్తన పట్టిక రూపకల్పనకు పనిచేసిన మొదటితరం పరిశోధకుల్లో ఆయన ముఖ్యులు. ఆయన ప్రతి మూలకం ధర్మాలను అధ్యయనం చేశారు. అవి పరమాణు ద్రవ్యరాశితో ఆవర్తన పద్ధతిలో సంబంధం కలిగి ఉన్నట్లు కనుక్కున్నారు. మెండలీవ్ మొదటిసారి మూలకాలను పట్టిక రూపంలో పొందుపరిచారు. దీన్నే మెండలీవ్ ఆవర్తన నియమం (ఆవర్తన పట్టిక) అంటారు. ఈయన్ను ఆవర్తన పట్టిక పితామహుడిగా పేర్కొంటారు. పోటీపరీక్షల నేపథ్యంలో ఈయన జీవితంలోని ముఖ్య విశేషాల గురించి తెలుసుకుందాం..!

బాల్యం – వృత్తి జీవితం

మెండలీవ్ 1834, ఫిబ్రవరి 8న రష్యాలోని Verkhnie Aremzyani లో జన్మించారు. ప్రారంభ విద్యను (1941-49) సైబీరియాలోని టొబోల్స్క్‌లో ఉన్న జిమ్నాసియంలో పూర్తి చేశారు.

✦ 1850లో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని మెయిన్ పెడగోగికల్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరారు. అక్కడ సైన్స్ పట్ల ఆయనకు ఆసక్తి కలిగింది. విదేశీ సంస్థల్లో అధ్యయనం చేసేందుకు రష్యా ప్రభుత్వం నుంచి ఫెలోషిప్ పొంది, 1859లో జర్మనీలోని హైడెల్‌బర్గ్ యూనివర్సిటీలో చేరారు.

అక్కడ ప్రముఖ రసాయన శాస్త్రవేత్త రాబర్ట్ విల్హెల్మ్‌తో కలిసి పనిచేశారు. మూలకాలు - వాటి ధర్మాలపై అధ్యయనం చేశారు. Capillarity of liquids, behavior of gases పై పరిశోధనలు నిర్వహించారు.


చివరగా

మూలకాల వర్గీకరణ ప్రక్రియలో మెండలీవ్ అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. మూలకాల జాబితాను అర్థవంతమైన నమూనాలో అమర్చవచ్చని ఆయన నిరూపించారు. దాని ఫలితమే ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆవర్తన పట్టిక. ఆధునిక రసాయనశాస్త్ర స్థాపకుల్లో ఒకరిగా ఆయన నిలిచారు. తన ప్రయోగాలు, రూపకల్పనలు తర్వాతికాలంలో ఎంతో మందికి మార్గదర్శకమయ్యాయి. ఆయన 1907, ఫిబ్రవరి 2న సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో మరణించారు.

మెండలీవ్ చేసిన ముఖ్యమైన పరిశోధనలు, ఆవర్తన పట్టిక, అవార్డులు - గౌరవాలు తదితర సమాచారంతోపాటు ఎస్ఎస్‌సీ సీజీఎల్, ఆర్ఆర్‌బీ గ్రూప్ డి పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ జాగ్రఫీ

రవాణా సౌకర్యాలు - జలమార్గాలు



రవాణా మార్గాల్లో జలరవాణా కీలకపాత్ర పోషిస్తోంది. ఏళ్లుగా అంతర్జాతీయ వాణిజ్యం నీటిపైనే జరుగుతోంది. సరకు రవాణా, వాణిజ్యానికి ఇది అత్యంత అనుకూలం. ఆర్థికానికి ఊతంగా నిలుస్తుంది. సముద్రాలు, నదులు, కాలువల ద్వారా ఈ ప్రక్రియ సాగుతుంది. ఈ మార్గం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక పరిమాణంలో సరకు ఎగుమతి, దిగుమతులను నిర్వహించవచ్చు. దేశంలోని జలమార్గాలు, వాణిజ్యం, ప్రధాన ఓడరేవుల గురించి పోటీపరీక్షార్థులు తెలుసుకోవాలి.

రకాలు

జలమార్గాలను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి..

1. అంతఃస్థలీయ జల మార్గాలు
2. జాతీయ జల మార్గాలు

జలమార్గ్ వికాస్ ప్రాజెక్టు

ఇది NW-1 సామర్థ్యాన్ని పెంచడానికి ఉద్దేశించింది.

✦ దీని అమలుకు అవసరమైన సాంకేతిక సహాయాన్ని వరల్డ్ బ్యాంక్ అందిస్తోంది.

సాగరమాల ప్రాజెక్టు

ఈ ప్రాజెక్టు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ పాలనలో ఉద్భవించింది. దీన్ని 2015లో ప్రారంభించారు.

పశ్చిమ తీర ఓడరేవులు

✦ కాండ్లా ఓడరేవు
✦ ముంబయి ఓడరేవు
✦ నవసేన ఓడరేవు
✦ మర్మగోవా ఓడరేవు
✦ న్యూమంగళూర్ ఓడరేవు
✦ కొచ్చిన్ ఓడరేవు

దేశంలోని జాతీయ జలమార్గాలు, హుగ్లీడాక్ అండ్ పోర్ట్ ఇంజినీర్స్ లిమిటెడ్, ప్రధాన ఓడరేవులు, తూర్పు తీర ప్రధాన ఓడరేవులు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో ఈ-బుక్ రూపంలో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

BRAGCET 2026 Admissions

The Government of Andhra Pradesh has released the notification for BRAGCET-2026 for admissions into Class V through Junior Intermediate for the academic year 2026-27. These admissions are for Dr. B.R. Ambedkar Gurukulams (APSWREIS), which aim to provide high-quality, free residential education to talented students from underprivileged and weaker sections of society. The last date for online applications is 19 February 2026.

Apprentice Posts

Indian Oil Corporation Limited (IOCL) is inviting online applications from eligible candidates for apprenticeship training in technical/non-technical trades across five regions under its Pipelines Division. The total number of posts is 394. Eligible candidates can apply online before 10 February 2026.

Did You Apply..?

Today (January 27) is the last date for the following Jobs

☛ 25 Executive Trainee jobs at NTPC Limited.
Eligibility: CA or CMA.

☛ Assistant Manager Posts at RITES Limited.
Eligibility: MBA/ PGDBA/ PGDBM/ PGDM/ PGDHRM.

☛ Faculty Jobs in FDDI, Hyderabad.
Eligibility: 10th/Intermediate/Degree/PG.

☛ Senior Manager Jobs at RITES Limited.
Eligibility: Post-Graduate degree.

For more information and other notifications - scan QR code

Polynomials

Bank Exams

Quantitative Aptitude

1. If x = 99, then find the value of $x(x^2 + 3x + 3)$
A) 9,99,999 B) 99,999 C) 9,99,990
D) 99,990 E) 990

2. If $a - b = 5$ and $ab = 7$, then what is the value of $(a^3 - b^3)$?
A) 225 B) 175 C) 230
D) 245 E) 190

3. If $p + \frac{1}{q} = 1$ and $q + \frac{1}{r} = 1$, then what is the value of $r + \frac{1}{p}$?
A) 3 B) 0 C) 2 D) 1 E) 7

4. Find the value of k, if $f(x) = x^3 + 2kx^2 - 13x + 7$ and $(x - 2)$ is a factor of f(x).
A) $\frac{13}{9}$ B) $\frac{11}{8}$ C) $\frac{13}{8}$
D) $\frac{11}{9}$ E) $\frac{11}{7}$

5. If $a + b + c = 0$, then find the value of $\frac{a^2 + b^2 + c^2}{c^2 - ab}$
A) 3 B) 2 C) 0 D) 1 E) 5

6. If $a^3 - b^3 = 87$ and $a - b = 3$, then what is the value of (ab).
A) $\frac{22}{3}$ B) $\frac{87}{3}$ C) $\frac{20}{3}$
D) 20 E) None of the above

7. If $\sqrt{x} + \frac{1}{\sqrt{x}} = 8$, then find the value of $x^2 + \frac{1}{x^2}$
A) 3248 B) 3284 C) 3824
D) 3842 E) None of the above

8. If $x + y + z = 7$ and $xy + yz + zx = 13$, then what is the value of $x^3 + y^3 + z^3 - 3xyz$.
A) 70 B) 91 C) 72
D) 81 E) 69

9. If $\left(x^{\frac{4}{3}} - x^{\frac{1}{3}}y + xy^{\frac{1}{3}} - y^{\frac{4}{3}}\right)$ is divided by $\left(x^{\frac{1}{3}} + y^{\frac{1}{3}}\right)$, then the quotient is:
A) x + y B) $x^{\frac{1}{3}} - y^{\frac{1}{3}}$ C) x − y
D) $x^{\frac{2}{3}} + y^{\frac{2}{3}}$ E) None of the above

10. If $a + b + c = 0$, then what is the value of $\frac{a^2}{3b} + \frac{b^2}{3a} + \frac{c^2}{3ab}$
A) bc B) 3abc C) ab
D) c E) 2a2b3c



11. What is the value of $\frac{(x^2 + y^2)(x + y) - (x + y)^3}{x^2y + xy^2}$
A) −2 B) 3 C) 2 D) −3 E) 7

12. A polynominal p(x) satisfies $p(x) = p(6 - x)$ and $p(1) = 5$, $p(2) = 9$, $p(3) = 11$, find p(5) value.
A) 14 B) 5 C) 9 D) 15 E) 11

13. Find the remainder when $x^{100} + x^{50} + 1$ is divided by $x^2 + x + 1$.
A) 0 B) x^{50} C) $\frac{1}{x}$ D) −1 E) 1

14. If $(x - a)$ is a factor of the polynomial $x^3 - ax^2 + 3x - a + 5$, then find the value of 'a'.
A) $\frac{-3}{5}$ B) $\frac{2}{5}$ C) $\frac{-5}{2}$
D) $\frac{5}{3}$ E) None of the above

15. Resolve into factors of $(x + y)^2 - 18z(x + y) + 81z^2$
A) $(x + y + 9z)^2$ B) $(x + y + 2z)^2$
C) $(x - y - 9z)^2$ D) $(x + y - 9z)^2$
E) None of the above

16. Find the sum of the coefficients of the polynomial expansion $(5x - 4)^{101}$
A) 5^{101} B) 1 C) 4^{101}
D) 9^{101} E) 11^{101}

17. What is the constant term in the expansion of the polynomial $(3x - 4)^5$
A) 1024 B) 243 C) −1024
D) −243 E) 1123

18. If $\left(x^3 + \frac{1}{x^3}\right) = 18$, then find the value of $\left(x + \frac{1}{x}\right)$
A) 3 B) 9
C) −3 D) 6
E) −9

Scan the QR code for Key

These model questions were prepared by
Dr.Vangala Srinivas,
Subject Expert



బీఎస్సీ ఎంపీసీఎస్ చదువుతున్నాను. ఎమ్మెస్సీలో స్టాటిస్టిక్స్ కోర్సు చేస్తే ఎలాంటి అవకాశాలు ఉంటాయి? మేటి సంస్థల వివరాలు తెలపండి. - నాగరాజు

స్టాటిస్టిక్స్‌తో ఎలాంటి అవకాశాలు?



■ బీఎస్సీ ఎంపీసీఎస్ (మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్) విద్యార్థులకు ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్ మంచి భవిష్యత్తు ఉన్న అకడమిక్ ప్రోగ్రాం. డేటా ఆధారిత నిర్ణయాలు కీలకమైన ప్రస్తుత సమయంలో స్టాటిస్టిక్స్‌కు అన్ని రంగాల్లోనూ డిమాండ్ పెరుగుతోంది. మ్యాథ్స్, లాజికల్ థింకింగ్, కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న ఎంపీసీఎస్ విద్యార్థులకు స్టాటిస్టిక్స్ పీజీ ప్రోగ్రాం సరైన ఎంపిక.

● ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్‌లో గణాంక సిద్ధాంతాలు, డేటా విశ్లేషణ పద్ధతులు, సంభావ్యత, శాంప్లింగ్, రిగ్రెషన్, టైమ్ సిరీస్, మల్టీ వేరియెంట్ అనాలిసిస్ లాంటి అంశాలు లోతుగా నేర్పుతారు. ఇవన్నీ పరిశ్రమలు, ప్రభుత్వ విభాగాలు, పరిశోధన సంస్థలు వినియోగించే ప్రాథమిక టూల్స్. ఎంపీసీఎస్ నేపథ్యం ఉన్న విద్యార్థులు ఈ సబ్జెక్టులు అర్థం చేసుకోవడం సులభంగా ఉంటుంది.

ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్‌తో ఐటీ, డేటా రంగంలో డేటా అనలిస్టు, స్టాటిస్టికల్ అనలిస్టు, బిజినెస్ అనలిస్టు, రిస్క్ అనలిస్టు లాంటి ఉద్యోగాలు లభిస్తాయి. బ్యాంకింగ్, బీమా రంగాల్లో క్రెడిట్ రిస్క్ అనలిస్టుగా సేవలందించవచ్చు. ఫార్మాస్యూటికల్, హెల్త్‌కేర్ రంగాల్లో క్లినికల్ డేటా అనలిస్టుగా పనిచేయవచ్చు.

● ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్‌తో పాటు డేటా అనలిటిక్స్, ప్రోగ్రామింగ్, స్టాటిస్టికల్ సాఫ్ట్‌వేర్‌లపై అవగాహన పెంచుకుంటే ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయి. స్టాటిస్టిక్స్‌ను ప్రాక్టికల్‌గా ఉపయోగించే నైపుణ్యం ఉంటే ఐటీ, ఫైనాన్స్, హెల్త్‌కేర్ రంగాల్లో వేగంగా ఎదగవచ్చు.

● బీఎస్సీ ఎంపీసీఎస్ తర్వాత ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్ చేయడం ఒక బలమైన, స్థిరమైన, భవిష్యత్తు దృష్టితో కూడిన నిర్ణయం. మేటి సంస్థలో చదివి, అదనపు నైపుణ్యాలు పెంచుకుంటే ప్రభుత్వ, ప్రైవేట్, పరిశోధన రంగాల్లో మంచి ఉద్యోగాలు సాధించవచ్చు. ప్రస్తుత డేటా ఆధారిత ప్రపంచంలో స్టాటిస్టిక్స్ నిపుణులకు డిమాండ్ పెరుగుతూనే ఉంటుంది.

● ప్రభుత్వ రంగంలో ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గణాంక విభాగాలు, ఆర్థిక సర్వేలు, ప్రణాళిక విభాగాల్లో ఉద్యోగాలు లభిస్తాయి. అలాగే యూపీఎస్సీ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, బ్యాంకింగ్ పరీక్షల్లో గణాంక పరిజ్ఞానం ఎంతో ఉపయోగపడుతుంది.

● ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్ తర్వాత పీహెచ్‌డీ చేయాలనుకునేవారు యూనివర్సిటీలు, పరిశోధనా సంస్థలు, డేటా సైన్స్ ల్యాబ్స్‌లో రిసెర్చ్ స్కాలర్‌గా పని చేయవచ్చు. అకడమిక్ రంగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎదగాలంటే జేఆర్ఎఫ్/ నెట్ అర్హత సాధించి, పీహెచ్‌డీ చేయడం ద్వారా మంచి కెరియర్ నిర్మించుకోవచ్చు.

● స్టాటిస్టిక్స్ కోర్సులకు ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ (కోల్‌కతా/ బెంగళూరు/ దిల్లీ) అత్యుత్తమ విద్యా సంస్థ. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, దిల్లీ యూనివర్సిటీ, బనారస్ హిందూ యూనివర్సిటీ, పుదిచ్చేరి యూనివర్సిటీ లాంటి కేంద్రీయ విశ్వవిద్యాలయాలతో పాటు వివిధ రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, కొన్ని ప్రైవేట్ యూనివర్సిటీలు ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్ కోర్సు అందిస్తున్నాయి. అయితే ఫ్యాకల్టీ నాణ్యత, ల్యాబ్ సదుపాయాలు, అలుమ్ని, ప్లేస్‌మెంట్ల వివరాలను తప్పనిసరిగా పరిశీలించాలి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

యంగ్ ప్రొఫెషనల్స్

హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్, కోల్‌కతా.. ఒప్పంద ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

◗ యంగ్ ప్రొఫెషనల్స్(జియాలజీ): 03 పోస్టులు

అర్హత: ఎమ్మెస్సీ (జియాలజీ/ అప్లయిడ్ జియాలజీ, టెక్ఇన్ అప్లయిడ్ జియాలజీ)తో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
వయసు: 35 ఏళ్లు మించకూడదు.
వేతనం: నెలకు రూ.65,000. **ఎంపిక:** ఇంటర్వ్యూతో.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 07-02-2026.
వెబ్‌సైట్: https://www.hindustancopper.com/



విస్తృత అవకాశాలకు జీసీసీ వేదికలు

ప్రస్తుతం దేశంలో దాదాపు 19 లక్షల మంది జీసీసీల్లో సేవలందిస్తున్నారు. ఈ ఏడాది చివరి నాటికి జీసీసీల సంఖ్య 2200-2500కు చేరుకుంటుందని, 2030 నాటికి వీటిలో ఉద్యోగుల సంఖ్య 28 లక్షలను దాటుతుందని అంచనా. జీసీసీలు ఐటీ సంస్థల కంటే ఎక్కువ సంఖ్యలో నియామకాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇవి ఎన్నో కొత్త ఉద్యోగాలనూ సృష్టిస్తున్నాయి. అయితే వీటిలో అవకాశాలు అందుకోవడానికి ప్రత్యేక నైపుణ్యాలతో పాటు ఏఐ సాంకేతిక పరిజ్ఞానం కావాలి.

ఇక్కడే ఎందుకంటే?

భారతదేశంలో జీసీసీల ఏర్పాటు కారణంగా సంస్థలకు దాదాపు 50-70 శాతం నిర్వహణ వ్యయాలు తగ్గుతున్నాయి. సమర్థులైన మానవ వనరుల లభ్యత మన దగ్గర ఎక్కువగా ఉంది. అందువల్ల ఎన్నో సంస్థలు వాటి గ్లోబల్ ఆర్‌అండ్‌డీ కేంద్రాలనూ నెలకొల్పుతున్నాయి. హైదరాబాద్‌లో ఇప్పటికే పెప్సీకో, ఈవై, పలు ఇతర సంస్థలెన్నో సేవలు ప్రారంభించాయి. టైర్-1తో పాటు టైర్-2 పట్టణాల్లోనూ ఇవి ఏర్పాటవుతున్నాయి. భారత జీసీసీలు భవిష్యత్తు పనిని పునర్నిర్మాణం చేసే దిశగా పనిచేస్తున్నాయి.

✦ దేశంలో సుమారు 1700కు పైగా జీసీసీలు సమర్థంగా సేవలందిస్తున్నాయి. ఇవి ఫైనాన్స్, రిటైల్, హెల్త్‌కేర్, ఏరోస్పేస్, ఆయిల్ అండ్ గ్యాస్ లాంటి విభిన్న రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి.

✦ భారత్ డెలివరీ సెంటర్ల నుంచి ఏఐ ఆధారిత సంస్థల వైపు సాగుతోంది. అలాగే కస్టమర్ సపోర్ట్, హెచ్‌ఆర్, ఇంజినీరింగ్ లాంటి విభాగాల్లోనూ ఏఐ వినియోగం వేగంగా పెరుగుతోంది. 2030 నాటికి ఏఐ సంస్థలు ప్రధాన కార్యకలాపాల్లో కీలక పాత్ర పోషిస్తాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ముఖ్యంగా డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌కు అవసరమైన నియామకాలు జరగనున్నాయని అంచనా.

✦ జీసీసీలలో లీడర్‌షిప్ ఉద్యోగాలు 2026 చివరి కల్లా మరో 40% పెరుగుతాయని నిపుణుల అంచనా. నియామకాలలో ముఖ్యంగా టెక్నికల్ విభాగాధిపతులు, కమర్షియల్ రోల్స్, గ్లోబల్ ఫంక్షన్ లీడ్స్, ఏఐ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, డేటా లీడర్స్ లాంటి ఉద్యోగాలకు డిమాండ్ పెరుగుతోంది. డిజిటల్ మార్పులు, ఏఐ ఆధారిత పనితీరు, గ్లోబల్ ఆపరేటింగ్ మోడల్స్ కారణంగా రాబోయే రోజుల్లో కూడా ఈ నియామకాలు మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

ఏ నైపుణ్యాలు?

✦ డేటా అనలిటిక్స్, సమస్యా పరిష్కారం, డిజిటల్ నైపుణ్యాలు, ఏఐ, డేటా అవగాహన చాలా అవసరం. కాబట్టి విద్యార్థులు ఇప్పటి నుంచే కొత్త నైపుణ్యాలను నేర్చుకుంటూ, టెక్నాలజీ మార్పులకు అనుగుణంగా తీర్చిదిద్దుకోవాలి. సమస్యలను పరిష్కరించే స్థాయికి ఎదగడమే భవిష్యత్తు విజయానికి మార్గం అవుతుంది.

✦ విద్యార్థులు పాఠ్య పుస్తకాలకే పరిమితం కాకుండా కొత్త టెక్నాలజీలు, విమర్శనాత్మక ఆలోచన లాంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి.

✦ టెక్నికల్ స్కిల్స్ (ఏఐ, డేటా అనలిటిక్స్, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ), కమ్యూనికేషన్ స్కిల్స్ (ఇంగ్లిష్, టీమ్ వర్క్), లీడర్‌షిప్ (నిర్ణయాలు తీసుకోవడం, బాధ్యత), డిజిటల్, కొత్త టెక్నాలజీలపై ఆసక్తి చూపాలి.

✦ విద్యార్థిగా ఉన్నప్పుడే తగిన రోల్‌ను ఎంచుకుని, అందుకు అవసరమయ్యే నైపుణ్యాలను పెంచుకోవాలి. కంపెనీ సంస్కృతినీ అర్థం చేసుకోవాలి.

అధిక వేతనం, పదోన్నతులు

ప్రస్తుతం మేనేజర్ స్థాయికి చేరుకోవడానికి 10-12 సంవత్సరాలు పడుతోంది. కానీ జీసీసీల కారణంగా మేనేజర్ కావడానికి 5-7 సంవత్సరాల్లోనే వీలవుతోంది. ఇందులో 35 సంవత్సరాలు నిండక ముందే టెక్ లీడ్, ఇంజినీరింగ్ మేనేజర్, డైరెక్టర్ అయ్యే స్థాయికి వెళతారు. సాధారణ ఐటీ సంస్థల కంటే జీసీసీల్లో 30 నుంచి 70 శాతం వరకూ ఎక్కువ వేతనం చెల్లిస్తున్నారు. ఇతర సంస్థలతో పోలిస్తే ఉద్యోగ భద్రతా ఎక్కువే.

ఉద్యోగానికి

జీసీసీల్లో ఉద్యోగాలు మాత్రం సులువుగా దక్కవు. పలు దశల్లో ఇంటర్వ్యూలు, అసెస్‌మెంట్లూ ఉంటాయి. నియామకానికి ఎక్కువ సమయం తీసుకుంటాయి. ఓపిక, సహనం తప్పనిసరి. అభ్యర్థుల నుంచి ఉన్నత స్థాయి నైపుణ్యాలను సంస్థలు ఆశిస్తాయి. అందువల్ల ఉద్యోగం పొందిన తర్వాతా నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండాలి.

విదేశాల్లోనూ

విదేశీ జీసీసీలూ భారతీయులను నియమించుకోవడానికి ఆసక్తి చూపుతున్నాయి. ముఖ్యంగా ఐటీ, హెల్త్‌కేర్, ఇంజినీరింగ్, హాస్పిటాలిటీ, ఫైనాన్స్ సెక్టార్, టెక్నాలజీ, టెలి కమ్యూనికేషన్స్, ఆయిల్ అండ్ గ్యాస్ సంస్థలు ఎక్కువ అవకాశాలు కల్పిస్తున్నాయి. మన వాళ్లకి యూఏఈ, సౌదీ అరేబియా, కతార్, ఒమన్, కువైట్ ప్రధాన ఉద్యోగ దేశాలుగా నిలుస్తున్నాయి. దుబాయ్, అబుదాబీ, రియాద్, దోహా, మస్కట్‌ల్లో ఎక్కువ మంది కొలువులు పొందుతున్నారు. అక్కడ అధిక వేతనాలూ, మెరుగైన వసతులూ దక్కుతున్నాయి.

నిర్వహణ విభాగం	హోదాలు
టెక్నాలజీ అండ్ ఇంజినీరింగ్	క్లౌడ్ ఇంజినీర్లు, ఏఐ/ ఎంఎల్ స్పెషలిస్టులు, సైబర్ సెక్యూరిటీ అనలిస్టులు, ప్రొడక్ట్ డెవలపర్లు, డేటా సైంటిస్టులు
ఫైనాన్స్ అండ్ బిజినెస్ ఆపరేషన్స్	ఫైనాన్స్ అనలిస్టులు, అకౌంటింగ్ ఎక్స్‌పర్టులు, ప్రొక్యూర్‌మెంట్ స్పెషలిస్టులు, లీగల్ కంప్లయన్స్ ఆఫీసర్లు
ఆర్‌అండ్‌డీ అండ్ ఇన్నొవేషన్	రిసెర్చ్ టీమ్స్, డిజైన్ థింకింగ్ ఎక్స్‌పర్టులు, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కన్సల్టెంట్లు
లీడర్‌షిప్ అండ్ స్ట్రాటజీ	సీటీఓలు, సీఐఓలు, డైరెక్టర్లు, వీపీలు, ప్రోగ్రామ్ మేనేజర్లు.

తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు జీసీసీలు భవిష్యత్తులో మేటి అవకాశాలు అందిస్తాయి. ఎన్నో సంస్థలు ఏపీ, తెలంగాణల్లో కార్యాలయాలు ప్రారంభించడానికి ఆసక్తి చూపడమే ఇందుకు కారణం.

టైర్-I జీసీసీ హబ్స్

ప్రాంతం	విభాగాలు
బెంగళూరు	టెక్/ఏఐ
హైదరాబాద్	క్లౌడ్/ఐటీ
పుణె	ఆర్‌అండ్‌డీ
చెన్నై	ఆటోమోటివ్/ డేటా ఇంజినీరింగ్
దిల్లీ ఎన్‌సీఆర్	అనలిటిక్స్/ కన్సల్టింగ్
ముంబయి	బీఎఫ్ఎస్ఐ/ ఫైనాన్స్

భవిష్యత్తులో అహ్మదాబాద్, ఇండోర్, నాగ్‌పుర్, వైజాగ్ లాంటి చోట్లకూ మరిన్ని జీసీసీలు విస్తరిస్తాయి.

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

డిజిటల్ మార్కెటింగ్

సంస్థ: డ్యూటీపర్ (ఏఐ టెక్నాలజీస్ ప్రై.లి.)
నైపుణ్యాలు: డిజిటల్ మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం
స్టైపెండ్: రూ.2,000-5,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 20
☛ https://tinyurl.com/mtyvcenf

లా/లీగల్

సంస్థ: ఇన్‌2లా అకాడమీ
నైపుణ్యాలు: కంటెంట్ ఎడిటింగ్, కంటెంట్ మేనేజ్‌మెంట్, కంటెంట్ రైటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఆఫీస్, ఎంఎస్-వర్డ్ **స్టైపెండ్:** రూ.4,000-10,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 20
☛ https://tinyurl.com/mrystenj

కంటెంట్ రైటింగ్

సంస్థ: షాప్ పైరేట్
నైపుణ్యాలు: బ్లాగింగ్, క్రియేటివ్ రైటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్ **స్టైపెండ్:** రూ.5,000-10,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 20
☛ https://tinyurl.com/ynmpwcfs

ఏఐ ఏజెంట్ డెవలప్‌మెంట్

సంస్థ: రితుంబర రిసార్ట్
నైపుణ్యాలు: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మార్కప్ లాంగ్వేజ్, జనరేటివ్ ఏఐ టూల్స్, న్యూరల్ నెట్‌వర్క్స్
స్టైపెండ్: రూ.7,000-10,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 21
☛ https://tinyurl.com/2ns93zdh

సోషల్ మీడియా మార్కెటింగ్

సంస్థ: స్టాట్స్‌లేన్
నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ఇలస్ట్రేటర్, కేన్వా, కంటెంట్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్ మీడియా మార్కెటింగ్, కంటెంట్ రైటింగ్
స్టైపెండ్: రూ.12,000-15,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 20
☛ https://tinyurl.com/yc38xn3c

వీడియో ఎడిటింగ్

సంస్థ: కోడ్ ఫ్రేమ్
నైపుణ్యాలు: ఏఐ ఇమేజ్ జనరేషన్, ఏఐ వీడియో జనరేషన్, ఏఐ వాయిస్‌ఓవర్, ఫైనల్ కట్ ప్రో, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్ **స్టైపెండ్:** రూ.15,000-20,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 20
☛ https://tinyurl.com/3arzppa4

టెలికాలింగ్

సంస్థ: టవర్ **నైపుణ్యాలు:** ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, హిందీ మాట్లాడటం, ఎంఎస్-ఎక్సెల్ **స్టైపెండ్:** రూ.14,000-22,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 20
☛ https://tinyurl.com/2e6w5wzm

ఫ్యాషన్ డిజైన్

సంస్థ: వెస్టివర్స్ ప్రై.లి.
నైపుణ్యాలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఎంబ్రాయిడరీ మేకింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, ఫ్యాషన్ ఇలస్ట్రేటర్, గార్మెంట్ కన్‌స్ట్రక్షన్, ఇమేజ్ ఎడిటింగ్, మర్చండైజింగ్, ఫొటోగ్రఫీ
స్టైపెండ్: రూ.2,600-5,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 20
☛ https://tinyurl.com/52etm3ru

స్పేస్ అప్లికేషన్స్ సెంటర్‌లో

స్పేస్ అప్లికేషన్స్ సెంటర్, అహ్మదాబాద్.. వివిధ విభాగాల్లో సైంటిస్ట్/ఇంజినీర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

◗ సైంటిస్ట్/ ఇంజినీర్ (ఎస్‌డీ/ ఎస్‌సీ): 49

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ/ ఎంఈ/ ఎంటెక్/ ఎమ్మెస్సీ/ బీఈ/ బీటెక్, బీఎస్సీతో పాటు పని అనుభవం ఉండాలి.
వయసు: ఫిబ్రవరి 12, 2026 నాటికి 18 నుంచి 35 ఏళ్లు ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది. **వేతన శ్రేణి:** నెలకు సైంటిస్ట్/ ఇంజినీర్‌కు రూ.56,100 - రూ.2,08,700.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 12.
దరఖాస్తు ఫీజు: రూ.750. **ఎంపిక:** రాత పరీక్ష/ స్కిల్‌టెస్ట్/ ఇంటర్వ్యూలతో. **వెబ్‌సైట్:** https://www.sac.gov.in/careers/?lang=en

ఎయిమ్స్‌లో

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్), దిల్లీ..ఒప్పంద ప్రాతిపదికన ఎడ్యుకేషనల్ మీడియా జర్నలిస్ట్ ఉద్యోగానికి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

◗ ఎడ్యుకేషనల్ మీడియా జర్నలిస్ట్

అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ(ఎడ్యుకేషన్, హెల్త్ ఎడ్యుకేషన్, సైకాలజీ, బిహేవియరల్ సైన్సెస్, సోషల్ సైన్సెస్/ కమ్యూనికేషన్)తోపాటు ఉద్యోగానుభవం ఉండాలి.
వేతనం: నెలకు రూ.67,700.
ఎంపిక: ఇంటర్వ్యూతో **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 14.02.2026. **వెబ్‌సైట్:** www.aiims.edu/index.php/en

ఎయిర్ ఫోర్స్‌లో మెడికల్ అసిస్టెంట్లు



భారతీయ వాయుసేన ఎయిర్‌మెన్ గ్రూప్ వై నాన్ టెక్నికల్ మెడికల్ అసిస్టెంట్ ట్రేడ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఇంటర్మీడియట్, బీఫార్మసీ, డిప్లొమా వీటిలో ఏదైనా విద్యార్హతతో పోటీ పడొచ్చు. ఫిజికల్ టెస్టులు, రాత పరీక్ష, మెడికల్ టెస్టులతో నియామకాలుంటాయి. ఎంపికైనవారు శిక్షణ తర్వాత ఎయిర్‌మెన్‌గా శాశ్వత ప్రాతిపదికన సేవలు అందించవచ్చు.

ఈ పోస్టులకు పురుషులే అర్హులు. గ్రూప్ వై నాన్ టెక్నికల్ మెడికల్ అసిస్టెంట్ ట్రేడ్ ఉద్యోగాల భర్తీకి దాదాపు ఏటా రెండు సార్లు ప్రకటన వెలువడుతోంది. ఇతర పోస్టులతో పోలిస్తే పోటీ పరిమితంగానే ఉంటుంది. ఇంటర్మీడియట్ బైపీసీ, బీఫార్మసీ, డీఫార్మసీ కోర్సులు పూర్తి చేసుకున్నవారు వీటికి ప్రయత్నించవచ్చు.

పరీక్ష

ఆన్‌లైన్‌లో ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇంగ్లిష్ విభాగం తప్ప మిగతా ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో ఉంటుంది. పరీక్ష వ్యవధి 45 నిమిషాలు. ఇంగ్లిష్, రీజనింగ్ అండ్ జనరల్ అవేర్‌నెస్ అంశాల్లో ప్రశ్నలుంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. అలాగే తప్పుగా గుర్తించిన ప్రతి జవాబుకూ పావు మార్కు చొప్పున తగ్గిస్తారు. ఇంగ్లిష్ ప్రశ్నలు సీబీఎస్ఈ 10+2 సిలబస్ నుంచే వస్తాయి. ఇంగ్లిష్ 20, రీజనింగ్ అండ్ జనరల్ అవేర్‌నెస్ 30 ప్రశ్నలు ఉంటాయి. ఈ రెండు విభాగాల్లోనూ అర్హత మార్కులు పొందడం తప్పనిసరి. ఇలా అర్హులైన వారిని మెరిట్ ప్రకారం తర్వాతి దశకు ఎంపిక చేస్తారు. https://airmenselection.cdac.in లో సిలబస్, మాదిరి ప్రశ్నలు చూసుకోవచ్చు.

ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్టు

ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షల్లో భాగంగా 1.6 కి.మీ. దూరాన్ని 7 నిమిషాల్లో చేరుకోవాలి. 21 ఏళ్ల కంటే ఎక్కువ వయసువారైతే 7 నిమిషాల 30 సెకన్లలో పూర్తిచేయాలి. అలాగే ఒక్కోటీ నిమిషం వ్యవధిలో 10 పుష్‌అప్స్, 10 సిట్‌అప్స్, 20 స్క్వాట్స్ పూర్తిచేయాలి.

అడాప్టబిలిటీ టెస్టులు: ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్టులో అర్హులకు అడాప్టబిలిటీ టెస్టు 1, 2లు నిర్వహిస్తారు. మొదటి దానిలో అర్హులకే రెండో పరీక్షకు అవకాశమిస్తారు. ఈ ఆబ్జెక్టివ్ పరీక్షల ద్వారా అభ్యర్థి ఎయిర్ ఫోర్స్ ఉద్యోగానికీ, భిన్న వాతావరణ పరిస్థితులు/ ప్రాంతాల్లో పనిచేయడానికీ సరిపోతాడో లేదో తెలుసుకుంటారు. రెండో పరీక్షలోనూ ఉత్తీర్ణత సాధిస్తే వైద్య పరీక్షలు నిర్వహించి శిక్షణ కోసం ఎంపికచేస్తారు.

శిక్షణ ఇలా

వాయుసేన ప్రాథమిక శిక్షణ కేంద్రంలో తర్ఫీదు నిర్వహిస్తారు. అనంతరం అభ్యర్థులను సంబంధిత ట్రేడ్ శిక్షణ కేంద్రాలకు పంపుతారు. శిక్షణ సమయంలో రూ.14,600 స్టైపెండ్ చెల్లిస్తారు. విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకున్నవారిని విధుల్లోకి తీసుకుంటారు. వీరు 20 ఏళ్లపాటు ఉద్యోగంలో కొనసాగవచ్చు. దీన్ని 57 ఏళ్ల వయసు నిండే వరకు పొడిగిస్తారు. మొదటి నెల నుంచే మిలటరీ సర్వీస్ పే తో కలిపి రూ.26,900 మూల వేతనం అందుతుంది. అన్ని అలవెన్సులతో రూ.50,000 కంటే ఎక్కువ వేతనమే పొందవచ్చు. మెడికల్ అసిస్టెంట్ ట్రేడులో చేరినవారు ఫస్ట్ ఎయిడ్ చేయగలిగేలా తర్ఫీదు పొందుతారు. వాయుసేనలోని మెడికల్ స్టోర్లు, డిస్పెన్సరీ, వార్డు పర్యవేక్షణ వీరి విధుల్లో భాగం. భవిష్యత్తులో పదోన్నతుల ద్వారా ఉన్నత స్థాయికీ చేరుకోవచ్చు. అలాగే సర్వీసులో కొనసాగుతూ కొన్ని పరీక్షల్లో అర్హతలు సాధించినవారు కమిషన్డ్ ఆఫీసర్లూ కాగలరు. ఉద్యోగం చేస్తూనే నిర్ణీత వ్యవధితో ఉన్నత విద్య కొనసాగించడానికీ వీరిని అనుమతిస్తారు. పదవీ విరమణ తర్వాత పింఛనూ, ఇతర సౌకర్యాలూ పొందవచ్చు.

వివరాలు

విద్యార్హత: ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లిష్ సబ్జెక్టులతో 50 శాతం మార్కులతో ఇంటర్మీడియట్. విడిగా ఆంగ్లంలో 50 శాతం మార్కులు ఉండాలి. లేదా ఇవే సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులతో ఒకేషనల్ కోర్సులు పూర్తిచేసుకున్న వారూ అర్హులే. లేదా డీఫార్మసీ/బీఫార్మసీలో 50 శాతం మార్కులు పొందాలి.

వయసు: ఇంటర్ విద్యార్హతతో అయితే జనవరి 1, 2006 - జనవరి 1, 2010 మధ్య జన్మించినవారు అర్హులు. ఫార్మసీ విద్యార్హతతో దరఖాస్తు చేస్తే జనవరి 1, 2003 - జనవరి 1, 2008 మధ్య జన్మించాలి. ఫార్మసీ చదివిన వివాహితులైతే జనవరి 1, 2003 - జనవరి 1, 2006లోగా జన్మించాలి.

ఎత్తు: కనీసం 152 సెం.మీ. ఉండాలి. ఛాతీ విస్తీర్ణం 77 సెం.మీ. ఉండాలి. ఊపిరి పీల్చక ముందు, పీల్చిన తర్వాత ఛాతీ వ్యత్యాసం కనీసం 5 సెం.మీ. తప్పనిసరి. దృష్టి దోషం ఉండరాదు. వినికిడి సామర్థ్యం స్పష్టంగా ఉండాలి.

పరీక్ష తేదీలు: మార్చి 30, 31

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 1.

పరీక్ష ఫీజు: రూ.550. జీఎస్టీ అదనం.

వెబ్‌సైట్: https://airmenselection.cdac.in/CASB/

షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, కొచ్చి.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో వర్క్ మెన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

◗ వర్క్‌మెన్: 260

విభాగాలు: షీట్ మెటల్ వర్కర్, వెల్డర్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, మెకానిక్, పెయింటర్, మెషినిస్ట్, క్రేన్ ఆపరేటర్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, ప్లంబర్.. మొదలైనవి.
అర్హత: పోస్టులను అనుసరించి పదో తరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, పని అనుభవం ఉండాలి. **వయసు:** ఫిబ్రవరి 7, 2026 నాటికి 45 ఏళ్లు మించకూడదు. **వేతనం:** నెలకు రూ.23,300.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 7.
దరఖాస్తు ఫీజు: రూ.300. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు లేదు.
ఎంపిక: ప్రాక్టికల్ టెస్టుతో.
వెబ్‌సైట్: https://cochinshipyard.in/careerdetail/career_locations/683

ఐఐఎస్ఈఆర్

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్(ఐఐఎస్ఈఆర్), తిరుపతి తాత్కాలిక ప్రాతిపదికన రిసెర్చ్ అసోసియేట్ కోసం దరఖాస్తులను కోరుతోంది.

◗ రిసెర్చ్ అసోసియేట్

అర్హత: సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ.
వేతనం: నెలకు రూ.58,000. **వయసు:** 35 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** ఇంటర్వ్యూతో
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 28.01.2026.
వెబ్‌సైట్: https://www.iisertirupati.ac.in/jobs/

సీసీఆర్‌హెచ్‌లో

సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రిసెర్చ్ ఇన్ హోమియోపతి (సీసీఆర్‌హెచ్), న్యూదిల్లీ.. పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

◗ రిసెర్చ్ అసోసియేట్: 04
◗ సీనియర్ రిసెర్చ్ ఫెలో (హోమియో): 12
◗ జేఆర్ఎఫ్: 06 ◗ మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజిస్ట్: 01
◗ ప్రిన్సిపల్ ప్రాజెక్ట్ అసోసియేట్: 01
◗ సైంటిస్ట్: 02 ◗ ప్రాజెక్ట్ అసోసియేట్-2: 05
◗ మల్టీ టాస్కింగ్ స్టాఫ్: 03 ◗ ఆఫీస్ అసిస్టెంట్: 03
◗ ఫార్మసిస్ట్/కాంపౌండర్/డిస్పెన్సర్: 01 ◗ ల్యాబ్ టెక్నీషియన్: 02

అర్హత: పోస్టును అనుసరించి టెన్త్, ఇంటర్మీడియట్, డిగ్రీ, బీఫార్మసీ/ ఎంఫార్మసీ/ ఎంవీఎస్సీ, పీజీ, ఎమ్మెస్సీ, పీహెచ్‌డీతో పాటు నెట్/ గేట్ స్కోరు, కంప్యూటర్ పరిజ్ఞానంతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
ఎంపిక: ఇంటర్వ్యూతో
ఇంటర్వ్యూ తేదీలు: ఫిబ్రవరి 10, 11, 12, 13, 16, 17, 18, 24, మార్చి 10.
వెబ్‌సైట్: https://ccrhindia.ayush.gov.in/



దిల్లీలోని కర్తవ్యపథ్‌లో సోమవారం జరిగిన గణతంత్ర వేడుకల అనంతరం వేదిక నుంచి కిందికి వస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ప్రధాని మోదీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లెయెన్, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా తదితరులు ✦ గణతంత్ర వేడుకల్లో యూరోపియన్ యూనియన్‌కు చెందిన సైనికులు ✦ గణతంత్ర వేడుకల్లో ఆకట్టుకున్న మధ్యప్రదేశ్‌కు చెందిన శకటం ✦ దిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో జాతీయజెండాకు సెల్యూట్ చేస్తున్న ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ✦ పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో గణతంత్ర వేడుకల్లో రోబోటిక్ మ్యూల్స్(మల్టీ యుటిలిటీ లెగ్డ్ ఎక్విప్‌మెంట్)ను ప్రదర్శిస్తున్న సైనికులు

భారత్ చక్కని మిత్ర దేశం

- ప్రపంచ దేశాధినేతల గణతంత్ర శుభాకాంక్షలు
- సందేశాలు పంపిన అమెరికా, చైనా, ఫ్రాన్స్
- విదేశాల్లోనూ ఘనంగా వేడుకలు

వాషింగ్టన్, బీజింగ్, దిల్లీ: భారత్ తమకు మంచి మిత్ర దేశమని ప్రపంచ దేశాలు కొనియాడాయి. ఇప్పటికే ఇరు దేశాల బంధాలను బలోపేతం చేసుకుని ముందడుగు వేస్తామని పేర్కొన్నాయి. సోమవారం భారత 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ సహా పలువురు దేశాధినేతలు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు శుభాకాంక్షల సందేశాలు పంపించారు. అమెరికా-భారత్ మధ్య చారిత్రక సంబంధాలున్నాయని ట్రంప్ పేర్కొంటూ తమ ప్రజల తరఫున భారత ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సందేశాలు పంపిన దేశ నేతలు ప్రధాని నరేంద్రమోదీ వద్ద వాటిని చెప్పారు. వివిధ దేశాల నేతల సందేశాలు..

ఎప్పటికీ మంచి పొరుగువారిగా ఉంటాం

భారత్ ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు. చైనా, భారత్ ఎప్పటికీ మంచి పొరుగువారిగా, స్నేహితులుగా, భాగస్వాములుగా ఉంటాయి. ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలను, సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని ఎదురుచూస్తున్నాం. డ్రాగన్, ఏనుగు కలిసి నాట్యమాడేలా చేయడం రెండు దేశాలకూ సరైన ఎంపిక. రెండు దేశాల ప్రయోజనాల కోసం, ప్రపంచ శాంతి-సుసంపన్నతల కోసం మన బంధాలు అభివృద్ధి చెందుతూ వస్తున్నాయి. సమాచార మార్పిడి, సహకారం, ఒకరి ఆందోళనల్ని ఒకరు అర్థం చేసుకోవడం ద్వారా ఆరోగ్యకరంగా, సుస్థిరంగా సంబంధాలు అభివృద్ధి చేసుకుందాం. – జిన్‌పింగ్, చైనా అధ్యక్షుడు

సహకారం.. సత్ఫలితం

ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్, పురాతన ప్రజాస్వామ్య దేశం అమెరికా. మన దేశాల మధ్య చారిత్రక సంబంధం కొనసాగుతోంది. రక్షణ, ఇంధనం, అధునాతన సాంకేతిక రంగాల్లో భారత్ అమెరికాల మధ్య సహకారం మంచి ఫలితాలను ఇస్తుందని ఆశిస్తున్నాం. రాబోయే రోజుల్లో ఉమ్మడి లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లేందుకు ఎదురుచూస్తున్నాం.
– మార్కో రూబియో, అమెరికా విదేశాంగ మంత్రి

భారత్‌తో భాగస్వామ్యం విలువైనది

అంతర్జాతీయ ఎజెండాలోని కీలక సమస్యలను పరిష్కరించడంలో భారత్ చురుకుగా వ్యవహరిస్తోంది. భారత్‌తో ప్రత్యేక, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని విలువైనదిగా భావిస్తున్నాం. మా ఉమ్మడి ప్రయత్నాల ద్వారా బహుళ రంగాల్లో నిర్మాణాత్మక, ద్వైపాక్షిక సహకారాన్ని మరింత విస్తరించే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.
– డెనిస్ అలిపోవ్, రష్యా రాయబారి

అదో విలువైన జ్ఞాపకం

ప్రియమిత్రుడు మోదీకి, ప్రియమైన భారతీయులకు నా శుభాకాంక్షలు. 2024లో భారత్‌లో గణతంత్ర వేడుకల్లో పాల్గొనడం ఎంతో విలువైన జ్ఞాపకం. భారత్, ఫ్రాన్స్‌ల బంధాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు ఫిబ్రవరిలో కలుద్దాం. దానికోసం వేచి చూస్తుంటా. – ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్

రాయబార కార్యాలయాల్లో..

వివిధ దేశాల్లోని భారత రాయబార కార్యాలయాల్లో అధికారులు, ప్రవాస భారతీయులు గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాయబారులు భారత రాష్ట్రపతి ముర్ము ప్రసంగాన్ని చదివి వినిపించారు. త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. శుభాకాంక్షలు తెలిపినవారిలో సౌదీ అరేబియా రాజు సల్మాన్, మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు, బ్రిటన్ రాజు ఛార్లెస్-3, భూటాన్ ప్రధాని షెరింగ్ టోబ్గే తదితరులు ఉన్నారు.

జీవక్రియ రుగ్మతలకు కళ్లెం!

- ఆస్ట్రేలియా శాస్త్రవేత్తల పరిశోధన

దిల్లీ: శరీరంలో సహజసిద్ధంగా లభ్యమయ్యే మైక్రో ఆర్ఎన్ఏ.. ఒత్తిడిని నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఇది జీవక్రియలకు సంబంధించిన రుగ్మతలు, వార్ధక్య సమస్యల చికిత్సకు కొత్త ఔషధాల అభివృద్ధికి వీలు కల్పిస్తుందని వారు తెలిపారు. మైక్రోఆర్ఎన్ఏలు జన్యువులతో బంధాన్ని ఏర్పర్చి, అవి అతిగా క్రియాశీలం కాకుండా చూస్తాయి. తాజాగా కణంలో శక్తి కేంద్రంగా ఉండే మైటోకాండ్రియాకు జరిగే నష్టంపై పరిశోధన చేశారు. ఈ నష్టాలు ఆ భాగంలో క్రమంగా పేరుకుపోతుంటాయి. ఫలితంగా నాడీ క్షీణత, క్యాన్సర్, మధుమేహం సహా జీవక్రియలు, వార్ధక్య సమస్యలతో ముడిపడిన వ్యాధులు ఉత్పన్నం కావొచ్చు. పరిశోధనలో భాగంగా సి.ఎలిగాన్స్ అనే కీటకంలోని ఎంఐఆర్-71 అనే మైక్రోఆర్ఎన్ఏపై పరిశోధన చేశారు. మైటోకాండ్రియాకు సంబంధించిన ఒత్తిడి చర్యాక్రమాలనూ మైక్రోఆర్ఎన్ఏలు నియంత్రిస్తాయని, శరీరంలోని ఇతర కణాలు, కణజాలాలకు ఒత్తిడి సంకేతాలు వ్యాప్తి చెందకుండా నిరోధిస్తాయని ఇందులో వెల్లడైంది. ఇవి దీర్ఘకాల ఒత్తిడిని తగ్గించి, కణాలను సంరక్షిస్తాయని శాస్త్రవేత్తలు తెలిపారు. మానవుల్లోనూ అదే తరహా జన్యువులను లక్ష్యంగా చేసుకునే మైక్రోఆర్ఎన్ఏలను డిజైన్ చేయవచ్చని తమ పరిశోధన సూచిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. తద్వారా దీర్ఘకాల ఒత్తిడి సంకేతాల తీవ్రత, వ్యాప్తిని తగ్గించొచ్చని వివరించారు.

వికసిత్ భారత్ కోసం మన సంకల్పం బలపడాలి

- గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన మోదీ

దిల్లీ: దేశ ప్రజలందరికీ ప్రధాని మోదీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అభివృద్ధి చెందిన భారత్ కోసం మన సంకల్పం మరింత బలపడాలని ఆకాంక్షించారు. దేశ గౌరవానికి, వైభవానికి ప్రతీక అయిన మహోత్సవమైన ఈ రోజున అందరి జీవితాల్లో కొత్త శక్తి, ఉత్సాహాన్ని నింపాలని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

దేశ ప్రజలకు ఉపరాష్ట్రపతి శుభాకాంక్షలు

గణతంత్ర దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలకు ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ శుభాకాంక్షలు తెలిపారు. భారతదేశం న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావం వంటి విలువలపై నిలిచి ఉన్న ఒక చైతన్యవంతమైన గణతంత్ర దేశమని ఆయన పేర్కొన్నారు. జనవరి 26 భారత రాజ్యాంగాన్ని రూపొందించిన మహానుభావుల దూరదృష్టికి నిదర్శనమేగాక, ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన పౌరుల బాధ్యతను మరోసారి గుర్తుచేసే రోజని తెలిపారు.

మోదీ నాయకత్వంలో..

కేంద్ర హోం మంత్రి అమిత్ షా దేశ ప్రజలందరికీ రిపబ్లిక్ డే శుభాకాంక్షలు తెలిపారు. బలమైన ప్రజాస్వామ్యానికి పునాది వేసిన స్వాతంత్ర్య సమరయోధులు, రాజ్యాంగ రూపకర్తలకు నివాళులర్పించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో రాజ్యాంగ విలువలను మరింత బలోపేతం చేయడానికి, వికసిత భారత్‌ను నిర్మించేందుకు సంకల్పించుకుందామని పిలుపునిచ్చారు.

అధిక అభ్యున్నతి కీలక బాధ్యత

గణతంత్ర దినోత్సవం సందర్భంగా రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తాను రాసిన వ్యాసాన్ని సోషల్ మీడియాలో పంచుకున్నారు. దీంతోపాటు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. 'ప్రతి ప్రజాస్వామ్య వ్యవస్థలో, పౌరుల సామాజిక, ఆర్థిక అభ్యున్నతి ప్రభుత్వ కీలక బాధ్యత. దీనికి పాలనలో కేంద్రంగా ప్రజలు ఉండటం, అభివృద్ధి ప్రయాణంలో పాల్గొనడం అవసరం. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం' అని వ్యాఖ్యానించారు.



అమరవీరులకు మోదీ నివాళి

దిల్లీ: జాతీయ యుద్ధ స్మారకం వద్ద సోమవారం ప్రధాని మోదీ అమరవీరులకు నివాళులర్పించారు. 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్, ముగ్గురు సైనిక దళాధిపతుల సమక్షంలో స్మారకం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి దేశం తరఫున ప్రధాని గౌరవ వందనం చేశారు. స్మారకం వద్ద మోదీకి రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్వాగతం పలికారు.

రాహుల్, ప్రియాంక శుభాకాంక్షలు

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భారత రాజ్యాంగం ప్రతి భారతీయుడికి గొప్ప ఆయుధమని, అదే మన హక్కులకు కవచమని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. 'ప్రతి పౌరుడికి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు. మన రాజ్యాంగం ప్రతి భారతీయుడికి గొప్ప ఆయుధం. అదే మన స్వరం, మన హక్కులను కాపాడే రక్షణ కవచం' అని పేర్కొన్నారు. 'రాజ్యాంగాన్ని కాపాడటం అంటే భారత గణతంత్రాన్ని కాపాడటమే. ఇది మన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు నిజమైన నివాళి' అని రాహుల్ తెలిపారు. చివరగా 'జై హింద్- జై కాన్‌స్టిట్యూషన్' అంటూ తన సందేశాన్ని ముగించారు.



కర్తవ్యపథ్‌లో ప్రత్యేక ఆకర్షణగా

కేంద్ర హోంశాఖ శకటం

దిల్లీ: గణతంత్ర దినోత్సవం సందర్భంగా దిల్లీలోని కర్తవ్యపథ్‌లో నిర్వహించిన పరేడ్‌లో కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు చెందిన శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భారత న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియమ్‌లను ఇతివృత్తంగా తీసుకుని శకటాన్ని రూపొందించారు. న్యాయవ్యవస్థలో చరిత్రాత్మకంగా నిలిచిపోయే ఈ చట్టాలు, బ్రిటిష్ కాలంనాటి అవశేషాలను పూర్తిగా తొలగించాయని హోంమంత్రి అమిత్ షా 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో వచ్చిన ఈ చట్టాలు.. దేశ ప్రయాణాన్ని శిక్షల నుంచి న్యాయానికి నడిపిస్తాయని తెలిపారు. కొత్తగా నిర్మించిన పార్లమెంటు భవనం నమూనాపైన పుస్తకాల రూపంలో ఈ చట్టాలను పొందుపరిచారు.

ఎర్రకోటలో "భారత్ పర్వ్ 2026"

ఇంటర్నెట్ డెస్క్ : గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా కేంద్రం నిర్వహించే ఆరు రోజుల వార్షిక జాతీయ సాంస్కృతిక, పర్యాటక ఉత్సవం "భారత్ పర్వ్" సోమవారం లాంఛనంగా ప్రారంభమైంది. ఈ వేడుక 31 వరకూ దిల్లీలోని ఎర్రకోట ప్రాంగణంలో జరగనుందని పర్యాటక మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇది కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ నిర్వహించే వార్షిక కార్యక్రమం. భారత సాంస్కృతిక, కళాత్మక, వంటకాల, ఆధ్యాత్మిక వారసత్వాన్ని వేడుకగా జరుపుకొనేందుకు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు.

అంబేడ్కర్ పేరే మర్చిపోతారా?

- గణతంత్ర వేడుకల్లో మంత్రిని నిలదీసిన అధికారిణి

ఈటీవీభారత్: 77వ గణతంత్ర వేడుకల వేళ మహారాష్ట్రలోని నాసిక్‌లో అనూహ్య ఘటన జరిగింది. ఒక రాష్ట్ర మంత్రిని, ఒక మహిళా అధికారిణి వేదికపైనే నిలదీసి ప్రశ్నించిన వైనం చర్చనీయాంశమైంది. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ పేరును రిపబ్లిక్ డే ప్రసంగంలో మహారాష్ట్ర మంత్రి గిరీశ్ మహాజన్ ప్రస్తావించకపోవడంపై అటవీ శాఖ అధికారిణి మాధవి జాధవ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. "రాజ్యాంగం అమల్లోకి వచ్చిన ఈ పవిత్ర దినాన, ఆ రాజ్యాంగ నిర్మాత పేరే చెప్పరా? బాబా సాహెబ్‌ను విస్మరిస్తారా?' ' అంటూ ఆమె మంత్రిని, అధికారులను నిలదీశారు. విధుల్లో ఉన్న ఆమె.. ప్రోటోకాల్‌ను పక్కనబెట్టి నిరసనను వ్యక్తం చేశారు. పోలీసులు ఆమెను అక్కడి నుంచి బలవంతంగా వాహనంలో తరలించారు. కాసేపటి తర్వాత విడుదల చేశారు. బాబాసాహెబ్ పేరును ఉద్దేశపూర్వకంగా వదిలేయలేదని, జరిగిన దానికి విచారం వ్యక్తం చేస్తున్నానని మంత్రి గిరీశ్ వివరణ ఇచ్చారు.

ఎర్రసముద్రానికి వస్తే మంటలే

- అమెరికాకు హూతీల పరోక్ష హెచ్చరిక

దుబాయ్: ఇరాన్ అల్లర్ల నేపథ్యంలో పశ్చిమాసియాకు అమెరికా యుద్ధ విమాన వాహక నౌక యూఎస్ఎస్ అబ్రహం లింకన్ వస్తున్న నేపథ్యంలో యెమెన్ తిరుగుబాటుదారులు కీలక ప్రకటన చేశారు. ఎర్రసముద్రంలోకి వచ్చే నౌకలపై మళ్లీ దాడులు ప్రారంభిస్తామని హెచ్చరించారు. ఇందుకు సంబంధించి ఓ చిన్న వీడియోను విడుదల చేశారు. ఇందులో మంటల్లో ఉన్న ఓ నౌకను చూపించారు. దానికి 'త్వరలో' అని ఓ వ్యాఖ్య జోడించారు. గాజా యుద్ధం సమయంలో హమాస్‌కు అనుకూలంగా, ఇజ్రాయెల్, అమెరికాలకు వ్యతిరేకంగా హూతీలు.. ఎర్ర సముద్రంలో వందకు పైగా వాణిజ్య నౌకలపై దాడులు చేసిన సంగతి తెలిసిందే. గాజా కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన తర్వాత వీటిని ఆపేశారు. హూతీలకు తొలి నుంచి ఇరాన్ మద్దతిస్తోంది. ఇప్పుడు ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా సేనలను పంపుతుండటంతో హూతీలు ఈ వీడియోను విడుదల చేసినట్లు తెలుస్తోంది. ఇరాన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా గత నెల 28 నుంచి ఆందోళనలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా జరిగిన ఘర్షణల్లో 5,848 మంది మృతి చెందారని విదేశీ సంస్థలు చెబుతున్నాయి. ఇరాన్ మాత్రం 3,117 మంది ప్రాణాలు కోల్పోయారని, ఇందులో 2,427 మంది పౌరులు.. భద్రతా సిబ్బంది ఉన్నారని మిగిలిన వారిని ఉగ్రవాదులుగా పేర్కొంది. దేశవ్యాప్తంగా ఈ నిరసనల్లో పాల్గొంటున్న ఆందోళనకారులను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మద్దతు ప్రకటించారు. వారికి సాయం అందిస్తామని తెలిపారు. భారీగా సైన్యాన్ని ఇరాన్ దిశగా పంపాలని ఇటీవల నిర్ణయించారు. ఇందులో భాగంగానే యూఎస్ఎస్ విమాన వాహక నౌక పశ్చిమాసియాకు బయల్దేరింది.

10 వేల కిలోల పేలుడు పదార్థాల స్వాధీనం

- స్మగ్లింగ్ నెట్‌వర్క్‌ను ఛేదించిన రాజస్థాన్ పోలీసులు

ఇంటర్నెట్ డెస్క్: రిపబ్లిక్ డే వేళ ఇంటెలిజెన్స్ అధికారులు స్మగ్లింగ్ నెట్‌వర్క్‌ను ఛేదించారు. నిఘా వర్గాల సమాచారం మేరకు గాలింపు చర్యలు చేపట్టిన అధికారులు రాజస్థాన్‌లో 10వేల కిలోల పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. నాగౌర్ జిల్లాలోని ఓ ఫామ్‌హౌస్‌లో 187 బస్తాల అమ్మోనియం నైట్రేట్‌తో పాటు డిటోనేటర్లు, డిటోనేటర్ వైర్లు, ఇతర పేలుడు పదార్థాలు లభ్యమైనట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో సులేమాన్‌ఖాన్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి విచారణ చేపట్టామన్నారు. అక్రమ మైనింగ్ కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులకు నిందితుడు ఈ పేలుడు పదార్థాలను సరఫరా చేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో గుర్తించినట్లు అధికారులు తెలిపారు. వీటి



విలువ రూ.కోట్లలో ఉంటుందన్నారు. నిందితుడిపై గతంలోనూ పేలుడు పదార్థాల సరఫరాకు సంబంధించి పలు కేసులు నమోదయ్యాయన్నారు. ఇప్పటివరకు ఈ పేలుడు పదార్థాలను ఎవరెవరికి సరఫరా చేశారు?, ఇందులో ఇతర రాష్ట్రాల ముఠాలకు కూడా సంబంధం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

యూజీసీ నిబంధనలకు నిరసనగా అధికారి రాజీనామా

బరేలీ: విశ్వవిద్యాలయాల నిధుల సంఘం (యూజీసీ) కొత్త మార్గదర్శకాలు సమాజాన్ని, దేశాన్ని విడగొట్టేవిగా ఉన్నాయంటూ ఉత్తర్‌ప్రదేశ్‌లో ఓ అధికారి గణతంత్ర దినోత్సవం నాడు పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను గవర్నర్‌కు, బరేలీ జిల్లా కలెక్టర్‌కు ఈ-మెయిల్ చేశారు. కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో షెడ్యూల్డ్ కులాలు, తెగలు, వెనుకబడిన కులాలపై పక్షపాతం వహిస్తున్నారని వచ్చే ఫిర్యాదులను స్వీకరించి తగిన చర్యలు తీసుకోవాలని యూజీసీ కొత్త నిబంధనలు తీసుకువచ్చింది. ఇందుకోసం ప్రత్యేక కమిటీలను, హెల్ప్‌లైన్లనూ, నిఘా బృందాలను ఏర్పాటు చేయాలని నిర్దేశించింది. ఈ నిబంధనలు కులపరమైన దాడులకు దారితీయవచ్చని బరేలీ సిటీ మేజిస్ట్రేట్ (2019 బ్యాచ్ అధికారి) అలంకార్ అగ్నిహోత్రి సోమవారం విలేకరులతో అన్నారు. ఇలాంటి దుర్విచక్షణాపూరిత నిబంధనలు సామాజిక అశాంతికి, అసంతృప్తికి దారితీస్తాయని విమర్శించారు. సమాజానికి మేలుకొలుపుగా రాజీనామా చేస్తున్నానని వివరించారు. బనారస్ హిందూ విశ్వవిద్యాలయం నుంచి బీటెక్, ఎల్ఎల్‌బీ పట్టభద్రుడైన అగ్నిహోత్రి అమెరికాలో కూడా పనిచేశారు. ముక్కుసూటి అధికారిగా పేరొందారు.

గోదాములో అగ్నిప్రమాదం..

- బెంగాల్‌లో ఏడుగురి మృతి

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లాలో సోమవారం ఒక గోదాములో జరిగిన అగ్ని ప్రమాదంలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో పలువురి ఆచూకీ తెలియడం లేదని పోలీసులు తెలిపారు. కోల్‌కతా శివారు నరేంద్రపుర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నజీరాబాద్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఏడుగంటల పాటు సహాయక చర్యలు చేపట్టిన అనంతరం మంటలు అదుపులోకి వచ్చాయని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదానికి కారణం ఇంకా తెలియరాలేదని పేర్కొన్నారు.

వయోజనుల సహజీవనం కేసుల్లో అత్యాచార నేరాన్ని ఆపాదించలేం

- జీవిత ఖైదు శిక్షను రద్దు చేస్తూ అలహాబాద్ హైకోర్టు తీర్పు

ప్రయాగ్‌రాజ్: పాశ్చాత్య నాగరికత ప్రభావంతో యువతలో సహజీవన ధోరణి అధికమవుతోందని అలహాబాద్ హైకోర్టు అభిప్రాయపడింది. యువతిని అపహరించి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడనే ఆరోపణలపై దిగువ కోర్టు విధించిన జీవిత ఖైదు శిక్షను రద్దు చేసింది. ఆమె మైనర్ కాదని నిర్ధారిస్తూ...పరస్పర ఆమోదంతోనే వయోజనులైన వారిద్దరూ శారీరక బంధాన్ని ఆరేళ్లపాటు కొనసాగించారని జస్టిస్ సిద్ధార్థ్, జస్టిస్ ప్రశాంత్ మిశ్ర ధర్మాసనం పేర్కొంది. ఇలాంటి వివాహేతర సంబంధాలు విఫలమైనప్పుడు అత్యాచార ఆరోపణలతో ఎఫ్.ఐ.ఆర్.లు తరచూ నమోదవుతున్నాయని తెలిపింది. సహజీవన భావన మనుగడలో లేని మన సమాజంలో... మహిళల రక్షణ కోసం రూపొందించిన చట్టాలు వారికే అనుకూలంగా ఉంటాయని, ఆ శాసనాల ఆధారంగా పురుషులను శిక్షించడం జరుగుతోందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. వయోజనుల సహజీవనం కేసుల్లో అత్యాచార నేరాన్ని ఆపాదించలేమని పేర్కొంది. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం...మైనర్ అయిన తన కుమార్తెను చంద్రేశ్ అనే వ్యక్తి అపహరించి శారీరక సంబంధం పెట్టుకున్నాడు అని ఆమె తండ్రి కేసుపెట్టారు. దీంతో ట్రయల్ కోర్టు...కిడ్నాప్, ఉద్దేశపూర్వక హాని, పోక్సో చట్టంలోని సెక్షన్ 6, ఎస్సీ/ఎస్టీ చట్టంలోని సెక్షన్ 3(2)(వి) తదితర నేరారోపణల కింద నిందితుడికి జీవిత ఖైదు విధించింది. ఈ తీర్పును చంద్రేశ్ హైకోర్టులో సవాల్ చేయగా తాజా తీర్పు వెలువడింది.

ఫుట్‌బాల్ మైదానంలో సాయుధమూకల దాడి

- మెక్సికోలో 11 మంది మృతి

మెక్సికో సిటీ: మెక్సికోలో కాల్పులు కలకలం సృష్టించాయి. గ్వానాజువాటో ప్రాంతంలోని ఓ ఫుట్‌బాల్ మైదానంలో సాయుధమూకలు కాల్పులకు తెగబడ్డాయి. ఈ దాడిలో 11 మంది ప్రాణాలుకోల్పోగా.. మరో 12 మందికి తీవ్ర గాయాలయ్యాయి. పదిమంది ఘటనాస్థలంలోనే మరణించగా.. మరొకరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. గాయపడిన వారిలో ఓ మహిళ, మైనర్ కూడా ఉన్నట్లు తెలిపారు. ఫుట్‌బాల్ ఆట ముగింపు దశకు చేరుకున్న సమయంలో సాయుధమూకలు మైదానానికి చేరుకుని కాల్పులు జరిపాయని వెల్లడించారు.

ఆ గ్రామంలో మూడిళ్లకో సైనికుడు

ఈటీవీ భారత్ : హరియాణాలోని కురుక్షేత్ర జిల్లాలో ఉన్న బర్నా.. సైనికుల గ్రామంగా ప్రసిద్ధి చెందింది. సైన్యంలో పనిచేస్తున్న వారు ఈ గ్రామంలో ప్రతి మూడిళ్లకు ఒకరున్నారు. పలువురు రిటైర్ కాగా, ప్రస్తుతం దాదాపు 200 మంది వరకు సైన్యంలో సేవలందిస్తున్నారు. బర్నాకు చెందిన ముగ్గురు సైనికులు దేశం కోసం ప్రాణాలర్పించారు. గ్రామంలోని యువత మొదట్నుంచీ దేశభక్తిని కలిగి ఉన్నారని,



ఇలా ప్రతి మూడిళ్లకు ఓ సైనికుడు ఉండటం తమకు గర్వకారణమని స్థానికులు హర్షం వ్యక్తంచేశారు. 18 ఏళ్ల వయసులో సురేంద్ర సింగ్ అనే యువకుడు సైన్యంలో చేరి ఐదేళ్ల పాటు సేవలందించారు. 2001న అనంత్‌నాగ్‌లో ఉగ్రవాదులతో పోరాడుతూ 23 ఏళ్ల వయసులో ఆయన అమరుడయ్యారు. సురేంద్ర త్యాగం ఎందరో యువకులను ఆర్మీలో చేరేలా ప్రేరేపించిందని ఆయన తండ్రి నేకి రామ్ తెలిపారు.

భారత్ వైమానిక శక్తికి తాళలేకే పాక్ కాల్పుల విరమణ

- ఆపరేషన్ సిందూర్‌పై సంచలన నివేదిక



ఈటీవీ భారత్: 'ఆపరేషన్ సిందూర్'పై స్విట్జర్లాండ్‌కు చెందిన రక్షణరంగ అధ్యయన సంస్థ 'సెంటర్ ఫర్ మిలిటరీ హిస్టరీ అండ్ పర్‌స్పెక్టివ్ స్టడీస్' (సీహెచ్‌పీఎం) సంచలన నివేదికను విడుదల చేసింది. భారత వాయుసేన శక్తి సామర్థ్యాల వల్లే, భారత్ ఆపరేషన్ సిందూర్‌ను మొదలుపెట్టిన నాలుగో రోజునే (2025 మే 10న) కాల్పుల విరమణకు పాక్ విజ్ఞప్తి చేసిందని అది పేర్కొంది.

సీహెచ్‌పీఎం సంస్థ తరఫున స్విట్జర్లాండ్‌కు చెందిన సైనిక వ్యవహారాల చరిత్రకారుడు అడ్రియెన్ ఫాంటనెల్లాజ్ సారథ్యంలోని నిపుణుల బృందం.. ఆపరేషన్ సిందూర్‌పై సమగ్ర అధ్యయనం చేసింది. 2025 మే 7 నుంచి మే 10 వరకు 88 గంటల వ్యవధిలో భారత్, పాక్ మధ్య వివిధ చోట్ల జరిగిన సైనిక ఘర్షణల సమాచారాన్ని సేకరించి విశ్లేషించి, ఒక నివేదికను తాజాగా సీహెచ్‌పీఎం ప్రచురించింది. అందులోని ముఖ్యాంశాలివీ..

ఆపరేషన్ సిందూర్‌ను మొదలుపెట్టిన తొలి రోజున (మే 7న) ఒక రఫేల్ యుద్ధవిమానాన్ని భారత్ కోల్పోయింది. ఈ ఒక్క నష్టాన్ని పాక్ పెద్దదిగా చేసి చూపించింది. ఆరంభంలోనే తమదే పైచేయి అని చెప్పుకునేందుకు ప్రయత్నించింది. దీనివల్ల తదుపరి రోజుల్లో (మే 8, 9, 10 తేదీల్లో) భారత్ సాధించిన భారీ విజయాలు పెద్దగా కనిపించకుండా పోయాయి. భారత్ వ్యూహాత్మకంగా వ్యవహరించి పాకిస్థాన్ గగనతల రక్షణ వ్యవస్థలను ధ్వంసం చేసింది. తద్వారా పాక్ వైమానిక శక్తి సామర్థ్యాలను చాలావరకు తగ్గించింది. మొత్తం మీద ఆపరేషన్ సిందూర్‌లో పాక్‌పై భారత్ పూర్తిస్థాయి పైచేయిని సాధించింది.

కలిసొచ్చిన స్వేచ్ఛ

ఆపరేషన్ సిందూర్ కోసం ప్రణాళిక రచించేందుకు త్రివిధ దళాలకు భారత ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛను ఇవ్వడం గొప్ప విషయం. దీనివల్లే పాక్ ప్రతిఘటనను ఎదుర్కొనే వ్యూహాలను భారత త్రివిధ దళాలు ముందస్తుగా సిద్ధం చేసి ఉంచగలిగాయి. అందుకే పాక్ వద్ద అణ్వస్త్రాలు ఉన్నాయని తెలిసినా, భారత్ నిర్భయంగా దాడులు చేయగలిగింది. మే 7న తెల్లవారుజామున పాక్‌లోని బహవల్‌పూర్, మురిద్కేలలో ఉన్న జైషే మహ్మద్, లష్కరే తయ్యిబా ఉగ్రవాద శిబిరాలు, ప్రధాన కార్యాలయాలపై భారత్ కచ్చితత్వంతో మెరుపు దాడులు చేసింది. ఈ దాడుల్లో చాలా భవనాలు ధ్వంసమయ్యాయి. ఎంతోమంది ఉగ్రవాదులు హతమయ్యారు. మే 7న తెల్లవారుజామున దాదాపు 60 భారత యుద్ధ విమానాలు, 40 పాక్ యుద్ధ విమానాలు గగనతలంలో తలపడ్డాయి. భారత యుద్ధ విమానాలపైకి చైనా తయారీ పీఎల్-15 క్షిపణులను పాక్ జెట్‌లు ప్రయోగించాయి. దీంతో ఒక రఫేల్, ఒక మిరాజ్-2000 ఫైటర్ జెట్, మరొక యుద్ధవిమానాన్ని భారత్ కోల్పోయింది. ఈ అంశాన్ని పాక్ బాగా ప్రచారం చేసుకుంది. తామే గెలిచామని గొప్పలు చెప్పుకొంది.

మే 10కల్లా లెక్క పూర్తిగా మారిపోయింది

మే 8, 9, 10 తేదీల్లో పాక్‌పై భారత్ చేసిన దాడులతో పరిస్థితి మారిపోయింది. స్కాల్ప్-ఈజీ, బ్రహ్మోస్ క్షిపణులతో పాక్‌లోని గగనతల రక్షణ వ్యవస్థలు, రాడార్ వ్యవస్థలు, వైమానిక స్థావరాలను కోలుకోలేని విధంగా భారత్ దెబ్బతీసింది. ఫలితంగా పాక్ రక్షణ కవచం బలహీనపడింది. ప్రధాన రన్‌వేలు, వాటితో ముడిపడిన వ్యవస్థలను భారత్ ధ్వంసం చేసింది. దీంతో వెంటనే పాక్ వాయుసేన స్పందించే అవకాశం లేకుండా పోయింది. భారత్ తన సమీకృత గగనతల రక్షణ, ఆదేశిక నియంత్రణ వ్యవస్థ (ఐఏసీసీఎస్), ఆర్మీకి చెందిన ఆకాశ్‌తీర్ సిస్టమ్ కలిసి పనిచేయడంతో ఆపరేషన్ సిందూర్‌లో పైచేయి ఖాయమైంది. ఆకాశ్, బరాక్-8, ఎస్-400 గగనతల రక్షణ వ్యవస్థల ద్వారా పాక్ క్షిపణి, డ్రోన్ దాడులను తిప్పికొట్టింది. అందుకే మే 10కల్లా లెక్క పూర్తిగా మారిపోయింది. కాల్పుల విరమణకు పాక్ అర్థించింది.

వైకాపా విధ్వంసం నుంచి.. కోలుకునే దిశగా డిస్కంల అడుగులు

• మొదటిసారి ఏసీఎస్ మించి ఏఆర్ఆర్ • నియంత్రణలోకి సరఫరా నష్టాలు

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) కుదేలయ్యాయి. ఏటా విడుదల చేయాల్సిన సబ్సిడీలు.. ప్రభుత్వ విభాగాలు వినియోగించిన విద్యుత్‌కు చెల్లించాల్సిన బిల్లులు బకాయిలు పెట్టింది. డిస్కంల నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో విద్యుత్ సరఫరా, వాణిజ్య నష్టాలూ పెరిగాయి. దీంతో యూనిట్ విద్యుత్ సగటు సరఫరా వ్యయం పెరిగింది. అందుకే గత ప్రభుత్వం ఏటా ట్రూఅప్ పేరుతో వినియోగదారులపై అదనపు భారాలు వేసింది. కూటమి అధికారంలోకి వచ్చాక పాత సబ్సిడీలతో పాటు.. ప్రభుత్వ విభాగాలు చెల్లించాల్సిన బకాయిలు విడుదల చేసి డిస్కంలకు కొంత మేర ఊపిరి అందించింది. తొలిసారి యూనిట్‌కు 13 పైసలు (ట్రూడౌన్) తగ్గించింది. కేంద్రం ఇచ్చే గ్రేడింగ్‌లలో 2025కు ఎస్‌పీడీసీఎల్, సీపీడీసీఎల్ మెరుగుపడ్డాయి. ఈపీడీసీఎల్ గ్రేడింగ్ తగ్గినా.. దానికి ప్రత్యేక కారణాన్ని అధికారులు చూపుతున్నారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి సరఫరా చేసే విద్యుత్‌కు రావాల్సిన సుమారు రూ.550 కోట్లను ఈక్విటీగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ బకాయిలు సర్దుబాటు చేస్తే డిస్కం గ్రేడింగ్ మెరుగవుతుందని అధికారులు తెలిపారు.

గత రెండేళ్లూ.. వాణిజ్య నష్టాలూ అధికం

విద్యుత్ పంపిణీ పర్యవేక్షణలోనూ డిస్కంలు ఇష్టారాజ్యంగా వ్యవహరించాయి. దీంతో సరఫరా, వాణిజ్య నష్టాలు భారీగా పెరిగాయి. ఆ మేరకు విద్యుత్ కొనుగోలు వ్యయం పెరిగింది. అదనపు భారం మొత్తం ట్రూఅప్ పేరిట వినియోగదారులపై వేసింది. ఒకే బిల్లులో మూడు ట్రూఅప్ ఛార్జీలు వేసి.. సామాన్యుల నుంచి ముక్కుపిండి వసూలు చేసింది. కూటమి అధికారంలోకి వచ్చాక డిస్కంల అంతర్గత సామర్థ్యంపై దృష్టిపెట్టి, ఏటీ అండ్ సి నష్టాలు తగ్గించింది.

నియంత్రణలోకి.. యూనిట్ విద్యుత్‌కు చేసే సగటు ఖర్చు

యూనిట్ విద్యుత్ వినియోగదారులకు సరఫరా చేసేందుకు చేసే ఖర్చు తగ్గింది. విద్యుత్ కొనుగోలుకు చేసే ఖర్చుతో పాటు డిస్కంలు తీసుకున్న అప్పులపై వడ్డీ, ఇతర ఖర్చులు కలిపి యూనిట్ సగటు విద్యుత్ సరఫరా వ్యయాన్ని (ఏసీఎస్) డిస్కంలు నిర్దేశిస్తాయి. వాటిని నియంత్రించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టడంతో మూడు డిస్కంల యూనిట్ సరఫరా కోసం చేసే ఖర్చు 2024తో పోలిస్తే.. 2025లో తగ్గింది.

బకాయిల వసూళ్లలో.. పెరిగిన ఆదాయం

ప్రభుత్వం సబ్సిడీలు, ప్రభుత్వ విభాగాలు వినియోగించిన విద్యుత్ బకాయిల వసూళ్లపై డిస్కంలు దృష్టి పెట్టడంతో యూనిట్‌కు సగటున వసూలయ్యే (ఏఆర్ఆర్) మొత్తం పెరిగింది. దీంతో యూనిట్ విద్యుత్‌కు కమిషన్ అనుమతించిన మొత్తం కంటే మూడు డిస్కంలకూ ఆదాయం అధికంగా వచ్చింది. గత ప్రభుత్వంలో ఏఆర్ఆర్ కంటే ఏసీఎస్ ఎక్కువగా ఉంది. 2025లో మాత్రం మూడు డిస్కంల ఆదాయం పెరిగింది.

2025 ఆర్థిక సంవత్సరంలో డిస్కంల విద్యుత్ విక్రయాలు(మిలియన్ యూనిట్లలో)

డిస్కం	ఇన్‌పుట్ విద్యుత్	విద్యుత్ విక్రయాలు
ఏపీసీపీడీసీఎల్	17,299	15,371
ఏపీఈపీడీసీఎల్	29,252	26,644
ఏపీఎస్‌పీడీసీఎల్	31,154	27,719

◆ గత మూడేళ్లలో మూడు డిస్కంలకూ కలిపి ప్రభుత్వం రూ.38,687 కోట్లు టారిఫ్ సబ్సిడీ చెల్లించాల్సి ఉంటే.. వైకాపా హయాంలో పెండింగ్‌లో పెట్టిన బకాయిలతో కలిపి కూటమి ప్రభుత్వం సబ్సిడీ మొత్తాన్ని విడుదల చేసింది. 2025 మార్చి నాటికి రూ.40,257 కోట్లు సబ్సిడీ కింద ప్రభుత్వాలు చెల్లించాయి.

యూనిట్ విద్యుత్‌కు వినియోగదారుల నుంచి వసూలు (ఏఆర్ఆర్-రూ.లలో)

డిస్కం	2022–23	2023–24	2024–25
ఏపీసీపీడీసీఎల్	7.25	7.86	10.00
ఏపీఈపీడీసీఎల్	7.00	7.38	7.56
ఏపీఎస్‌పీడీసీఎల్	6.76	7.34	9.79

◆ ప్రజలకు యూనిట్ విద్యుత్ సరఫరాకు చేసే సగటు వ్యయం.. దానిపై వస్తున్న సగటు ఆదాయం (ఏఆర్ఆర్) మధ్య ఉన్న వ్యత్యాసాన్ని బట్టి డిస్కంల ఆర్థిక పరిస్థితి అంచనా వేయవచ్చు. ఈ ప్రకారం 2025లో ఏసీఎస్ కంటే ఏఆర్ఆర్ పెరిగింది. మూడు డిస్కంలూ ఇదే బాటలో ఉండటం గత మూడేళ్లలో ఇదే మొదటిసారి.

గత మూడేళ్లలో ప్రభుత్వ విభాగాలు వినియోగించిన విద్యుత్.. చెల్లించిన బిల్లులు (రూ.కోట్లలో)

డిస్కం	2022-23		2023-24		2024-25	
	బిల్లు	వసూలు	బిల్లు	వసూలు	బిల్లు	వసూలు
ఏపీసీపీడీసీఎల్	792	424	930	343	951	2,051
ఏపీఈపీడీసీఎల్	830	470	1,242	434	1,302	2,178
ఏపీఎస్‌పీడీసీఎల్	2,705	1,424	3,305	660	3,535	8,556
	4,327	2,318	5,477	1,437	5,788	12,785

వైకాపా ప్రభుత్వం 2023లో 53.57%, 2024లో 26.24% బిల్లులే చెల్లించింది. కూటమి ప్రభుత్వం 2025లో పాత బకాయిలతో కలిపి (220.89%) చెల్లించింది.

గత మూడేళ్లలో ఏటీ అండ్ సి నష్టాలు

డిస్కం	2022-23	2023-24	2024-25
ఏపీసీపీడీసీఎల్	10.33	11.37	7.95
ఏపీఈపీడీసీఎల్	5.94	10.41	7.70
ఏపీఎస్‌పీడీసీఎల్	8.08	13.95	7.99

సరఫరా నష్టాలు పెరగడంతో ఆర్థికంగా డిస్కంలు నష్టపోతాయి. దీంతో గత మూడేళ్లూ డిస్కంల నష్టాలు పెరగడమే తప్పించి.. తగ్గుతున్న దాఖలా లేదు. డిస్కంల నష్టాలు 2024లో రూ.29,211 కోట్లు ఉంటే.. 2025లో రూ.29,420 కోట్లకు పెరిగాయి. అప్పులపై వడ్డీలు, ఇతర ఖర్చుల ప్రభావంతో ఏటా నష్టాలు పెరుగుతూనే ఉన్నాయి.

యూనిట్ విద్యుత్ సరఫరాకు చేసే సగటు ఖర్చు(ఏసీఎస్–రూ.లలో)

డిస్కం	2023-24	2024-25
ఏపీసీపీడీసీఎల్	9.18	8.86
ఏపీఈపీడీసీఎల్	7.73	7.47
ఏపీఎస్‌పీడీసీఎల్	8.38	8.29

2047 నాటికి రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే లక్ష్యం

• గణతంత్ర వేడుకల సందర్భంగా గవర్నర్ అబ్దుల్ నజీర్ సందేశం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 2047 నాటికి పేదరికాన్ని నిర్మూలించడంతోపాటు.. ఏపీని అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు వ్యూహాత్మక అభివృద్ధి లక్షిత ప్రణాళికను ప్రభుత్వం అమలు చేస్తోందని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. గణతంత్ర వేడుకల నేపథ్యంలో సోమవారం లోక్‌భవన్ నుంచి ఆయన రాష్ట్ర ప్రజలనుద్దేశించి సందేశమిచ్చారు. అందులో.. ‘ఆంధ్రప్రదేశ్‌లో పేదరిక నిర్మూలన లక్ష్యంతోపాటు బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ ప్రయోజనాలను అందించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోంది. 2047 నాటికి పేదరిక నిర్మూలన కోసం పీ-4 పథకాన్ని చేపట్టింది. 2047 నాటికి రాష్ట్రంలో రూ.55 లక్షల తలసరి ఆదాయంతో రూ.308 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థను సాధించడం, 15 శాతం వార్షిక వృద్ధిరేటును సాధించేందుకు ప్రభుత్వం వ్యూహాత్మక అభివృద్ధి లక్షిత ప్రణాళికను అమలు చేస్తోంది. వ్యవసాయం, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, సేవలు, సామాజికాభివృద్ధి వంటి రంగాలవారీగా అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలను అమల్జేస్తోంది. పెట్టుబడిదారుల స్నేహపూర్వక విధానాలతో, సమర్థ పాలనతో 2025-26 ఆర్థిక సంవత్సరంలో దేశంలో ప్రతిపాదిత పెట్టుబడుల్లో రాష్ట్రం నాలుగోవంతు సాధించింది. సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలందరికీ అందిస్తూ అన్ని వర్గాల ప్రజల సంతృప్తిస్థాయి పెంచే లక్ష్యంతో సమగ్ర అభివృద్ధి సాధిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని విశ్వసిస్తున్నా’ అని తెలిపారు.

దారిద్ర్య రేఖ నుంచి పైకి

‘గడిచిన ఏడు దశాబ్దాల్లో భారత దేశం అద్భుతమైన పురోగతిని సాధించింది. ఇప్పుడు భారత్ ప్రపంచ నాలుగో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచింది. ప్రపంచంలోనే మనకు మూడో అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టం ఉంది. దేశంలో వివిధ సంక్షేమ పథకాలతో ప్రభుత్వం గత దశాబ్ద కాలంలో 171 మిలియన్ల మందిని దారిద్ర్య రేఖ నుంచి ఎగువకు తేగలిగింది. ఆయుష్మాన్ భారత్ వంటి కార్యక్రమాలు కోట్లాది కుటుంబాలకు ఆరోగ్య భద్రతను అందించాయి, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి దేశవ్యాప్తంగా రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూర్చింది. ఇవేగాక అనేక ఇతర కార్యక్రమాలు పేదలు, అణగారిన, సమాజంలోని వెనుకబడిన వర్గాల జీవితాలను మెరుగుపరిచాయి’ అని వివరించారు.

ఉపాధి హామీలో మార్పులపై ఉద్యమిస్తాం: షర్మిల

ఈనాడు, దిల్లీ: యూపీయే ప్రభుత్వం తీసుకొచ్చిన మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్ని భాజపా ప్రభుత్వం భ్రష్టు పట్టించడానికి వ్యతిరేకంగా రాష్ట్ర కాంగ్రెస్ ఆధ్వర్యంలో త్వరలోనే కార్యక్రమం చేపడతామని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. పార్టీ సంస్థాగత వ్యవహారాలపై సోమవారం ఇక్కడి ఇందిరాభవన్‌లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో జరిగిన పీసీసీ అధ్యక్షుల సమావేశంలో పాల్గొన్న అనంతరం షర్మిల విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో బూత్ నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీని బలోపేతం చేయడంపై కేసీ వేణుగోపాల్ వద్ద చర్చ జరిగిందన్నారు. పీసీసీ అధ్యక్షురాలిగా నేను కూడా బలపడాలని వారు చెప్పారని తెలిపారు. ‘జీరాంజీ పథకం కింద 40% ఆర్థిక భారాన్ని రాష్ట్రాలు భరించాలని కేంద్రం చెబితే మావల్ల కాదు, దాన్ని కూడా మీరే భరించాలని చంద్రబాబు కేంద్రానికి వినతిపత్రం సమర్పించారు. ఆయన పార్లమెంట్‌లో బిల్లుకు మద్దతివ్వడం ఎందుకు? మళ్లీ వాళ్లను అర్థించడం ఎందుకు? ప్రతిపక్షంలో ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి అయినా ఉపాధి హామీ పథకాన్ని ఎందుకు రద్దు చేస్తున్నారని ప్రశ్నించలేకపోయారు. అందరూ భాజపాకు బినామీలే కాబట్టి అందుకు వారు ధైర్యం చేయలేకపోతున్నారు. 20 ఏళ్ల క్రితం ఏపీలో మొదలుపెట్టిన ఉపాధి హామీ పథకాన్ని భాజపా నాశనం చేయడానికి పూనుకున్నా దాని గురించి ప్రశ్నించలేనివారిని ఏమనాలి’ అని ప్రశ్నించారు.

టౌన్‌ప్లానింగ్‌లో 4 ఏడీ పోస్టుల ఫలితాల విడుదలకు కమిటీ సిఫార్సు

ఈనాడు, అమరావతి: పట్టణ, గ్రామీణ ప్రణాళిక విభాగం సహాయ సంచాలకుల (ఏడీ) పోస్టుల ఫలితాల విడుదలకు ఏపీపీఎస్సీ నియమించిన కమిటీ. . తన ప్రతిపాదనను సమర్పించింది. మొత్తం 7 ఏడీ పోస్టుల్లో మొదటి నాలుగు పోస్టుల ఫలితాల విడుదలకు సిఫార్సు చేసింది. ఈ కమిటీలో వైద్య, ఆరోగ్య శాఖ, టౌన్, కంట్రీ ప్లానింగ్, ఏపీపీఎస్సీకి చెందిన ఇద్దరితో కలిపి మొత్తం నలుగురు సభ్యులున్నారు. ఒకే నోటిఫికేషన్, ఒకే రకమైన పోస్టుల్లో కొన్నింటికి ఫలితాలిచ్చి, మిగతా వాటిని ఆ తర్వాత విడుదల చేసేలా ఫైల్ సిద్ధమైంది. దీనిపై ఏపీపీఎస్సీ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ పోస్టులకు మెరిట్ జాబితా విడుదలైనప్పటి నుంచీ అభ్యర్థుల విద్యార్హతల నిబంధనలపై వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు కొన్ని పోస్టులకు ఫలితాలు ఇచ్చి, మరికొన్నింటిని పక్కన పెట్టాలని కమిటీ సూచించింది. అభ్యర్థుల్లో 8 మంది విద్యార్హతలు సరిగ్గా లేవని ఉన్నత విద్యామండలి నుంచి నివేదిక వచ్చాక ఏపీపీఎస్సీ ఈ కమిటీని నియమించింది.

అసలేం జరిగింది?

టౌన్, కంట్రీ ప్లానింగ్ విభాగంలో అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ గతేడాది ఫిబ్రవరిలో నోటిఫికేషన్ ఇచ్చింది. తర్వాత పరీక్షలు నిర్వహించి, మెరిట్ జాబితాను విడుదల చేసింది. ఒక్కో పోస్టుకు ఇద్దరు చొప్పున గత అక్టోబరులో సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించింది. అభ్యర్థుల విద్యార్హతలు, నోటిఫికేషన్‌లో ఇచ్చిన వాటికి సమానమైనవేనా? కాదా? అని తెలుసుకునేందుకు గతేడాది అక్టోబరు 8న ఏపీపీఎస్సీ టౌన్, కంట్రీ ప్లానింగ్ విభాగానికి లేఖ రాసింది. ఈ విభాగం అభ్యర్థుల అర్హతలను తేల్చేందుకు ఉన్నత విద్యామండలికి సర్టిఫికెట్లు పంపించాలని సూచించింది. దీంతో ఉన్నత విద్యామండలికి ఏపీపీఎస్సీ లేఖ రాసింది. ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేసిన ఉన్నత విద్యామండలి ఇగ్నో పీజీ డిప్లొమా ఇన్ అర్బన్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ కోర్సు పూర్తిచేసిన 8 మంది అనర్హులుగా తేల్చింది. దీనిపై ఇటీవల ఏపీపీఎస్సీ కమిటీ సమావేశం నిర్వహించగా, ఉన్నత విద్యామండలి నివేదిక ఇచ్చినందున మెరిట్ జాబితాలో కింద ఉన్న వారికి అవకాశం కల్పించాలని కొందరు ప్రతిపాదించారు. మొత్తం 15 మంది అభ్యర్థుల్లో 8 మంది అనర్హులుగా తేలడంతో మిగిలిన ఏడుగురితో నాలుగు పోస్టులకు ఫలితాలు విడుదల చేయాలని ఏపీపీఎస్సీ నియమించిన కమిటీ సిఫార్సు చేసింది.



ఆ రోజుల్లో ఈ బైక్‌పై 5 లక్షల కి.మీ. తిరిగా..

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్‌లోని అబిడ్స్ చిరాగ్‌అలీ వీధిలో వింటేజ్ వాహనాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇందులో సుమారు 50 కార్లు, 60 ద్విచక్ర వాహనాలను ప్రదర్శించారు. చిత్రంలో కనిపిస్తున్న పెద్దాయన చర్మాస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కెప్టెన్ కేఫ్ పిస్టోన్‌జీ (80). పైలట్ కూడా అయిన ఆయన... 1965లో ఈ జావా ద్విచక్ర వాహనం కొనుగోలు చేశారు. ‘1985 వరకు దీనిపై సుమారు 5 లక్షల కిలోమీటర్లు ప్రయాణించా.. హనీమూన్‌కి సైతం ఈ మోటార్ సైకిల్‌పైనే వెళ్లా’ అని గర్వంగా చెబుతున్నారు. అప్పటి మధుర సుభూతుల ఫొటోని ఆ వాహనంపై పెట్టారు. అక్కడికి వచ్చిన వింటేజ్ వాహనాల ప్రేమికులు ఈయనతో ఫొటోలు దిగుతూ సందడి చేశారు.

–ఈనాడు, హైదరాబాద్

మనమంతా రాజ్యాంగ స్ఫూర్తితో మెలగాలి

గణతంత్ర వేడుకల్లో ఉద్యోగులకు సీఎస్ విజయానంద్ పిలుపు

ఈనాడు, అమరావతి: సమాజంలో ప్రతి ఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా నడుచుకోవాలని, అప్పుడే రాజ్యాంగ నిర్మాతల కలలు సాకారమవుతాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా సచివాలయంలోని మొదటి బ్లాక్ వద్ద సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో సీఎస్ పాల్గొని మహాత్మా గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం జాతీయ జెండా ఆవిష్కరించారు. ‘దేశంలోని పౌరులందరికీ సమాన అవకాశాలు కల్పించేందుకు, ఆర్థిక అసమానతలు తొలగించేందుకు అన్ని అంశాలను పొందుపర్చి రాజ్యాంగ నిర్మాతలు గొప్ప రాజ్యాంగాన్ని అందించారు. వారి ఆశయాలకు అనుగుణంగా మనమంతా మెలగాలి. వికసిత్ భారత్ లక్ష్య స్ఫూర్తితో 2047 నాటికి స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు ప్రభుత్వ యంత్రాంగం కృషి చేయాలి. ప్రతి ఉద్యోగి చిత్తశుద్ధి, అంకితభావంతో పనిచేసి అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులకు చేరేలా చూడాలి’ అని సూచించారు. అంతకుముందు ఆయన ఎస్పీఎఫ్ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు, సచివాలయ ముఖ్య భద్రతాధికారి మల్లికార్జునరావు, సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్ర గ్రిడ్ పటిష్ఠానికి రూ.9,319 కోట్లతో ప్రాజెక్టులు

- అదనంగా 1,558 సర్క్యూట్ కి.మీ.ల లైన్లు
- విద్యుత్ సౌధలో గణతంత్ర వేడుకల్లో ట్రాన్స్‌కో జేఎండీ

ఈనాడు, అమరావతి: రాష్ట్ర గ్రిడ్‌ను మరింత బలోపేతం చేసి భావి అవసరాలకు ఉపయోగపడేలా రూ.9,319 కోట్లతో విద్యుత్ పంపిణీ ప్రాజెక్టులు చేపట్టినట్లు ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ పేర్కొన్నారు. విజయవాడలోని విద్యుత్ సౌధలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో ఆయన మాట్లాడుతూ ‘55 పంపిణీ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్ర విద్యుత్ గ్రిడ్‌కు 8,853 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మేషన్ సామర్థ్యంతో పాటు 1,558 సర్క్యూట్ కి.మీ.ల ట్రాన్స్‌మిషన్ లైన్లు అదనంగా అందుబాటులోకి రానున్నాయి. కాకినాడ సెజ్, అచ్యుతాపురం, గుడివాడ, ఐనవిల్లిలో కొత్తగా 400/220/132 కేవీ సామర్థ్యం ఉన్న సబ్‌స్టేషన్లు అభివృద్ధి చేస్తున్నాం. విస్తృత డిజిటలైజేషన్, రియల్ టైమ్ మానిటరింగ్, నెట్‌వర్క్ ఆప్టిమైజేషన్ చర్యల ద్వారా విద్యుత్ సరఫరా నష్టాలను ట్రాన్స్‌కో రికార్డు స్థాయిలో 2.6 శాతానికి తగ్గించింది. గ్రిడ్ స్థిరత్వం, పునరుత్పాదక శక్తిని వినియోగించుకునేందుకు 3 వేల మెగావాట్ల విద్యుత్ నిల్వ చేసే బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తున్నాం’ అని వివరించారు. ఏపీ జెన్‌కో థర్మల్ కేంద్రాల ద్వారా రికార్డు స్థాయిలో గరిష్ఠ విద్యుత్ ఉత్పత్తి 6,009 మెగావాట్లు సాధించిందని అన్నారు. సమావేశంలో జెన్‌కో ఇన్‌ఛార్జ్ ఎండీ పుల్లారెడ్డి, ట్రాన్స్‌కో, జెన్‌కో డైరెక్టర్లు పాల్గొన్నారు.

గిరిజన భూ సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం

రాష్ట్ర ఎస్టీ కమిషన్‌కు ప్రజా సమాఖ్య ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: ఉమ్మడి కర్నూలు జిల్లాలో గిరిజన భూ సమస్యల పరిష్కార విషయంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని రాష్ట్ర ఎస్టీ కమిషన్‌కు ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విజయవాడలోని ఎస్టీ కమిషన్ కార్యాలయంలో ఛైర్మన్ బొజ్జిరెడ్డిని కలిసి సోమవారం ఆయన ఫిర్యాదు ఇచ్చారు. ‘రీసర్వే పేరుతో గిరిజన భూముల్ని ఇతరుల పేర్ల మీదకు మార్చి ఇబ్బందులు పెడుతున్నారు. తిరిగి సర్వే చేయాలని కోరితే కాలయాపన చేస్తున్నారు. పోడు వ్యవసాయ భూములకు పట్టాలు మంజూరు చేయడం లేదు. పైగా కొందరు అటవీ అధికారులు ఈ భూముల్ని దౌర్జన్యంగా ఆక్రమించుకుంటున్నారు’ అని పేర్కొన్నారు. దీనిపై ఛైర్మన్ స్పందిస్తూ త్వరలో ఆయా ప్రాంతాల్లో పర్యటించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

నగర వీధుల్లో అంధకారం

- నిర్వహణ లోపంతో 35%పైగా వెలగని ఎల్ఈడీ దీపాలు

ఈనాడు, అమరావతి: ఎల్ఈడీ వీధి దీపాల నిర్వహణ లోపంతో నగరాలు, పట్టణాల వీధుల్లో అంధకారం నెలకొంది. ప్రధాన రహదారుల్లో తప్పితే వీధుల్లో ఎల్ఈడీలు అలంకారప్రాయంగా మారాయి. పాడైన ఎల్ఈడీల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పలు చోట్ల పుర, నగరపాలక సంస్థలు వీధి దీపాల నిర్వహణను గాలికి వదిలేస్తున్నాయి. 123 పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లోని 10.50 లక్షల ఎల్ఈడీ వీధి దీపాల్లో మొత్తంగా 30% వరకు వెలగడం లేదు. కొన్ని నగరాలు, పట్టణాల్లో 35-40% పని చేయడం లేదు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్), పురమిత్ర యాప్‌కి వచ్చే ఫిర్యాదుల్లో అత్యధికం వీధి దీపాల సమస్యలే ఉండటం తీవ్రతకు అద్దం పడుతోంది.

ఒప్పందం ముగియడంతో వెతలు

2014 నుంచి 2024 వరకు ఎల్ఈడీ వీధి దీపాల నిర్వహణకు తెదేపా ప్రభుత్వం(2014-19లో) కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇంధన సామర్థ్య సేవల సంస్థ (ఈఈఎస్ఎల్)తో ఒప్పందం చేసుకుంది. ఈ పదేళ్ల ఒప్పంద కాలంలో ఈఈఎస్ఎల్ పాత బల్బుల స్థానంలో 7.50 లక్షలకుపైగా కొత్త ఎల్ఈడీ దీపాలు ఏర్పాటు చేసింది. కేంద్రీకృత నియంత్రణ, పర్యవేక్షణ విధానం (సీసీఎంఎస్) అమలు చేయడం ద్వారా విద్యుత్తు వినియోగాన్నీ తగ్గించింది. ప్రభుత్వంతో ఈఈఎస్ఎల్ ఒప్పందం ముగిశాక వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పుర, నగరపాలక సంస్థలు పూర్తిగా దృష్టి సారించడం లేదు. ఫిర్యాదులొచ్చిన ప్రాంతాల్లో తప్ప మిగిలిన చోట్ల కొత్త దీపాలు ఏర్పాటు గగనమవుతోంది.



దుకాణాల దీపాల వెలుగులో గుంటూరులోని క్లాత్ మార్కెట్

కమిషనర్లకు పట్టదా?

ఈఈఎస్ఎల్‌తో ఒప్పందం ముగిశాక వీధి దీపాల నిర్వహణను పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీలే చూడాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలిచ్చింది. కానీ, చాలా చోట్ల కమిషనర్లు చొరవ చూపడం లేదు. ఫిర్యాదులొచ్చినా.. ఆ బాధ్యతను కిందిస్థాయి సిబ్బందికి వదిలేస్తున్నారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో వెలగని వీధి దీపాలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రత్యేకించి విజయవాడ, తిరుపతి, గుంటూరు, నెల్లూరు, ఒంగోలు, కాకినాడ, కర్నూలు నగర శివారు ప్రాంత కాలనీల్లో అంధకారం నెలకొంది.

◆ గుంటూరు జిల్లాలోని పుర, నగరపాలక సంస్థల్లో 65,555 ఎల్ఈడీ వీధి దీపాల్లో 30-35 శాతానికిపైగా వెలగడం లేదు. ప్రధాన రహదారుల్లో వెలుగులీనుతున్న ఎల్ఈడీలు... వీధుల్లో, సందుల్లో అలంకారప్రాయంగా మారాయి. ప్రకాశం, కర్నూలు, చిత్తూరు, శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాల్లోనూ ఇదే దుస్థితి.

ప్రైవేటుకు అప్పగించినా తప్పని వెతలు

ఈఈఎస్ఎల్‌తో ఒప్పందం ముగిశాక విశాఖలో వీధి దీపాల నిర్వహణ బాధ్యత బ్రిడ్జ్, రూఫ్ అనే ప్రైవేటు సంస్థకు అప్పగించారు. అయినా.. ప్రధాన రహదారుల్లో తప్ప వీధుల్లో, సందుల్లో ఎల్ఈడీలు వెలగడం లేదు. పెందుర్తి, గాజువాక, పీఎంపాలెం, భీమునిపట్నం, అనకాపల్లి ప్రాంతాలు అంధకారంలోనే ఉన్నాయి. నిర్వహణ లోపంపై నగరపాలక సంస్థ అధికారులు ఏజెన్సీకి జరిమానా విధించినా పరిస్థితి మెరుగుపడలేదు.

ఒకట్రెండు నెలల్లో సమస్యకు పరిష్కారం

వీధి దీపాల నిర్వహణపై కొత్త ఏజెన్సీ ఎంపిక కోసం టెండర్లు పిలిచాం. పాడైన దీపాల స్థానంలో కొత్తవి ఏర్పాటు, అమలులో కొత్త ఆవిష్కరణల అనుసంధానం.. ఇలా వివిధ అంశాల్లో ఆసక్తిగల సంస్థల నుంచి బిడ్లు ఆహ్వానించాం. ఒకటి, రెండు నెలల్లో సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

– సురేశ్‌కుమార్, రాష్ట్ర పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి

చైనా మాంజాకు ఐదేళ్ల చిన్నారి బలి

- హైదరాబాద్‌లో ఘటన



నిశ్వికాదిత్య

మూసాపేట, న్యూస్‌టుడే: చైనా మాంజాకు ఐదేళ్ల చిన్నారి బలైంది. తల్లిదండ్రుల ద్విచక్ర వాహనంపై ముందు కూర్చున్న బాలిక మెడకు దారం చుట్టుకోవడంతో ఈ దుర్ఘటన జరిగింది. హైదరాబాద్ కూకట్‌పల్లి జాతీయ రహదారిపై చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికులను కలిచివేసింది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల ప్రకారం.. ఏపీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అంబాజీపేటకు చెందిన డి.రాంసాగర్, పద్మావతిలు కొన్నాళ్ల క్రితం నగరానికి వచ్చారు. వీరికి ఇద్దరు అమ్మాయిలు. చిన్న కుమార్తె నిశ్వికాదిత్య (5) ఎల్‌కేజీ చదువుతోంది. కాగా ఈ కుటుంబం ఈమధ్యే ఇల్లు కొనుగోలు చేసింది. దాని ఇంటీరియర్ పనుల నిమిత్తం భార్యాభర్తలు కుమార్తెను వెంటబెట్టుకొని బయటికొచ్చారు. సోమవారం మధ్యాహ్నం తిరిగి వచ్చే క్రమంలో కూకట్‌పల్లిలోని ఓ జ్యువెల్లరీ షాపునకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఆ సమయంలో నిశ్వికాదిత్య బైక్ ముందు కూర్చుంది. సుమిత్రానగర్‌లోని మెట్రో పిల్లరు నం.781 వద్దకు రాగానే అకస్మాత్తుగా కేకలు వినిపించాయి. దీంతో తండ్రి బైక్‌ను ఆపి చూడగా చిన్నారి మెడకు చైనా మాంజా చుట్టుకుని రక్తం కారుతోంది. హుటాహుటిన పక్కనున్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. బాలిక చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచింది. చిన్నారిని ఆసుపత్రికి తీసుకొచ్చేసరికి తీవ్రంగా రక్తస్రావమైందని, మెడ రెండున్నర అంగుళాల మేర తెగిందని వైద్యులు తెలిపారు. ఘటనకు ఎవరు బాధ్యులు అనే కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కూకట్‌పల్లి సీఐ కె.వెంకటసుబ్బారావు తెలిపారు.

దేవాదాయ శాఖ ట్రైబ్యునల్ ఖాళీ!

- ఏడాదికిపైగా ఛైర్మన్ లేరు
- నెలాఖరుకు సభ్యుని పదవీ విరమణ
- ముగియనున్న స్టాండింగ్ కౌన్సిల్స్ పదవీకాలం
- కేసుల పరిష్కారంలో మరింత జాప్యం

ఈనాడు, అమరావతి: దేవాదాయ శాఖ ట్రైబ్యునల్ ఈ నెలాఖరుకు దాదాపు ఖాళీ అవుతోంది. ఇప్పటికే ఛైర్మన్ లేరు. ఇన్‌ఛార్జి సభ్యునిగా ఉన్న అధికారి పదవీ విరమణ చేయనున్నారు. కొంతకాలంగా ట్రైబ్యునల్‌లో కేసులు పరిష్కారంకాక.. ఎటువంటి ఉత్తర్వులూ వెలువడక వందల మంది పిటిషనర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు వారి కష్టాలు మరింత పెరగనున్నాయి.

ఎవరి పట్టా భూములైనా... ఆలయ ఆస్తుల రికార్డుల్లో నమోదైతే అవి తమవేనంటూ యజమానులు ఆధారాలు చూపించి దేవాదాయ కమిషనర్ నుంచి కానీ ప్రభుత్వం నుంచి కానీ నిరభ్యంతర ధ్రువపత్రం(ఎన్వోసీ) పొందాలి. ఎన్వోసీని తిరస్కరించినా.. కమిషనర్, ప్రభుత్వ స్థాయిలో భూసమస్యలు పరిష్కారం కాకపోయినా హైకోర్టుకు వెళ్లే అధికారం పిటిషనర్లకు ఉండదు. తొలుత దేవాదాయ శాఖ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించాల్సి ఉంటుంది.

ఛైర్మన్ నియామకంపై నిర్ణయమేదీ?

రిటైర్డ్ జిల్లా జడ్జిని కానీ, ప్రస్తుతం జిల్లా జడ్జిగా కొనసాగుతున్న వారిని కానీ ట్రైబ్యునల్ ఛైర్మన్‌గా ప్రభుత్వం నియమించొచ్చు. వైకాపా హయాంలో ఛైర్మన్‌గా నియమితులైన హరినాథ్.. కూటమి ప్రభుత్వం వచ్చాక రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఛైర్మన్ పోస్టు ఖాళీగా ఉంది. ట్రైబ్యునల్ సభ్యునిగా దేవాదాయ శాఖ రిటైర్డ్ కమిషనర్ ఎం.పద్మ కొంత కాలం కిందటిదాకా కొనసాగారు. ఆమె వయసు 65 ఏళ్లకు చేరడంతో నిబంధనల ప్రకారం పదవీకాలం ముగిసింది. దీంతో దేవాదాయ శాఖ ప్రస్తుత అదనపు కమిషనర్-1 చంద్రకుమార్ సభ్యునిగా కొనసాగుతున్నారు. ఈ నెలాఖరుకు ఆయనా పదవీ విరమణ చేయనున్నారు. ట్రైబ్యునల్‌లో దాఖలైన కేసులకు సంబంధించి దేవాదాయ శాఖ కమిషనర్, ప్రభుత్వం తరఫున స్టాండింగ్ కౌన్సిళ్లు వాదిస్తారు. పది మంది న్యాయవాదులను స్టాండింగ్ కౌన్సిళ్లుగా ప్రభుత్వం నియమిస్తుంది. ఒక్కొక్కరూ రెండు, మూడు జిల్లాల కేసులను చూస్తారు. గత ప్రభుత్వంలో 10 మంది స్టాండింగ్ కౌన్సిళ్లను నియమించగా, కూటమి గెలిచాక ఐదుగురు రాజీనామా చేశారు. మిగిలిన ఐదుగురి పదవీకాలం ఈ నెలాఖరుతో ముగియనుంది.

1,500 కేసులు పెండింగ్

ప్రస్తుతం ట్రైబ్యునల్‌లో 1,500 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో అత్యధికం భూముల ఎన్వోసీ కేసులే. పరిష్కారానికి పిటిషనర్లు చాలాకాలంగా ఎదురుచూస్తున్నారు. ఛైర్మన్‌ను నియమించాలంటూ ప్రభుత్వానికి దేవాదాయ శాఖ కమిషనరేట్ నుంచి ప్రతిపాదన వెళ్లి నెలలు గడుస్తున్నా నిర్ణయం వెలువడలేదు.

అమరావతిలో గణతంత్ర వేడుకలతో వైకాపాలో వణుకు

ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

ఈనాడు, దిల్లీ: రాష్ట్ర రాజధాని అమరావతిలో ఘనంగా జరిగిన 77వ గణతంత్ర వేడుకలు వైకాపాకు వణుకు పుట్టించాయని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పేర్కొన్నారు. ఈ వేడుకలు రాష్ట్ర చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతాయని, ఆ వైభవాన్ని చూసి వైకాపా నాయకుల గుండెల్లో గుబులు మొదలైందన్నారు. ఆయన సోమవారమిక్కడ తన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. “రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అమరావతిలో తొలిసారిగా గణతంత్ర వేడుకలు ఘనంగా జరగడంపట్ల ప్రజలంతా హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఈ సందర్భంగా గవర్నర్ చేసిన ప్రసంగం రాష్ట్ర ప్రజల ఆశయాలకు అద్దంపట్టింది. అమరావతిలో కనిపించిన పండుగ వాతావరణం జగన్‌మోహన్‌రెడ్డి సహా వైకాపా నాయకులకు వణుకు పుట్టించింది. రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుంటే తమ రాజకీయ భవిష్యత్తు ఏమవుతుందోనన్న భయంతో ఆ పార్టీ నాయకులు ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. రాష్ట్ర భవిష్యత్తుకోసం ఎన్డీయే బంగారు బాటలు వేస్తోంది. ఇప్పటికైనా వైకాపా నాయకులు బురదచల్లడం మానుకొని ఆత్మవిమర్శ చేసుకోవాలి” అని అప్పలనాయుడు హితవుపలికారు.

తెదేపా లోక్‌సభ నియోజకవర్గ కమిటీలకు శిక్షణ

పాల్గొననున్న 1,050 మంది నేతలు

ఈనాడు, అమరావతి : తెదేపా లోక్‌సభ నియోజకవర్గ కమిటీలకు మంగళగిరిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం శిక్షణ ఇవ్వనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సహా మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు వీరికి దిశానిర్దేశం చేయనున్నారు. ఒక్కో నియోజకవర్గం నుంచి 45 మంది చొప్పున మొత్తం 1,050 మంది శిక్షణలో పాల్గొంటారు. కమిటీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, అధికార ప్రతినిధి, మీడియా కోఆర్డినేటర్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఇలా వారి హోదాల ఆధారంగా వీరిని 11 బృందాలుగా విభజించి శిక్షణ ఇస్తారు. పార్టీ చరిత్ర, సంస్థాగత నిర్మాణం, సాధించిన విజయాలు, లోక్‌సభ కమిటీల విధులు, గ్రామ, మండల స్థాయిలో వచ్చే సమస్యల పరిష్కారం, సామాజిక మాధ్యమాల వినియోగం, మీడియా ఆవశ్యకత, వైకాపా దుష్ప్రచారాలను తిప్పికొట్టడం సహా వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తారు. ఉదయం 11 గంటలకు జరిగే ప్రారంభ కార్యక్రమంలో లోకేశ్, పల్లా శ్రీనివాసరావు పాల్గొంటారు. సాయంత్రం 4:15 గంటలకు ముగింపు సభలో చంద్రబాబు ప్రసంగిస్తారు. చంద్రబాబు ఆదేశాల మేరకు ఈ శిక్షణ ఏర్పాటు చేసినట్టు తెదేపా మానవవనరుల విభాగం ఛైర్మన్ వేపాడ చిరంజీవిరావు తెలిపారు.